వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 7 సంచిక : 7 హైదరాబాద్ 96 జూలై 2009 పేజీలు : 60 రు. 10

* ఫోకస్ : మన పాఠశాల విద్యారంగం
* ఆకలి చావులు - అసలు కారణాలు
* ప్రపంచబ్యాంక్ దృష్టిలో అభివృద్ధి
* మహిళా రిజర్వేషన్‌లు - సమప్రాధాన్యం
* శ్రీలంక తమిళుల పోరాటం
* మార్క్స్ కాపిటల్ ఎలా చదవాలి?

వీక్షణం మీరు చదువుతున్నారా?వెంటనే చందాదారులు కండి !
మీరు చందాదారులేనా? కనీసం మరొకరి చందా చేర్పించండి!

మీ గ్రంథాలయానికి, కార్యాలయానికి, మీకు తెలిసిన ప్రజాసంఘాలకు
వీక్షణం ను పరిచయం చేయండి, వీక్షణం మీ పత్రిక, ప్రజల పత్రిక
నాలుగు కాలాలు నడిచేలా చూసే బాధ్యత మీదే

మీరు తప్పనిసరిగా తెలుసుకోవలసిన సమస్త సామాజిక, రాజకీయార్థిక
విషయాలను సమగ్రంగా, స్పష్టంగా వివరిస్తాయి **వీక్షణం** వ్యాసాలు

విడి ప్రతి కేవలం రు.10 మాత్రమే

చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
మూడు సంవత్సరాల చందా	రు.	350
ఐదు సంవత్సరాల చందా	రు.	550
పది సంవత్సరాల చందా	రు.	1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

వీక్షణం 96

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జూలై 2009
సంపుటి : 7
సంచిక : 7

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

గౌరవ సంపాదకులు :
వి. హనుమంతరావు

సంపాదకులు :
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు :
డి.వి.రామకృష్ణారావు

కరస్పాండెంట్ /
సర్క్యులేషన్ మేనేజర్ :
వై. రామచంద్రం
9949391028

కరస్పాండెంట్/సబ్ఎడిటర్ :
సి. రాజశేఖర్

సబ్ఎడిటర్ :
పి. గాయత్రీ ప్రసన్న

ఆఫీస్ అసిస్టెంట్ :
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

రాజకీయ పక్షాలలో అసమ్మతి వెల్లువ

శాసనసభ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని రాజకీయ పక్షాలన్నిటిలో, ముఖ్యంగా ఆయా రాజకీయ పక్షాలలోని అసమ్మతివర్గాలలో పెద్దఎత్తున గందరగోళాన్ని సృష్టించినట్టు కనబడుతోంది. ఆ అసమ్మతివాదులు అధికారపక్షంలోని వారయితే రాజీపడి ఏదో ఒక ప్రతిఫలం కొరకు బేరాలు ఆడుకునే అవకాశం ఉంటుంది. అలా సర్దుకుపోవడం కూడ కనబడుతోంది. కాని ప్రతిపక్షాలలోని అసమ్మతివాదులకయితే తమ శిబిరాన్ని చికాకు పరచడం, ప్రచారసాధనాలకు ఒకటిరెండు రోజుల మేత సమకూర్చి పెట్టడం, వీలయితే పాలకపక్షపు ఆదరణ పొందడానికి ప్రయత్నించడం లక్ష్యాలుగా ఉంటున్నాయి. ప్రతికూల ఫలితాల పట్ల నిజమైన ఆత్మవిమర్శకు పూనుకుని, తమ ఆశయాలకు పునరంకితం కావడానికి ప్రయత్నిస్తున్నవారు ఏ ఒకరో ఇద్దరో ఉండవచ్చును గాని కొనసాగుతున్న రణగొణధ్వనిలో వారి స్వరాలకు అంత విలువ ఉన్నట్టులేదు. ఈ కల్లోలంలో రాజకీయ పక్షాలకూ, నాయకులకూ ఏమయిపోయినా ఫరవాలేదుగాని, వారు ఇంతకాలంగా ప్రకటిస్తూవచ్చిన ఆశయాలకు ప్రమాదం వాటిల్లితే కష్టం. ఆ ఆశయాలు ప్రాతినిధ్యం వహించే ప్రజారాశుల ఆకాంక్షలకు నష్టం జరిగితే ప్రమాదం. ప్రస్తుత రాజకీయ రంగంలో అన్ని రాజకీయ పక్షాలూ పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించేవే అయినప్పటికీ, ప్రతి రాజకీయ పక్షం వెనుకా భ్రమలతో అయినా, అమాయకంగానయినా గణనీయమైన సంఖ్యలోనే ప్రజలు ఉన్నారు. కనుక ఆయా పార్టీలలోపల జరుగుతున్న పరిణామాలేవయినా ఆ పార్టీలకూ, వాటికి అధినాయకత్వం వహిస్తున్న పాలకవర్గ ప్రతినిధులకూ మాత్రమే సంబంధించినవి కావు. ఆ పరిణామాలకు ప్రజలమీద, ప్రజా ఆకాంక్షల మీద చెప్పుకోదగిన ప్రభావం ఉంటుంది. మొన్నటికిమొన్న రాష్ట్రవిభజనను సమర్థించిన పార్టీలో మళ్లీ సమైక్యవాదం వినిపించడమయినా, సామాజిక న్యాయం కోసం నిలబడతానని చెప్పిన పార్టీలో వెనుకబడిన సామాజికవర్గాలకు వ్యతిరేకమయిన ఆచరణ జరగడమయినా, గెలిస్తే వందరోజుల్లో రాష్ట్ర విభజన సాధిస్తామన్న పార్టీలో ఓడిపోగానే తెలంగాణ అనడమే తప్పయిందనే ప్రకటనలు రావడమయినా, ఆయా పార్టీల, నాయకుల ఊసరవెల్లితనానికి మాత్రమే చిహ్నాలు కావు. మన రాజకీయపక్షాలలో ప్రజలపట్ల, ప్రజాప్రయోజనాలపట్ల, ప్రజా ఆకాంక్షలపట్ల ఎంత నిర్లక్ష్యం ఉన్నదో ఈ పరిణామాలు చూపుతున్నాయి. అన్ని పార్టీలకూ అధికార లాలసే ప్రధానం. మాట్లాడే మాటకు, చెప్పే సిద్ధాంతాలకు కట్టుబడి ఉండనవసరం లేదు. ప్రజల పేరుమీదనే తమ నాటకమంతా ఆడుతున్నా, ప్రజాజీవితం మెరుగుపరచడానికి ఏమీ చేయనక్కరలేదు. పైగా, తమ బొక్కసాలు నింపుకోవడం కొరకు ప్రజాజీవితాన్ని మరింత దిగజార్చవచ్చు. ఈ రాజకీయ వాతావరణంలో తెలంగాణ ప్రజా ఆకాంక్షలే పునాదిగా ఏర్పడిన రాజకీయ పక్షాల ఆచరణ కూడ ఏమీ భిన్నంగాలేదు. అందువల్ల తెలంగాణ ప్రజా ఆకాంక్షలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతున్నది. ఎన్నికల ఫలితాలను తెలంగాణ ఆకాంక్షల ఓటమిగా చూడడం అనేదే ఒక పొరపాటు ధోరణి అయితే, ఆ పొరపాటు ధోరణికి కొనసాగింపుగా ప్రస్తుత గందరగోళం జరుగుతున్నది. ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమితి అనేక పొరపాట్లు చేసిన మాట నిజమే. ఆ స్వయంకృతాపరాధాలకు ఆ పార్టీ మూల్యం చెల్లించింది కూడ. ఆ పార్టీ చేసిన పొరపాట్లను సరిదిద్ది, ఆ పార్టీ ప్రతిఫలించిన ప్రజా ఆకాంక్షలను మళ్లీ ఒకసారి మరింత బలంగా వేదిక మీదికి తీసుకురావడమే ఇవాళ్టి కర్తవ్యం. అంటే ఆ పార్టీ సాధించలేకపోయిన తెలంగాణవాదుల ఐక్యతను సాధించడం, ఆ పార్టీ చేపట్టలేకపోయిన ఉద్యమరూపాలను చేపట్టి ఆ ఆశయాన్ని బలోపేతం చేయడం ఇవాళ్టి అవసరాలు. కాని వెల్లువెత్తుతున్న విమర్శలు, వ్యక్తిగత స్థాయికీ, ఆత్మస్తుతికీ, పరనిందకూ దిగజారి, మరింత అనైక్యతనే సూచిస్తున్నాయిగాని, ఐక్యతా ప్రయత్నాలను కాదు. ఆ విమర్శల తీరు పరిశీలిస్తే ప్రస్తుత విమర్శకులు కూడ ఉద్యమ రూపాలు చేపట్టడం కన్న వార్తావస్తువులు కావడానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారనిపిస్తున్నది. మన ప్రజల ఆకాంక్షలనూ, ఆ ఆకాంక్షలు నెరవేర్చగల ఉద్యమాలనూ ఇటువంటి రాజకీయ నాయకుల చేతుల్లోంచి విముక్తి చేయడం చారిత్రక అవసరం. వీ

లాల్ ఘడ్ ఆదివాసుల ఆందోళన

పశ్చిమ బెంగాల్ లోని పశ్చిమ మేదినీపూర్ జిల్లా లాల్ ఘడ్ ప్రాంతంలో జరుగుతున్న ఆదివాసి ఆందోళన గత రెండు వారాలుగా ప్రచారసాధనాల పతాకశీర్షికలకు ఎక్కి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నది. నిజానికి బహిరంగంగా కనిపించిన హింసారూపాలవల్ల ఇప్పుడు ఆ ప్రాంత సమస్యలు ఇంతగా వెల్లడవుతున్నాయి గాని, అక్కడి సమస్యలకూ, ఆ సమస్యలమీద ఆదివాసుల ఆందోళనకూ సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతకాలం ఆ సమస్యలను పరిష్కరించని ప్రభుత్వాలు, ఆ సమస్యలను ఇంకా పెంచుతూవచ్చిన ప్రభుత్వాలు, సమస్యల పరిష్కారాన్ని కోరిన ప్రజలమీద దుర్మార్గమైన హింసకూ అణచివేతకూ పాల్పడుతూవచ్చాయి. ఆ హింసనూ అణచివేతనూ ప్రతిఘటించడానికి ప్రజలు ప్రయత్నించిన సందర్భంలోనే అక్కడ ఏదో జరిగిపోతున్నదన్నట్టు గగ్గోలు వినబడుతోంది. పశ్చిమ మేదినీపూర్, పురులియా, బంకురా జిల్లాలలోని అటవీ ప్రాంతాలలో ఆదివాసుల జీవితం పరమ దుర్భరంగా ఉంది. కనీస సౌకర్యాలు లేని స్థితిలో, కనీస మానవ అవసరాలు తీరని స్థితిలో అక్కడి ఆదివాసులు (సంథాల్ లు) తమ అభివృద్ధికోసం ఎంతో కాలంగా పోరాడుతున్నారు. ఆ పోరాటానికి 1990ల చివరినుంచీ విప్లవకారుల మద్దతుకూడ చేకూరింది. ప్రస్తుత ఆందోళనలో భాగంగా ఆదివాసులు తమ భూమి, భుక్తి, స్వయంపాలన, కొత్త అభివృద్ధి నమూనా, సంథాలీ భాషా సంస్కృతుల పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం వంటి డిమాండ్లతో పాటు, జంగల్ మహల్ అటవీ ప్రాంతంలో స్వయం పాలనా మండలి నెలకొల్పాలని కోరారంటే, 62 సంవత్సరాల స్వతంత్ర పాలనలో, 32 సంవత్సరాల "వామపక్ష" పాలనలో ఆ ఆదివాసులకు ఏమి ఒరిగిందో స్పష్టమవుతుంది. వెనుకబడిన పురులియా జిల్లాలో కౌలు రేట్లు, అభివృద్ధి చెందిన బర్ధమాన్, హౌరా, హుగ్లీ జిల్లాల్లో ఉన్నట్టుగా ఉండగూడదని, అవి తగ్గించాలని ఆదివాసులు కోరుతున్నారు. తమ అటవీ ప్రాంతాలను జపాన్ జలవిద్యుత్ కేంద్రానికీ, జిందాల్ ఉక్కు కర్మాగారానికీ ఇవ్వగూడదనీ, తమ అడవులను ఇలా బహుళజాతి సంస్థలకు అప్పగించి, మళ్లీ అడవుల అభివృద్ధి పేరుతో యూకలిప్టస్, సోనాఝురి వంటి విషపు మొక్కలు నాటగూడదనీ, తాము అడవులనుంచి ఏరుకొచ్చే సాల్ ఆకులకు, కెందు ఆకులకు, వంట చెరకుకు కనీస గిట్టుబాటుధర ఇవ్వాలనీ ఆదివాసులు అడుగుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే సిపిఐ (ఎం) నాయకత్వంలోని "వామపక్ష" ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి నమూనాను ఆదివాసులు ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రశ్నలతో, ప్రతిఘటనలతో ఆగ్రహించిన ప్రభుత్వం, ఆ ఆదివాసుల మీద దాడి చేయడానికి ఎదురుచూస్తూ ఉండింది. మావోయిస్టులు పేల్చిన మందుపాతర ను సాకుగా తీసుకుని, పోలీసులు, అధికారపార్టీకి చెందిన హర్మద్ వాహిని అనే సాయుధ ముఠా ఆదివాసి గ్రామాల మీద విరుచుకుపడ్డారు. భయంకరమైన అణచివేతకు, ఎన్నో అత్యాచారాలకు పాల్పడ్డారు. దానితో పులీషీ సంత్రాష్ బిరోధి జనసాధారణేర్ కమిటీ (పోలీసు అత్యాచారాల వ్యతిరేక ప్రజా కమిటీ) ఏర్పడింది. పోలీసులు తమ గ్రామాలకు రావడమంటే అత్యాచారాలు చేయడానికే గనుక వారిని నిరోధించడానికి ఆదివాసులు ఎక్కడికక్కడ రోడ్లు తవ్వి, రోడ్లకు అడ్డంగా చెట్లు నరికి పడవేసి రవాణా సౌకర్యాలను అడ్డుకున్నారు. ఆ విధ్వంసం మాత్రమే కాక, నిర్మాణ, అభివృద్ధి కార్యక్రమాలు కూడ చేపట్టి వందలాది గ్రామాలలో గ్రామాభివృద్ధి కమిటీలు ఏర్పరచుకుని, సొంతంగా విద్య, వైద్యం, చిన్న నీటిపారుదల వంటి అభివృద్ధిపనులు చేపట్టారు. కనుక ఇది మౌలికంగా ప్రజాజీవన అభివృద్ధి నమూనాల ఘర్షణ. ఐదువేల ఎకరాలలో, ముప్పై ఐదువేలకోట్ల రూపాయలతో బహుళజాతి సంస్థలకోసం సాగే జిందాల్ తరహా భారీ అభివృద్ధి నమూనాకూ, అట్టడుగు ప్రజల అవసరాలకోసం, వారి భాగస్వామ్యంతో సాగే చిన్నతరహా అభివృద్ధి నమూనాకూ ఘర్షణ. సింగూర్ నుంచి నందిగ్రామ్ మీదుగా లాల్ ఘడ్ వరకు చేరిన ఈ ఘర్షణ మన ప్రజల అభివృద్ధి వ్యూహానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.

ఇరాన్ ఎన్నికల ఫలితాలు

జూన్ 12 న జరిగిన ఇరాన్ అధ్యక్ష ఎన్నికలలో ఎనభై శాతానికి పైగా వోటర్లు పాల్గొన్నారనీ, అత్యధికంగా 62 శాతం వోట్లు తెచ్చుకుని ప్రస్తుత అధ్యక్షుడు మహ్మూద్ అహ్మదినెజాద్ మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారనీ ఇరాన్ పాలనా వ్యవహారాలు చూసే రక్షణ సమితి అధినాయకుడు అయతొల్లా అల్ ఖామెనీ ప్రకటించారు. ఆ ఎన్నికలలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ఆ ఎన్నికలు చెల్లవని 33 శాతం వోట్లతో రెండో స్థానంలో నిలిచిన మీర్ హొస్సేన్ మౌసవి ఆరోపిస్తున్నారు. అంతర్జాతీయ పత్రికలు, ఐక్యరాజ్యసమితి, యూరపియన్ యూనియన్, అమెరికా, ఇజ్రాయిల్ ప్రభుత్వాలు ఇరాన్ ఎన్నికలలో అక్రమాలు జరిగాయని భావిస్తున్నాయి. అరబ్ లీగ్ దేశాలు, రష్యా, చైనా, భారత్ ప్రభుత్వాలు ఈ ఎన్నికలఫలితాలను ఆహ్వానించాయి. ఫలితాలు వెలువడినప్పటినుంచీ ఇరాన్ రాజధాని టెహరాన్ లోను, ప్రధాన పట్టణాలన్నిటిలోనూ నిరసనలు, ప్రజా ప్రదర్శనలు జరుగుతున్నాయి. హింసాకాండ చెలరేగుతోంది. మౌసవి ఫిర్యాదును అంగీకరించి విచారించిన రక్షణ సమితి ఎన్నికలు సక్రమంగానే జరిగాయని నిర్ధారించింది. అయితే అక్కడ ఎన్నికలు ఎలా జరిగాయి, ప్రస్తుతం నిరసన తెలుపుతున్న ప్రజల డిమాండ్ న్యాయమయినదేనా అనే ప్రశ్నలకన్న ముఖ్యంగా ఆలోచించవలసిన విషయాలున్నాయి. చమురు, సహజవాయు ఉత్పత్తి, ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉన్న దేశంగా, పశ్చిమాసియాలో ప్రభావశీల దేశంగా ఉన్న ఇరాన్ తమ చెప్పుచేతల్లో ఉండాలని అమెరికా పాలకులు ఏడెనిమిది దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ పాత రాజు మహమ్మద్ రెజా పహ్లావీ అమెరికా కీలుబొమ్మగానే రాజ్యం చేశాడు. ఇస్లామిక్ మూఢత్వాన్ని రద్దుచేసి ఆధునికతను ప్రవేశపెట్టిన రాజుగా అమెరికా ఆయనకు పూర్తి మద్దతు తెలిపింది. 1979లో అక్కడ జరిగిన ఇస్లామిక్ విప్లవంతో రాజును కూలదోసి మతపాలన ప్రారంభమయింది. మొదట అయతొల్లా ఖొమేనీ, ప్రస్తుతం ఖామెనీ అక్కడ అత్యున్నత, అంతిమాధికార పాలకులుగా కొనసాగుతూ, తమ కనుసన్నలలోనే పార్లమెంటరీ పాలనను నడుపుతున్నారు. వారి అంగీకారం లేకుండా అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి కూడ వీలులేదు. కనుక ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయిల్, బ్రిటన్ ప్రభుత్వాలు, పాశ్చాత్యపత్రికలు చెపుతున్నట్టుగా అహ్మదినెజాద్ మతఛాందసుడని, మౌసవి సంస్కరణవాది అనే అవకాశమేమీ లేదు. ఇద్దరికిద్దరూ మతఛాందసులే. ఇద్దరూ మతపాలన సాగించేవాళ్లే. మొత్తంగా ఇరాన్, ప్రత్యేకించి అహ్మదినెజాద్ చూపిన అమెరికా వ్యతిరేకత వల్ల వారికి బుద్ధి చెప్పాలనేదే అమెరికా లక్ష్యం. అందుకే అది ప్రత్యర్థులను ఎగదోసి, అస్థిరతను పెంచిపోషిస్తోంది. అయితే గత ముప్పై సంవత్సరాల మతపాలనలో చితికిన రాజకీయార్థిక, సామాజిక జీవితం వల్ల, అణగారిన సాంస్కృతిక జీవనంవల్ల అసంతృప్తి చెందిన లక్షలాది ప్రజలు ఇవాళ దొరికిన ఈ అవకాశాన్ని వాడుకుని తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఇవాళ ఆ నిరసనకారులు మౌసవిని తమ నాయకుడుగా చూపుతుండవచ్చుగాని, మౌలికంగా అది కొనసాగుతున్న పాలనావిధానాలపట్ల నిరసనే. అటువంటి న్యాయమైన ప్రజా నిరసనను తన ప్రయోజనాలకొరకు వాడుకోజూడడమే అమెరికా దుర్మార్గనీతి. ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేసుకుని, అరబ్ దేశాలకు నాయకత్వం వహించి తనమీద ఎక్కడ దాడికి దిగుతుందో, పాలస్తీనాలో తానుచేసిన పాపాలకు ఎక్కడ శిక్ష విధిస్తుందో అని భయపడుతున్న ఇజ్రాయిల్ కుటిలంగా ఇరాన్ ప్రజల నిరసనను సమర్థిస్తున్నట్టు నటిస్తోంది. ఎన్నికలలో న్యాయం జరిగిందా, అన్యాయం జరిగిందా ఇరాన్ ప్రజలు తేల్చుకుంటారు. ఇరాన్ ప్రజల ఆందోళన న్యాయమైనది. ఇరాన్ ప్రజల చితిమంటలలో పేలాలు వేయించుకుందామనుకునే అమెరికా, ఇజ్రాయిల్ ల కుటిలనీతిని ఖండించాలి. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : జూలై 2009 మన పాఠశాల విద్యారంగం

గత ఇరవై ఏళ్లుగా పాలకులు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో పాఠశాల విద్యారంగంలో కూడా అనేక మార్పులొచ్చాయి. ప్రభుత్వరంగంలోని పాఠశాలలు విపరీతంగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పాఠశాలల సంఖ్య పెంచలేదు. ఉపాధ్యాయులను నియమించలేదు. విద్యార్థులతో కిక్కిరిసిన తరగతి గదులతో విద్యా బోధన నామమాత్రమైంది. ప్రాథమిక పాఠశాలలో అయిదు తరగతులకు ఒక్క టీచరే బోధించే పరిస్థితులున్నాయి. చదువుతున్న మధ్యతరగతి వర్గం పెరగడంతో, తల్లిదండ్రులకు తమ పిల్లల చదువుపై ఆసక్తి పెరుగుతున్న తరుణంలో కుప్పలు తెప్పలుగా ప్రైవేట్ పాఠశాలలు వచ్చాయి. అనాకర్షణీయంగా, వసతుల లేమితో ఉండే ప్రభుత్వ పాఠశాలల నుండి మధ్య తరగతి వర్గం ప్రైవేట్ పాఠశాలలకు తరలడంతో ప్రభుత్వ పాఠశాలలు అల్పాదాయ వర్గాలకే పరిమితమైనాయి.

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.


– సర్క్యులేషన్ మేనేజర్
9949391028
















- **పతంజలి భాష్యం** – బాధ్యతారహిత మానవసమాజం మీద అక్షర శర సంధానం – పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ – 160 పేజీలు, 1/8 డెమీ, రు.100, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞానభవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్–500 001, ఫోన్ : 040–24744580
- **కలాల కాపలా** – ఎన్నికలు – మీడియా – డా. మాడభూషి శ్రీధర్ – ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ప్రచురణలు – 108 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 5–9–166, ఛాపల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్ – 500 001; ఫోన్ : 23298672, 23298673
- **ఓడిపోలే... పల్లె** – కథలు, కవితలు ఉదయమిత్ర, ఇక్బాల్ – పాలమూరు ప్రచురణలు – 40 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: ఉదయమిత్ర, 9–25, చైతన్యనగర్, జడ్చర్ల; ఎం.డి. ఇక్బాల్ పాష, 6–29, ఇక్బాల్ మంజిల్, జి.వి. ఎన్‌క్లేవ్, గద్వాల
- **ఆనవాలు** – కవిత – పప్పుల రాజిరెడ్డి – మంజీరా రచయితల సంఘం ప్రచురణ, 102 పేజీలు, 1/8 డెమీ, రు. 45, ప్రతులకు : పి. రాజిరెడ్డి, (పో) మోతె, (మం) మిర్దొడ్డి, వయా దుబ్బాక, మెదక్ – 502 108; విశాలాంధ్ర బుక్‌హౌస్; నవోదయ్ బుక్ హౌస్; దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్ హౌస్, హైదరాబాద్
- **ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?** – ప్రొ. పి. ముత్తయ్య – ఆం.ప్ర. మాదిగ మేధావుల ఫోరం ప్రచురణ 32 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు : దళిత రిసెర్చ్ సెంటర్, ప్లాట్ నెం. 74, ఎస్.పి.ఎ.ఆర్.టి. – 7, బాలాజీ హిల్స్, రాజశేఖర కాలనీ, బోడుప్పల్, ఉప్పల్ – 500 029; ఫోన్ : 9441778229
- **నేను పోలేపల్లి పీనుగని మాట్లాడుతున్న** – గీతాంజలి – విరసం ప్రచురణలు – గీతాంజలి – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, దిశ బుక్‌హౌస్, సహచర బుక్‌హౌస్
- **మనిషిజాడ** – ఎమ్వీ రామిరెడ్డి – మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురణలు – 89 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: ఎం. రాజ్యలక్ష్మి, 102, శ్రీకోట రెసిడెన్సీ, పోలీస్ స్టేషన్ దగ్గర, మియాపూర్, హైదరాబాద్ – 500 049; ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **1857 ముస్లింలు** – సయ్యద్ నశీర్ అహమ్మద్ – తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ ప్రచురణ – 300 పేజీలు, 1/8 డెమీ, రు.130, ప్రతులకు : తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్, సందేశభవనం, లక్కడ్‌కోట, చత్తాబజార్, హైదరాబాద్–500 002; ఫోన్ : 24564583
- **ప్రపంచ ఆర్థిక సంక్షోభం** – వేములపల్లి వెంకట్రామయ్య – సిపిఐ (ఎం–ఎల్) న్యూడెమోక్రసీ ప్రచురణ – 82 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : ప్రజాపంథా, ఇ.నెం. 658, మార్క్స్ భవన్, 7వ లైన్, విద్యానగర్, హైదరాబాద్ – 500 044; నవోదయ బుక్ హౌస్, సహచర బుక్‌మార్క్, దిశ పుస్తక కేంద్రం, మైత్రి బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, విశాలాంధ్ర బుక్ హౌస్
- **సీమ గుండెచప్పుడు** – కరువు సీమ సమాలోచన – ఇమామ్ – కదలిక ప్రచురణ – 313 పేజీలు, 1/4 క్రౌన్, రు. 150, ప్రతులకు: ఇమామ్, కదలిక ప్రచురణలు, ఎర్రనేలకొట్టు, ఆర్.సి. నగర్, అనంతపూర్, సెల్ : 9989904389; విశాలాంధ్ర బుక్ హౌస్











వీక్షణం మే నెల సంచికలో ఎస్.సి. రిజర్వేషన్ల వర్గీకరణపై రచయిత తన అభిప్రాయాన్ని రాస్తూ పార్లమెంట్ పంథా కంటే, ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించవచ్చున్నారు. 14 సంవత్సరాలుగా కొనసాగుతున్న వర్గీకరణ ఉద్యమాన్ని పరిశీలిస్తే రాష్ట్ర చరిత్రలోనే సుస్థిర స్థానాన్ని సంపాదించింది. మాదిగల గుండెల నిండా ఆత్మగౌరవాన్ని నింపి మిగతా కులాల వారికి ఆదర్శమయింది. లక్షలాది మందిని సమీకరించి, రాజధానిని దిగ్బంధించి ప్రభుత్వాన్ని హడలెత్తించింది. ఆమరణ నిరాహార దీక్షలు, రాష్ట్రబంద్‌లు, రాస్తారోకోలు చేసింది. ఇవన్నీ శాసనసభల వెలుపల తీవ్రంగా కొనసాగించిన చర్చలు అయితే శాసనసభల లోపల మాదిగల తరఫున అంతే తీవ్రస్థాయిలో సమస్యను ప్రస్తావించే మాదిగలు లేరు. ఒకరిద్దరు ఉన్నా వారి పాత్ర నామమాత్రం. కాంగ్రెస్ పార్టీ ద్వారా పార్లమెంట్ పంథాలో శాసనసభలలో అధిక సంఖ్యలో ప్రవేశించిన మాలలు వర్గీకరణ ప్రయత్నాలను సులువుగా అడ్డుకున్నారు. ఆ బలం మాదిగలకు లేని కారణంగానే వర్గీకరణ సాధ్యం కాలేదు. అంటే ఇక్కడ మాలలు ఉద్యమాల కంటే పార్లమెంట్ పంథాలో వారికున్న బలం వల్లనే అడ్డుకోగలిగారు. సరిగ్గా ఈ కొరతను మాదిగ దండోరా గుర్తించి ఆ దిశగా ఉద్యమాన్ని మొదలుపెట్టింది. బయట ఉద్యమాలు చేసే సత్తా ఉన్నా, పార్లమెంట్ లోపల సమస్య గురించి పోరాడే వారి సంఖ్యను పెంచే ప్రయత్నమే పార్లమెంట్ పంథా. అలాగని ఉద్యమాన్ని వదిలివేస్తామని చెప్పటం లేదు. అదే ఉద్యమం వివిధ రూపాలుగా మారుతుందని చెపుతున్నాం. రెండవ అంశం ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి విషయం. ఇప్పుడిప్పుడే సమాజంలో తలెత్తుకొని తిరుగుతూ, హక్కులు సాధించే క్రమంలోనున్న బడుగు నేతలపై బాడుగ నేతలు అని ఏ ఆధారంతో రాశారు? ఆధారం లేకుండా రాసే ఈ రాతల కంటే ఉద్యమానికి ఉపయోగపడే మరే రాతలన్నా రాయవచ్చు కదా! అంటే వీరు బడుగులు, బలహీనులు రాస్తే ఏమీ కాదనే ధైర్యంతోనే రాశారు. ఇది పత్రికాస్వేచ్ఛ కిందికి వస్తుందా? కాదు. ఇది యాజమాన్య స్వేచ్ఛ అవుతుంది. దానినే మేము వ్యతిరేకించాం. పత్రికా స్వేచ్ఛని కాదు. పత్రికలంటే నిరుపేదలైన మాదిగలకు, నాయకులకు గౌరవం ఉంది.

సమకాలీన సాంఘిక, రాజకీయ, ఆర్థిక అంశాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ వ్యాసాలు అందిస్తున్న వీక్షణం గత కొన్ని సంచికల నుండి సీరియస్‌గా మాదిగ సాహిత్యంపైన గుండిమెడ సాంబయ్య గారు అందిస్తున్న సమాచారం ఎంతో విలువైనది. అనేక సాహిత్య విషయాలను, చరిత్రను తెలుకున్నాను. ముఖ్యంగా జూన్ నెల సంచికలో వర్గీకరణ సమస్యలోని వాస్తవ అంశాలను వివరంగా రాసి ఈ సమస్యపై కొందరికున్న అభూత భావాలను నివృత్తి చేశారు. వాస్తవంగా అంబేద్కర్‌ను వారసుడిగా ప్రకటించుకుంటూ బౌద్ధ సూత్రాలను వల్లెవేస్తూ, అంబేద్కర్ సాహిత్యాన్ని చదువుతూ అంబేద్కరైట్‌లుగా చెప్పుకుంటున్న, వర్గీకరణను వ్యతిరేకిస్తున్న మాల నాయకులు వర్గీకరణలోని సామాజిక న్యాయాన్ని గ్రహించాలి. ఇకముందు కూడా సాంబయ్యగారు కులాల పుట్టుకపైన, వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ, మాదిగ చరిత్రకు సంబంధించిన వారి అమూల్య వ్యాసాలను అందించవలసిందిగా కోరుతున్నాం.

– డా. తడికమళ్ల శేఖర్

సత్తుపల్లి, ఖమ్మం

వీక్షణం మే 2009 సంచికలో నక్సల్బరీ రాజకీయాల మీద సంపాదకీయం చదివి ఇది రాస్తున్నాను. ఉద్యమం చాలా బలహీనపడిందని, అన్ని రంగాల్లో – ప్రధానంగా విద్యార్థి, రైతుకూలీ, కార్మిక (ఇది ఎప్పుడు కొద్దిపాటిదే) – ఎవరైనా ఒప్పుకోక తప్పదు. మీరు రాసినట్లు, ఉద్యమంలో ఆత్మావలోకన చాలా అవసరం. ఉద్యమంలో చాలాకాలం పనిచేసి బయటికి వచ్చిన వారు తమ విశ్లేషణ లేక అనుభవాలు రాస్తే కొంత చర్చకు పనికొస్తుంది. నాకు తెలిసినంత వరకు, ఉద్యమంలో తాత్వికలేమి (ఫిలసాఫికల్ పావర్టీ) చాలా ఉంది. ప్రజాస్వామ్యం, ఐక్య సంఘటన, ప్రజా సంఘాల విషయంలో ఇది చాలా బలంగా కనపడేది. ఉదాహరణకు, చాలా మహాసభలు పొటెంకిన్ మహాసభలు – లేదంటే సినిమా సెట్టింగ్ లాగా, పైకి గొప్పగా, లోపల డొల్లగా నడిచేవి. వరంగల్‌లో నేను చూసిన ఒక మహిళా సంఘం మహాసభ జరిగిన తరువాత మూడు నెలలలో ఆ సంఘం నుండి కనీసం ఒక ప్రకటన కూడా నేను చూడలేదు – అప్పుడు నేను పేపర్‌లో పని చేసేవాడిని. అన్ని సంఘాలకు కోశాధికారి ఉంటారు కాని నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో, ఎంత ఎక్కడ ఖర్చు అవుతున్నాయో చాలా వరకు వాళ్లకు తెలియదు. ఇక ప్రజాసంఘాల నాయకత్వం అయితే, చాలా సందర్భాలలో వీళ్లను పారాచ్యూట్‌లో దించి సమావేశాలలో చప్పట్లు కొట్టిస్తారు. ఒకానొక కార్మిక సంఘ మహాసభలో, తీర్మానాల పేరు చదివి చప్పట్లు కొట్టమంటే, అసలు ఇలాంటి చర్చ లేని తీర్మానాలెందుకు అని అడిగినందుకు, ఫ్రెంచ్ ఉద్యమంలో పాల్గొన్న మేధావి నుండి చివాట్లు తిన్నాను.

ప్రజాస్వామ్యం అనేది కేవలం నిర్మాణ సూత్రం కాదు. అది ఒక విలువ. అన్ని విలువల లాగే ఒక ఎబ్‌స్ట్రాక్షన్. దీనిని విప్లవ పార్టీలు ఎన్నడూ ఆచరణలో గుర్తించలేదు. ఆ ఐక్య సంఘటనలో గాని, ప్రజా సంఘంలో గాని అవి పనిచేసినా, వాటిలో సజీవ అంతర్భాగంగా పనిచెయ్యలేదు. తారతమ్య బేధాలతో, మరీ మిలిటెంట్ పార్టీలు నిస్సిగ్గుగా, ఇతరులు కొంత గోప్యంగా – పార్టీ కార్యక్రమానికి ఐక్య ప్రయోజనాలను బలి చేసారు. పేరుకు స్వతంత్ర సంఘాలైనా, వీటి రోజువారి జీవితం పార్టీ – మహాసభల తారీఖులు, స్థలాలతో సహా ఆధీనంలోనే నడుస్తోంది. ఇక సాంస్కృతిక సంఘాల మాటకొస్తే వీటికెప్పుడూ సొంత జీవం ఉన్నట్లు కనబడదు. పార్టీ మీటింగ్‌లలో, ఇతర సంఘాల మీటింగ్‌లలో కొంతసేపు విరామం కలిగించడం, ప్రజలను పార్టీ కార్యక్రమానికి ప్రేరేపించడమే కాకుండా ఉన్న సంస్కృతి మీద పోరాటం చేసింది చాలా తక్కువ – సినిమాలు, సాహిత్యం, బాణామతి లాంటి మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, అంటరానితనం మొదలైనవి. ఉద్యమంలో ప్రవేశించినవాళ్లు కేవలం ఆబ్జెక్ట్స్ ఆఫ్ ది రెవల్యూషన్ మాత్రమే కాదు, సబ్జెక్ట్స్ కూడా. వాళ్ల ఫంక్షనల్ అటానమి పెరగకుండా, ప్రాపంచిక దృక్పథం నిరంతరం విప్లవీకరించకుండా, వాళ్ల సృజనాత్మక శక్తులు వెలికి రాకుండా విప్లవం వచ్చినా అది రష్యా, చైనాలో లాగే కుంటుపడుతుంది. ఇవి నాకు తెలిసిన విషయాలు. ఇది తుది వ్యాఖ్యానం అనుకోవడం లేదు, చర్చకు నాంది ప్రస్తావన కావాలని కోరుకుంటున్నాను.

– నరేంద్రమోహన్

మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా

శ్రీలంక ఇటీవలి చరిత్ర గురించిన వ్యాసం బాగుంది కాని ఎల్.టి.టి.ఇ. నిర్వహించిన పాత్రను గురించి పూర్తిగా చెప్పలేదనిపించింది. గత పాతికేళ్లుగా టి.యు.ఎల్.ఎఫ్. మొదలైన మితవాద పార్టీలెన్నో ఉండేవి. అవి తమ పద్ధతిలో తమిళ మైనారిటీల తరఫునా, ఈళం పేరుతోనూ ఆందోళనలు చేపడుతూ ఉండేవి. వాటన్నిటినీ ఎల్.టి.టి.ఇ. సమూలంగా నాశనం చేసింది. నాయకులను హత్యలు చేసింది. తమిళుల పక్షాన తాను తప్పితే మరెవరూ మాట్లాడకూడదనే నిరంకుశ వైఖరితో ప్రవర్తించింది కనుకనే దానికి ప్రపంచ దేశాల నుంచి తగినంత సానుభూతి లభించలేదనేది వాస్తవం. ఎల్.టి.టి.ఇ. చర్యలను నక్సలైటు కలాపాలతో పోల్చడం సరికాదు. తగిన సైద్ధాంతిక పునాది లేకుండా హింస, హింస కోసమే అన్న పద్ధతిలో అది ఎందరో అమాయక తమిళులను హత్య చేసింది. అలా జరగకపోతే చరిత్ర మరో విధంగా ఉండేది. ఇక సింహళ బౌద్ధులకున్నంత రక్తదాహం మరెవరికీ లేదనేది మరొక సత్యం.

– రోహిణీప్రసాద్

అట్లాంటా, యు.ఎస్.ఎ.

వీక్షణం జూన్ 2009 సంపాదకీయం – ఒక్కమాటలో చెప్పాలంటే ఉట్టి ఊకదంపుడు. 'ప్రజావ్యతిరేకులు గెలుస్తున్నట్లు, ప్రజల నిజ ఆకాంక్షలను ఫలితాలు వ్యక్తం చేయలేకపోతున్నట్లు కనిపించక తప్పదు.' అట్లా కనిపించడం అనివార్యమన్న మాట. కనిపించడం అంటే సారాంశంలో అది భ్రమాజనితం. అసలు సంగతి – అవి ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్నాయనేదే వాస్తవం అని వ్యాఖ్యానించుకోవలసి వస్తుంది. ఈ జారుడు రాతలు ఆట్టే శోభనియ్యవు. 'అందరూ ఒకే తాను ముక్కలే' అయినప్పుడు ఎవరు గెలిస్తే ఏముంది? సంపాదకీయమంతా ఈ విషయమే అంతర్లీనంగా ఉంది. 'మౌలికంగా ఎన్నికల స్వభావమే మారాలి' అంటూ అందుకోసం మీరు సూచిస్తున్నది – 'అంటే పునాదిగా ఉన్న వ్యవస్థ మారాలి.' దేనికి ఏది పునాదిగా ఉంది? చెప్పలేదు. ఇది అలవాటు కొద్దీ రాయడమవుతుంది, ఆలోచించి కాదు. ఇంకా మీ ఆవేదన 'వ్యవస్థ మార్పు గురించి, కనీసం రాజ్యాంగ బద్ధ ఆదర్శాల గురించి ఏమాత్రం ఆలోచించలేని రాజకీయ పక్షాలు ఎన్ని మారినా, ఎవరు గెలిచినా

(... మిగతా 38వ పేజీలో)

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం

పదమూడవ శాసన సభ ఎన్నికల్లో 157 స్థానాలను సాధించిన కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటయింది. మే 20న హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో వై.ఎస్. రాజశేఖర రెడ్డి రాష్ట్ర 22వ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను 7 నుంచి 9 గంటలకు, తెల్లరేషన్ కార్డుల బియ్యంకోటాను 20 కిలోల నుంచి 30 కిలోలకు పెంచే ఫైళ్లపై తొలిసంతకాలు చేశారు. మే 25న ముప్పై ఐదు మందితో కూడిన మంత్రివర్గాన్ని ఎంపిక చేశారు.

రాజకీయ ఖైదీల విడుదల

కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పౌరహక్కుల సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు మే 21న ఇందిరా పార్క్ వద్ద ఏడేళ్ల శిక్ష పూర్తిచేసుకున్న జీవిత ఖైదీలను విడుదల చేయాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు దేశంలోని జైళ్లు విప్లవకారులతోను, జాతి విముక్తి ఉద్యమకారులతోను, దళిత, ఆదివాసి, ముస్లిం ఉద్యమకారులతోను నిండిపోయాయని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న వీరిని ఏళ్ల తరబడి జైళ్లలో నిర్బంధిస్తున్నారని అన్నారు. ఇరవయి ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్నవారూ ఉన్నారని తెలిపారు. ఇలాంటి రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలని కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

మావోయిస్ట్ నేత ఎన్‌కౌంటర్

మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మహారాష్ట్ర ఇన్‌చార్జి పటేల్ సుధాకరరెడ్డి, ఆయనతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కానుగుల వెంకటయ్య (29)లను వరంగల్ జిల్లా తాడ్వాయి వద్ద లవ్వాల అడవుల్లో పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అనీ, మావోయిస్ట్ నేతను మహారాష్ట్రలోనే మే 23న అరెస్ట్‌చేసి వరంగల్ అడవులకు తెచ్చి కాల్చిచంపారని ప్రజాసంఘాలు, హక్కుల నేతలు ఆరోపించారు. ఈ విషయాన్నే మావోయిస్ట్ పార్టీ ఒక ప్రకటనలో ధృవీకరించింది.

మజర్ మెహది మృతి

మజర్ మెహది గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవలే చనిపోయారు. ఆయన ఉర్దూ, తెలుగు సాహిత్యాల మైత్రిని కొనసాగించడంలో కృషి చేశారు. హైదరాబాద్ సాహిత్య వేదికకు సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. 'అర్జై బే పైగంబర్', ఫ్రెంచ్ రచయిత బాదిలేర్ కవితల అనువాదాలు, హిబ్రూ కవితల అనువాదాలు చేశారు. 'గుజరాత్ జఖ్మ్' (గుజరాత్ గాయం) సంకలనానికి సంపాదకవర్గ సభ్యుడిగా ఉన్నారు.

పెరిగిన ఉత్తీర్ణతా శాతం

పదో తరగతి ఫలితాలు మే 27న వెలువడ్డాయి. పదోతరగతి పరీక్షలకు హాజరయిన విద్యార్థుల్లో 78.82 శాతంమంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో బాలికలు 0.52 శాతం ఆధిక్యతను కనబరిచారు. మొత్తం 10,01,529 మంది విద్యార్థులు హాజరు కాగా 7,89,468 మంది ఉత్తీర్ణులయ్యారు. పరిక్షలకు హాజరయిన బాలురు 5,21,117 మంది కాగా 4,09,481(78.57శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షలకు హాజరయిన 4,80,412 మంది బాలికల్లో 3,79,987 (79.9 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతలో నిజామాబాద్ 90.94 శాతంతో మొదటి స్థానంలో, చిత్తూరు 66.93 శాతంతో చివరి స్థానంలో నిలిచాయి.

అమ్ముడుకాని ధాన్యం

ధాన్యం అమ్ముడు కాక రాష్ట్రంలో రైతులు కష్టాలు పడుతున్నారు. రబీలో వరి సాగువిస్తీర్ణం 11.87 లక్షల హెక్టార్లు. ఈసారి ఇది గణనీయంగా పెరిగి 15.62 లక్షల హెక్టార్లకు చేరింది. సుమారు 55.05 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్లు అర్థ గణాంక శాఖ అంచనా కాగా, దిగుబడి కూడ బాగానే వచ్చింది. మే చివరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం 6.51 లక్షల టన్నులే. మిల్లర్లు, దళారులు 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో 30 శాతం పంట రైతులు అమ్ముకోవాల్సే ఉంది.

దళితుల వెలి

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పట్టణానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోల్లపర్రు గ్రామంలో 100 దళిత కుటుంబాలు వెలివేయబడ్డాయి. దళిత పేటకు చెందిన లాజరు జూపూడి శ్రీనుకు చెందిన చేపల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. చెరువు గుమస్తాకు, లాజరుకు మధ్య చేపల చెరువులో మందు వేసే విషయంలో గొడవ జరుగగా యజమాని శ్రీను లాజరుపై దొంగతనం కేసు పెట్టాడు. పోలీసుల సమక్షంలో రాజీపడినా తరువాత గుమస్తా సామాజిక వర్గానికి చెందిన వారు వంద దళిత కుటుంబాలను వెలివేశారు. పలురకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని దళితులు వాపోయారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ జోక్యంతో ఇరు వర్గాలు రాజీ పడ్డాయి.

కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్‌కు బ్రేక్

సముద్ర తీర ప్రాంతంలో పారిశ్రామికీకరణకు దోహదపడే కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ (సిఎంజెడ్) నోటిఫికేషన్ ముసాయిదా ఆమోదానికి బ్రేక్ పడింది. దేశవ్యాప్తంగా తీరానికి 50 కిలోమీటర్ల వరకు నివసిస్తున్న సుమారు 25 కోట్ల మంది ప్రజల జీవనం, వృత్తులు, పర్యావరణాలపై తీవ్రప్రభావం చూపే సిఎంజెడ్‌లో పొందుపరిచిన కొన్ని అంశాలు అసమగ్రంగా ఉన్నాయని కమిటీ అభిప్రాయపడింది. ప్రభుత్వాలెప్పుడూ ప్రజల శ్రేయస్సుకోసం చట్టాలు రూపొందించాలే తప్ప, కొంతమంది ఆర్థిక ప్రయోజనాల కోసం కాదని కమిటీ పేర్కొంది.

తెలంగాణ విమోచన సమితి

సికింద్రాబాద్‌లోని హరిహరకళాభవన్‌లో జూన్ 18న 'తెలంగాణ విమోచన సమితి' (టివిఎస్) ఆవిర్భావ సదస్సు జరిగింది. సదస్సు జరిగిన కాళోజీ ప్రాంగణంలో 'సికింద్రాబాద్ డిక్లరేషన్' పేరిట టివిఎస్ తన ఎజెండాను ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తక్షణం ప్రకటిస్తూ పార్లమెంట్‌లో వెంటనే బిల్లుపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వీ

దేశంలో ఆకలి నిర్మూలనకు, ఆహార భద్రతకు సుప్రీంకోర్టు పలు సూచనలు చేసినా, పాలకుల నిర్లక్ష్యం దేశవ్యాప్తంగా ఆకలిచావులకు కారణమవుతోందని అంటున్నారు **రమా ఎస్. మెల్కోటే**

ఆకలి చావులు - అసలు కారణాలు

అభివృద్ధి చెందుతున్న ఆధునిక సమాజంలో ప్రజల ఆహార భద్రతే దేశ ఆర్థిక సామర్థ్యానికి చిహ్నంగా గుర్తిస్తున్నారు. కారణాలు ఎలాంటివైనా వర్తమాన ఆధునిక సమాజంలో ఆకలిచావులు అనేవి పౌరపాలనలోని వైఫల్యంగానే చూడాల్సివస్తుంది. ప్రపంచీకరణ ప్రభావంతో చోటుచేసుకుంటున్న మార్పుల ఫలితంగా భారత ఆర్థిక వ్యవస్థలో సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తో సహా ఒరిస్సా, రాజస్థాన్‌లాంటి రాష్ట్రాలలో '90వ దశకంలో ఆకలిచావుల సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌లాంటి వ్యవసాయాధారిత రాష్ట్రంలో వెలుగుచూస్తున్న ఆకలిచావులకు వ్యవసాయ సంక్షోభంతో పాటుగా, కూలిపోతున్న కులవృత్తుల నేపథ్యం కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఎందుకంటే మన రాష్ట్రంలో వెలుగుచూసిన ఆకలిచావుల్లో వ్యవసాయకూలీలు, చేతివృత్తులవారే అధికంగా ఉన్నారు.

రాష్ట్రంలోని మొత్తం కార్మికుల్లో దాదాపు 41శాతం మంది వ్యవసాయదారులు, వ్యవసాయకూలీలుగానే ఉన్నారు. వీరిలో సుమారు 27.24 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న కూలీల కుటుంబాలే. అదేవిధంగా రైతుకుటుంబాలలో సైతం సుమారు 82.74 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. అయితే ఈ రైతాంగం కూడా తాము చేసే వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడికోసం అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తున్నది. ఇంకోవైపున గిట్టుబాటు ధరలు, నానాటికీ పెరుగుతున్న పెట్టుబడి భారం, తగ్గిపోతున్న పంటదిగుబడులు, సాగునీటి వసతిలేకపోవడం ప్రధానంగా మన రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతాంగాన్ని కృంగదీస్తున్న వాస్తవాలు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో వ్యవసాయం గడచిన పది సంవత్సరాల కాలంలో తీవ్రమైన ఆటుపోట్లకు, సంక్షోభానికి గురయ్యింది. ఫలితంగా గతంలో ఎన్నడూలేని రీతిలో ఈ ప్రాంతాలలోనే ఆకలిచావులు గణనీయంగా పెరిగిపోతున్నాయి. ఆకలిచావులపై నిర్వహించిన అధ్యయనాలు సైతం ఇదే అంశాన్ని ధృవీకరిస్తున్నాయి.

ఆహార హక్కు కేసులో సుప్రీంకోర్టు నియమించిన జాతీయ కమిషనర్లకు రాష్ట్ర సలహాదారుల బృందంతో పాటుగా 'చిప్' (సెంటర్ ఫర్ హాండ్లూమ్ ఇన్ఫర్మేషన్ అండ్ పాలసీ అడ్వోకసీ), యాక్షన్ ఎయిడ్, కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ (సిసిసి)లాంటి సంస్థలతో కలిసి రాష్ట్రంలోని మెదక్, మహబూబ్‌నగర్, ప్రకాశం, వరంగల్, నల్గొండ, అనంతపురం జిల్లాలలో వెలుగుచూసిన 65 ఆకలిచావుల సంఘటనలకు సంబంధించిన సమాచార సేకరణ ద్వారా ఒక నివేదికను రూపొందించాం. ఇందులో భాగంగా ఆకలిచావులపై అధ్యయన బృందంలోని సభ్యులకు నిపుణులచే పలుమార్లు వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించాం. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సంస్థకు చెందిన డాక్టర్ వీణా శత్రుఘ్న, డాక్టర్ రాధాకృష్ణలాంటి ప్రముఖవైద్యుల సలహాలను కూడా తీసుకొన్నాం. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా బాధిత కుటుంబాలకు సంబంధించిన ఆర్థిక, సామాజిక స్థితిగతులను బేరీజు వేశాం. ఆకలిచావుల సంఘటనలపై మీడియాలో వచ్చిన వార్తాకథనాల ఆధారంగా బాధితకుటుంబాలను ఈ అధ్యయనం కోసం ఎంపిక చేసాం. 15 మే 2005 – 15 ఏప్రిల్ 2008 మధ్య నాలుగు సంవత్సరాల కాలవ్యవధిలో మన రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన 65 ఆకలిచావుల సంఘటనలను ఈ బృందం పరిశీలించింది. ఇందుకు దారితీసిన పరిస్థితులను అధ్యయనం చేసింది. చాలినంత తిండి తినక పోవడంవల్ల జరిగిన చావులన్నింటినీ ఆకలిచావులుగానే గుర్తించాలని ఈ అధ్యయన నివేదిక ప్రతిపాదిస్తున్నది.

రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం. వృత్తి ఉపాధి రంగాలలో నెలకొన్న సంక్షోభమే ఈ ఆకలిచావుల సంఘటనలకు కారణంగా భావించవలసివస్తున్నది. చిన్న, సన్నకారు రైతులు 82శాతంగా ఉన్న మనరాష్ట్రంలో వాణిజ్యవ్యవసాయం పెంపొందినా, ఆ వాణిజ్య వ్యవసాయ నిర్వహణకు కావాల్సిన వనరులు రైతులకు అందుబాటులోకి రాలేదు. సరళీకరణ నేపథ్యంలో ఏ ప్రభుత్వం కూడా రైతులకు ఉపాధిని కాపాడే ప్రయత్నమూ చేయలేదు. చేతివృత్తుల విషయంలో కూడా ఇట్లాంటి ఉదాసీన వైఖరులనే అన్ని ప్రభుత్వాలు అనుసరించాయి.

అధ్యయనం చేసిన 65 మందిలో, 42 మంది మెదక్ జిల్లాకు చెందినవారు. 37 మంది మహబూబ్‌నగర్ జిల్లాకు, నల్గొండ, ప్రకాశం, అనంతపురం జిల్లాల నుండి ఆరు సంఘటనల చొప్పున, వరంగల్ జిల్లానుండి మూడు సంఘటనలను పరిశీలించారు. ఈ ఆకలిచావులకు బలైన వారిలో 31 మంది ఎస్.సిలు, తొమ్మిది మంది నేతకార్మికులు, మిగిలిన వారు వెనుకబడినవర్గాలకు చెందిన వారు.

అధ్యయనంలో వెలుగుచూసిన వాస్తవాలు

1) ఆకలిచావులకు గురైన వారిలో 26కుటుంబాల నెలసరి ఆదాయం 300 నుండి 700 రూపాయలుగా మాత్రమే ఉన్నది. ఎనిమిది కుటుంబాల నెలసరి ఆదాయం 700 నుండి 1400 రూపాయల మధ్యన ఉంది. ఒక కుటుంబానికి ఎలాంటి ఆదాయం లేకపోవడంతో భిక్షాటనే జీవనాధారంగా బతికారు. మిగిలిన 16 కుటుంబాలు 30 నుండి 40 రూపాయల దినసరి కూలీలే.

2) ఈ కుటుంబాలలోని ఏ ఒక్కరు కూడా శాస్త్రీయ నిర్దేశాల ప్రకారం చాలినంత తిండి తినడంలేదు. వీరిలో 17 కుటుంబాలవాళ్లు చాలీచాలని అన్నం, చారు, కారంలాంటి వాటితోనే సరిపుచ్చుకోవాల్సి వస్తున్నది. ఈ కుటుంబాలలో తమ పిల్లలకు అప్పుడప్పుడూ తిండిపెట్టగలిగినా, వారు మాత్రం చాలాసార్లు గంజితోనే కాలం వెళ్లదీసుకున్నారని వివరించారు. ఫలితంగా తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారు.

3) ఆకలిచావులకు బలైన ఈ 65 మంది బాధితుల్లో, చనిపోవడానికి వారంరోజుల ముందు, 11 మంది రోజుకు ఒకపూట మాత్రమే తిన్నారు. 24 మంది కేవలం ఒక పిడికెడు అన్నం, చారుతోనే సరిపుచ్చుకున్నారు. ముగ్గురు కేవలం ఒకే ఒక రొట్టెముక్కతో బతికారు. 22మంది గంజి నీళ్లతోనే బతికారు. ఒకరు మాత్రం దొరికిన సందర్భాలలో మాత్రమే తిన్నారు. మరో నలుగురికి సంబంధించిన సమాచారం మాత్రం అందుబాటులో లేదు.

4) ఆకలిచావులకు బలైన వారిలో ఎవ్వరు కూడా దీర్ఘకాలిక వ్యాధులతో, నయంకాని జబ్బులతో మంచాన పడ్డవాళ్లుకారు. అందరిలోనూ పౌష్టికాహార లోపంవల్ల ఎదురైన చిన్నచిన్న అనారోగ్యాలు మాత్రమే.

5) వీరిలో 50శాతం మందికి తెల్లకార్డులు, అంత్యోదయ కార్డులు ఉన్నప్పటికీ డబ్బులు లేకపోవడంతో వాటిని ఉపయోగించుకోలేక పోయారు. 39శాతం మందికి ఉపాధిహామీ జాబ్ కార్డులున్నాయి. అయితే శారీరక బలహీనతవల్ల ఎలాంటి పనులకు పోలేకపొయ్యారు. 10శాతం మందికి వృద్ధాప్య లేదా వికలాంగుల ఫించన్లు ఉన్నప్పటికీ వాళ్ల ఆహార, వైద్య అవసరాలకు ఏ మాత్రం చాలలేదు.

సూచనలు

సుప్రీంకోర్టు 2001లో రాజస్థాన్‌లో వెలుగుచూసిన ఆకలిచావుల సంఘటనలపై పియుసిఎల్ వేసిన పిటిషన్‌పై ఇచ్చిన తీర్పులో ఆకలిని నిర్మూలించి, పౌరుల ఆహార భద్రతను పెంపొందించడానికి పలు సూచనలను చేసింది. ప్రభుత్వాలకు, పాలనాయంత్రాంగానికి ఈ విషయంలో చిత్తశుద్ధి లోపించడంతో సుప్రీంకోర్టు సూచనలు అమలులోకి రాలేదు. మరికొన్ని నామమాత్రంగానే అమలు జరుగుతున్నాయి. మధ్యాహ్నభోజన పథకం ఒక్కటి మాత్రమే కొంతలోకొంత మెరుగ్గా కనిపిస్తున్నది. ఇటీవలి కాలంలో వృద్ధాప్య ఫించన్లు, వికలాంగుల ఫించన్లుకు చెల్లించే మొత్తాన్ని కొంతమేరకు పెంచడంవల్ల పరిస్థితులు కొంత మెరుగైనట్లు కనిపిస్తున్నది. అయితే రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలవల్ల పెంచిన మొత్తాలు చాలడంలేదని చాలాచోట్ల లబ్ధిదారులు అంటున్నారు. రాజకీయపార్టీలుకూడా కోర్టు తీర్పులను సక్రమంగా అమలు చేయించే ప్రయత్నాలు చేయడంలేదు. పేదప్రజలను సమానహోదాలో పౌరులుగా గుర్తించకపోవడంవల్లనే వీరికోసం అమలుచేస్తున్న పథకాలలో అనేక లోపాలకు ఆస్కారం కలుగుతోంది. వారికి అందజేస్తున్న సహాయాన్ని కూడా తాము ఉదారంగా ఇస్తున్న భిక్షగానే చూస్తున్నారు తప్ప, ఇది ప్రజలకు చెందవలసిన హక్కుగా మాత్రం గుర్తించడంలేదు. ఈ పరిస్థితిని నివారించడానికి ఈ దిగువ పేర్కొన్న రెండు సూచనలు అమలుచేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

1) ఆహార హక్కు చట్టాన్ని తీసుకువచ్చి ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు అధికారాలను స్పష్టంగా రూపొందించాలి. ఈ హక్కును వినియోగించుకోవడం కోసం ప్రజలకు అందుబాటులో అవసరమైన ప్రభుత్వ, పాలనా యంత్రాంగాన్ని నియమించాలి.

2) కేవలం మనిషి బ్రతకడానికి అవసరమైన తిండిని మాత్రమే కల్పించడం ఆకలిచావులకు శాశ్వత పరిష్కారం కాదనే వాస్తవాన్ని గుర్తించాలి. అన్నార్తులకు అవసరమైన ఉపాధిని శాశ్వత ప్రాతిపదికన అందజేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలి. పేదప్రజలు తిండికొరతనుండి పూర్తిగా ఉపశమనం పొంది, ఆత్మగౌరవంతో జీవించేవిధంగా చర్యలు తీసుకోవాలి. వీ

వీక్షణానికి చేయూత...

తెలుగులో మంచి పత్రికలు చాలా తక్కువగా ఉన్నాయి. అందులో ఒకటి 'వీక్షణం'. సామాజిక బాధ్యతతో క్రమం తప్పకుండా వస్తున్న 'వీక్షణం' అభివృద్ధికి నా వంతు కర్తవ్యంగా పదిహేను సంవత్సర చందాలు కానుకగా ఇస్తున్నాను. రాష్ట్రంలోని పదిహేను ప్రభుత్వ కాలేజీ లైబ్రరీలకు పత్రికను ఏడాదిపాటు పంపించండి.

– ఎస్. కిషోర్
హైదరాబాద్

నేను 'వీక్షణం' పాఠకుడిని. వీక్షణం లాంటి పత్రికలు నిలబడాలంటే సమాజంలో అందరూ చేయుతను అందించి బాధ్యతపడాలి. అందుకు నావంతుగా 'వీక్షణం'కు పది సంవత్సరాల చందాతో పాటు వెయ్యి రూపాయల విరాళాన్ని అందజేస్తున్నాను.

– చుక్కపల్లి పిచ్చయ్య
విజయవాడ

వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయినా, గ్రామీణ ప్రాంతంలో ఇప్పటికీ అత్యధిక జనాభా భూమిని అంటిపెట్టుకుని ప్రత్యామ్నాయాలు లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారంటున్నారు వి. హనుమంతరావు

వ్యవసాయ సంరక్షణ - ఆహార భద్రత

దేశ ఆర్థికవ్యవస్థ 2003-04తో ప్రారంభించి, 2008లో ప్రపంచ ఆర్థికసంక్షోభం మానవాళిని ముంచేటంత వరకు 'పోదాం పై పైకి' అంటూ సాగిపోయింది. స్థూల జాతీయాదాయం అభివృద్ధి తొమ్మిది శాతానికి చేరింది. తయారీ రంగం ముందుకు దూసుకుపోయింది. భారతీయ పారిశ్రామికవేత్తలు ఇతర దేశాల్లో పరిశ్రమలను కొనటం ప్రారంభించారు. ఇది రూపాయకు ఒకవైపు చిత్రం అయితే, రెండోవైపు చూడబోతే వ్యవసాయరంగం నేలచూపు చూడటం, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడటం, రైతాంగం ఆత్మహత్యలు, నిరుద్యోగం, పేదరికం పెరుగుదల మనకు కనిపిస్తుంది. ఇది సమానత్వంతో కూడిన అభివృద్ధి కాదని, ఆమ్ ఆద్మీ కి అభివృద్ధి ఫలితాలు అందలేదని తెలియజేస్తుంది. దీనికి మూలకారణం మన అభివృద్ధికి పునాది రాయి అయిన వ్యవసాయాన్ని 1991లో సంస్కరణలు ప్రవేశ పెట్టినప్పటి నుంచి నిర్లక్ష్యం చేయడం, పెట్టుబడులు పెట్టకపోవడం, ఫలితంగా వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు చితికిపోవడం, వలసలు వెళ్లడం జరుగుతోంది. కాగా మనం గత 18 సంవత్సరాల్లో సాధించింది ఆమ్ ఆద్మీ అభివృద్ధీ కాదు, ఉపాధి కల్పించే అభివృద్ధీ కాదు అని స్పష్టమవుతోంది. ఈ పరిణామానికి వ్యవసాయానికి పునాది సంబంధం ఉంది. కాబట్టి ఆ రంగంలో జరుగుతూ వచ్చిన పరిణామాలను విశ్లేషించుకోవడం అవసరం.

వ్యవసాయంరంగం నుంచి వచ్చే స్థూల జాతీయాదాయం పెరుగుదల 1980-95 మధ్య 3.3 శాతం పెరగగా, 1995-96/ 2004-05 మధ్య రెండు శాతానికి పడిపోయింది. అన్ని వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పత్తి అన్ని రాష్ట్రాల్లో పడిపోయింది. ఇంతగా పడిపోవడం 1947లో అధికార మార్పిడి తర్వాత ఎప్పుడూ చూడలేదు. ఇలా పడిపోవడం ఆహార భద్రతకే ముప్పు. 2001-02లో తలసరి ఉత్పత్తి ఎంత ఉందో, వచ్చే సంవత్సరం (2010) నాటికి కూడా అంతే ఉండాలంటే, 24 కోట్ల టన్నుల ఉత్పత్తి జరగాలి. కాని 2007-08లో 21.9 కోట్ల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేయగలిగాం. నడుస్తున్న సంవత్సరంలో ఇది సాధ్యమా? అవసరమైనంత ఉత్పత్తి చేయలేకపోతే, దిగుమతి చేసుకొందాం అంటున్నారు పాలకులు. ఇలా దిగుమతికి పాల్పడటం వల్లనే మే-సెప్టెంబర్ 2007లో అంతర్జాతీయ ధరలు టన్నుకు 200 నుంచి 400 డాలర్ల మేరకు పెరిగి, మన దిగుమతి చెల్లింపులు రెట్టింపయ్యాయని పాలకులు గుర్తించాలి. ఇది మన పీకను మనమే ఉత్తరించుకోవడమవుతుంది. ఆహార భద్రతకు ముప్పు ఏర్పడడానికి ప్రధాన కారణం గత ఇరవై ఐదు సంవత్సరాల్లో వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెట్టకపోవడమే. ప్రస్తుతం స్థూలజాతీయాదాయం లో పెట్టుబడుల శాతం 1.9 శాతం మాత్రమే. ఉత్పత్తి తగ్గితే ధరలు పెరుగుతాయి, పేదల కొనుగోలు శక్తి ఈ ధరల పెరుగుదలను భరించలేదు. ప్రపంచంలో మాంసాహారం పెరుగుతోంది. ఒక కిలో ఆవు మాంసం తినాలంటే ఎనిమిది కిలోల తిండిగింజలు అవసరమ వుతాయి. పైగా అభివృద్ధి చెందిన దేశాల్లో బయో-ఫ్యూయల్ కోసం తిండిగింజల ఉత్పత్తి పెద్ద ఎత్తున తరలిపోతోంది. ఉదాహరణకు అమెరికాలో 2000-07 మధ్య బయో-ఫ్యూయల్ ఉత్పత్తి కోసం మొక్క జొన్న తరలింపు 150 లక్షల టన్నుల నుంచి 850 లక్షల టన్నులకు పెరిగింది. సహజంగా ధరలు పెరుగుతాయి.

మన దేశంలో వ్యవసాయంలో మందగమనం, తలసరి తిండిగింజల వినియోగం తగ్గిందంటే దానికి కొనుగోలు శక్తి తగ్గటం, ధరలు పెరగటం కారణాలు. తినే తిండి ఇచ్చే శక్తిని కేలరీల ప్రకారం చూస్తే, 1993-94/2004-05 మధ్య గ్రామాల్లో 106 కేలరీలు, పట్టణ ప్రాంతాల్లో 51 కేలరీల మేరకు పడిపోయింది. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ఉత్సా పట్నాయక్ వేసిన లెక్కల ప్రకారం 2004-05లో గ్రామాల్లో 87 శాతం మంది 2400 కేలరీలు శక్తినిచ్చే ఆహారం తినలేక పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తినే ఆహారం ఇచ్చే కేలరీల శక్తి 1993-94లో 2153 నుంచి 2004-05 లో 2047కు, పట్టణాల్లో అదే కాలంలో 2071 నుంచి 2020 కేలరీలకు పడిపోయింది. జాతీయ సాంపుల్ సర్వే ప్రకారమే ప్రతి వ్యక్తీ రోజూ 2400 కేలరీల శక్తినిచ్చే ఆహారం తినాల్సి ఉండగా, అలా తినలేని వారి శాతం పైన ఉదహరించిన కాలంలోనే గ్రామాల్లో 42 నుంచి 49.1కు పట్టణాల్లో 48.8 నుంచి 53.6 శాతానికి పెరిగింది. పేదరిక రేఖను ఈ కేలరీల ఆధారంగానే లెక్కవేస్తారు. ఒక పక్క నేషనల్ సాంపుల్ సర్వే లెక్కలు ఇలా ఉంటే, ప్రభుత్వం మాత్రం 27.5 శాతం ప్రజలు మాత్రమే పేదరికపు రేఖ కింద ఉన్నారని నమ్మబలుకుతోంది. ఈ విషయంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశం సోదిలోకి కూడా రాదు. ప్రపంచ సగటు 2718 కేలరీలయితే, అభివృద్ధి చెందిన దేశాల సగటు 3206. వర్ధమాన దేశాల సగటు 2573 కన్నా మన దేశం హీనదశలో ఉంది.

ప్రజలు తిండిగింజల కన్నా మాంసం, కోడిగుడ్లు, పాలు, చేపలు

తింటున్నారనీ, అందుచేత తిండిగింజల కొరత గురించి పట్టించుకో నవసరం లేదనీ కొంతమంది సర్కారీ ఆర్థిక శాస్త్రవేత్తలు అంటూంటారు. అసలు తిండే దొరక్క పేదలు పస్తులు పడుకొంటూంటే, వాళ్లు మాంసం, చేపలు తినేస్తున్నారంటారేమిటి అని మీకు అనిపించటం లేదూ? వాస్తవమేమిటంటే కేవలం కేలరీలే కాదు, మాంసకృత్తులు (ప్రోటీన్) వినియోగం కూడా గ్రామాల్లో అయిదు శాతం తగ్గింది. కాగా తిండి తక్కువ తింటే శక్తి తగ్గుతుంది, పోషకాహార నిలువలూ తగ్గుతాయి. రోగాలొస్తాయి కూడా. గ్రామాల్లో 68 శాతం, పట్టణాల్లో 56 శాతం కేలరీల శక్తి ఆహార ధాన్యాల నుంచే వస్తుంది. పప్పు దినుసుల నుంచి మాంసకృత్తులు 9-11 శాతం వస్తోంది. పప్పుల ధరలు కొండెక్కి కూర్చుంటే పోషకాహార విలువలు తగ్గకేంచేస్తాయి.

భూమి విస్తీర్ణం, భూసారం, ఉత్పాదకత అన్నీ ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయి. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం 1990-91/2003-04 మధ్య కాలంలో నికర పంట భూమి విస్తీర్ణం 1430 లక్షల హెక్టార్ల నుంచి 1409 లక్షల హెక్టార్లకు తగ్గింది. అలాగే నీటిపారుదల సౌకర్యం ఉన్న భూమి విస్తీర్ణం 571 లక్షల హెక్టార్ల నుంచి 551 లక్షల హెక్టార్లకు తగ్గింది. నీటి సౌకర్యం ఉన్న భూమి విస్తీర్ణం తగ్గడానికి కారణం ఆ భూమిని రియల్ ఎస్టేట్‌కు, సెజ్‌లకు తరలించడం, ఉత్పత్తి కారకాలు (ఇన్‌పుట్స్) ధరలు పెరగటం. కల్తీ కావటం వల్ల అటు కారకాల ఉత్పత్తి తగ్గుతుంది, రైతుల వాడకమూ తగ్గుతుంది. ఫలితంగా భూసార రక్షణ దెబ్బతింటుంది. పంట ఉత్పాదకత తగ్గుతుంది. వ్యవసాయ భూమిలో మూడింట రెండు వంతులకు 'జబ్బు' చేసింది. బోర్లు, పంపుసెట్లతో భూగర్భ జలాలను తోడేస్తుండడం వల్ల దేశంలోని 596 జిల్లాల్లోని 264 జిల్లాల్లో భూగర్భ నీటిమట్టం అడుగంటి పోతోంది. ఈ లెక్కన మొత్తం పర్యావరణమే తీవ్రంగా దెబ్బతింటోంది. ఉత్పత్తి తగ్గుతోంది, ఉత్పాదకత తగ్గుతోంది కాని వ్యవసాయం మీద ఆధారపడే జనాభా మాత్రం అలాగే ఉంది. రైతుల సంఖ్య తగ్గుతోంది. వ్యవసాయ కూలీల సంఖ్య పెరుగుతోంది. పరిష్కారం ఏమిటి?

కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టి, పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలి – ఇది పాలకుల పరిష్కారం. టెక్నాలజీ ఎవరిస్తారు? ప్రపంచ వ్యవసాయ రంగాన్ని మడిచి జేబులో పెట్టుకొంటున్న మొన్‌శాంటో లాంటి గుత్తపెట్టుబడి సంస్థలు, కార్పొరేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టగలుగుతాయి. అంటే భూముల నుంచి రైతుల తొలగింపు, లేదా రైతే తన పొలంలో తానే వ్యవసాయ కూలీగా మారడం, లేదా కాంట్రాక్ట్ వ్యవసాయం. మన్మోహన్‌సింగ్ చుట్టాలెవరో తెలిసిపోతోంది. ఆధునిక టెక్నాలజీ మరిన్ని పెట్టుబడులు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచటానికి తోడ్పడతాయి. సందేహం లేదు. కాని ఎవరికోసం? లక్ష్యం ఏమిటి? పేద రైతు బాగుపడలేదా? ఎవరూ లాభిస్తారు? ఆధునిక టెక్నాలజీ అని పెద్ద పెద్ద మాటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు వల్లె వేస్తుంటారు. కాని వాస్తవమేమంటే ఏ ఆధునిక టెక్నాలజీ లేకుండానే ఉత్తర ప్రదేశ్‌లో ఉత్పాదకత 50 శాతం, బీహార్‌లో 100 శాతం, చత్తీస్‌ఘడ్‌లో నీరు పారని భూముల్లో 150 శాతం, నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో 169 శాతం పెంచవచ్చునని అధికారిక కమిటీ చెబుతోంది. మరో విషయమేమంటే చిన్న, సన్నకారు, మధ్యతరహా, ధనికరైతు – అందరినీ ఒకేగాటన కట్టేసి మాట్లాడుతుంటారు. ధనిక రైతుకున్న అవకాశాలు, శక్తి, పెట్టుబడులు సన్నకారు రైతుకుంటాయా? రైతుల్లో వివిధ వర్గాల వారిని వివిధ స్థాయిల్లో సాయం, సలహా అందాలి. అలా చేయకపోబట్టే ఆత్మహత్యల పర్వం కొనసాగుతోంది.

ఈ శాస్త్రవేత్తలు మరోపాట పాడుతూంటారు. ఉన్న భూమి ఏదో ఉంది, అదేమీ రబ్బరులా సాగదు. చేయాల్సిందల్లా ఉత్పాదకత పెంచటమే మార్గం అని అంటూంటారు. కాని భూమి గురించిన గణాంకాలు అసలు కథ చెబుతున్నాయి. 260 లక్షల హెక్టార్ల ఫాలో భూములు, 130 లక్షల హెక్టార్ల కల్టివబల్ వేస్ట్ భూములు దేశంలో ఉన్నాయి. ఈ భూముల్లో కొంతభాగం పశుగ్రాసం కోసం ఉపయోగిస్తున్నా, ఇంకా ఎన్నో హెక్టార్ల భూములను నికర పంట భూమిగా మార్చే అవకాశం ఉంది. అలా జరగటం లేదంటే దానికి కారణాలు వాటికి నీటి సౌకర్యం లేకపోవటం, రైతుల పేదరికం, వర్కింగ్ కాపిటల్ లేకపోవటం, పండించిన దానికి ఖర్చులైనా గిట్టుబాటు కాని ధరలు, కొన్ని చోట్ల భూస్వాములు భూమిని పడావు పెట్టడం, అలాంటి భూములను చిన్న, సన్నకారు రైతులు తమ సంఘటిత శక్తితో, పంట పండించుకోలేని అశక్తత – ఇలా సామాజిక, ఆర్థిక కారణాలెన్నో ఉన్నాయి. గత అయిదు దశాబ్దాల్లో భూ యాజమాన్యంలో మార్పేమీ లేదు. నేషనల్ సాంపిల్ సర్వే ప్రకారమే 5.2 శాతం గ్రామీణ కుటుంబాల అధీనంలో 42.8 శాతం భూమి ఉండగా, అగ్రభాగాన ఉన్న 9.5 శాతం మంది చేతుల్లో 56.6 శాతం భూమి ఉంది. మిగతా 90.5 శాతం కుటుంబాలు 43.4 శాతం భూమిని కలిగి ఉన్నాయి. వీరిలో 41.6 శాతం మంది కుటుంబాలకు వారి గుడిసె వేసుకొన్న నేల తప్ప, వేరే భూమి లేదు. కౌలుదార్ల సంగతి జగద్విదితం, వేరే వ్యాఖ్యానించాల్సిన పనిలేదు.

వ్యవసాయం ఇలా దండగగా మారిన వ్యవహారమైనా, 57 శాతం శ్రమజీవులు భూమినే అంటిపెట్టుకొన్నారంటే కారణం స్పష్టం – వారికి ఇంకో వ్యాపకం లేదు లేదా వలసపోవాలి. పట్టణాలకు పోయి రిక్షా లాక్కోవాలి. ఉపాధి లభించదు, లేదా కాంట్రాక్ట్ కార్మికునిగా పని దొరికితే తనను తానే పోషించుకోలేడు, ఇంటికేమి పంపించగలడు? నగరాల్లో పరిశ్రమలు ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి ఉన్న కార్మికులనే బయటకు పంపేస్తున్నాయి. ఈ కారణాలన్నింటివల్లా భూమిని వదిలే అవకాశం లేదు. ఈ అసహాయ స్థితిని భూ కామందులు అవకాశంగా తీసుకొని వారి శ్రమశక్తిని దోచుకొంటున్నారు. అరెకరం, పావెకరం ఉందనియ్, దానినే అంటిపెట్టుకొని ఉండడం తప్ప మరో మార్గం లేదు. వ్యవసాయం సంక్షోభంలో ఉండక ఏమవుతుంది? వ్యవసాయాధారిత గ్రామీణులకు ఆస్తిపాస్తులేమీ ఉండవు. గుంటా, సెంటు భూమి, చారెడు నేలమీద పాక – ఇవే వారి ఆస్తులు. ఆలిండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వేల ప్రకారం 63 శాతం రైతు కుటుంబాలకు భూమే ఆధారం. 24 శాతం రైతు కుటుంబాలకు ఇళ్లని పిలువబడే గుడిసెలు. రెండూ కలిపితే 87 శాతం. ఈ పరిస్థితి గత మూడు, నాలుగు దశాబ్దాల పాటు ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయింది. అక్కడక్కడ పశువులు, కోళ్లు, వ్యవసాయ యంత్రాలున్న వారు కనిపిస్తారు. వారి సంఖ్య చాలా తక్కువ. ఆస్తులు కూడా రానురాను తరిగిపోతున్నాయి.

అభివృద్ధి గురించి కొత్త నిర్వచనాలతో, కొత్త సూచనలతో తయారయిన ప్రపంచ బ్యాంక్ నివేదికను సమీక్షిస్తున్నారు **ముదునూరి భారతి**

ప్రపంచబ్యాంక్ నివేదిక - విమర్శనాత్మక సమీక్ష

ప్రపంచబ్యాంక్ అభివృద్ధిని కేంద్రంగా తీసుకుని, ప్రపంచ దేశాల పురోగతిని సమీక్షిస్తూ 'ప్రపంచ అభివృద్ధి నివేదిక 2009'ని ఈ మధ్యనే విడుదల చేసింది. అభివృద్ధి మీద నేను చాలా కాలంగా పని చేశాను. అభివృద్ధి అంటే సమాజ నిర్మాణంలో మార్పు అనీ, అది దానిలో ఉండే మూడు కోణాలతో చలనం ద్వారా అర్థం చేసుకోవచ్చుననీ రాసాను. ప్రపంచబ్యాంక్ పత్రికలలో భారతదేశ అభివృద్ధి పథకాల మీద చేసిన ఒక విపరీతమైన వాఖ్యని చూసి ఆ నివేదికని చదివాను. ఆర్థిక నిపుణులు ఇంతవరకూ తయారుచేసిన అభివృద్ధికి చెందిన అంశాలను వెనుకకు నెట్టి, తిరిగి కొత్త నిర్వచనాలు, కొత్త పరికరాలు తయారు చేసి మనముందు నివేదిక రూపంలో పెట్టింది. అభివృద్ధి చెందవలసిన దేశాలు వీటిని అన్వయించుకుంటే అభివృద్ధి చెందగలవని సూత్రీకరించింది. అందులో అమెరికా, జపాన్ లాంటి దేశాలను (అధిక ఆదాయం కలవి, అభివృద్ధి చెందినవి) అభివృద్ధి చెందవలసిన దేశాలు వారి క్రమాన్ని అనుసరించటం ద్వారా అభివృద్ధి చెందగలవనే భరోసాని ఇచ్చింది. పేద దేశాలు అభివృద్ధి చెందటానికి ఏకైక మార్గం ఇదేనని సూచించింది. ఈ నివేదికలో తన ప్రస్థానాన్ని వివరిస్తూ, వాస్తవ సంగతులు గుర్తించడం, దీనిని విశ్లేషించడం, దీనికి కావలసిన పథకాలను సూచించడం ద్వారా కొనసాగిందని వివరించింది. వాస్తవ సంగతులు కళ్లకు కట్టినట్లుగా వివరించడం అనే ప్రక్రియని 'వర్ణన' అనవచ్చును. వీటిని విశ్లేషించడం అంటే ఒక కార్యాకారణ సంబంధం చూడటం అని అర్థం చేసుకోవచ్చును. ఇంకొంచెం వివరంగా వర్ణన అంటే ఏమిటి? విశ్లేషణ అంటే ఏమిటి? వీటి మధ్యన ఉండే సంబంధం ఏమిటి? అనే వాటి గురించి ఆలోచిద్దాం.

వర్ణన - విశ్లేషణ

వర్ణన, విశ్లేషణ అనే భావనలు మన చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడానికి, ఈ క్రమంలో వాస్తవ ప్రపంచ పోకడల గురించి శాస్త్రవిజ్ఞానం పెంపొందించుకోవడానికి, ఈ శాస్త్ర విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టి వాస్తవ ప్రపంచంలో మార్పులు తీసుకుని రావడానికీ చాలా ఉపయోగపడతాయి. ఈ క్రమంలో మనిషి కూడా మారుతూ పెరుగుతాడు. ఈ భావనలు వాస్తవ ప్రపంచంలో భాగమైన మనిషి తన చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచాన్ని అర్థం చేసుకునే క్రమంలో

రైతాంగ ఆర్థిక జీవనం గురించి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కోర్కె మేరకు నేషనల్ సాంపిల్ సర్వే సంస్థ ప్రత్యేకంగా ఒక అధ్యయనం చేసింది. ఈ అధ్యయనం ప్రకారం :

- వెనుకబాటుతనం, ఇతర వర్గాల నుంచి దూరంగా ఎక్కువ మంది రైతులు జీవనం వెళ్లదీస్తున్నారు.
- గ్రామస్థాయిలో వ్యవసాయ ఉత్పత్తి కారకాలు, పశు సంరక్షణ సేవలు లభించటంలేదు.
- కనాకష్టంగా ఉన్న వారి అక్షరాస్యత, విద్య.
- దేశంలో ఎక్కువ భాగంలో కనీస మద్దతుధర అనే సౌకర్యం గురించి తెలియనే తెలియదు. ఆ కనీస ధర లభించటం అనే సమస్యేలేదు.
- అలాగే ఇన్స్యూరెన్స్ సౌకర్యం ఉందని కూడా వారికి తెలియదు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వారికి అందుబాటులో లేదు. ఇందు గురించిన సమాచారం అందచేయాల్సిన ఎక్స్‌టెన్షన్ అధికార గణం చాలా కొద్దిమందికే తెలుసు. గ్రామ, బ్లాక్ స్థాయిలో ప్రతీ 2200 భూకమతాలకు ఒక్క ఎక్స్‌టెన్షన్ అధికారి మాత్రమే ఉన్నారు. ఈ సర్వేలో తెలియవచ్చిన మరో విషయమేమంటే రైతుకు మిగిలే ఆదాయం అతని కనీస వినియోగ అవసరాలకు కూడా సరిపోదు. సగటు రైతు కుటుంబాదాయం అతని అవసరాలను 35 శాతం మేరకు మాత్రమే తీర్చగలుగుతుంది. ఉత్పత్తి కయ్యే ఖర్చు, అతను ఉపయోగించే వ్యవసాయ యంత్రాల విలువ తరుగుదలను కూడా కలిపి చూస్తే, అతనికి నికరంగా మిగిలేది ఇంకా తక్కువగా ఉంది. రైతు కుటుంబం జీవనాన్ని సాగించడానికి వ్యవసాయేతర పనులను చేపట్టి అదనపు ఆదాయాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. అటు వ్యవసాయం, ఇటు వ్యవసాయేతర పనుల నుంచి అతనికి ముడుతున్న ఆదాయం రు. 2115. ఇది అతని వినియోగ ఖర్చు రు. 2700 కన్నా తక్కువే. అతని వినియోగ ఖర్చు సగటున నెలకు తలసరి రు. 503 మాత్రమే. సర్వే లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం రైతు కుటుంబ ఆదాయం లోటు 2800 రూపాయలు. ఈ లోటు తీర్చడానికి అప్పు చేస్తారు. ఉన్న ఆస్తులు అమ్ముకొంటారు. లేదా కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లి సంపాదించిన దాంట్లో కొంత సొమ్ము ఇంటికి పంపిస్తారు. ఇలా లోటు బడ్జెట్ తో సంసారం ఈదేవాళ్లు, రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి ఉన్నవారు 88 శాతం మంది ఉన్నారు. వీ

తనే స్వయంగా రూపొందించుకున్న భావనలు. ఈ వాస్తవ ప్రపంచంలో చెట్లు, చేమలు, జంతువులు, పక్షులతో కూడిన ప్రాకృతిక ప్రపంచం, మనుష్యులు నిర్మించుకున్న సామాజిక ప్రపంచం అనే రెండు భాగాలు ఉంటాయి. ప్రాకృతిక ప్రపంచంలో భాగమయిన జంతువులు, వృక్షాలలో మళ్లీ ఎన్నో వేల జీవజాతులు ఉంటాయి. వీటిలో ఎన్నో విభేదాలు కూడా ఉంటాయి. సామాజిక ప్రపంచంలో కూడా ఇలాగే ఎన్నో విభేదాలు ఉంటాయి. సామాజిక ప్రపంచంలో భాగమయిన మనిషి తన చుట్టూ ఉన్న ప్రకృతి, సమాజాలలో సహజంగానే ఉండే ఈ భిన్నత్వాన్ని తన పంచేంద్రియాల ద్వారా గుర్తించి దానిని స్పష్టంగా వివరించడం అనే ప్రక్రియని వర్ణన అని నిర్వచించుకోవచ్చు. ప్రాకృతిక ప్రపంచంలో వృక్షజాతిలో ఎన్నో వేల రకాల జాతులు, వాటి మధ్యన భిన్నత్వం ఉన్నట్లుగానే, ఒకే జాతి వృక్షాలలో, అంటే ఉదాహరణకి మామిడి చెట్టు తీసుకుంటే, ఒకే స్థలంలో ఉన్న మామిడి చెట్లలో తేడాలే కాకుండా, కాలగమనంలో ఈ మామిడి చెట్టు నిన్నటికి, ఇవాళ్టికి భిన్నంగా కనిపిస్తుంది. ఈ రెండు రకాల భిన్నత్వం, ఒకటి స్థలంలో, రెండవది కాలగమనంలో లేకపోతే మనిషి వీటిని గుర్తించడం జరగదు. అంటే అంతర్‌భిన్నత్వమే (వేరియబిలిటీ) మనిషి తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అవగాహన చేసుకుని జ్ఞానం సంపాదించడానికి మూలకారణం.

ఇంక సామాజిక ప్రపంచానికి వస్తే, దీనిలో కూడా చాలా భిన్నత్వముంటుంది. సామాజిక ప్రపంచంలో అతి చిన్న భాగమైన గ్రామంలో కూడా ఈ తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒక ఆదివాసీ గ్రామం, ఎడారిలో ఉండే గ్రామం, నీటి వనరులు బాగా ఉండే గ్రామం, పంటలు బాగా పండని కరువు ప్రాంతంలో ఉండే గ్రామం ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయి. అలాగే పట్టణాలలో కూడా చాలా అంతరాలు ఉంటాయి. ముంబయి, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో అంతరాలు ఉన్నట్లే వీటి పక్కనే ఉన్న గ్రామాలలో కూడా తేడాలు ఉంటాయి. ఇదే విధంగా రాష్ట్రాలలో తేడాలు – ఆంధ్రప్రదేశ్ వేరు, ఒరిస్సా వేరు – అలాగే సంపన్న దేశాలయిన అమెరికా లాంటి దేశాలు, పేద దేశమయిన ఇండియా లాంటి దేశాలలో అంతరం స్పష్టంగానే ఉంటుంది. వీటన్నింటిలో ఏకకాలంలో రూపంలో తేడాలే కాక, కాలంలో తేడాలు అంటే నిన్నటి గ్రామానికి ఇవాళ్టి గ్రామానికి, నిన్నటి దేశానికి ఇవాళ్టి దేశానికి తేడాలుంటాయి. ఉదాహరణగా మేము సర్వే చేసిన కొన్ని గ్రామాలు చూద్దాం.

ఒకే సమయంలో భిన్నత్వానికి ఉదాహరణగా ఒరిస్సాలోని ఇంద్రావతి నది మీద కట్టిన డ్యాం వలన ఒకేసారి ఒకే గ్రామం నుండి నిర్వాసితులయిన రెండు చిన్న గ్రామాలను తీసుకోవచ్చును. పరజాదేవపల్లి అనే గ్రామం నుండి నిర్వాసితులై దూర దూరంగా ఉన్న రెండు చిన్న చిన్న గ్రామాలుగా పునరావాసం పొందినప్పటికీ, రెండింటిలో ప్రస్ఫుటంగా తేడాలు కనిపిస్తాయి. డోంగ్‌ఝురనా అనే చిన్న గ్రామం నిర్వాసిత సమస్యల వలన వచ్చే ఒడిదుడుకులు తట్టుకోలేక చితికిపోయే స్థితిలో ఉంటే, రెండవ గ్రామం నవమాజిగూడ నిర్వాసిత సమస్యల వలన వచ్చే బాలారిష్టాలన్నీ తట్టుకొని సమాజ నిర్మాణంలో తమ కవసరమైన శక్తిని సంపాదించుకుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న పండించే రెండు గ్రామాలు, చిత్తూరు జిల్లాలో కుప్పంలో ఉన్న చల్దిగానిపల్లి, కరీంనగర్ జిల్లాలో ఉన్న చిన్నారం గ్రామాలలో మనకు వ్యత్యాసం బాగా కనిపిస్తుంది. చల్దిగానిపల్లెలో పిల్లమక్క (బేబీ కార్న్) పండించడంలో కార్పొరేట్ వ్యవసాయంలో భాగంగా ఇజ్రాయిల్‌కి చెందిన సాంకేతిక జ్ఞానం, నీటి చుక్కల వ్యవసాయమూ, అధిక మొత్తంలో మదుపు, ఎగుమతుల ప్రాధాన్యం, తక్కువ లింకేజీలు, అతి సుకుమారంతో కూడిన వ్యవసాయం అయితే, చిన్నారంలో ప్రతి ఇంట మొక్కజొన్న పంట, వర్షాధారపు పంట, తక్కువ మదుపు, శీతోష్ణస్థితులలో మార్పులకు తట్టుకొని నిలబడగలిగినది, సాంప్రదాయిక వ్యవసాయంలో భాగంగా అందరికీ తెలిసిన పంట పండించగల జ్ఞానం, ముఖ్యంగా కుటుంబ అవసరాలు తీర్చే, ఉపయోగపు విలువ ఎక్కువగా ఉన్న మొక్కజొన్న పంట.

ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నా, ఒకే ప్రభుత్వ అధికార పథకాల ప్రభావం ఉన్నా కూడా ఈ రెండు గ్రామాలూ ఒకదానితో ఒకటి పోలికలేని గ్రామాలుగా కనిపిస్తాయి. ఇంక కాలంలో ఉన్న భిన్నత్వాన్ని చూడాలంటే శ్రీకాకుళంలో ఉన్న బొంతల కోడూరు లోని ఎస్.సి. కాలని. గతంలో విడివిడిగా నివసించిన వ్యవసాయ కూలీలుగా ఉన్న ప్రజలను ప్రభుత్వ సహాయంతో ఒకచోట చేర్చి ఇంటిస్థలం, దాని పక్కనే చిన్నదైనప్పటికీ కొంత సాగుభూమిని ఉమ్మడిగా ఇచ్చి, ఎత్తిపోతల పథకం ద్వారా నీటి సదుపాయం, ఇవికాక ఆవుల పెంపకానికీ, స్వయం సహాయక బృందాలకూ రుణసహాయం ఇచ్చి కొంత చేయూతనిచ్చింది. వీటి వలన గతంలో వ్యవసాయ కూలీలుగా ఉన్నవారు చాలా తక్కువ సమయంలోనే సొంతపొలం ఉండి సమిష్టి వ్యవసాయం సమర్థవంతంగా చేయగల వ్యవసాయదారులుగా మారిపోయారు. ఈ ఆచరణలో మార్పులతో వారి ఆలోచనలలో కూడా మార్పులు వచ్చాయి.

ఇంకో ఉదాహరణగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మించడం మూలాన నిర్వాసితులకు కట్టిన పునరావాస కేంద్రాలలో దానబోయిన పాలెం ఒకటి. గతంలో ఈ గ్రామంలో చాలా వరకు అన్ని కుటుంబాలకు వ్యవసాయం ప్రధాన వ్యాపకంగా ఉండేది. సాంప్రదాయ పద్ధతులలో వ్యవసాయం, నీటి సదుపాయం తక్కువ, మెట్ట ప్రాంతం అవడం మూలాన చాలా వరకు కుటుంబాలు తమ రోజువారీ అవసరాలకు గ్రామ పెద్దమీద ఆధారపడేవారు. ఈ గ్రామం యజ్ఞం కథలోని సుందరపాలెం గ్రామాన్ని పోలి ఉండేది. పునరావాస గ్రామంలో స్థిరపడిన తరువాత ఇళ్లకు కరెంటు సదుపాయం, నీటి కొరత లేకుండా బోరు పంపుల సదుపాయం, రవాణా సౌకర్యాలు లాంటివి కల్పించినా కూడా కొత్త వ్యవస్థలో ఇమడలేక మిగిలిపోయినవాళ్లు వ్యవసాయ కూలీలే. వీరికి ఇతరులతో సంబంధాలు పోయి ఎవరికి వారే ఆయిపోవడంతో, గతంలో తమకున్న సామాజిక భద్రతని కోల్పోయి నిరాధారులుగా, నిస్సహాయులుగా మిగిలిపోయారు.

ప్రాకృతిక ప్రపంచంలో కాని, సామాజిక ప్రపంచంలో కాని వాటిలో ఉన్న భిన్నత్వాన్ని గురించి వివరించడం 'వర్ణన' అని చూడవచ్చును. ఈ వర్ణన ఏకకాలంలో వివిధ ప్రదేశాలలో రూపంలో ఉండే భిన్నత్వాన్ని కాని, వేర్వేరు కాలాలలో అంటే కాలక్రమంలో ఉండే భిన్నత్వాన్ని కాని వివరించే ప్రక్రియగా చూడవచ్చును.

ఇంక విశ్లేషణ గురించి చెప్పుకోవాలంటే వాస్తవ ప్రపంచంలో, అంటే ప్రాకృతిక లేక సామాజిక ప్రపంచాలలో, భిన్నత్వం ఎందుకు ఉంది? ఎలా వచ్చింది? అనే ప్రశ్నలకు సమాధానం వెతకడంగా అర్థం

చేసుకోవచ్చును. పైన చెప్పినట్లుగా మామిడి చెట్టునే మన వస్తువుగా తీసుకుంటే ఈ చెట్టుకి మామిడి కాయలు వస్తాయి. ఎలా? కొన్ని మామిడి చెట్లకు ఎక్కువ కాయలు వస్తే, కొన్ని చెట్లకు తక్కువ కాయలు వస్తాయి. ఒక మామిడి చెట్టుకి ఒక ఏడాది కాయలు కాస్తే మరో ఏడాది రావు. మామిడి చెట్లలో ఏకకాలంలోనూ, కాలానుగుణంగానూ ఉండే ఈ భిన్నత్వం ఎందుకు? ఎలా? అనే వర్ణనాత్మక వివరణలకు ఒక కార్యకారణ సంబంధం వెతకడం ఈ వర్ణనకి ఇచ్చిన విశ్లేషణగా గుర్తించవచ్చును. వర్ణనని విశ్లేషించే ఈ క్రమమే శాస్త్రం, శాస్త్ర విజ్ఞానం అంటే సైన్స్‌గా చెలామణీ అవుతుంది. మార్క్స్ పరిభాషలో చెప్పాలంటే రూపం నుండి సారానికి వెళ్లే ప్రయత్నమే సైన్స్ అని అర్థం చేసుకోవచ్చును.

ఇక్కడ విశ్లేషణ అంటే ఒక మామిడి చెట్టు మొలవడానికి మూలం దాని విత్తనం అని గ్రహిస్తే ఏ మామిడి చెట్లు చూపులకు ఎలా ఉన్నాయి? ఎలాంటి కాయలు ఇస్తాయి? అనేది వాటి విత్తనం మీద ఆధారపడుతుంది అని చెప్పడం ఒక వర్ణనాత్మక జ్ఞానం. చెట్టు గుణాలు అది మొలకెత్తిన విత్తనం మీదే ఆధారపడతాయి. అంటే ఈ భిన్నత్వానికి కారణం విత్తనంలో తేడాలని, మరికొంచెం ముందుకు వెళ్లి మంచి విత్తనానికి, చెడ్డ విత్తనానికి తేడాలేమిటి అని తెలుసుకోవడానికి ఇప్పుడు విత్తనాన్ని పరిశీలిద్దాం. పంచేంద్రియాలు గ్రహించగలిగిన గుణాలతో సరిపెట్టుకోకుండా ఈ విత్తనంలో ఉండే అంతర్భాగాలేమిటి? ఆ భాగాల మధ్యన ఉండే సంబంధం ఏమిటి? అని చూడవలసి వస్తుంది. ఈ భాగాలు, వాటి మధ్యన ఉండే సంబంధమే ఆ విత్తనానికి ఒక రూపాన్ని, గుణాన్ని ఇస్తాయి. సీడ్ సైన్స్‌కి కాని, సీడ్ టెక్నాలజీకి కాని ఇది ఒక ముఖ్యోద్దేశ్యమౌతుంది. ఆ విత్తనాన్ని మార్చే క్రమం కోసం ఒక భాగాన్ని మారుస్తామా? భాగాల మధ్య సంబంధాలను మార్చే క్రమం ఉందా? ఈ భాగాలను కాని ఈ సంబంధాలను కాని మార్పు చేయడం వలన మామిడి చెట్టుకి మంచివి, ఎక్కువగా కాయలు వచ్చే అవకాశం ఉందా? అనే విషయాల మీద పరిశోధనే సైన్స్‌గా అర్థం చేసుకోవచ్చును. ప్రస్తుతం చర్చ జరుగుతోన్న విత్తనాల జన్యుమార్పిడి లాంటి మార్పులు కూడ ఈ విధంగానే అర్థం చేసుకోవచ్చును.

అలాగే సమాజాన్ని విశ్లేషించాలంటే, దీనిలో ఉండే భాగాలేమిటి? ఏ భాగాల వలన, ఎటువంటి సంబంధాల వలన సమాజానికి అప్పటి రూపం వచ్చింది? ఆ భాగాలను కాని, ఆ సంబంధాలను కాని మార్చగలమా? ఒకవేళ మార్చగలిగితే సమాజం మొత్తం రూపం మారుతుందా? అనేవి సామాజిక శాస్త్రం ముందు ఉండే ప్రశ్నలు. ఈ విశ్లేషణ ద్వారా మరో మెరుగైన సమాజం రాగలదా? అనేవి సమాజాన్ని విశ్లేషణాత్మకంగా చూసినప్పుడు, మన ముందుకు వచ్చే ప్రశ్నలు. సమాజ చరిత్రలో చూస్తే, సామాజిక మార్పులను మనిషి ప్రకృతిలో కనుగొన్న జ్ఞానాన్ని బట్టి ఒక విశ్లేషణా చట్రం తయారుచేసి దాని ఆధారంగా విశ్లేషిస్తాం. అది మన చరిత్ర ప్రవాహంలో పాత రాతియుగం, కొత్త రాతియగం, లోహయుగం, అణుయుగం - అనే వేరువేరు పేర్లతో విశ్లేషించారు. దీనికి భిన్నంగా సమాజంలో ఉండే భాగాలు, వీటి మధ్య ఉండే సంబంధాలను, ఆ భాగాల, సంబంధాల మధ్య జరిగే మార్పుని కేంద్రంగా తీసుకొని సమాజాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్త మార్క్స్. ఆయన మానవచరిత్రని ఆదిమ సమాజం, బానిసత్వం, భూస్వామ్యవ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ, సోషలిజం, కమ్యూనిజం అనే పేర్లతో విశ్లేషించాడు.

మనిషి తయారు చేసుకున్న జ్ఞాన సిద్ధాంత చరిత్రలో వర్ణనకి, విశ్లేషణకి చాలా ముఖ్యమైన పాత్రలు ఉన్నాయి. ఏ వర్ణనా విశ్లేషణకి అతీతంగా ఉండదు. అలాగే ఏ విశ్లేషణా వర్ణనకి అతీతంగా ఉండదు. వాటి మధ్యన ఒక అవినాభావ సంబంధం, అంటే ఒక గతితార్కిక సంబంధం ఉంటుంది. వర్ణన రాశిలో పెరిగే క్రమంలో విశ్లేషణా జ్ఞానం మారిపోతుంది. ఈ విశ్లేషణా జ్ఞానంలో మార్పులు వర్ణనలో మార్పులను తీసుకుని వస్తాయి. అంటే అప్పటి విశ్లేషణా జ్ఞానం ఒక వర్ణనకి మూలమైతే, మారిన విశ్లేషణా జ్ఞానం వర్ణనలో మార్పులను తీసుకుని వస్తుంది. ఉదాహరణగా ఒక చెట్టుకి మూలం విత్తనం అంటే విత్తనం నాటితే చెట్టు మొలుస్తుంది అనేది ఒక విశ్లేషణా జ్ఞానం. దీని ఆధారంగా మంచి చెట్టు మొలవాలంటే మంచి విత్తనం కావాలి. మంచి విత్తనం అంటే ఎలా ఉంటుంది? అనే ప్రశ్నకి సమాధానంగా విత్తనం రంగు, రూపురేఖలు, ఆకారం, గట్టితనం మొదలైన గుణాలను బట్టి ఇది మంచి విత్తనం, దీని ద్వారా మంచి చెట్టు, దానికి మంచి కాయలు వస్తాయనే ప్రతిపాదన ఒక విశ్లేషణ నుండి పుట్టిన వర్ణన. అదే విత్తనాన్ని కోసి, లోపల ఉన్న అంతర్భాగాలను గుర్తించి, వాటి మధ్య ఉండే సంబంధాలను గ్రహించి మంచి విత్తనం తయారు చెయ్యగలం అనేది విశ్లేషణా జ్ఞానం ద్వారా వచ్చిన కొత్త వర్ణన.

ఈ మధ్యకాలంలో సమాజాలను చూస్తే, అభివృద్ధి చెందిన దేశం అంటే ఎక్కువ ఉత్పత్తులు, ఎక్కువ ఆదాయం ఉన్న దేశమనీ, పెద్ద పెద్ద పట్టణాలు ఉంటాయనీ, వ్యవసాయం తక్కువగా ఉంటుందనీ, ఆర్థిక అవకాశాలను వెతుకుతూ వలస పోయే ప్రజలు ఎక్కువగా ఉంటారనీ ఇలాంటి ఒక అభిప్రాయం ఉంది. ఇది ఒక వర్ణన మాత్రమే. జపాన్‌లో టోకియో పెద్ద పట్టణమనీ, అలాగే చైనాలో షాంఘై, ఇంగ్లండ్‌లో లండన్, ఇండియాలో ముంబయి పెద్ద పట్టణాలనీ, ఇవే అభివృద్ధికి సూచికలనీ చూడడం ఒక వర్ణనాత్మకమైన వివరణ. ప్రపంచ అభివృద్ధి నివేదిక కూడా ఈ వర్ణననే విశ్లేషణగా ప్రచారం చేసింది. ఈ విషయాన్ని గురించి ముందు ముందు ప్రస్తావిద్దాం. దీనినే విశ్లేషణగా చూడాలంటే ఈ అధిక ఉత్పత్తులు, పెద్ద పట్టణాలు ఇత్యాది ఎందుకు వచ్చాయి? ఎలా వచ్చాయి? ఆ సమాజంలో ఉండేటటువంటి భాగాలేమిటి? వాటి మధ్య సంబంధాలేమిటి అనే విషయాలను చదవ వలసిన అవసరం ఎంతైనా ఉంది. అంటే ఏ పట్టణం ఎందుకు, ఎలా పెరుగుతోంది, ఆ సమాజంలో ఏ భాగం దీనికి ప్రాతినిధ్యం వహిస్తోంది, ఆ ప్రాతినిధ్యం అంతర్గతంగా వచ్చిందా లేక బాహ్యకారణాల వలన వచ్చిందా అనే ప్రశ్నలు ముఖ్యమౌతాయి. అంటే వీలైనంత వరకూ ఆ పట్టణం ఎక్కువ చరిత్రని చదవవలసి ఉంటుంది. ఒకానొక కాలంలో పెద్ద పట్టణంగా గుర్తించబడిన కోల్‌కతా, దానిలోని జనుప పరిశ్రమ ఎందుకో ఇప్పుడు క్షీణ దశకు వచ్చింది. ప్రస్తుతం పెరుగుతున్న ముంబయిలో నూలు పరిశ్రమ, తగ్గిపోయిన తరువాత ఏ కారణాల వలన కూడా అది క్షీణదశకు చేరుకోలేదు. సమాజాన్ని విశ్లేషణాత్మకంగా చూసినపుడు ఈ ప్రశ్నలు ముఖ్యమౌతాయి.

నివేదికలో

గత రెండు వందల ఏళ్లుగా పెట్టుబడిదారీ సమాజం ప్రపంచంలో

నిలదొక్కుకుని బలపడే కార్యక్రమాలు, అంటే పెద్ద పరిశ్రమలు స్థాపించడం, దీనిలో పని చేయడానికి శ్రామికులను గ్రామాల నుండి ఆకర్షించడం, వివిధ రకాల వస్తువులను భారీ సంఖ్యలో ఉత్పత్తి చేసి, వ్యాపారం చేసి కొత్త విలువలు కల ఒక నూతన సమాజాన్ని సృష్టించింది. దీని వలన ఇంగ్లండ్, జర్మనీ, జపాన్, అమెరికా లాంటి కొన్ని దేశాలు అభివృద్ధి చెంది సంపన్న దేశాలుగా మారిపోయాయి. ప్రపంచంలో మిగిలిన పేద దేశాలన్నీ కూడా ఇలాగే ఈ క్రమంలోనే అభివృద్ధి చెందవచ్చుననే ఊహతో, ప్రపంచబ్యాంక్ సంపన్న దేశాలలో కనిపిస్తున్న కొన్ని సూచికలను – పెద్దగా పెరిగిపోతున్న పట్టణాలు, అధిక సంఖ్యలో ఈ పట్టణాలకు వలస పోయే ప్రజలు, భారీగా సాగే వస్తువు/వస్తు భాగాల వాణిజ్యం – గుర్తించింది. ఈ మూడు అంశాలు అభివృద్ధిలో అంతర్భాగమనీ, ఈ మూడు కలిసికట్టుగా పని చేస్తే త్వరితగతిలో ఆర్థిక పెరుగుదల సాధ్య పడుతుందనీ తన 'అభివృద్ధి నివేదిక – 2009'లో ప్రతిపాదించింది. ఇటువంటి సమాజాన్నే విశ్లేషించిన ఆర్థిక శాస్త్ర నిపుణుడు ఆడంస్మిత్ కూడా తన ప్రముఖ పుస్తకం 'ద వెల్త్ ఆఫ్ నేషన్స్'లో మొదటి మూడు అధ్యాయాలలో పై మూడు అంశాల మీదే కేంద్రీకరించాడని చెప్పి, ఇదే సూత్రాన్ని ఆధారంగా తీసుకుని ప్రపంచ బ్యాంక్ తన అభివృద్ధి నివేదికలో పేద దేశాల అభివృద్ధికి ఒక నమూనాని రూపొందించింది.

ప్రపంచంలో సంపన్న దేశాలను పరిశీలిస్తే పట్టణాలు, వలసలు, వాణిజ్యం అనే మూడు కోణాలతో చాలా మార్పులు తేవడం ద్వారా అభివృద్ధి సాధించాయని, అందుచేత ఈ మూడు మార్పులను అభివృద్ధికి చెందిన మూడు కోణాలుగా నిర్ధారించింది. ఈ మూడింటిని ఆర్థిక కేంద్రీకరణ, సామీప్యత, వాణిజ్య క్షమత అని పేర్కొంది. మొదటిది ఆర్థిక సాంద్రత లేక కేంద్రీకరణ – ఒక చోట పోగవుతోన్న సంపదకి ఇది ఒక కొలమానం. సగటు ఆర్థిక ఉత్పత్తి ద్వారా దీనిని చూస్తే పెద్ద, పెద్ద పట్టణాలంటే అధిక సాంద్రత, ముఖ్యంగా ఆర్థిక రూపంలో కేంద్రీకరణగా గుర్తించవచ్చును. రెండవది, సామీప్యత – ఆర్థిక కేంద్రానికి అందులో దొరికే అవకాశాలను అంది పుచ్చుకునే ఉద్దేశంతో దేశంలో వివిధ ప్రాంతాల నుండి వేగంగా సాగే ప్రజల వలసలు. ఇంక మూడవది వాణిజ్యం – అంటే అడ్డంకులు లేకుండా దేశాల మధ్యన వేగంగా సాగిపోయే వస్తు రవాణాలు. ఈ మూడు కోణాల ఆధారంగా, అంటే పెద్ద పట్టణాలు, వలసలు, వాణిజ్యం అనేవి ప్రగతికి ముఖ్య ప్రేరకాలుగా గత రెండు వందల సంవత్సరాల్లో కొన్ని దేశాలు సంపన్న దేశాలుగా మారిపోయాయని, దీనికి ఉదాహరణగా వాస్తవంగా జరిగిపోయిన ఘటనలు – జపాన్‌లో టోకియో పట్టణం, అమెరికాలో శలవు దినాలలో సాగిపోయే వలసలు, పశ్చిమ యూరపు దేశాలలో జరిగిపోయే వాణిజ్యంగా సూచించింది. వీటినే అభివృద్ధి చెందవలసిన దేశాలు కూడా అనుసరిస్తున్నాయనీ, ఉదాహరణగా ఇండియాలో ముంబయి అధిక సాంద్రత కల పట్టణంగా మారుతోందనీ, చైనాలో వలసలు అతివేగంగా సాగిపోతున్నాయనీ, ఆసియాలో కొన్ని భాగాలలో వ్యాపారం పెరిగిపోతోందనీ నివేదిక ఉదహరించింది. ఈ మూడు కోణాలు కూడా ఒక స్థలానికి, మార్కెట్లకి మధ్య చేరువని వివరిస్తాయనీ, వీటిని స్థానిక, దేశీయ, అంతర్జాతీయ కొలమానంగా చూడాలనీ, వీటికి తగిన పథకాలను కూడా ప్రతిపాదించింది.

మొదటగా కేంద్రీకరణ, సంపద ఒక చోట పోగయి పట్టణీకరణ జరగాలనీ, దీని ద్వారా ప్రజలకు ఇక్కడ స్థిరపడే ఆర్థిక సదుపాయాలే కాకుండా, ఇతర సామాజిక మౌలిక సదుపాయాలు కూడా కావాలనీ దీనికి తగిన పథకాలు సూచించింది. రెండవది, దేశంలో వివిధ ప్రాంతాల మధ్య సాగుతున్న వలస ప్రజల సమయం వృథా కాకుండా వేగవంతమయిన రవాణా సౌకర్యాలు అంటే ఆర్థిక, మౌలిక సదుపాయాలు కావాలని, అలాగే ఇక్కడ తయారైన వస్తువుల ఎగుమతులకు తగిన సదుపాయాలను సూచించింది. ప్రపంచీకరణ ఒక పథకంగా సూచించి దీని ద్వారా దేశాల మధ్య అంతరాలు పోయి ప్రపంచ మార్కెట్‌లో భాగమవుతాయని సూచించింది. క్లుప్తంగా చూడాలంటే, సంపద ఒక చోట పోగయితే పట్టణాలు వస్తాయనీ, పట్టణీకరణ ద్వారా ప్రజలకు నివసించే సదుపాయాలు కావాలనీ, అక్కడికి ప్రజలు (పారిశ్రామికవేత్తలు, శ్రామికులు) వలస వస్తారనీ, ఈ వలస ప్రజల సమయం వృథా కాకుండా రవాణా సౌకర్యాలు కావాలనీ, ఇక్కడ తయారైన వస్తువుల ఎగుమతులకు అవసరమైన సదుపాయాలు కావాలనీ సూచించింది. పరీక్షగా చూస్తే ఇవన్నీ మనకు ప్రత్యేక ఆర్థిక మండలాలలో కనిపిస్తాయి.

అభివృద్ధిలోని మూడు కోణాలలో ఎదురయ్యే సమస్యల నివారణకు మరో మూడు పరికరాల సహాయం తీసుకుంది. మొదటి కోణంలో వచ్చే సమస్యలు ఉత్పత్తి జరిగేది పట్టణాలలో అయితే అక్కడ శ్రమ చేసే ప్రజలు గ్రామాలలో ఉంటారు. గ్రామాలు పేదగా ఉండటంతో ఇది గ్రామాలకు, పట్టణాలకు మధ్య విభేదం చూపిస్తుంది. రెండవది దేశంలో ఆర్థికంగా ముందున్న ప్రాంతాలు కొన్ని అయితే వెనుకబడిన ప్రాంతంలో ఉన్న పేద ప్రజలే వలస కార్మికులవుతారు. ఇంక మూడవది ప్రపంచంలో కొన్ని దేశాలలో సంపత్తి కేంద్రీకృతమై మిగిలిన అన్నీ పేద దేశాలుగా ఉండిపోయాయి. ఈ మూడు రకాల తారతమ్యాలు తగ్గించి ఆర్థికంగా ఏకం చేసే విధంగా పథకాలు కావలసి ఉంటుంది. అభివృద్ధి అసమతుల్యంగా ఉన్నాకూడా, అభివృద్ధి అందరికీ చెందాలంటే స్థానిక, జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు కలిసిపోవాలనీ, మురికివాడలు పట్టణాలుగా మారిపోవాలనీ, దేశంలో వెనుకబడిన ప్రాంతాలు మిగతా ప్రాంతాలతో కలిసి పోవాలనీ, వెనుకబడిపోయిన దేశాలను ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలతో కలిపివేయడంగా సూచించింది. ఈ సమస్యల పరిష్కారానికి ఆయా దేశ ఆర్థిక పరిస్థితులను బట్టి కావలసిన పథకాలు, పరికరాలు ఎంచుకోవాలని, దీనిలో ప్రభుత్వానికి, ప్రైవేట్ రంగానికి కూడా పాత్ర ఉంటుందని సూచించింది.

ఒక్కసారి తిరిగి చూస్తే మొదటి కోణం కేంద్రీకరణతో ఆర్థిక సాంద్రత, జనసాంద్రత పెరిగిపోవటం వలన పట్టణీకరణ సమస్యలే కాకుండా మురికి వాడల సమస్యలు కూడా ముందుకు వస్తాయి. రెండవ కోణంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే శ్రామికుల సంఖ్య పెరగడంతో వలసలు, దానికి చెందిన సమస్యలు ముందుకు వస్తాయి. మూడవ కోణంలో పెరిగిన వాణిజ్యం ద్వారా ప్రపంచీకరణకు చెందిన సమస్యలు ముందుకు వస్తాయి.

నివేదికలో మన దేశం అభివృద్ధిని ప్రస్తావిస్తూ ముంబయి మురికివాడల గురించి, దేశంలో అమలులో ఉన్న అభివృద్ధి పథకాల గురించి ప్రస్తావించింది.

(ఇంకావుంది) వీ

చట్ట సభల ద్వారా సమస్యలన్నీ పరిష్కారం అయిపోతాయనే భ్రమలు లేకున్నా, మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి చట్టసభలలో రిజర్వేషన్‌లు కల్పించడం, కులాల దామాషాగా ప్రాతినిధ్యం కల్పించడం అవసరమే అంటున్నారు పవన

మహిళా రిజర్వేషన్‌లు - అన్నివర్గాల ప్రాతినిధ్యం ?

గత పదమూడేళ్లుగా పదే పదే పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టబడుతూ, ఆమోదానికి నోచుకోని బిల్లు మహిళా రిజర్వేషన్ బిల్లు. పార్లమెంట్‌లోనూ, రాష్ట్ర అసెంబ్లీలోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రతిపాదిస్తూ 1996 సెప్టెంబర్‌లో ఈ బిల్లు మొదటిసారిగా లోక్‌సభలో ప్రవేశపెట్టబడింది. అప్పుడు అధికారంలో ఉన్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. అప్పటి నించి ఇప్పటి వరకు ప్రతి ప్రభుత్వం వారి పాలనాకాలంలో ఈ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నం చేయడం, అది ఆమోదం పొందకపోవడం జరుగుతూ ఉంది. మొదట్లో మహిళలకు రిజర్వేషన్‌లు అవసరమా లేదా అనే వైపు నించి చర్చ జరిగినప్పటికీ ప్రధానంగా అన్ని వర్గాల మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేలా సబ్- కోటా వర్తింపచేయాలనే అంశం చుట్టూ చర్చ తిరుగుతూ ఉన్నది. తాజాగా మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో 'మహిళా బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే విషం తాగి చస్తా' అన్న శరద్ యాదవ్ వ్యాఖ్యాలతో ఈ అంశం తిరిగి తెరపైకి వచ్చింది.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్‌లు అవసరమా లేదా అనే చర్చ ప్రస్తుతం పెద్దగా లేనప్పటికీ, మహిళల ప్రాతినిధ్యం మాత్రం చట్టసభల్లో చాలా తక్కువగా ఉందన్నది గుర్తించవలసిన అంశం. ఈ అంశం పై చర్చ మొదలైన తర్వాత, ఈ 13 ఏళ్లలో కూడా స్త్రీల ప్రాతినిధ్య శాతం పెద్దగా పెరగకపోగా తగ్గిన సందర్భాలు కూడా ఉన్నాయి. మొత్తంగా చూసినా ఎక్కువలో ఎక్కువగా 20 శాతాన్ని మించిన ప్రాతినిధ్యం మహిళలకు ఏ లోక్‌సభలోనూ లేదు. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరగా ఆమోదం పొందడం ద్వారా పరిస్థితి కొంత మెరుగవవచ్చున్న ఆశ కొంతమేరకు మహిళా ఉద్యమాలలో కనిపిస్తున్నది.

ఐతే, మహిళలకు కల్పిస్తున్న 33 శాతం రిజర్వేషన్లలో, అన్ని వర్గాల మహిళలకు ప్రాతినిధ్యాన్ని కల్పించాలని, లేకపోతే ఈ బిల్లు కేవలం అగ్రవర్ణ మహిళలకే ప్రయోజనాన్ని చేకూరుస్తుందని కొన్ని పార్టీలు, సంఘాలు చేస్తున్న వాదనను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. గత 60 ఏళ్ల చరిత్రను పరిశీలిస్తే దళిత, బిసి, మైనారిటీ ప్రజలకు దక్కవలసినన్ని అవకాశాలు దక్కని పరిస్థితే కళ్లముందు ఉంది. రిజర్వేషన్‌ల అమలులో ఉన్న రంగాలలో కూడా పూర్తిస్థాయి న్యాయం జరిగిన పరిస్థితి లేదు. ఆయా కులాలలోని మహిళల పరిస్థితి మరింత అన్యాయం. ఇటువంటి స్థితిలో 'మహిళలంతా ఒక్కటే' అనే భావన వాస్తవ దూరం. సబ్ కోటాను వ్యతిరేకిస్తున్న వారి వాదనలు గమనిస్తే, కొంతమంది పూర్తిగా దీనిని వ్యతిరేకిస్తే, కొంతమంది బిల్లైతే రానివ్వండి, తర్వాత చర్చిద్దాం అంటున్నారు. కొంతమంది న్యాయపరమైన సమస్యలను ముందుకు తెస్తున్నారు. పూర్తిగా వ్యతిరేకిస్తున్నవారు ఈ విధంగా కులాల వారిగా ప్రాతినిధ్యం కల్పించడం మహిళలను విభజిస్తుందని వాదిస్తున్నారు. వాస్తవానికి ఈ విభజనలు భారత సమాజం లో ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా యథావిధిగా ఉండడమే కాకుండా మరింత పెరుగుతున్నాయి. దళిత, బిసి ప్రజలపై, మహిళల పై అణచివేత, అగ్రకుల ఆధిపత్యం అనేక సందర్భాలలో స్పష్టంగానే కనిపిస్తున్నది. ఈ పరిస్థితులలో ఆయా కులాల మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా జరిగితే కొంత మేలు జరగొచ్చేమో కాని, కొత్తగా సృష్టించే విభజనలేమి ఉండవు. గత పదేళ్లుగా ఈ అంశంపై చర్చ జరుగు తున్నప్పటికీ సామాజిక న్యాయాన్ని హామి చేసే రూపంలో బిల్లును ప్రవేశ పెట్టడానికి చిత్తశుద్ధితో జరిగిన ప్రయత్నాలు లేవు. అటువంటప్పుడు బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఈ అంశాలను చర్చించి, పొందుపరిచే అవకాశం ఉంటుందనుకోవడం కూడా భ్రమే. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవడం ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే పెద్ద కష్టమేమి కాదని పదేళ్లుగా వివిధ న్యాయనిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు వివరిస్తూనే ఉన్నారు.

ఈ అంశం పై సిపిఐ, సిపిఎంలు స్పందిస్తున్న తీరు గురించి కూడా కొంత గమనించాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆలస్యమవడానికి కులాల వారిగా ప్రాతినిధ్యం కోరుతున్నవాళ్లే కారణమన్నట్టు, అందువల్ల వాళ్లు పచ్చి మహిళా వ్యతిరేకులన్నట్టు చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా భారత మహిళలందరికీ వారే ప్రతినిధులమన్నట్టు మాట్లాడు తున్నారు తప్ప, సమాన ప్రాతినిధ్యం డిమాండ్ వెనుక ఉన్న న్యాయబద్ధత ఎంత అనే అంశాన్ని పక్కకు పెడుతున్నారు. ముందుకొస్తున్న చర్చలకు అనుగుణంగా బిల్లులో తీసుకరావాల్సిన మార్పులను చిత్తశుద్ధితో పరిశీలించే ప్రయత్నం చేయడంలేదు. చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్‌లే మహిళలకు సమానత్వాన్ని ప్రసాదిస్తాయన్నట్టు మాట్లాడుతున్నారు.

మొత్తంగా ఏ వర్గానికైనా, ఏ రంగంలోనైనా రిజర్వేషన్‌లు కల్పించడం అనేది సామాజిక అణచివేత కారణంగా జరుగుతుంది. అది ఏ నిష్పత్తిలో జరగాలనేది జనాభా ప్రాతిపదికన నిర్ణయమవుతుంది. మహిళలు పితృస్వామ్య అణచివేతకు గురవుతున్నారు కాబట్టి మహిళలకు రిజర్వేషన్లు అవసరం. దాంతోపాటు అణచివేతకు గురవుతున్న కులాలలోని మహిళలు కుల అణచివేతను కూడా ఎదుర్కొంటున్నారు. కాబట్టి కులాలవారిగా మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం కూడా అంతే అవసరం. ఈ ప్రాతినిధ్యం జనాభా దామాషా ప్రకారంగా జరగాలి.

ఎల్.టి.టి.ఇ. అణచివేతతో శ్రీలంక తమిళుల ఆకాంక్షలు సమసిపోయేవి కావనీ, వివక్ష కొనసాగినంత కాలం జాతి పోరాటం కూడా కొనసాగుతుందనీ అంటున్నారు **ఎం. శ్రీనివాస్**

శ్రీలంక తమిళుల పోరాటం

ఇవ్వాళ శ్రీలంకలో తమిళ ప్రజలది జీవన్మరణ సమస్య. ఒకరిది ఆధిపత్య పోరాటం. మరొకరిది హక్కులకోసం ఆరాటం. జాతి దురహంకారంతో ఆధిపత్యం కోసం రాజ్యం చేస్తున్న దాడులివి. సామ్రాజ్యవాదులకు పావుగా మారిన శ్రీలంక దళారీ పాలకవర్గాలు వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకోసం చేస్తున్న సైనికదాడులవి. 'రాజ్యం అనే ఉగ్రవాదం' తమిళ జాతిపైన, ఆ ప్రజలపైనా చేస్తున్న ముప్పేటదాడి. మహింద రాజపక్షే ఆధ్వర్యంలో రాజ్యం 2006 నుండి ప్రారంభించిన చుట్టివేత, అణచివేత, నిర్మూలనా కార్యక్రమమది. 'ఈలం వార్‌ఫోర్తు' పేరుతో శ్రీలంకలో ప్రభుత్వసైన్యం జరుపుతున్న దాడుల వలన తమిళ ప్రాంతాలు వల్లకాడుగా మారాయి. గ్రామాలకు గ్రామాలే విధ్వంసం చేయబడ్డాయి. జనజీవనం చిన్నాభిన్నమైంది. ఎల్.టి.టి.ఇ. ఉద్యమకారులు వేలసంఖ్యలో ఊచకోతకి గురవుతున్నారు. అక్కడ నిశ్శబ్ద స్మశానం రాజ్యమేలుతోంది. రెండున్నర ఏండ్లుగా సైన్యం జరుపుతున్న నరమేధానికి ఎల్.టి.టి.ఇ. ఉద్యమకారులే కాదు, సాధారణ తమిళ పౌరులు సుమారు పదివేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సైనిక దాడుల్లోనూ, ఎల్.టి.టి.ఇ. సంస్థ ఆ దాడులను ప్రతిఘటించే క్రమంలో 80వేల మంది శ్రీలంక పౌరులు చనిపోయారు. వీరిలో మూడువంతులు తమిళ పౌరులే కావడం విశేషం. ఎల్.టి.టి.ఇ. చేపట్టిన కొన్ని తప్పుడు విధానాల ఫలితాలు కూడా ఏదో మేరకు ఇందులో లేకపోలేదు. తమిళజాతి విశ్వసనీయతను, గౌరవాన్ని పొందిన ఈలం ఉద్యమకారులు రాజ్య చుట్టివేత, అణచివేత చర్యలకు వెరవలేదు. వెన్నుచూపలేదు.

మూడు దశాబ్దాలుగా శ్రీలంక ప్రపంచ ప్రాముఖ్యత కల్గిన వార్తల్లో ఒకటిగా ఉంటూ వస్తోంది. 'ప్రత్యేక ఈలం' కోసం తమిళ ప్రజలు నిర్వహిస్తున్న సాయుధ ఉద్యమమే ఇందుకు ప్రధానకారణం. తరతరాలుగా సింహళీయుల, తమిళుల మధ్య జాతి వైషమ్యాలు రగులుతున్నాయి. ప్రాంతాలకోసం, జాతుల ఉనికికోసం జరుగుతున్న వైరమది. ఈ వైషమ్యాలకు నాటి బ్రిటిష్ వలస పాలకులు ఆజ్యం పోస్తే, నేటి శ్రీలంక దళారీ పాలకవర్గాలు ముఖ్యంగా సింహళ జాత్యాహంకార పాలకులు రావణకాష్టం లాగా మండిస్తూనే ఉన్నారు. జయవర్ధనే మొదలు రాజపక్షే వరకు తమిళ ప్రజలను తమ మిలటరీ ఉక్కుపాదం కింద అణచివేస్తూ వస్తున్నవారే. రెండు దశాబ్దాలుగా తమిళ జనవాస ప్రాంతాలను సైనిక దిగ్బంధంలో ఉంచారు. నిత్యావసర వస్తువులను పూర్తిగా నిలిపివేశారు. వైమానికదాడుల ద్వారా బాంబుల వర్షం కురిపించారు. తమిళ ప్రాంతాలను విధ్వంసం చేసి, అల్లకల్లోలం సృష్టించారు. ప్రజలను ఊచకోతకోస్తూ వేలమందిని అతి కర్కశంగా పొట్టనపెట్టుకున్నారు. తమిళజాతిని అతి దారుణంగా అణిచివేయడానికి లేదా అంతంచేయడానికి పూనుకున్నారు. శ్రీలంకలో తాజాపరిణామాలకు మూలమైన సింహళీయులకు తమిళులకు మధ్య జరుగుతున్న జాతి వైరం ఈ నాటిది కాదు. ఈ వైరానికి సుమారు రెండు వేల ఏడువందల సంవత్సరాలకు పైచిలుకు నాడే వేళ్లూనుకున్నాయి.

నేటి శ్రీలంక పరిణామాలను, వాటి చారిత్రక మూలాలను గతితార్కిక చారిత్రక దృక్పథంతో పరిశీలించవలసి ఉంటుంది. ఉత్తర భారతదేశంలోని

చివరగా చట్టసభలో మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించడం ద్వారా మహిళా సమస్యలు పరిష్కారమవుతాయా అనేది కూడా ఒక ప్రశ్న. నిజంగా కూడా మహిళల ప్రాతినిధ్యం ద్వారా మహిళా రంగానికి ఒరిగే ప్రయోజనం కూడా పెద్దగా ఏమి ఉండకపోవచ్చు. పార్లమెంటరీ వ్యవస్థ ద్వారానే ప్రజాస్వామ్యం అభాసు పాలవుతున్న స్థితిలో మహిళా ఎంపిలు, ఎంఎల్‌ఎలు చేయగలిగేది ఏమిలేదు. అయితే పితృస్వామ్య సమాజంలో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది ఒక అభివృద్ధి కరమైన అంశం కాబట్టి, మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రయోజనాన్ని ఆమేరకే ఆశించవచ్చు. చట్టసభలలో మహిళల సంఖ్య పెరగడం ద్వారా మహిళలకు మరిన్ని ప్రయోజనాలు లభిస్తే సంతోషకరమే. అయితే ఇక్కడ మనం కోరవలసింది జనాభాలో సగమైన మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు – 33 శాతం కాదు.

ముగించే ముందు – శరద్ యాదవ్ తాజా వ్యాఖ్యాలపై మీడియా, కొన్ని మహిళా సంఘాలు, మేధావులు స్పందించిన తీరు గురించి మాట్లాడుకోవాలి. దాదాపు మెజారిటీ ఛానళ్లు, పత్రికలు శరద్ యాదవ్ వ్యాఖ్యాల్లోని 'ప్రస్తుత రూపంలో...' అనే పదాలను తీసివేసి 'మహిళా బిల్లు ప్రవేశపెడితే విషం తాగి చస్తా' అనే వాక్యాన్ని మాత్రమే ప్రచారంలో పెట్టాయి. వెంట వెంటనే దీనిపై అభిప్రాయ సేకరణలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించాయి. కొన్ని మహిళా సంఘాలు, కొంతమంది మేధావులు వెంటనే ఆగ్రహంతో స్పందించారు కూడా. 'విషం తాగి చస్తా' అన్న వ్యాఖ్యాలు కచ్చితంగా అభ్యంతరకరమే కాని, ప్రస్తుత రూపంలోని మహిళా బిల్లును శరద్ యాదవ్, ఇతరులు గత పదేళ్లుగా వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఈ రకమైన వివాదాలు సృష్టించడం మీడియా ప్రచారానికి మాత్రమే ఉపయోగపడుతుంది. 'విషం పంపిస్తా', 'శరద్ యాదవ్ లాంటి వాళ్లు చస్తేనే మహిళలకు మేలు' లాంటి వ్యాఖ్యలు సమస్యలను పరిష్కరించవు. వీ

బౌద్ధమతాన్ని స్వీకరించి ఆ సంస్కృతిని అలవరచుకున్న బెంగాల్, గుజరాత్, తీరప్రాంతాలకు చెందిన సింహళీయులు క్రీ.పూ 5వ శతాబ్దంలోనూ, దక్షిణభారతదేశం నుండి తమిళులు క్రీ.పూ. 6వ శతాబ్దంలోనూ శ్రీలంకకు వలసపోయారు. ఈ విషయంలో మరొక వాదన కూడా లేకపోలేదు. నిజానికి తమిళులు, సింహళీయులు భారతదేశం నుండి వలస పోలేదనీ వాళ్లు అక్కడి వాళ్లేనన్నది దాని సారాంశం. చారిత్రక కారణాలు ఏమైనప్పటికి భారతదేశంలో లాగానే శ్రీలంక కూడ విభిన్నజాతులు, మతాలు, సంస్కృతులు కలిగినదేశం. భిన్నజాతులమధ్య ముఖ్యంగా ప్రధాన జాతులైన సింహళీయులు, తమిళుల మధ్య తొలినుండి ఈ వైరమే కొనసాగుతూ వచ్చింది. వాస్తవానికి ఈ రెండు జాతులు భారతదేశం నుండి శ్రీలంకకు వలస వెళ్లినవే. క్రీ.పూ. 6వ శతాబ్దంలో దక్షిణ భారతదేశం నుండి వలస వెళ్లిన తమిళులు శ్రీలంక ఉత్తర, తూర్పు ప్రాంతాలలో స్థిర నివాసం ఏర్పరుచుకోగా, క్రీ.పూ. 5వ శతాబ్దంలో ఉత్తరభారతదేశం నుండి వలస వెళ్లిన సింహళీయులు మధ్య, నైరుతి భూభాగంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. శ్రీలంకను పాలించిన ఫ్రెంచ్, డచ్, బ్రిటిష్ వలస పాలకులు తమిళ, సింహళీయులను విభజించి పాలించారు. వారి అవసరాల కోసం జాతి వైషమ్యాలను ప్రోత్సహించారు. సుమారు నాల్గున్నర శతాబ్దాలు వలస పాలకులు తమిళ, సింహళీయులను బలవంతంగా మతమార్పిడికి ప్రోత్సహించారు. ఆ రకంగా ఆ రెండు జాతులకు చెందిన కొంత మంది క్రైస్తవులుగా మారారు. శ్రీలంకలో బ్రిటిష్ పాలకులు సింహళీయులకు ఆంగ్ల విద్యను అందుబాటులోకి తెచ్చారు. తమిళులను నిర్లక్ష్యం చేశారు. వారికి విద్యావకాశాలను నిరాకరించారు.

ఈ పరిస్థితి గమనించిన అమెరికన్ మిషనరీలు తమిళులకు విద్యను అందుబాటులోకి తెచ్చాయి. ఈ ప్రక్రియంతా వారి, వారి ప్రయోజనాల పరిధిలోనే జరిగిందే తప్ప తమిళ, సింహళ ప్రజల విద్యాభివృద్ధి కోసం కాదన్నది గమనించాలి. బ్రిటిష్ వలస పాలనకు ముందే పాలకులు మూర్‌జాతి తమిళ ప్రజలను చైనా, సింహళీయుల మధ్య వివాదాలు లేపి యుద్ధాలు చేయించి తమ ఆధిపత్యం కాపాడుకొంటుండేవి. 16వ శతాబ్దంలో పోర్చుగల్ వారు శ్రీలంకలో ప్రవేశించేనాటికే ఈ జాతుల వైరాలు అలాగే కొనసాగుతూ ఉన్నాయి. దాదాపు రెండు శతాబ్దాల కాలం పాటు శ్రీలంకలో తమిళులు శ్రీలంక మెజార్టీ ప్రాంతాన్ని పాలించారు. సింహళీయులు మెజార్టీగా నివసిస్తున్న కొన్ని ప్రాంతాలను పోర్చుగీసు వారు ఆక్రమించుకొని తమిళులతో నిరంతరం పోరాడేవారు. ఈ వైరుధ్యాలను ఆధారం చేసుకొని తమిళ ప్రాంతాలలోకీ డచ్‌వారు చొరబడ్డారు. తమిళ ప్రాంతాలపై నిత్యదాడులకు పాల్పడుతున్న పోర్చుగీసు వారికి డచ్ వాళ్ళతో నిత్యం యుద్ధాలు జరిగేవి. ఈ పరిస్థితులలో శ్రీలంకలోకి ప్రవేశించిన ఆంగ్లేయులు ఫ్రెంచ్ వారినీ, డచ్ వారినీ ఓడించి, శ్రీలంక దేశంపై పూర్తి ఆధిపత్యం సంపాదించారు. నాటి నుండి 1948 వరకు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు యథేచ్ఛగా పాలించారు. జాతి వైరానికి శ్రీలంకలో మరింత అజ్యం పోసింది బ్రిటిష్ వలసపాలకులే. ఈ జాతి వైషమ్యాలకు శతాబ్దాల చరిత్ర ఉంది. సామ్రాజ్యవాదుల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు నెరవేరాలంటే ఈ ప్రక్రియ కొనసాగాల్సిందే. భూసమస్య, జాతి అస్తిత్వం ఈ జాతుల వైరానికి కేంద్రబిందువైనప్పటికీ చరిత్ర చెప్తున్నట్లుగా 12, 13 శతాబ్దాలలో సంభవించిన కొన్ని పరిణామాలు జాతి వైషమ్యాలను పెంచాయి. వలసపాలన కాలంలో చోటుచేసుకున్న ఆర్థిక, సాంఘిక పరిణామాలు ఈ వైషమ్యాలను తీవ్రస్థాయికి చేర్చాయి.

బ్రిటిష్ వలస పాలన ప్రారంభం కావడంతో వారి వర్తక, వ్యాపార ప్రయోజనాల కోసం శ్రీలంకలోని కాఫీ, రబ్బరు, టీ ప్లాంటేషన్లల్లో పనిచేయడానికి కూలీలు అవసరమయ్యారు. అవసరమైన కూలీలను భారతదేశంలో అప్పటికే వలస పాలన సాగిస్తున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మద్రాస్ ప్రెసిడెన్సీ నుండి భారతీయ తమిళ ప్రజలను కారుచౌకగా దిగుమతి చేసుకున్నారు. ఆ విధంగా 'బలవంతపు వలసలకు వెళ్లిన భారతీయ తమిళ కూలీలు జాతివైషమ్యాలకు ఫ్రెంచ్, డచ్ వలసపాలకుల అధిపత్య దాడులకు గురై దుర్భరమైన పరిస్థితులను అనుభవించారు. వారి జీవన విధానం పూర్తిగా దిగజారింది. భారతదేశం నుండి వెళ్లిన తమిళులతో సహా శ్రీలంకలోని మొత్తం తమిళజాతి ప్రజలు ద్వితీయ శ్రేణి ప్రాంతాలు ఏర్పరుచుకున్నారు. తమిళజాతి కనీస పౌరహక్కులకు కూడా దూరమయ్యింది. ప్రభుత్వ చిత్రహింసలకు గురైయ్యింది. చివరికి మైనార్టీ జాతిగానే మిగిలిపోయింది.

బ్రిటిష్ వలస పాలకులు భారతదేశంలో 1947లో అధికారాన్ని బదలాయించినట్లుగానే, 1948లో శ్రీలంకలో కూడా తమ తాబేదారులకు అధికారాన్ని బదలాయించారు. ఆనాటి నుండి శ్రీలంక పాలకవర్గాలు తమిళజాతిపట్ల జాత్యాహంకారాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నాయి. సింహళీయులు, తమిళజాతుల మధ్య వైషమ్యాలను మరింత వేగిరపరచి, తమ అధికార ప్రయోజనాలనూ, ఆధిపత్యాన్నీ కాపాడుకుంటూ వచ్చాయి. వాస్తవానికి తమిళ ప్రజలు లేవనెత్తిన డిమాండ్లు అత్యంత ప్రజాస్వామికమైనవి. సామాజికంగా కూడా న్యాయబద్ధమైనవే. 1948 తరువాత తమిళ ప్రజలకున్న కనీస హక్కులను సైతం రద్దుచేసే విధానాలనే పాలకులు అమలు చేశారు.

శ్రీలంక దేశ తొలి ప్రధాని డాన్‌స్టీఫెన్ సేనానాయికే పార్లమెంట్‌లో తమిళులకున్న సీట్ల సంఖ్యను 24 నుండి 16 కు కుదించారు. భారతీయ తమిళులను శ్రీలంక పౌరులుగా గుర్తిస్తూ 1945లో ఆమోదించిన పౌరసత్వ చట్టాన్ని రద్దుచేశారు. ఓటుహక్కు లేకుండా చేశారు. శ్రీలంక దేశ పౌరులుగా గుర్తించ నిరాకరించారు. 1956లో యునైటెడ్ నేషనల్ పార్టీ ప్రభుత్వం సింహళ, తమిళ భాషలను అధికార భాషలుగా గుర్తించింది. అ మేరకు చట్టాన్ని కూడా చేసింది. ఈ నిర్ణయాన్ని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బండారునాయకే ప్రభుత్వం రద్దుచేసి, సింహళ భాషయే ఏకైక అధికార భాషగా గుర్తిస్తూ నిర్ణయించింది. తమిళులకు కేటాయించిన ప్రాంతాలలోనే వారు నివసించాలనీ ఆజ్ఞలు జారీ చేసింది. తమిళ ప్రజల ఆవాస ప్రాంతాలను 7500 చదరపు మైళ్లకు కుదించింది. బండారునాయకే, జయవర్ధనే ప్రభుత్వాలు మొదలు మహింద రాజపక్షే ప్రభుత్వం వరకు అనుసరించిన విధానాలు తమిళ ప్రజలను రెండవ జాతి పౌరులుగా దిగజార్చాయి. ఫలితంగా తమిళప్రజలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యారు. సాంఘికంగానూ సాంస్కృతికంగానూ అణిచివేతకు గురయ్యారు. విద్య, వైజ్ఞానిక విషయాలలో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డారు. అన్నీ రకాలుగా వెనుకబడిపోయిన తమిళ ప్రజలు తీవ్ర అసంతృప్తికి, ఆగ్రహానికిలోనై సొంతగడ్డపైనే ద్వితీయ శ్రేణి పౌరులుగానూ, జాతిగానూ చూడబడడం అవమానకరంగా భావించారు. తమిళ ప్రజల జీవన విధానానికీ, వారి మనుగడకూ సుస్థిరత, భద్రత లేకుండా పోయింది. సొంతగడ్డ మీదనే పరాయీకరణకు గురై, అభద్రతాభావంతో కాలం వెళ్లదీస్తున్నారు. తమిళ ప్రజలు ఈ అమానవీయ చర్యలకూ, జీవించే హక్కును గుర్తించ నిరాకరించే పాలకుల వైఖరికీ, విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటనే మార్గంగా గుర్తించారు. ఈ ఆగ్రహజ్వాలల్లో నుండే 'ప్రత్యేక ఈలం' డిమాండ్ ఆవిర్భవించింది. ఈ డిమాండ్ ముందుకు తెచ్చిన ఎల్.టి.టి.ఇ.కి సంబంధించి ఒకటి రెండు విషయాలను ఇక్కడ చెప్పుకోవాలి.

1950 దశకం నుండే కొన్ని తమిళ రాజకీయ సంస్థలు తమ ప్రాంతాలకు సమాన అవకాశాలు కావాలని కోరడం ప్రారంభించాయి. 1957లో బండారునాయకే – చెల్వనాయకమ్‌ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని ప్రభుత్వం అమలుపరచలేదు. 1965లో కుదిరిన ఒప్పందాన్ని కూడా అమలు చేయలేదు. అప్పటికి తమిళులకు సమాన హక్కులు లేవు. తమిళ ప్రాంతాలకు అధికార వికేంద్రీకరణ జరగలేదు. ఈ పరిస్థితుల్లో తమిళ ప్రజల మనోనిబ్బరాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను శ్రీలంక ప్రభుత్వం చేపట్టింది. 1970లో తమిళ విద్యార్థులను ఎక్కువగా విశ్వవిద్యాలయాల్లో చేర్చుకోవద్దనీ, ఉద్యోగాలలో పది శాతానికి మించకుండా చట్టాలు చేసింది. ఫలితంగా ప్రభుత్వ సర్వీసుల్లో, సైన్యంలో తమిళుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. అక్షరాస్యత క్రమంగా తగ్గింది.

తమిళజాతి పట్ల వివక్ష, విద్యా, ఉద్యోగరంగాలలో అవకాశాల నిరాకరణకు వ్యతిరేకంగా 1972లో వేలుపిళ్లై ప్రభాకరన్ ఆధ్వర్యంలో న్యూ తమిళ్ టైగర్స్ సంస్థ ఏర్పడింది. 1974లో జాఫ్నాలో విద్యార్థులు జరుపుకున్న మహాసభపై శ్రీలంక సైన్యం జరిపిన దాడులలో 9 మంది చనిపోగా 50 మంది క్షతగాత్రులయ్యారు. ఈ సంఘటనతో తీవ్ర ఆగ్రహానికి గురైన న్యూ తమిళ్ టైగర్స్ సంస్థ 1976లో ఎల్.టి.టి.ఇ.గా ఏర్పడి, తమిళ ప్రజలకు స్వతంత్ర దేశం కావాలన్న డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. అంతేకాకుండా శ్రీలంక పౌర సమాజంలో సమాన అవకాశాలు లభించని తమిళ మైనార్టీ ప్రజలకు శ్రీలంక పాలకవర్గాల జాత్యాహంకార ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యంపై ఉన్న అసంతృప్తి, వ్యతిరేకతల మూలంగానే 1976లో ఎల్.టి.టి.ఇ. ఏర్పడింది. 1983లో సింహళీయులు జరిపిన దాడుల్లో నాలుగు వేల మందికిపైగా అమాయక తమిళులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనకు నిరసనగా ఎల్.టి.టి.ఇ. సింహళీయులపైనా, ప్రభుత్వ కార్యాలయాల పైనా, ప్రభుత్వాధినేతలపైనా దాడులకు దిగింది. 1987లో బ్లాక్‌టైగర్స్ ఆత్మహుతి దళాలను ఏర్పాటుచేసుకుంది.

అంతెందుకు 2006లో 'ఈలం వార్‌ఫోర్తు'ను శ్రీలంక ప్రభుత్వం ప్రారంభించిన నాటి నుండి 'పోరాడండి–నిర్మూలించండి' అన్న నినాదంతో జాత్యాహంకార భావజాలాన్ని సైన్యానికి నూరిపోసింది మహింద రాజపక్షే ప్రభుత్వం. శ్రీలంక ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాల విజ్ఞప్తులను పట్టించుకోలేదు. ఇది ముమ్మాటికి తమిళ ప్రజలపైనా, వాళ్లపోరాట ప్రతినిధియైన ఎల్.టి.టి.ఇ. పైనా జరుపుతున్న జాత్యాహంకార దాడియే. అనైతికత, అమానవీయతే జాత్యాహంకార లక్షణంగా ఉంటుంది. రాజపక్షే ప్రభుత్వ జాత్యాహంకార చర్యలు ఎంత వరకు వెళ్లాయంటే 'మా జాతి సైనికులకు వందనాలు' అంటూ సింహళభాషలో బోర్డులు రాయించి దేశ నలుమూలలా ఏర్పాటు చేసింది. ప్రభుత్వ చర్యలు విమర్శించిన, వ్యతిరేకించిన వారెవరైనా సరే, వారిని హతమార్చడమో, తప్పుడు అభియోగాలతో జైళ్లల్లో నిర్బంధించడమో చేసింది. ఈ తరహా దాడులకు గురైనవారిలో పౌర, మానవ హక్కుల సంఘాలకు చెందినవారు, జర్నలిస్టులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఉన్నారు. రాజపక్షే అధికారం చేపట్టిన ఈ కాలంలో 16 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. డజన్ల సంఖ్యలో జైళ్లల్లో మగ్గుతున్నారు.

ఒక సంస్థ రాజకీయ శక్తిగా ఎదిగి, అది సైనిక పోరాట రూపాన్ని ధరించాలంటే నిర్దిష్టమైన ఆ పోరాటసంస్థకు ప్రజల నుంచి సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఆదరణ, మద్దతు పునాదిగా ఏర్పడాలి. భౌతికంగా ఎల్.టి.టి.ఇ. సంస్థకు ఈ పరిస్థితులు పుష్కలంగా ఉండబట్టే అది సాయుధ పంథాను చేపట్టింది. గెరిల్లా పోరు నడుపుతూ వచ్చింది. విస్తృతమైన తమిళ పౌర సమాజం మద్దతు పొందింది. కనుకనే ఎల్.టి.టి.ఇ. ఒక బలమైన గెరిల్లా సంస్థగా అంటే 20మంది అగ్రశ్రేణి నేతలను, 200 మంది గెరిల్లా శిక్షణ యిచ్చే ట్రెనింగ్ మాస్టర్లను కలిగి ఉంది. 16వేల మంది గెరిల్లా యోధులతో కూడిన రెగ్యులర్ సైన్యం ఉంది. పాక్షికంగా సాయుధ శిక్షణ పొందిన మరో రెండు లక్షలమంది గ్రామీణ యువ వాలంటీర్లూ ఉన్నారు. వందలాది మిషన్ బోట్లు ఉన్నాయి. రెండు డజన్లకుపైగా అత్యాధునిక మర పడవలున్నాయి. ఆరేడు ఆధునిక జలంతర్గాములున్నాయి. అరడజనుకుపైగా యుద్ధ విమానాలున్నాయి. డజన్ల సంఖ్యలో యుద్ధ టాంకులున్నాయి. వేల సంఖ్యలో ఎ.కె 47 తుపాకులున్నాయి. లక్షలసంఖ్యలో రివాల్వర్లు, పిస్తోళ్లు వంటి చిన్న ఆయుధాలున్నాయి. ఎల్.టి.టి.ఇ. ప్రపంచంలోనే త్రివిధ దళాలు కల్గిన ఏకైక గెరిల్లాసంస్థగా ఏర్పడి తమజాతి ప్రజలకోసం పోరాడుతూ వచ్చింది.

ఇంతటి సైనిక సామర్థ్యం కలిగి, పోరాట అనుభవం ఉన్న ఎల్.టి.టి.ఇ. సంస్థ తాజా పరిస్థితుల్లో తాత్కాలికంగా వెనుకడుగు వేయవచ్చు. అగ్రశ్రేణి నాయకత్వాన్ని, దాని అధినేతను కోల్పోవచ్చు. తమ ఆధీనంలోని కీలకమైన స్థావరాల్ని కోల్పోవచ్చు. ఎల్.టి.టి.ఇ. స్వయం నిర్ణయాధికారహక్కునే కాదు, తమిళ జాతి విముక్తికీ, 'ప్రత్యేక ఈలం' కోసం ఉద్యమించడం గమనార్హం. ఇక రాజకీయంగా ఆ హక్కును ఉదారవాద తమిళ సంస్థలన్నీ ఏనాడో వదులుకున్నాయి. దీనితో శ్రీలంక తమిళ ప్రజల విశ్వాసం, మద్దతును అవి కోల్పోయాయి. కనుకనే ఈనాటికీ 95శాతం తమిళ ప్రజలు ఎల్.టి.టి.ఇ.కి ప్రజా పునాదిగానే మిగిలి ఉన్నారు.

శ్రీలంక దేశ జనాభాలో 18.2 శాతం ఉన్న తమిళులు జాతివివక్ష నుండి బయటపడాలనీ, జీవించే హక్కుతో సహా ఇతర పౌర, సామాజిక, చట్టబద్ధమైన హక్కులను పొందాలనీ కోరుకున్నారు. దుర్భరమైన వారి జీవితాలకు, అన్నిరంగాలలో అన్నిరకాల అవకాశాలకు దూరమైన పరిస్థితికి సాంఘికంగానూ, సామాజికంగానూ, విద్యాపరంగానూ అభివృద్ధి చెందాలన్నా ఆర్థిక, రాజకీయపరమైన సమ హక్కులు పొందాలన్నా, తమిళ ప్రాంతాలకు స్వయంనిర్ణయధికారం ఉండాలని వారు కోరుకున్నారు. ఈ అంశాల ప్రాతిపదికపైనే 1974 నుండి 1983వరకు ఉద్యమాలు నిర్మించారు. పోరాటాలు నిర్వహించారు. అంతకు ముందు నుండే తమిళజాతి పట్ల వివక్షకు వ్యతిరేకంగా, వారి హక్కుల కోసం ఇ.పి.ఆర్.ఎల్.ఎఫ్, టి.యు.ఎల్.ఎఫ్, పి.ఎల్ ఓ.టి.ఇ వంటి ఉదారవాద తమిళ సంస్థలు ఏర్పడి పనిచేస్తున్నాయి.

ఎల్.టి.టి.ఇ., శ్రీలంక ప్రభుత్వాలకు మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగాయి. సిక్కిం రాజధాని థింపూలో తొలిసారిగా శ్రీలంక ప్రభుత్వంతో జరిగిన చర్చలలో ఎల్.టి.టి.ఇ. అధినేత ప్రభాకరన్ స్వయంగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎల్.టి.టి.ఇ. తమిళుల జాతీయతను గుర్తించడం, వారికి స్వయం నిర్ణయధికార హక్కును ఇవ్వడం, తూర్పు, ఉత్తర ప్రాంతాలను ప్రత్యేక ప్రాంతాలుగా గుర్తించడం, తమిళులందరికి పౌరసత్వం జారీ చేయించడం వంటి నాలుగు అంశాలతో కూడిన ప్రతిపాదనను పెట్టారు. ఈ చర్చల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రతినిధి బృందానికి శ్రీలంక అధ్యక్షుడు జయవర్ధనే సోదరుడైనా హెచ్.డబ్ల్యూ జయవర్ధనే నాయకత్వం వహించాడు. ఈ బృందంలో ఉన్న వారంతా న్యాయవాదులు కావడం, రాజకీయ ప్రతినిధులెవ్వరూ ఉండకపోవడంతో రాజకీయ పరిష్కారానికి విఘాతం కలిగింది. వాస్తవానికి జయవర్ధనే ప్రభుత్వం ఈ డిమాండ్‌కు ఒక రాజకీయ

పరిష్కారం చూపడానికీ సిద్ధంగా లేదనీ, కేవలం తమిళ ప్రజలను, అంతార్జాతీయ సమాజాన్ని నమ్మించడానికే ఈ ప్రక్రియను నిర్వహిం చిందన్నది తదుపరి ఆ ప్రభుత్వం అనుసరించిన చర్యలు రుజువు చేశాయి.

1987లో 'భారత శాంతి పరిరక్షణదళం' శ్రీలంకకు వెళ్లిన తర్వాత కూడా శ్రీలంక ప్రభుత్వం ఒప్పందాలను అమలుచేయడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించలేదు. 2002లో కాల్పుల విరమణ తర్వాత కూడా తమిళ ప్రాంతాలకు అధికార వికేంద్రీకరణ జరగలేదు. తమిళ ప్రజల పట్ల వివక్ష, నిరాదరణలనే ప్రభుత్వం చూపింది. ఒక దశలో టైగర్లు స్వతంత్ర దేశ డిమాండ్‌ను వదులుకొని స్వయం ప్రతిపత్తికే పరిమితమైనా శ్రీలంక ప్రభుత్వం అందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. ఆ తర్వాత కాలంలో న్యూఢిల్లీ, జెనీవా, బ్యాంకాక్, నార్వే, లండన్, జపాన్ తదితర ప్రాంతాలలో జరిగిన చర్చలు విఫలం కావడానికి శ్రీలంక ప్రభుత్వ జాత్యాహంకార విధానాలే కారణం. ఇందులో సామ్రాజ్యవాద శక్తుల పాత్ర కూడా ఉంది.

70వ దశకంలో నాటి అగ్రరాజ్యాలైన రష్యా, అమెరికాలు శ్రీలంకపై తమ ఆధిపత్యం కోసం ప్రయత్నం చేశాయి. శ్రీలంక భౌగోళికంగా, వ్యూహాత్మకంగా చాలా చాలా కీలకమైన ప్రాంతంలో ఉంది. భారతదేశానికి దక్షిణాన 22 కి.మీ దూరంలో హిందూ మహాసముద్రంలో ఉంది. తూర్పుదేశాల నుండి పాశ్చాత్య దేశాలకు, గల్ఫ్‌దేశాలకు నౌకలు ఈ ప్రాంతం గుండానే వెళ్లాలి. కనుకనే ఈ ప్రాంతం నాటి అగ్రరాజ్యాల ఆధిపత్య పోటీకి ఆలవాలంగా మారింది. చాలా కాలం పాటు బ్రిటన్-అమెరికా అనుకూల ప్రభుత్వమే శ్రీలంకలో రాజ్యమేలింది.

తరతరాలుగా రగులుతున్న జాతుల సమస్యపై ఉత్పన్నమైన పరిస్థితిని రష్యా ఉపయోగించుకొని ఆ ప్రాంతంలో తలదూర్చడానికి ప్రయత్నం చేసింది. విస్తరణ స్వభావం కలిగిన, ఉపఖండంలో పెద్దన్న పాత్ర పోషించాలనే పెత్తందారీ స్వభావం కలిగిన భారత దళారీ పాలక వర్గాలు తొలి నుంచి తన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని శ్రీలంక విషయంలో సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించాయి. రష్యా ప్రోద్బలంతోనే భారతదేశం ఎల్.టి.టి.ఇ., శ్రీలంక ప్రభుత్వాలకు మధ్యవర్తిత్వం వహించింది. 1987లో న్యూ ఢిల్లీలో జరిగిన చర్చలు, ఆ సందర్భంగా తమిళ ప్రజల అభిష్టానికి భిన్నంగా జరిగిన ఒప్పందం (ఎల్.టి.టి.ఇ. అధినేతకు ఈ ఒప్పందం అంగీకారం కాదు), ఆ ఒప్పందాన్ని అమలు చేయించి శాంతియుత పరిస్థితులు నెలకొల్పడానికి అంటూ 1987-90ల మధ్యకాలంలో భారత శాంతి దళాలు శ్రీలంక వెళ్లడం లాంటి పరిణామాలు; ఒక దశలో రష్యా ప్రయోజనాలను నెరవేర్చడానికి భారతదేశం సార్క్ దేశాల, అలీనోద్యమ వేదిక, కామన్వెల్త్‌ను కూడా బేఖాతర్ చేసి శ్రీలంక అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంది. 'ఈగల్ ఆపరేషన్' జరిపింది. అటు రష్యా ప్రయోజనాల కోసం, ఇటు స్వదేశీయులు తమిళుల ఓటు బ్యాంకును నిలుపుకోవడానికి భారత దళారీ పాలకులు శ్రీలంక సమస్యపై దౌత్యం నెరిపారు. 1987లో న్యూఢిల్లీలో జరిగిన ఒప్పందం, శ్రీలంకలోకి 'శాంతి పరిరక్షక దళాలను' పంపడం వంటి చర్యలు శ్రీలంక సమస్యలను మరింత జటిలం చేశాయేతప్ప సమస్యకు పరిష్కారం లభించలేదు.

ఉద్యమం ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో తమ న్యాయమైన డిమాండ్ సాధనకు అన్ని జాతులకు చెందిన విశాల ప్రజారాసుల మద్దతును కూడగట్టుకోవడానికి ఎల్.టి.టి.ఇ. సమయస్ఫూర్తితో వ్యవహరించ లేకపోయింది. కొన్ని తప్పుడు ఎత్తుగడల మూలంగా అంతర్జాతీయ సమాజం మద్దతునూ, శ్రీలంకలోని సాధారణ సింహళ ప్రజల మద్దతునూ కోల్పోయింది. ఈ కారణంగానే ఉద్యమానికి రావాల్సిన విస్తృత రాజకీయ మద్దతురాలేదు. విధానాలు, ఆచరణ ఏమైనప్పటికీ తమిళ ఉదారవాద సంస్థలైన తుల్ఫ్, ఇ.పి.ఆర్.ఎల్.ఎఫ్ తదితర సంస్థల అధినాయకత్వాన్ని హతమార్చడం సరైందికాదు. తమిళ్ నేషనల్ అలయెన్స్ (టి.ఎన్.ఎ) సంస్థతో సత్ససంబంధాలు కొనసాగించడం, తమిళహక్కులను బలపరిచే మేధావులను, ప్రజాస్వామిక వాదులను తమవైపు సమీకరించుకుని మద్దతును సమకూర్చుకోవడంలో ఎల్.టి.టి.ఇ. నాయకత్వం విఫలమైంది. ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి నిర్దిష్ట పరిస్థితులలో నిర్దిష్ట ఎత్తుగడలు వేయడంలో రాజకీయ చతురత, సమయస్ఫూర్తి, వ్యూహాత్మక దృష్టి ఎల్.టి.టి.ఇ. అధినాయకత్వంలో లోపించినట్లుగా ఆచరణ అనుభవం తెలియజేస్తుంది. తప్పుడు ఎత్తుగడలతో ఉద్యమాన్ని నష్టపరుచుకుంది. ఉద్యమానికి బయటినుండి వచ్చే మద్దతును దూరం చేసుకుంది.

ఉదాహరణకు 2005లో శ్రీలంకలో జరిగిన సాధారణ ఎన్నికలలో ఎల్.టి.టి.ఇ. అధినాయకత్వం తీసుకున్న వైఖరీ, అనుసరించిన విధానమూ ఉద్యమానికి అపారమైన నష్టాలు తెచ్చిపెట్టాయి. తాజా పరిణామాలకు మూలమైన ప్రధానకారణాలలో ఇది ఒకటన్నది విస్మరించారు. 2005లో జరిగిన ఎన్నికల్లో రణిల్ విక్రమ్‌సింఘేకి మద్దతును ఇవ్వమని తమిళ్ నేషనల్ అలయెన్స్ కోరింది. ఆ విషయాన్ని ప్రభాకరన్ పట్టించుకోలేదు. పైగా శ్రీలంక ఉత్తర ప్రాంతంలో ఉన్న తమిళులచే బలవంతంగా ఎన్నికలను బహిష్కరింప జేశాడు. ఈ చర్య మహింద రాజపక్షే గెలుపుకు అనుకూలించింది. ఆయన శ్రీలంక దక్షిణ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి సింహళీయుల ఓట్లతో గెలిచాడు. ఇక్కడొక విషయాన్ని గమనించాలి. రాజపక్షే తన ఎన్నికల మెనిఫెస్టోలో తాను అధికారంలోకి వస్తే ఎల్.టి.టి.ఇ.ని పూర్తిగా నిర్మూలిస్తానని ప్రకటించిన విషయం కూడా ఎల్.టి.టి.ఇ. అధినేతకు తెలుసు. రణిల్ విక్రమ్ సింఘే తమిళజాతి పట్ల సానుభూతిని, ఉద్యమం పట్ల గౌరవభావాన్ని కలిగినవాడు.

ఎన్నికలు జరిగిన మూడు మాసాలకే అంటే 2005 ఆగస్ట్‌లో విదేశాంగ మంత్రి లక్ష్మణ్‌కదిర మార్గర్‌ను ఎల్.టి.టి.ఇ. ఆత్మాహుతిదళాలు చంపడంతో తీవ్ర వ్యతిరేకత, నిరసన వ్యక్తమైంది. వాస్తవానికి లక్ష్మణ్‌కదిర మార్గర్ బూర్జువా ప్రజాస్వామిక వాది. తమిళ ప్రజల ఉద్యమంపట్ల సానుభూతి కలిగినవాడు. వారి డిమాండ్లు న్యాయబద్ధమైనవనే విషయాన్ని అంగీకరించే వ్యక్తి. వారి ఆశలు, ఆంకాంక్షలపట్ల సానుకూలత, గౌరవం కలిగినవాడు. ఇలాంటి వ్యక్తిని హత్య చేయడంద్వారా మేధావుల్లోనూ, సాధారణ ప్రజల్లోనూ, ఎల్.టి.టి.ఇ. పట్ల వ్యతిరేకత పెరిగింది. ఈ సంఘటనను ఆధారం చేసుకొని 32కు పైగా యూరపియన్ దేశాలు ఎల్.టి.టి.ఇ.ని నిషేధించాయి. ఈ సంఘటనతో ఎల్.టి.టి.ఇ. రెండు రకాలుగా నష్టపోయింది. అంతర్జాతీయంగా వచ్చే ఆర్థికవనరులను, ఆయుధ సంపదను కోల్పోయింది. వాటిని సమకూర్చుకునే విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఇక తమిళేతరుల నుండి లభించే సానుభూతిని, మద్దతును కోల్పోవాల్సివచ్చింది. అంతర్జాతీయ సమాజంలో పొందవలసిన రాజకీయ మద్దతును కూడా కోల్పోయింది.

భిన్న అభిప్రాయాలను చర్చకు ఆహ్వానించే ప్రజాస్వామిక వాతావరణం ఎల్.టి.టి.ఇ. సంస్థలో లేదన్న చర్చకూడా ఉంది. ఉద్యమ సహచరుల సూచనలు, సలహాలు పట్టించుకోకపోవడం, ఏకపక్ష, ఒంటెద్దు పోకడలాంటి ధోరణులు అధినాయకత్వాన్ని వెంటాడుతున్న స్థితిలో సంస్థ ఉంది. ఇలాంటి ధోరణులు తమిళ ప్రజలు సాధించుకునే

మౌలిక లక్ష్యానికి ఆటంకమయ్యాయి. నాయకత్వం మధ్య ఏర్పడిన వైరుధ్యాల ఫలితంగా అనుభవం ఉన్న నాయకులు కొందరు వారితో పాటు పోరాటస్ఫూర్తి, నైపుణ్యమున్న వందలాదిమంది క్యాడర్ సంస్థను వీడి బయటకు వెళ్లిపోవడానికి దారితీశాయి. దీని వలన సంస్థ బలహీనపడటానికి కొంత అవకాశం ఏర్పడింది.

ఎల్.టి.టి.ఇ. సంస్థలో ఏర్పడిన వైరుధ్యాలను ప్రభుత్వం చక్కగా ఉపయోగించుకుంది. కరుణ, దయామాస్టర్ లాంటి వాళ్లు పాలక వర్గాలతో జతకట్టడమే ఇందుకు నిదర్శనం. ఇక 1991లో కారణాలేమైనప్పటికీ రాజీవ్‌గాంధీని హత్య చేయడం భారత ప్రజల సానుభూతేకాక స్వజాతికి సంబంధించిన ఏడు, ఎనిమిది కోట్లమంది భారతీయ తమిళ ప్రజల సానుభూతిని కూడా కోల్పోవలసి వచ్చింది. ఈ వాస్తవాన్ని కొంతమంది అంగీకరించక పోవచ్చు. ఎల్.టి.టి.ఇ. ఉద్యమంలోని అల్పమైన బలహీనతలనో, పొరపాట్లనో ప్రధానాంశాలుగా ఎత్తిచూపే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

ప్రచార, ప్రసార మాధ్యమాలు సైతం ఈ అంశాలనే ముఖ్యమైన ప్రచార అస్త్రాలుగా ఎజెండా మీదికి తెస్తున్నాయి. తమ న్యాయమైన డిమాండ్‌కు రాజకీయ మద్దతు కూడగట్టుకోవడంలో ఎల్.టి.టి.ఇ. వేసిన కొన్ని వ్యూహాత్మక ఎత్తుగడలు విఘాతం కల్గించాయనడంలో భిన్నాభిప్రాయం లేదు.

ఎంతోమంది ఉద్యమ సహచరులు నేలరాలుతున్నా, మరికొంత మంది విశ్వాసం సన్నగిల్లి ఉద్యమాన్ని వీడినా, మురళీధరన్‌కరుణ, దయామాస్టర్‌లాంటి వాళ్లు నిరాశతో ఉద్యమానికి వెన్నుపోటుపొడిచి శత్రువు పంచన చేరినా, సడలని విశ్వాసంతో, దృఢదీక్షతో ప్రభాకరన్ ఉద్యమాన్ని కొనసాగించాడు. తమిళ ప్రజల జీవించే హక్కుకోసం, తమిళజాతి అస్తిత్వం, మనుగడకోసం ఉద్యమాన్ని మరింత నిర్మాణాత్మకంగానూ, చైతన్యవంతంగానూ, సాయుధంగానూ నడిపాడు. ప్రజలకోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించాలన్న భావాన్ని, పట్టుదలను క్యాడర్లో పెంపొందించాడు. అది సాధారణ విషయం కాదు. క్యాడర్ ఆమోదం, అంగీకారం కాకుండా ఇది సాధ్యపడేదికాదు. ఉద్యమ శ్రేణుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని సంపూర్ణంగా పొందాడు కాబట్టే ఇది సాధ్యపడింది.

ప్రచార, ప్రసార మాధ్యమాలు ఇస్తున్న సమాచారం ప్రకారం పోరాటక్రమంలోనే తానేకాదు తన కుటుంబాన్ని సైతం తమిళజాతి ప్రజల ఆశలూ, అకాంక్షలకోసం బలిపెట్టాడు. టైగర్లపై యుద్ధం పేరుతో శ్రీలంక సైన్యం సామాన్య ప్రజలను సైతం ఊచకోత కోస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపైనా, జనావాసాలపైనా బాంబుల వర్షం కురిపిస్తూ వందల మందిని సామూహిక హత్యాకాండ నిర్వహిస్తున్నప్పటికీ భారతీయ సమాజం కనీస స్థాయిలోనైనా స్పందించకపోవడం విచారకరం. లండన్‌లోనూ, నార్వేలోనూ, ఇతర యూరోపియన్ దేశాలల్లో వ్యక్తమైన స్థాయిలోనైనా తమిళనాడులో నిరసన వ్యక్తంకాకపోవడం బాధాకరం. పైగా తమిళ పార్టీలన్నీ ఎన్నికల్లో ఓటు బ్యాంకును కాపాడుకోవటానికి ఈ సమస్యను ఉపయోగించుకున్నాయే తప్ప, శ్రీలంక ప్రభుత్వం అక్కడ తమిళ ప్రజలపై జరుపుతున్న సైనికదాడులను ఆపడానికి ప్రయత్నించలేదు. ఎల్.టి.టి.ఇ. పోరాట కారులను ఓడించవచ్చు. తమిళ ప్రజల ఆశల, అకాంక్షలను ఓడించలేరు. శ్రీలంకలో తమిళ ప్రజల చీకటి యుగానికి చరమగీతం పాడాలన్న సంకల్పంతో ప్రారంభమైన ఎల్.టి.టి.ఇ. ఉద్యమం చావలేదు. ప్రభాకరన్ లాంటి పోరాట యోధులను చంపొచ్చు. ప్రభాతాలను చంపలేరు. పోరాట క్రమంలో యోధులు నిష్క్రమించవచ్చు. కానీ కన్నీళ్లూ, వివక్షా ఉన్నంత కాలం తమిళ ప్రజల ఉద్యమం సజీవంగానే కొనసాగుతుంది. వీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొఠారీ కమిషన్ సిఫారసులను తుంగలో తొక్కి, అన్నిరకాల సామాజిక అంతరాలను విద్యారంగంలో కూడా అమలు చేయడం వల్ల విద్యారంగం దెబ్బతిన్నదంటున్నారు **ఎం. గంగాధర్**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్య

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యను రెండు ముక్కలుగా చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల కిందనే ప్రకటించింది. ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు వేరు చేసి దాన్ని ప్రాథమిక విద్యాశాఖ అంటామని, ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఇపుడున్న సెకండరీ విద్యలో ఇంటర్‌మీడియట్‌ను కలిపి దాన్ని మాధ్యమిక విద్యాశాఖ అంటామని ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వం ఈ నిర్ణయం చేయడానికి ముందు రాష్ట్రంలో ఉపాధ్యాయ నియోజకవర్గాల నుండి ఎన్నికైన ఎం.ఎల్.సి.లను గానీ, ఉపాధ్యాయ సంఘాలను గానీ, ఇంటర్ విద్యతో సంబంధమున్న అధ్యాపక సంఘాలతో గానీ, విద్యారంగంలో లబ్ధప్రతిష్టులైన మేధావులతో గానీ కనీసం సంప్రదించలేదు.

2008-09 విద్యా సంవత్సరం ప్రారంభంలో ఈ రాష్ట్ర ప్రభుత్వమే 6500 ప్రభుత్వరంగ సెంకడరీ పాఠశాలలకు సక్సెస్ పాఠశాలలు అనే పేరు పెట్టి ఆరవ తరగతిని ఆంగ్ల మాధ్యమంలో సమాంతరంగా ఒక సెక్షన్‌ను ప్రవేశపెట్టింది. ఆంగ్ల మాధ్యమంలో సిబిఎస్‌ఇ సిలబస్‌ను నిర్దేశించింది. ఈ నిర్ణయం తీసుకోవడానికంటే ముందు ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలను సంప్రదించింది. రాష్ట్రంలో అయిదు ప్రాంతాలలో సమావేశాలను నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడమనే తంతును పూర్తిచేసింది. సమాజంలో ఆంగ్లమాధ్యమం పట్ల ఉన్న ఆకర్షణను అవకాశంగా చేసికొని ప్రభుత్వం తన నిర్ణయాన్ని అమలుచేసింది. ఈ సంవత్సరకాలంలో ఈ నిర్ణయాల అమలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయిలో చేదు అనుభవాన్ని మిగిల్చింది. కాని ఈ అనుభవాన్ని పట్టించుకునే స్థితిగాని, సమీక్షించే స్థితిగాని ప్రభుత్వంలో కనిపించడం లేదు.

మన రాష్ట్రంలో రెసిడెన్షియల్ పాఠశాలలది మరింత దారుణమైన పరిస్థితి. మూడు రెసిడెన్షియల్ సొసైటీల కింద ఆరు వందలకు పైగా ఉన్న పాఠశాలల్లో 2008-09 విద్యా సంవత్సరం నుండీ 5,6 తరగతుల నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమాన్ని, సి.బి.ఎస్.ఇ. సిలబస్‌ను ప్రవేశపెట్టారు. తెలుగులో చదువుకుందామనుకున్న విద్యార్థులకు ఈ పాఠశాలల్లో అవకాశం కూడా లేదు. ఈ నిర్బంధ పరిస్థితిని ఈ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సామాజిక నేపథ్యంలో చూస్తే ఇందులోని దారుణత్వం అర్థమవుతుంది. ఈ మూడ్ సొసైటీలో ఒకటి ఎస్.సి.లకు, మరొకటి ఎస్.టి.లకు ఉద్దేశించింది. ఈ ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులు నిర్బంధంగా ఆంగ్ల మాధ్యమంలోకి ప్రవేశించడానికి ముందు తెలుగు మాధ్యమంలోనే విద్యాభ్యాసం చేసి ఉంటారు. ఈ విద్యార్థులకు ఉన్న కుటుంబ నేపథ్యాన్ని, సామాజిక నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ స్థితి ఎంత అననుకూలమైనదో అర్థమవుతోంది. ఈ విద్యార్థులు రెంటికి చెడిన రేవడులు అవుతారా?

గత విద్యా సంవత్సరంలో ప్రారంభించిన సక్సెస్ పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నుండి పెద్దయెత్తున నిధులు వస్తాయని చెప్పారు. ఇప్పుడు మాధ్యమిక విద్యగా నామకరణం చేసిన ఈ కొత్త విభాగానికి కూడా కేంద్ర ప్రభుత్వం నుండి బాగా నిధులు రాబోతున్నాయని వినబడుతోంది. విద్యా విధానం కొరకు నిధులా, నిధుల కొరకు విద్యా విధానామా అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. కేంద్ర ప్రభుత్వమే విద్యా విధానాన్ని రూపొందించింది. నిధులను విడుదల చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అనాలోచితంగా అమలు చేస్తే, విద్య విషయంలో రాష్ట్రానికి ఉన్న ప్రతిపత్తి ఏమిటి? భారత రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో విద్య ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను అనుసరించే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాలను, తన ప్రయోజనాలను ఆలోచించవద్దా? తన అనుభవాన్ని సమీక్షించుకోవద్దా? ఆ కాలంలో అధికారంలో ఉన్న మంత్రుల, అధికారుల నిర్ణయాలే దాశాబ్దాల తరబడి అమల్లో ఉండే విద్యా విధానాలు కావలసిందేనా?

పాఠశాల విద్యారంగంలో వెంట వెంటనే వస్తున్న ఈ మార్పుల సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్యారంగం ఎలా ఉన్నదో కొంతమేరకు పరిశీలించడం ఈ వ్యాసానికి పరిధి. ఈ వ్యాసంలో జనాభాకు చెందిన గణాంకాలు 2001 జనాభా లెక్కల నుండి, విద్యారంగానికి సంబంధించిన గణాంకాలు 2007-08 విద్యా సంవత్సరానికి సంబంధించినవి.

ఆంధ్రప్రదేశ్ 60.47 శాతం అక్షరాస్యతను కలిగి ఉంది. ఇది జాతీయ సగటు అక్షరాస్యతా శాతం 64.84 కంటే తక్కువే. దేశంలో ఉన్న 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత విషయంలో 28వ స్థానంలో ఉందనేది గమనించవలసిన అంశం. 1991లో ఆంధ్రప్రదేశ్‌లో 44.09 శాతం అక్షరాస్యత ఉంది. అంటే పదేళ్ల కాలంలో 16.38 శాతం పెరుగుదలను మాత్రమే సాధించడానికి వీలయింది. ఈ పదేళ్ల కాలంలో ఎన్నో అక్షరాస్యత పథకాలు కేంద్ర ప్రభుత్వ సహాయంతో అమలయ్యాయనే విషయాన్ని మనం గుర్తు పెట్టుకోవాలి. అయినా మన పరిస్థితి 60 శాతం దగ్గరే ఉంటే మనం 100 శాతం అక్షరాస్యతను ఎప్పటికి చేరుకోగలం?

ఈనాడు అక్షరాస్యత అంటే గాంధీ చెప్పిన చదవడం, రాయడం, కనీసం అంకగణిత పరిజ్ఞానం కాదు. సంతకం చేయడం వస్తే, బస్సు బోర్డును చదవగలిగితే అక్షరాస్యులే.

మొత్తం విద్యారంగానికి ప్రాథమిక విద్య పునాది వంటిది. ప్రాథమిక విద్య పటిష్టంగా ఉంటే విద్యా సంబంధ నైపుణ్యాలు విద్యార్థుల్లో బలపడి విద్యారంగంలోని తరువాతి దశలకు మెరుగైన విద్యార్థులు అందుబాటులో ఉంటారు. మన ప్రాథమిక విద్యారంగం ఈ భావనకు విరుద్ధంగా ఉంది. రాష్ట్రంలో అన్ని యాజమాన్యాల కింద కలిపి 62,464 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 53,66,949 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1,67,059 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో సాధరణంగా అయిదు తరగతులు ఉంటాయి. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండడం ఆదర్శప్రాయమైన స్థితి. కాని రెండు దశాబ్దాలుగా అనేక అక్షరాస్యతా పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు బహుళ తరగతి బోధనా విధానాన్ని విజయవంతంగా అమల్లోకి తెచ్చాయి. ఒక ఉపాధ్యాయుడు సగటున రెండు తరగతులను, అన్ని సబ్జెక్టులను బోధించాలి. ఈ స్థితి ప్రభుత్వరంగ ప్రాథమిక పాఠశాలల్లో సర్వసాధారణం. ప్రైవేట్ పాఠశాలల్లో కొంత భిన్నమైన, మెరుగైన స్థితి కనిపిస్తుంది.

ఇప్పుడు అమలవుతున్న సర్వశిక్షా అభియాన్ (ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి దీనికి పెట్టిన పేరు రాజీవ్ విద్యా మిషన్) కంటే ముందు డిపెప్ అమలవుతున్న కాలంలో చదువుకోవడానికి పేదరికం ఆటంకం కాదని ప్రభుత్వాలు సిగ్గు లేకుండా ప్రచారం చేసాయి. ఇందుకు ఎంపిక చేసిన కొన్ని ఉదాహరణలను తమ వాదానికి సమర్థంగా చూపాయి. కాని మొత్తం పరిస్థితిని చూస్తే మనకు భిన్నమైన దృశ్యం కనబడుతుంది. అక్షరాస్యతలో లింగ వివక్ష, సామాజిక వర్గ వివక్ష, గ్రామీణ, పట్టణ ప్రాంత వివక్ష స్పష్టంగా కనిపిస్తాయి. 60.47 శాతం అక్షరాస్యతను కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పురుషులు 70.32 శాతం అక్షరాస్యతను, స్త్రీలు 50.43 శాతం అక్షరాస్యతను కలిగి ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 54.50 శాతం అక్షరాస్యత ఉండగా పట్టణ ప్రాంతాల్లో 76.09 శాతం అక్షరాస్యత ఉంది. గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాలలోనూ స్త్రీ, పురుషుల మధ్య అక్షరాస్యత హెచ్చుతగ్గులు ఇంతకు ముందు చెప్పిన విధంగానే కనిపిస్తాయి. ఒకవైపు పేదరికానికి, వెనుకబాటుతనానికి, మరొకవైపు నిరక్షరాస్యతకు మధ్య ఇంత సన్నిహిత సంబంధం కనిపిస్తుండగా చదువుకొనడానికి పేదరికం ఆటంకం కాదని ప్రభుత్వాలు పేదలను అవమానించదలచుకున్నాయా?

ప్రాథమిక పాఠశాలల్లో చదువుకోవడానికి అనువైన ఆరు నుండి పది సంవత్సరాల వయస్సులోపు ఉన్న బాలబాలికలు ఆంధ్రప్రదేశ్‌లో 74,41,460 మంది ఉన్నారు. వీరిలో ఎస్.సి. సామాజికవర్గానికి చెందిన బాలబాలికల సంఖ్య 12,04,850. ఎస్.టి. సామాజికవర్గానికి చెందిన బాలబాలికల సంఖ్య 4,90,584. ఆరు నుండి పది సంవత్సరాల మధ్య వయస్సులోనున్న బాలబాలికలు ప్రాథమిక పాఠశాలల్లో ఉండాలి. కాని ఇంకా 26,723 మంది బాలబాలికలు బడి ముఖం చూడకుండానే ఉన్నారు. ఈ అంకెలతో రాష్ట్ర ప్రభుత్వం 2007-08 విద్యా సంవత్సరం నాటికి 96.40 మేరకు ఎన్‌రోల్‌మెంట్ రేషియోను సాధించానని అంటోంది. ఎస్.సి., ఎస్.టి. ల విషయంలో ఈ అంకెలు మనకు గమ్మత్తుగా దర్శనమిస్తాయి. ఆరు నుండి పది సంవత్సరాల మధ్య వయస్సులోనున్న ఎస్.సి. బాలబాలికలు 12,04,850 మంది ఉండగా, ఒకటి నుండి ఐదు తరగతులలో ఎస్.సి. బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ మాత్రం 13,65,680గా ఉండి 113.35 శాతం మేరకు ఎన్‌రోల్‌మెంట్ రేషియోను గణాంకాలు చూపుతున్నాయి. ఎస్.టి.ల విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంది. ఆరు నుండి పది సంవత్సరాల మధ్య వయస్సులోనున్న ఎస్.టి. బాలబాలికలు 4,90,584 మంది ఉండగా ఒకటి నుండి ఐదు తరగతులలో ఎస్.టి. బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ 7,38,623గా ఉంది. ఆ విధంగా వారి ఎన్‌రోల్‌మెంట్ రేషియో 150.56 శాతంకు చేరుకున్నది.

ఎస్.సి., ఎస్.టి.ల విషయంలో ఈ విచిత్రమైన స్థితికి కారణమేమిటి? ప్రాథమిక పాఠశాలలో ఉండి చదువుకోవలసిన ఎస్.సి., ఎస్.టి. బాలబాలికల సంఖ్య కంటే వాస్తవంగా చదువుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగా ఎందుకు కనబడుతోంది? ఈ రెండు సామాజిక వర్గాలకు చెందినవారు నూటికి నూరు శాతం మంది ప్రాథమిక పాఠశాలల్లో చేరారని చెప్పడానికి ఇది ఒక సూచిక అవుతుందా? ఎంత మాత్రమూ కాదు. ఇప్పటివరకు బడిముఖం చూడని బాలబాలికలలో ఎస్.సి., ఎస్.టి.లే వారి జనాభా దామాషాలో చూస్తే ఎక్కువ మంది ఉంటారు. పది సంవత్సరాల వయసు దాటిన బాలబాలికలు ప్రాథమిక విద్యను పూర్తి చేసి ప్రాథమికోన్నత విద్యలోనో, సెంకడరీ విద్యలోనో ఉండాలి. కాని ఎస్.సి., ఎస్.టి. సామాజిక వర్గాలలో మాత్రం ఆలస్యంగా బడిలో చేరడం వలన గాని, ఒకసారి బడిలో చేరి డ్రాప్ అవుట్స్‌గా మారిపోయి, కొంతకాలం తరువాత మళ్లీ బడిలో చేరడం వలన గాని వారి ఎన్‌రోల్‌మెంట్ రేషియో వంద శాతం కంటే ఎక్కువగా కనిపిస్తున్నది. ఇది చదువులో వారి వెనుకబాటుతనానికే నిదర్శనం. ఎస్.సి.ల కంటే ఎస్.టి.లు బాగా వెనకబడిపోయి ఉన్నారని ఈ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలు చెపుతున్నాయి.

ఈ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలకు డ్రాప్ అవుట్ రేట్లను అనుసంధానం చేసి చూస్తే పరిస్థితి తీవ్రత మనకు బాగా అర్థమవుతుంది. ఆరు నుండి పది సంవత్సరాల మధ్య వయస్సులోనున్న బాల బాలికల విషయంలో 96.40 శాతం మేరకు ఎన్‌రోల్‌మెంట్ రేషియోను సాధించినట్లుగా ఒకవైపు కనబడుతుండగా, 2007-08 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతిలో 18.79 మేరకు డ్రాప్ అవుట్ రేటు మరొక వైపు కనబడుతున్నది. అంటే 80 శాతం దగ్గరగా ఉండవలసిన ఎన్‌రోల్‌మెంట్ రేషియో 96 శాతం పైన ఉన్నదంటే, ఈ అదనపు 16 శాతం మంది బాలబాలికలు పది సంవత్సరాల వయస్సుపై బడినవారని అర్థం. అంటే చదువుకోవడంలో వారు వెనకబడి ఉన్నారని అర్థం.

అలాగే ఆరు నుండి పది సంవత్సరాల మధ్య వయస్సులోనున్న ఎస్.సి. బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ 113.35 శాతంగా ఉంది. వీరి డ్రాప్ అవుట్ రేట్ 20.82 శాతంగా ఉంది. అంటే సుమారు 30 శాతం మంది ఎస్.సి. బాలబాలికలు పది సంవత్సరాల వయస్సుకు పై బడినవారు చదువులో వెనుకబడిపోయి ఉన్నారని అర్థం. ఇదే విధంగా ఇదే వయసులో ఉన్న ఎస్.టి. బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ రేషియో

150.56 శాతం కాగా, డ్రాప్ అవుట్ రేటు 46.26గా ఉంది. అంటే సుమారు 80 శాతం మేరకు ఎస్.టి. బాలబాలికలు పది సంవత్సరాల వయస్సుకు పైబడిపోయి, చదువులో వెనకబడిపోయి, ఇంకా ప్రాథమిక పాఠశాలల్లో ఉన్నారని అర్థం. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిపోయి ఉండడానికి, చదువులో వెనకబడిపోయి ఉండడానికి విడదీయరాని సంబంధం ఉందని ఈ గణాంకాలను చూస్తే మనకు అర్థమవుతున్నది. కాని ప్రభుత్వాలకు ఎందుకు అర్థం కావడం లేదు?

ఇంటర్‌మీడియట్ నుండి ఉన్నత స్థాయి వరకు అనేక శాఖలుగా విస్తరించిన ఉన్నత విద్యారంగంలో ప్రైవేటీకరణ కార్పొరేట్ స్థాయికి చేరుకున్నది. ఈ ధోరణులు సెకండరీ విద్యలోకి, ప్రాథమిక విద్యలోకి చొచ్చుకువస్తున్నాయి. ఇప్పటికే ప్రాథమిక, సెకండరీ విద్యారంగంలో ప్రభుత్వ రంగ పాఠశాలలదే పెద్దపాత్ర. అయితే గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వరంగ పాఠశాలల పాత్ర క్రమక్రమంగా తగ్గిపోతున్నట్లుగా, సహజంగానే అదే మోతాదులో ప్రైవేట్ పాఠశాలల పాత్ర క్రమక్రమంగా పెరిగిపోతున్నట్లుగా అర్థమవుతుంది. పదేళ్ల, ఇరవై ఏళ్ల గణాంకాలను తీసికొని ఈ అంశాన్ని స్పష్టంగా విశ్లేషించవచ్చును. అది అలా ఉండగా 2007-08 విద్యా సంవత్సరానికి సంబంధించిన గణాంకాల నుండే మనం కొన్ని అంశాలను గమనించవచ్చును.

2007-08 విద్యాసంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, మండల పరిషత్, మున్సిపల్, ప్రైవేట్ ఎయిడెడ్) ప్రాథమిక పాఠశాలలు 56,481 ఉండగా, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు 5,983 ఉన్నాయి. మొత్తం ప్రాథమిక పాఠశాలలలో ప్రైవేట్ పాఠశాలలు 9.58 శాతం మేరకు ఉన్నాయి. కాని ఎన్‌రోల్‌మెంట్ విషయంలో ప్రైవేట్ పాఠశాలలు బాగా ముందున్నాయి. ఇదే విద్యాసంవత్సరంలో ప్రభుత్వరంగ ప్రాథమిక పాఠశాలల్లో 35,72,645 మంది బాలబాలికలు కనిపిస్తుండగా, ప్రైవేట్ పాఠశాలల్లో 17,94,304 మంది కనిపిస్తున్నారు. మొత్తం ఎన్‌రోల్‌మెంట్ లో 33.43 శాతం మేరకు ప్రైవేట్ పాఠశాలలలో ఉంది. ఈ తేడా ఉపాధ్యాయుల సంఖ్యలో కూడా కనిపిస్తుంది. ప్రభుత్వరంగ ప్రాథమిక పాఠశాలల్లో 1,19,399 మంది ఉపాధ్యాయులు ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో 47,660 మంది ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్నన మొత్తం ఉపాధ్యాయులలో 28.53 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నారు. అంటే 9.58 శాతం మేరకు ప్రైవేట్ పాఠశాలలు 28.53 శాతం మేరకు ఉపాధ్యాయులతో, 33.43 శాతం మేరకు విద్యార్థులతో ప్రభుత్వరంగ పాఠశాలలకు సవాల్ చేస్తున్నట్లుగా ఉన్నాయి.

ప్రైవేట్ పాఠశాలలు మెరుగైన స్థితిలో ఉండడానికి కారణాలేమిటి? ప్రభుత్వ విధానాలే ప్రభుత్వరంగ పాఠశాలల విశ్వసనీయతను దెబ్బతీసాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులలో కనిపించే బాధ్యతారాహిత్యం, వారి మీద లోపించిన పర్యవేక్షణ ప్రభుత్వరంగ పాఠశాలల విశ్వసనీయతను దెబ్బతీయడంలో సహకరించాయి. గత రెండు దశాబ్దాల ప్రపంచీకరణ విధానాలు ప్రైవేటీకరణ మీదనే ఆధారపడి ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ నిర్దిష్టమైన ఎంపిక మీద ఆధారపడి జరుగుతోంది. నిర్దిష్టమైన ఎంపిక స్పష్టంగా కనిపించని చోట ప్రైవేట్ పాఠశాలల స్వరూప స్వభావాలను బట్టి సహజమైన ఎంపిక ప్రక్రియ చోటు చేసుకుంటుంది. వీటికి తోడు ప్రైవేట్ పాఠశాలలకు చదువుకోవడానికి వచ్చే బాలబాలికల కుటుంబ, సామాజిక నేపథ్యాలు కూడా పరోక్షంగా, పరంపరగా ప్రైవేట్ పాఠశాలల విశ్వసనీయత పెరగడానికి, ప్రభుత్వరంగ పాఠశాలల విశ్వసనీయత దెబ్బతినడానికి కారణమవుతున్నాయి. అయితే ప్రభుత్వరంగ పాఠశాలలు మోస్తున్న సామాజిక బాధ్యతే వాటి విలువకు దోహదకారిగా ఉంది. ప్రపంచీకరణ చేస్తున్న దాడులను సామాజిక విలువలు ఎంతమేరకు తట్టుకోగలవో అంతమేరకు ప్రభుత్వరంగ పాఠశాలలు కూడా తమ ఉనికిని నిలుపుకోగలుగుతాయి.

ప్రాథమిక విద్య అనేక లోపాలతో కూడుకొని ఉన్నప్పటికీ పదేళ్ల కిందటికి, ఇప్పటికి మధ్య ఎన్‌రోల్‌మెంట్ విషయంలో, బడిలో చేరిన బాలబాలికలు బడి మానివేయకుండా ఉండే విషయంలో మెరుగుదల కనిపిస్తున్నది. ఆరు నుండి 10 సంవత్సరాల మధ్య వయస్సులో నున్న బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ రేషియో 1997-98లో 82.87 ఉండగా, 2007-08లో అది 96.40కు చేరుకున్నట్టుగా గణాంకాలు సూచిస్తున్నాయి. అలాగే ఒకటవ తరగతిలో చేరిన బాలబాలికలు ఐదవ తరగతికి చేరుకునే సరికి 45.48 శాతం మేరకు బడిలో కనిపించకుండా డ్రాప్ అవుట్స్‌గా మిగిలిపోయేవారు. ఇది 1997-98 నాటి పరిస్థితి. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయటం వలన గానీ, అక్షరాస్యత వ్యాప్తి మేరకు తీసుకున్న కార్యక్రమాల వలన గానీ, తమ పిల్లల్ని చదివించాలనే కోరిక తల్లిదండ్రులలో పెరిగినందువలన గాని పరిస్థితిలో మార్పు వచ్చింది. ఫలితంగా 2007-08 నాటికి డ్రాప్ అవుట్ రేటు 18.79 శాతానికి పడిపోయింది. ఈ డ్రాప్ అవుట్ రేటు కూడా ఆందోళన కలిగించేదే. దీన్ని కూడా నివారించడానికి విద్యాపరమైన చర్యలను, పేదప్రజల ఆర్థికస్థోమతను పెంచే చర్యలను ప్రభుత్వాలు తీసుకోవాల్సి ఉంది.

విద్యారంగం మీద ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చు ఇంకా పెరిగివలసిన అవసరం ఉంది. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం స్థూల జాతీయ ఉత్పత్తిలో 6 శాతం మొత్తాన్ని, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లలో 30 శాతం మొత్తాన్ని కేటాయించాలని కొఠారీ కమిషన్ సూచించింది. కాని గడచిన నాలుగు దశాబ్దాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొఠారీ కమిషన్ సూచించిన మొత్తాల్లో సుమారు సగానికి అటూ ఇటూగా మాత్రమే ఖర్చు పెడుతున్నాయి. అయిదేళ్ల కింద యుపిఎ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగం కొరకు పన్నుల మీద 2 శాతం విద్యా సెస్సును కూడా విధించింది. కాని విద్యమీద కేంద్ర ప్రభుత్వ వ్యయం మాత్రం ఆ మేరకు పెరగలేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడున్న ప్రాథమిక పాఠశాలలను వసతుల విషయంలో, ఉపాధ్యాయులను నియమించే విషయంలో సరిగా అభివృద్ధి చేయడం లేదు. కొత్త పథకాలను రూపొందించి, అందుకు అనుగుణమైన కొత్త పాఠశాలలను స్థాపిస్తోంది. లేదా కొత్త పథకాల పరిధిలోకి అన్ని పాఠశాలలను తేకుండా, వాటిలో కొన్ని పాఠశాలలను మాత్రమే చేర్చుతోంది. ఇది పాఠశాల విద్యలో ప్రభుత్వరంగంలోనే అనేక అంతస్తులతో కూడిన విద్యా రంగ నిర్మాణానికి దారితీస్తోంది. దేశంలో కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని, తద్వారా సామాజికంగా

జాతీయ విద్య, సార్వత్రిక విద్య, అందరికీ విద్య వంటి లక్ష్యాలను దెబ్బతీసి కనీస విద్య కూడా అందించలేకపోతున్న విధాన వైఫల్యాలను వివరిస్తున్నారు **ఎ. నరసింహారెడ్డి**

విద్యారంగంలో తిరోగమన విధానాలు

దేశీయ అవసరాలకు అనుగుణమైన 'జాతీయ విద్య' రూపొందించాలనే ఆకాంక్ష స్వాతంత్ర్య ఉద్యమకాలంలోనే వ్యక్తమైంది. ఆరు దశాబ్దాలు గడిచినా సార్వత్రిక విద్య అందించడంలో మన పాలకులు వైఫల్యం చెందారు. కనీస విద్యకు నోచుకోని స్వాతంత్ర్యం మనది. 'అందరికీ విద్య–సమాన విద్య' అందించడంలోని వివక్షను సమాజిక అంతరాలను తొలిగించడానికి కొఠారీ కమిషన్ 1966లో ఉమ్మడి పాఠశాల విధానాన్ని సూచించింది. పార్లమెంట్ 1968లో ఉమ్మడి పాఠశాల విధానాన్ని ఆమోదించింది. ఐక్యరాజ్య సమితి 1948 డిసెంబర్ లో ప్రకటించిన సార్వత్రిక మానవ హక్కుల్లో విద్యను కూడా మానవ హక్కుగా పేర్కొంది. మన రాజ్యాంగం అమలులోకి వచ్చి ఆరు దశాబ్దాలు కావస్తున్నా ప్రపంచ నిరక్షరాస్యులలో అత్యధికులు మనదేశంలోనే ఉన్నారు. పాఠశాల విద్యలో మన దేశం ఎంతగానో వెనుకబడి ఉందని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ తప్పుబట్టడమే కాక పాఠశాల విద్యను ప్రైవేట్ సంస్థల ద్వారా, వ్యక్తుల ద్వారా అందించడం సముచితం కాదని, విద్య వ్యాపారంగా మారకుండా, అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వాలే నిర్ణయాత్మక పాత్ర పోషించాలని, అలాంటి చొరవ మన నేతల్లో కొరవడటమే విద్యారంగం సమస్యలకు, సంక్షోభాలకు దారి తీసిందన్నారు.

నేటికీ విద్యాపరంగా సంపన్న, పేద వర్గాల మధ్య, ప్రాంతాల మధ్య, స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసాలు కనబడతాయి. విద్య మానవ హక్కుగా, రాజ్యంగ హక్కుగా, ప్రాథమిక హక్కుగా గుర్తించబడినప్పటికీ ఆచరణలో సార్వత్రిక విద్య అందించడంలో పాలకులు నిర్లక్ష్యం చేశారు. విద్య ద్వారా సాంఘిక పరివర్తన, స్వావలంబన, సాధికారత, వికాసం లాంటి ఆదర్శాలు సాధించవచ్చని భావించారు. అందరికీ పాఠశాలలు అందుబాటులోకి తేవడం, బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించడం, బడిలో చేరిన విద్యార్థులు మధ్యలో బడి మానివేయకుండా చర్యలు చేపట్టడం ఇలా పలుమార్లు విధాన నిర్ణయాలు ప్రకటించారు. అందుకు పాఠశాలలు పెంచడం, మౌలిక వసతులు సమకూర్చడం, మధ్యాహ్న భోజనం సమకూర్చడం, ఉపకార వేతనాలు, హాస్టల్ సౌకర్యాలు, ఉచితంగా పుస్తకాలు సరఫరా చేయడం, ఉపాధ్యాయులకు బోధన మెలకువలపై శిక్షణ ఇవ్వడం, పర్యవేక్షణ పటిష్ఠపరచడం లాంటి చర్యలు 1980 వరకు ఓ మేరకు చేపట్టారు. గ్రామీణ భారతంలో పాతుకుపోయిన పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత బాలల వికాసానికి ఆటంకంగా ఉన్నాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వలసలు వంటివి బాలకార్మికుల సంఖ్యను మరింత పెంచుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా నాలుగున్నర కోట్ల మంది బాలకార్మికులు మన దేశంలో ఉన్నారన్నది ప్రపంచబ్యాంక్ తాజా అంచనా. భారత సామాజిక ఆర్థిక వ్యవస్థ నుండి బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించడం, ఉన్న అంతరాలను విద్యారంగంలో అధిగమించాలని కొఠారీ కమిషన్ సూచించగా, దానికి భిన్నమైన మార్గంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయి. ఇది విద్యారంగంలో అంతరాలను సృష్టించి, విద్యార్థులకు వారి సామాజిక అంతరాలకు అనుగుణంగా విభజించి చదువు చెప్పే ధోరణులను స్థిరపరిచింది. విద్యారంగంలో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య క్రమక్రమంగా పెరిగిపోతున్న వైనం, ప్రభుత్వ రంగంలోనే వివిధ అంతరాలను సృష్టించడం, విద్య మన సామాజిక అవసరాలను తీర్చేదిగా కాకుండా మార్కెట్ అవసరాలను తీర్చేదిగా రోజు రోజుకూ మార్పు చెందుతూ రావడం ఆందోళన కలిగించే పరిణామాలుగా ఉన్నాయి.

రాజ్యాంగంలోని 45వ ఆర్టికల్‌లో 14 ఏళ్ల వయస్సు వచ్చేవరకు బాలబాలికలకు నిర్బంధోచిత విద్యను ప్రభుత్వాలు అందించాలని ఉండేది. 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 2002లో విద్యను ప్రాథమిక హక్కుగా మారుస్తూ 21వ ఆర్టికల్‌ను కొత్తగా చేర్చినపుడు ఈ హక్కును 6 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సులోనున్న బాలబాలికలకు మాత్రమే పరిమితం చేసారు. ఈ ప్రాథమిక హక్కును అయినా సవ్యంగా అమలు చేయడానికి అవసరమైన విద్యా చట్టాన్ని ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం చేయలేదు. 2008 డిసెంబర్‌లో రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు అనేక లోపాలతో కూడుకొని ఉంది. విద్యకు సంబంధించిన ఈ ప్రాథమిక హక్కును బాలబాలికలకు అందించే విషయంలో ప్రభుత్వాలు పూచిపడడానికి బదులు, ఆ బాధ్యతను తల్లిదండ్రులపై నెట్టివేయడానికి బిల్లులో ప్రయత్నం జరిగింది. ప్రైవేట్ పాఠశాలల పాత్రను కూడ బిల్లులో ఏమీ తగ్గించలేదు. పురోగామి సామాజిక దృక్పథం గల విద్యారంగ మేధావులు, సంస్థలు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో నెమ్మదిగా రూపుదిద్దుకుంటున్న విద్యారంగ ఉద్యమమే విద్యారంగ సమస్యలకు పరిష్కారాన్ని సాధించవలసి ఉంది. వీ

ఎన్ని చట్టాలున్నా ఆచరణీయం కావడం లేదు. పద్నాలుగు సంవత్సరాల లోపు బాలబాలికలు పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని, పనుల్లోకి వెళ్లరాదని రాజ్యాంగంలోని 24వ అధికరణ నిర్దేశిస్తోంది. బడిబాట ఆర్భాటం ముగియగానే మళ్లీ ఇంటిబాట, పనిబాట యథావిధిగా కొనసాగుతోంది. మంత్రుల, అధికారుల ఆర్భాటమే తప్ప శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్న దాఖలాలే కనబడవు.

1970 దశకంలో విద్యారంగ వైఫల్యాలు పట్ల పలు విమర్శనాత్మక నివేదికలు వెలువడ్డాయి. పాలకుల్లో నిజాయితీ లోపించిందని, పాఠ్యాంశాలు జీవితాలను ప్రతిబింబించడం లేదని, పాఠశాలలు ఆకర్షణీయంగా లేవని, ప్రజల పేదరికం కారణంగా బాలకార్మికత వేళ్ళూనుకుందని, విద్యకు జాతీయ లక్ష్యాలు లేవని, సామాజిక ఆర్థిక అంతరాలను నివారించే విధంగా మన విద్యా ప్రణాళిక రూపొందించ బడలేదని, విద్యావ్యాప్తికి తగినంతగా నిధులు కేటాయింపు జరగడం లేదన్న విమర్శలు వచ్చాయి. ప్రధానంగా పెరుగుతున్న పాఠశాలల సంఖ్యకు విద్యా ప్రమాణాలకు మధ్య వైరుధ్యముందన్న సాకుతో విద్యలో సమానత్వ ఆదర్శం ఆచరణీయం కావడం లేదన్న ప్రభుత్వ వాదనను జె.పి.నాయక్, కృష్ణకుమార్, కామత్ లాంటి విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. పాఠశాలల సంఖ్య పెరగడం వలన కావలసిన వనరులు సమకూర్చి, విద్యా నాణ్యతను అందించలేకపోతున్నామని, విద్యా నాణ్యతను పెంచాలంటే పాఠశాలల సంఖ్యను కుదించాల్సి వస్తుందన్న వితండ వాదనతో కొన్ని పాఠశాలలను ఉన్నతీకరించి శిష్ట వర్గ విద్యా విధానానికి 1986 రాజీవ్ నూతన విద్యా విధానంతో నవోదయ పాఠశాలలకు నాంది పలికింది. ఈ ప్రక్రియలో కొందరికి నాణ్యమైన విద్య, అశేష ప్రజానీకానికి నాసిరకమైన విద్య అందించే వివక్షతను మరింత పెంచి సామాజిక అంతరాలను మరింత వ్యవస్థీకృతం చేసారు.

మన పాలకులు 1990వ దశకం నుండి విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని వ్యవస్థాగతంగా సాంఘిక, ఆర్థిక అసమానతల్లో ఉందన్న వాస్తవాన్ని చూడనిరాకరించి సమస్యలకు పరిష్కారం బోధనాభ్యసనల మార్పు ద్వారా సాధించాలను కోవడంతో రోగమొకటయితే మందొకటన్న చందంగా మారింది. నేటి విద్యా విధానాలు మన సామాజిక అవసరాలు తీర్చేవిగా, రాజ్యాంగంలో ప్రకటించుకున్న మౌలిక ఆదర్శాలైన ప్రజాతంత్ర, లౌకిక, సమసమాజ, సర్వసత్తాక లాంటి విలువలు సాధించే విధంగా లేవు. అందరికీ విద్యను అందించే రాజ్యాంగ లక్ష్యం కాలంతోబాటు గడువు పొడిగించబడుతోంది.

విద్యా వ్యవస్థలో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితులను నివారించడానికి అనేక కమిషన్‌లు, సమీక్షా సంఘాలు, సలహా మండళ్లు ఎన్నో సూచనలు చేశాయి. అవాంఛనీయ పరిస్థితులను నివారించాలని సిఫారసులు చేశాయి. అయినప్పటికీ ప్రభుత్వాల వైఖరిలో మార్పురాలేదు. ప్రజావసరాల కనుగుణంగా, దేశ అవసరాల కనుగుణంగా విద్యా లక్ష్యాలను నిర్మించడం లేదు. విద్యను సామాజిక ప్రక్రియ నుండి వేరు చేసి చూడడం జరుగుతోంది. విద్యకు గల సామాజిక కర్తవ్యాన్ని గుర్తించడం లేదు. నేటికీ విద్యను జాతీయ ప్రాధాన్యతా అంశంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదు. 'సామాజిక న్యాయాన్ని' అందించే లక్ష్యంగా సమాన అవకాశాల ప్రాతిపదికగా విద్యను అందించడం లేదు.

గత ఆరు దశాబ్దాలుగా పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు గణనీయంగా విస్తరించాయి. అయినా సమాజంలోని అన్ని వర్గాలకు విద్యావకాశాలు సమానంగా అందలేదు. అందువలన ఈ అభివృద్ధి అంతా పైపైనే జరిగినదిగా స్పష్టమైపోయింది. దేశ ఆర్థిక, సామాజిక జీవనాన్ని స్వావలంబన దిశలో, ఆధునికతా మార్గంలో నడిపే లక్ష్యం గాని, చొరవ గాని, చిత్తశుద్ధిగాని, ప్రభుత్వాలకి లోపించింది. సుస్థిరమైన మానవాభివృద్ధికి దీర్ఘకాలిక దృష్టితో కూడిన ఆచరణాత్మక ప్రణాళిక అవసరాన్ని పాలకులు గుర్తించడం లేదు. గడిచిన కాలమంతా విద్యావ్యవస్థ పెట్టుబడికీ, సామ్రాజ్యవాదానికీ, దళారీ స్వభావం సంతరించుకున్న ప్రభుత్వాలకూ, పాలకవర్గాలకూ సేవచేసేదిగా కొనసాగింది. రాజీవ్‌గాంధీ 1986లో ప్రకటించిన నూతన విధాన పత్రం ఈ స్వభావాన్ని మరింత స్పష్టపరిచింది. తరువాతి ప్రభుత్వాలు ఇక వెనుచూడలేదు.

1986 వరకు పాఠశాల విద్యలో ప్రైవేట్ పాఠశాలలు చూసాం కాని ఉన్నత విద్యలో కళాశాలలు గాని, విశ్వవిద్యాలయాలుగాని ప్రైవేట్ రంగంలో మనం చూడలేదు. ఇప్పుడు ఉన్నత విద్య మొత్తం ప్రైవేట్‌రంగం లోకి వెళ్లి క్రమంగా పాఠశాల విద్యలోకి చొరబడుతోంది. అందులో భాగంగానే కాన్‌సెప్ట్ స్కూళ్లు, రూరల్ పబ్లిక్ స్కూళ్లు, ప్రైవేట్ – పబ్లిక్ భాగస్వామ్యంలో నెలకొల్పే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వరంగంలో ఉన్న పాఠశాలలను, కళాశాలలను బలహీనం చేసి, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా లాభాలు దండుకునే విధంగా వోచర్ విధానం ఉనికిలోకి వచ్చింది. దీంతో ఇక ప్రజాధనంతో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు లాభాలు దండుకునే సమాజ వ్యతిరేక అప్రజాస్వామిక విధానం ఆచరణలోకి రానుంది.

మన రాష్ట్రంలో దాదాపు 24 వేల పాఠశాలలు కనీస వసతికి నోచుకోని దుస్థితిలో ఉన్నట్లు ప్రభుత్వమే ఉన్నత న్యాయస్థానానికి నివేదించింది. ప్రతి వ్యక్తికీ పాఠశాల విద్య కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేననీ, ప్రైవేట్ చదువులు మరీ ఖరీదుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేననీ హైకోర్టు స్పష్టం చేసింది. విద్య వ్యాపారంగా మారకుండా ప్రభుత్వాలే నిర్ణయాత్మక పాత్ర పోషించాలని, సకల వసతులు సమకూర్చి ప్రభుత్వ పాఠశాలల్ని పటిష్ఠపరచాలనీ హితవు పలికినా మన పాలకుల్లో అలాంటి చొరవ కొరవడడం వలన విద్యారంగం సమస్యలకు, సంక్షోభాలకు నిలయమయింది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతగ్గి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. పర్యవసానంగా వెయ్యి ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి, మరికొన్ని పాఠశాలలు మూతపడే అవకాశం ఉంది. అంతిమంగా ప్రభుత్వ పాఠశాలలు అదృశ్యమయ్యే ప్రమాదం పొంచి ఉంది. కానీ ప్రభుత్వ పాఠశాలలకు కావల్సిన వసతులు సమకూర్చనంత వరకు ప్రైవేట్ విద్యా సంస్థల దూకుడును అడ్డుకోవడం సాధ్యం కాదు.

1966లో ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందంలోని 13వ ప్రకరణలో (1)వ అంశం భాగస్వామ్య దేశాలన్నీ అందరికీ విద్యా హక్కుని గుర్తించాలని పేర్కొంది. ఈ హక్కు పూర్తిగా వాస్తవ రూపం దాల్చేలా 13వ ప్రకరణం (2)లో ప్రాథమిక విద్య నిర్బంధంగానూ, అందరికీ ఉచితంగా అందుబాటులో ఉండాలనీ

పేర్కొంటుంది. అంతర్జాతీయ బాలల హక్కుల సదస్సు 1990 తీర్మానాలను కూడా భారత ప్రభుత్వం 1992లో ఆమోదించింది. ఇందులో 28వ ప్రకరణం 'భాగస్వామ్య దేశాలన్నీ బాలల విద్యా హక్కుని గుర్తించి, సమాన అవకాశాల ప్రాతిపదికన క్రమంగా దాన్ని సాధించడానికి ముఖ్యంగా (ఎ) సాధారణ, ఉపాధి విద్యలతో సహా వివిధ రకాల సెకండరీ విద్యను అభివృద్ధి చేసి, వాటిని బాలలందరికీ అందుబాటులో ఉండేలా ఉచితంగా అందించడం, అవసరమైన వారికి ఆర్థిక సహాయం లాంటి చర్యలు చేపడతామని' పేర్కొంటుంది. అందులోనే 29వ ప్రకరణం (1) (ఎ) 'బాలల వ్యక్తిత్వమూ, ప్రజా భౌతిక, మానసిక శక్తి సామర్థ్యాలు పూర్తిగా వికసించేలా, బాలల విద్యను రూపొందిస్తామనీ భాగస్వామ్య దేశాలు అంగీకరిస్తాయి' అని పేర్కొంది.

అందరికీ విద్యను అందించాలన్న లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి పది అంశాల కార్యాచరణ పథకాన్ని రూపొందించింది. దీన్ని 1990 సెప్టెంబర్ 30న న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి శిఖరాగ్ర సమావేశం చర్చించి ఆమోదించింది. అది ఆకలి, పౌష్టికాహారలోపం, కరువుకాటకాలను నిర్మూలించే పథకాలను చేపట్టడం ద్వారా ప్రపంచంలో ఉన్న బాధిత బాలలను కష్టాల నుండి విముక్తి చేసి, వారి అభివృద్ధికి కృషి చేయాలని, సామాజిక నేపథ్యం, లింగ బేధాలతో నిమిత్తం లేకుండా బాలలలో నిరక్షరాస్యతను తగ్గించడం, అందరికీ సమాన విద్యావకాశాలను కలిగించడం, వృత్తి విద్యల ద్వారా పిల్లలకు ఉత్పాదకతతో కూడిన ఉపాధిని కలిగించడం వంటివి చేపట్టాలి. నేటి తరం కోసమే కాదు, భవిష్యత్తు తరాల కోసం కృషి కొనసాగించుతామనీ, ప్రతి పసికందుకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడం కంటే మహత్తరమైన విధి మరొకటి లేదనీ ప్రకటించింది. పది అంశాల కార్యాచరణ పథకాన్ని 2000 సంవత్సరం నాటికి నెరవేర్చాలని గడువు నిర్దేశించుకొన్నది. ఆ ప్రకటనపై భారతదేశంతో సహా 59 దేశాలు సంతకం చేశాయి. మన దేశంలో నేటికీ సుమారు 4 కోట్ల మంది బడిఈడు పిల్లలు బడి ముఖం చూడలేదు.

1993లో సుప్రీంకోర్టు ఉన్నికృష్ణన్, మోహిన్‌జైన్ కేసులో పౌరుల ప్రాథమిక హక్కులకు ఎడబాటు కలిగే విధంగా ప్రభుత్వ పాలన ఉండ రాదని సూచించింది. 41వ ప్రకరణ ప్రకారం విద్యా హక్కును అమలులోకి తేనంతకాలం ప్రాథమిక హక్కులు నిరక్షరాస్యులకు అందుబాటులోకి రావు. జీవించే హక్కు అనే మాటలో జీవితానికి సంబంధించిన అన్ని హక్కులు మిళితమై ఉంటాయి. కనుక ఆ హక్కుల పునాదిపై గౌరవ ప్రదమైన జీవితాన్ని అనుభవించడానికి వీలవుతుంది. జీవించే హక్కు ద్వారా విద్యను పొందగలిగే హక్కు ప్రతి వ్యక్తి జీవితంలో ప్రవేశిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. సార్వత్రిక విద్య సాధనలో సాధించిన ప్రగతి నిరాశాజనకంగా ఉన్న నేపథ్యంలో అంతర్జాతీయ ఒత్తిడి, సుప్రీంకోర్టు తీర్పుల వలన కేంద్ర ప్రభుత్వానికి విద్యను ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం లో చేర్చవలసిన అనివార్య స్థితి వచ్చింది. ఫలితంగా 86వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా 2002లో గుర్తించింది. ఈ చట్టం సంచలనాత్మకమైన ఫలితాలను అందించగలదని ఆశించలేం. ప్రాథమిక విద్య ప్రాథమిక హక్కుగా మారినప్పటికీ, ఆస్తి ప్రాథమిక హక్కు అయినంతమాత్రాన అందరికీ ఆస్తి ఎలాగుండదో విద్య ప్రాథమిక హక్కుల్లో చేర్చినంత మాత్రాన బాలలందరూ విద్యావంతులు కాలేరు. ఎందుకంటే బాలలకు చదువు చెప్పించే బాధ్యతలను రాజ్యాంగంలో 51-కె అనే ప్రకరణాన్ని చేర్చడం ద్వారా తల్లిదండ్రులపై పెట్టింది. బాలబాలికలను చదివించే బాధ్యత ప్రభుత్వానిది కాక తల్లిదండ్రులదవుతుందని పేర్కొంది. రాజ్యాంగ చట్టంలో సవరణలు చేసినంతమాత్రాన ఈ విషయంలో ప్రగతిని సాధించగలమని అని చెప్పలేం. జీవించే హక్కు అందరికీ ఎలా జీవితాన్నివ్వదో అలాగే విద్యా హక్కు అందరికీ చదువునివ్వదు. విద్య రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా 2002లో చోటు సంపాదించుకున్నప్పటికీ, కార్యాచరణకు సంబంధించిన విద్యా హక్కు బిల్లు నేటికీ చట్ట రూపం దాల్చలేదు. విద్యాహక్కును అన్ని హక్కుల మాదిరిగానే కాలరాచే ప్రయత్నం జరుగుతోంది.

1990లో జోమితీన్‌లో ప్రపంచ విద్యాసదస్సు యునెస్కో ప్రపంచబ్యాంక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సదస్సులో వివిధ దేశాల విద్యామంత్రులు పాల్గొన్నారు. ఈ సదస్సు తర్వాత విద్యారంగంలో చాలా మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయి. అవి : (1) విద్య అంటే అక్షరాస్యతగా భావించడం, (2) అనియత విద్యకు నియత విద్యతో సమాన స్థాయి కల్పించడం, (3) రెగ్యులర్ ఉపాధ్యాయుల స్థానంలో విద్యావాలంటీర్లను నియమించడం, (4) 6-14 సంవత్సరాలకు బదులు 6-11 సంవత్సరాల వరకు సార్వత్రిక విద్యను పరిమితం చేయడం, (5) బహుళోపాధ్యాయుల స్థానంలో ఏకోపాధ్యాయ విధానాన్ని అమలు చేయడం, (6) ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులు బోధించే మల్టీగ్రేడ్ టీచింగ్ అమలు చేయడం. ఈ క్రమంలోనే పాఠశాల విద్యలోకి విదేశీ నిధులు ప్రవేశించడం, పాఠశాల విద్యను నియంత్రించడం, పాఠ్య ప్రణాళిక, విద్యాప్రణాళిక, బోధనాభ్యసనలో మార్పులు చేపట్టింది. ఈ విధానాలన్నింటినీ జిల్లా ప్రాథమిక విద్యా ప్రణాళిక (డిపెప్) ద్వారా 1992 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి తెచ్చారు. ఇందులో భాగంగానే విద్యా హామీ పాఠశాల, మళ్లీ బడికి, ప్రత్యామ్నాయ పాఠశాల, రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్, ఓపెన్ స్కూల్ లాంటివి ఉనికిలోనికి వచ్చాయి. వీటిలో బోధించే అంశాలు తక్కువ, బోధించే కాలం తక్కువ, బోధించే వారి స్థాయి తక్కువ, వేతనం తక్కువ. అంతిమంగా 2001-2002 విద్యా సంవత్సరం నుండి పై పాఠశాలలన్నింటిని సర్వశిక్షా అభియాన్ (ఎస్.ఎస్.ఎ) చట్రం కిందికి తీసుకువచ్చింది. 2003 నాటికి అందరినీ బడిలో చేర్చాలని, 2007 నాటికి ప్రాథమిక విద్య పూర్తి చేయాలని, 2010 నాటికి మాధ్యమిక విద్య పూర్తి చేయడంతో పాటు సంపూర్ణ నమోదు, సంపూర్ణ నిలుపుదల సాధించాలన్న లక్ష్యం నినాదంగానే మిగిలింది.

1980 దశకంతో పోల్చితే 1990 దశకంలో విద్యకు కేటాయింపు తగ్గింది. సర్వశిక్షా అభియాన్ కోసం 2004లో ప్రపంచబ్యాంక్ నుండి 4710 కోట్ల రుణం ప్రభుత్వం తీసుకుంది. ఈ కాస్త మొత్తానికే మన విద్యారంగ స్వావలంబనను వదులుకోవడానికి మన పాలకులు సిద్ధమయ్యారు. సెకండరీ పాఠశాల విద్యలో తెస్తున్న మార్పులు బడుగు బలహీన వర్గాలను విద్యకు దూరం చేసేవిగానే ఉన్నాయి. 500 మంది విద్యార్థులకు వసతిగల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 1200 మందిని చేర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ధరలు పెరుగుతున్నా వసతి గృహ నిర్వహణకు కేటాయింపులు పెంచడం

లేదు. గత నాలుగు దశాబ్దాలుగా మన రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రైవేట్ పాఠశాలలకంటే అగ్రభాగాన నిలిచాయి. అయితే గత సంవత్సరం నుండి గురుకుల పాఠశాలల్లో విద్యను బలహీనం చేసే విధానాలు అమలులోకి వచ్చాయి. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. కాని ఈ మాటలు ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతున్నాతీ.

విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి వారంలోనే విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించడం లేదు. విద్యార్థులు స్వంత డబ్బుతోనే నోట్‌బుక్స్ కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. రెండు మూడు నెలల తర్వాత అందిస్తున్నారు. అప్పటికే త్రైమాసిక పరీక్షలు సమీపిస్తున్నాయి. అందువల్ల పుస్తకాలు చదవకుండానే టీచర్లు చెప్పిన దాన్ని మాత్రమే విని విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. దీని వల్ల విద్యార్థులు చాలా నష్టపోతున్నారు. సకాలంలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

ఇక గురుకుల పాఠశాలల్లో తగినంతమంది ఉపాధ్యాయులు లేకపోవడం మరొక సమస్య. దాదాపు యాభైశాతం మంది కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నారు. ఈ కారణంగా విద్యార్థులకు సరైన బోధన అందించ లేకపోతున్నారు. మంచి ఫలితాలు సాధించాలంటే రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉంది.

మాతృభాషలో బోధనకు స్వస్తిపలికి, సాంస్కృతిక సామ్రాజ్య వాదాన్ని ప్రభుత్వ విద్యలోకి తెచ్చి బహుళజాతి సంస్థల అవసరాలను తీర్చడానికి 6,500 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గత సంవత్సరం ఆంగ్ల మాధ్యమంను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆరవ తరగతి నుండి సి.బి.ఎస్.ఇ. విధానంలోకి మార్చింది. అందుకు అవసరమైన తరగతి గదులు నిర్మించలేదు. ఉపాధ్యాయులను నియమించలేదు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించలేదు. సంపన్నుల పిల్లలు పూర్వ ప్రాథమిక స్థాయి నుండి ఆంగ్ల మాధ్యమంలో చదువుతుంటే, బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఆరవ తరగతి నుండి ఆంగ్ల మాధ్యమంలో బోధన జరపడం వలన వాళ్ల స్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారింది. మన రాష్ట్రంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యలో చొరబడడానికి బహుళజాతి సంస్థలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

గ్లోబలైజేషన్ నేపథ్యంలో రాజ్యం విధులు అన్నీ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నిర్వహిస్తోంది. మార్కెట్ పరంగా వస్తున్న మార్పులు సమాజ, రాజ్య సంబంధాలను శాసిస్తున్నాయి. మార్కెట్ అవసరాలనే సామాజిక అవసరాలుగా గుర్తించడంలో రాజ్యానికి, సమాజానికి మధ్య ఉన్న వైవిధ్యం తొలగిపోయి మార్కెట్ అవసరాలే సామాజిక అవసరాలుగా చలామణీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే విద్యను సామాజిక అవసరంగా గుర్తించే క్రమంనుండి వైదొలగి మార్కెట్ అవసరంగా విద్య గుర్తింపు పొందింది. అందువలననే విద్య సరకుగా మారి లాభసాటి వ్యాపారంగా అభివృద్ధి చెందింది. సమాజ, వ్యక్తి వికాసాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రజాతంత్ర వ్యవస్థ స్థానంలోనే సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్‌ల పేరుతో వ్యక్తి వికాసం ఎరగా దేశంలోని సంపన్నుల, విదేశీ కార్పొరేట్ల వికాసమే ధ్యేయంగా మన ఆర్థిక విధానాలు కొనసాగుతున్నందున స్వార్థ చింతన, సంపాదనే ధ్యేయంగా మన విద్యావిధానం కొనసాగుతోంది.

సామాజిక, ఆర్థిక అంతరాలను తొలగించడంలో విద్య పాత్ర అత్యంత కీలకమైందన్న గుర్తింపు మన రాజకీయాలకు లేకుండా పోయింది. పర్యవసానంగా సమాజంలోని భిన్నమైన సమూహాలకు భిన్నమైన విద్య, అంటే వ్యక్తుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను బట్టే విద్య అందుబాటులో ఉంది. మరోవైపు బడిబాట పట్టని బాలబాలికలు 13 – 18 సంవత్సరాల వయస్సుగల వారికి అనియత విద్యను నియత విద్య స్థానంలో ప్రవేశపెట్టింది. దీంతో విద్య అంటే అక్షరాస్యత అనే సంకుచిత భావన పాలకుల్లో కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. మన దేశంలో సామాజికార్థిక అంతరాలు తొలగిపోవాలనుకునే వారు, దేశ భవిష్యత్తు ప్రజాతంత్రయుతంగా ఉండాలనుకునే వారు, మానవ సంబంధాలు మానవీయంగా ఉండాలని కోరుకునే వారు, అందరికీ సమాన విద్య వకాశాలు కల్పించే విద్య కావాలనుకునే వారందరు విద్యా రంగంలో ప్రభుత్వ తిరోగమనాన్ని అడ్డుకునే ప్రత్యామ్నాయం కోసం ఉద్యమించాలి. వీ

మౌలిక వసతులు లేకపోవడం, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు మరల్చడం వంటి అనేక సమస్యలతో పాఠశాల విద్య నానాటికీ సంక్షోభంలో కూరుకుపోతోందంటున్నారు **కె. వేణుగోపాల్**

సంక్షోభంలో పాఠశాల విద్య

రాష్ట్రంలో 1 నుండి 10 తరగతులకు విద్యనందించే పాఠశాలలు వివిధ యాజమాన్యాల కింద ఉన్నాయి. విద్యా శాఖ నేరుగా నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలలు, ప్రభుత్వ సహాయం పొందుతూ ప్రైవేట్ యాజమాన్యాలు నిర్వహించే ఎయిడెడ్ పాఠశాలలు. ఇవి కాకుండా రెసిడెన్షియల్ పద్ధతిలో నడిచే మూడు రకాల గురుకుల పాఠశాలలు ప్రభుత్వరంగంలో ఉన్నాయి. వీటికి అదనంగా ప్రభుత్వ సహాయం పొందకుండా ప్రభుత్వ గుర్తింపుతో మాత్రమే నడిచే వేలాది ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాల లన్నింటిలో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌తో విద్యాబోధన జరుగుతోంది. సి.బి.ఎస్.ఇ. సిలబస్‌తో జవహర్ నవోదయ పాఠశాలలు పూర్తి రెసిడెన్షియల్ పద్ధతులలో కేంద్ర ప్రభుత్వంచే నిర్వహించ బడుతున్నాయి. అట్లే సి.బి.ఎస్.ఇ. సిలబస్‌లో నిర్వహించబడే కేంద్రీయ పాఠశాలలు కేంద్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది. సి.బి.ఎస్.ఇ./ఇ.సి.ఎస్.ఇ. సిలబస్‌లో బోధించే ప్రైవేట్ పాఠశాలలున్నాయి.

సిలబస్, ప్రభుత్వం ఒకటే అయినా యాజమాన్యాలు వేరుగా ఉండటం, విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు వేరుగా ఉండటం, ఆయా పాఠశాలలున్న ప్రాంతాల భౌతిక పరిస్థితులు వేరుగా ఉండటం, ఉపాధ్యాయులకు కల్పించే సౌకర్యాలలో తేడాలు ఉండటంతో ఈ విద్యార్థులకు అందే చదువులోని నాణ్యతలో కూడా తేడాలున్నాయి. ఇక స్టేట్ సిలబస్‌లో నడిచే ప్రైవేట్ పాఠశాలల పరిస్థితులలో కూడా అనేక తేడాలున్నాయి. ఇన్ని రకాల వైరుధ్యాలతో రాష్ట్రంలోని పాఠశాల విద్యారంగం ఉంది.

ప్రభుత్వరంగంలోని అన్ని పాఠశాలలు ప్రధానంగా తెలుగు మీడియంలో నిర్వహించబడుతున్నాయి. ఉర్దూ, మరాఠీ, కన్నడ, తెలుగు, తమిళం, ఒరియా, హిందీ మీడియంలలో కూడా కొన్ని పాఠశాలలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇంగ్లిష్ మీడియం ఉండే పాఠశాలలు కూడా ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలలన్నీ ఇంగ్లిష్ మీడియంలోనే ఉన్నాయి.

'భారతదేశ భవిష్యత్తు నేటి తరగతి గదుల్లో రూపుదిద్దుకొంటుంది' అని కొఠారీ కమిషన్ అభిప్రాయపడుతూ ఇన్ని వైరుధ్యాలతో పాఠశాల విద్య నిర్వహించడం సరికాదని భారత సమాజానికి అనువైన 'కామన్ స్కూల్ విధానం' అమలు చేయాలని సిఫార్సు చేసింది. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక తేడాలతో మత, కుల, ప్రాంత, లింగ భేదాలున్న మన దేశంలో చిన్నతనం నుండి విద్యార్థులకు వైరుధ్యాలతో కూడిన సమాజ అనుభవాన్ని అందించి, ఆ అనుభవంతో భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా ఎదగబోయే ఈనాటి విద్యార్థుల తరగతి గదులు కూడా భారత సమాజాన్ని ప్రతిబింబించే విధంగా 'కామన్ స్కూలు విధానం' ఉండాలని బలంగా అభిప్రాయపడింది. విద్యార్థుల అభ్యసనం సక్రమమైన రీతిలో ఉండడానికి సెకండరీ స్థాయి వరకు మాతృ భాషలో విద్యాబోధన జరగాలని ఆకాంక్షించింది. విద్య అందించడంలో అంతరాల ఫలితంగా భవిష్యత్తులో సమాజంలో కూడా ఆ అంతరాలు కొనసాగే అవకాశం ఉందని అంతరాలు లేని సమాజ రూపకల్పన చేయాలంటే అందరికీ సమానమైన విద్య సమాన అవకాశాలతో అందించాలని, అదీ ప్రభుత్వ రంగంలోనే అందించాలని నోబెల్ బహుమతి గ్రహీత ఆమర్త్యసేన్ కూడా అభిప్రాయపడ్డారు.

గత ఇరవై ఏళ్లుగా పాలకులు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో పాఠశాల విద్యారంగంలో కూడా అనేక మార్పులొచ్చాయి. ప్రభుత్వరంగంలోని పాఠశాలలు విపరీతంగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పాఠశాలల సంఖ్య పెంచలేదు. ఉపాధ్యాయులను నియమించలేదు. విద్యార్థులతో కిక్కిరిసిన తరగతి గదులతో విద్యా బోధన నామమాత్రమైంది. ప్రాథమిక పాఠశాలలో అయిదు తరగతులకు ఒక్క టీచరే బోధించే పరిస్థితులున్నాయి. చదువుతున్న మధ్యతరగతి వర్గం పెరగడంతో, తల్లిదండ్రులకు తమ పిల్లల చదువుపై ఆసక్తి పెరుగుతున్న తరుణంలో కుప్పలు తెప్పలుగా ప్రైవేట్ పాఠశాలలు వచ్చాయి. అనాకర్షణీయంగా, వసతుల లేమితో ఉండే ప్రభుత్వ పాఠశాలల నుండి మధ్య తరగతి వర్గం ప్రైవేట్ పాఠశాలలకు తరలడంతో ప్రభుత్వ పాఠశాలలు అల్పాదాయ వర్గాలకే పరిమితమైనాయి. అదే సమయంలో ఈ పాఠశాలలన్నీ ప్రభుత్వ అనాదరణకు గురికావడంతో పట్టించుకునే వారు లేక మరింత క్షీణించాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన అక్షరాస్యతా కార్యక్రమాలతో, ఎన్‌రోల్‌మెంట్ పెరిగింది. విదేశీ నిధులతో నిర్వహించబడే అనేక పథకాలూ అమల్లోకి వచ్చాయి.

విద్యార్థులకు అందుబాటులో పాఠశాలలుండాలనే భావనతో ఇబ్బడిముబ్బడిగా ప్రాథమిక పాఠశాలల సంఖ్య పెంచారు. సంఖ్య పెంచారు కాని భవనాల సంగతి, ఉపాధ్యాయుల నియామకాలు మరచిపోయారు. పెద్దయెత్తున ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలుగాను, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలగాను స్థాయి పెంచారు. స్థాయి పెరిగినకొద్దీ కావలసిన సౌకర్యాలు, ఉపాధ్యాయుల కొరత పెరిగింది.

అదే కాలంలో విదేశీ నిధులతో నిర్వహించే డి.పి.ఇ.పి., సర్వశిక్షా

అభియాన్ పథకాల ద్వారా అనేక కార్యక్రమాలు అమల్లోకి వచ్చాయి. ఇందులో ప్రధానంగా ఉపాధ్యాయుల కొరతకు ప్రత్యామ్నాయంగా 'బహుళ తరగతి బోధన' ఒక తాత్విక భావనగా ముందుకు తెచ్చారు. ఒకడే ఉపాధ్యాయుడు ఒకేసారి అనేక తరగతులకు బోధించడం, విద్యార్థులకు పూర్తి జ్ఞానాన్ని కాకుండా కనీస అభ్యసన పరిమితులలో బోధించడంపై ప్రాధాన్యత ఇవ్వడం పెరిగింది. వివిధ సబ్జెక్టులలో ఉపాధ్యాయులకు శిక్షణలు ఇవ్వడం, సమావేశాలు నిర్వహించడం, అనేక రకాల రిపోర్టులను పంపడమే విద్యాబోధనగా, ఉపాధ్యాయుల విధి నిర్వహణగా పరిగణించే స్థితికి వచ్చింది. అసలే ఉపాధ్యాయుల కొరత ఉండి, తరగతికో ఉపాధ్యాయుడు లేకుండా ఉన్న సమయంలో ఉన్న ఒకరిద్దరు టీచర్లు పాఠశాల పనిదినాల్లో బోధనేతర పనులలో నిమగ్నం కావడం తరగతిగదుల్లో విద్యాబోధనకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఫలితంగా పిల్లల చదువుపై చైతన్యం పెరిగిన తల్లిదండ్రులు పల్లెటూళ్ళకు కూడా అందుబాటులోనికి వచ్చిన ప్రైవేట్ పాఠశాలల వైపు మరలడం ప్రారంభమైంది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేకున్నా, సక్రమ పర్యవేక్షణ, తరగతికో ఉపాధ్యాయుడు ఉండడంతో బోధన సక్రమంగా సాగుతుందనే భావనతో ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మరలిపోయారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో క్షీణించిన పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కొరతతో విద్యాబోధన గాలికి వదిలివేయబడింది.

ప్రభుత్వ పాఠశాలల దీన స్థితికి కారణాలైన సౌకర్యాల కొరత, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం లేకపోవడం, పర్యవేక్షణాధికారుల కొరత, పాఠశాల పనిదినాల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులప్పగించడం వంటి సమస్యలకు అదనంగా క్లిప్స్, క్లాప్స్ లాంటి సమాంతర బోధనా కార్యక్రమాల అమలు కూడా తోడైంది. తరగతి పాఠ్య ప్రణాళికను ప్రక్కకు పెట్టి, కనీస అభ్యసనా సామర్థ్యాలను మాత్రమే క్లిప్స్, క్లాప్స్ ద్వారా బోధించడంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి 'పెనం లోంచి పొయ్యిలో పడ్డట్లు' అయింది. క్లిప్స్, క్లాప్స్ లాంటి కనీస అభ్యసన కార్యక్రమాలను ప్రవేశపెట్టడానికి కారణాలుగా విద్యార్థుల అభ్యసనం, విద్యా ప్రమాణాలు అతి తక్కువగా ఉండడం, చదవడం, రాయడం, కనీస గణిత ప్రమాణాలు లేకపోవడమని చెపుతున్నారు. దీనికి వివిధ సర్వేల ఫలితాలను కారణాలుగా చూపిస్తున్నారు. ఇన్ని కార్యక్రమాలు చేసినప్పటికీ గత ఏడెనిమిదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ పడిపోవడం గమనిస్తాం.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన లేకపోవడమే దీనికి కారణం అని సరికొత్త వాదన తెస్తున్నారు. మన పాఠశాలల్లో కూడా ఇంగ్లిష్ మీడియంలో తరగతులు ప్రారంభించడమే దీనికి పరిష్కారమని అంటున్నారు. విశాఖపట్టణం మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల లన్నింటిలో తెలుగు మీడియం రద్దు చేసి ఇంగ్లిష్ మీడియం తరగతులు ప్రారంభించడం, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి నుండి రెండేళ్ల క్రితం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, చివరకు 6,500 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో 6వ తరగతి నుండి ఇంగ్లిష్ మీడియంలో అదనపు తరగతులు ప్రారంభించడం జరిగింది. 4 లేదా 5 తరగతుల వరకు తెలుగు మీడియం చదివి ఒకేసారి ఇంగ్లిష్‌లో అన్ని సబ్జెక్టులు చదవడం విద్యార్థికి తలకు మించిన భారమవుతుందనే విషయం విద్యాశాఖ ఉద్దేశ్యపూర్వకంగా పట్టించుకోలేదు. ఈ 6,500 ఉన్నత పాఠశాలలను 'సక్సెస్' పథకం కింద అభివృద్ధి చేస్తామంటూనే మిగిలిన 4 వేల ఉన్నత పాఠశాలలకు స్వచ్ఛంద మరణం ప్రసాదించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. పైగా 4 వేల అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లోని 6, 7 తరగతులను రద్దు చేసి, సమీప సక్సెస్ పాఠశాలకు తరలించడంతో 5వ తరగతి తర్వాత పక్క గ్రామంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులకు అందుబాటులో పాఠశాలలు ఉండడం ద్వారా ఎన్‌రోల్‌మెంట్ పెంచవచ్చుననేది నిపుణుల అభిప్రాయం. అందుకు భిన్నంగా 'సక్సెస్' పథకంలో పాఠశాలల కుదింపు జరగడంతో డ్రాపౌట్ల సంఖ్య పెరగడంతో పాటు, స్తోమత ఉన్నవారు అందుబాటులోని ప్రైవేట్ పాఠశాలలకు తరలిపోయారు. ఒక్కొక్క 'సక్సెస్' పాఠశాలను కోటి రూపాయల ఖర్చుతో భౌతిక వసతులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ లాబొరేటరీ తదితర సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులను నియమిస్తామని ప్రభుత్వం ప్రచారం చేసింది. కాని గత సంవత్సర కాలంలో ఈ పాఠశాలలకు ఒక్క రూపాయి కూడా అదనంగా మంజూరు కాలేదు. కాని అదనంగా ప్రారంభించిన ఇంగ్లిష్ మీడియం 6వ తరగతి వరండాలో నడిపారు. విద్యా సంవత్సరం ప్రారంభైన మూడు నెలల దాకా ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు పాఠశాలలకు చేరలేదు. కొత్త విద్యా సంవత్సరం కూడా అవే సమస్యలతో ఇంగ్లిష్ మీడియం తరగతులను నిర్వహించాల్సివస్తోంది.

గత సంవత్సరం 'సక్సెస్' పాఠశాలలకు 33 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, నాలుగు వేల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసిన ప్రభుత్వం, అదే సమయంలో 20 వేల సెకండరీ గ్రేడ్ పోస్టులను రద్దు చేసింది. ఈ సెకండరీ పోస్టులన్నీ ప్రాథమిక పాఠశాలల్లోని పోస్టులే. ఈ పోస్టుల రద్దు ద్వారా 20 వేల ప్రాథమిక పాఠశాలలన్నీ 'ఏకోపాధ్యాయ' పాఠశాలలుగా నిర్వహించబడుతాయి. ఏ ప్రాథమిక పాఠశాల కూడా ఏకోపాధ్యాయ పాఠశాలగా నిర్వహించరాదన్న కేంద్ర ప్రభుత్వ విధానానికి ఈ చర్య విరుద్ధం. ఏకోపాధ్యాయ పాఠశాలల వలన ప్రాథమిక విద్య మరింత నిర్వీర్యం కానున్నది.

సకాలంలో పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేయకపోవడంతో, స్థాయి పెరిగిన పాఠశాలలకు అవసరాల మేరకు కొత్త పోస్టులు మంజూరు చేయకపోవడంతో ముఖ్యమైన సబ్జెక్టులు బోధించే టీచర్లు లేక ఉన్నత పాఠశాలల్లో విద్యా బోధనకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనికి పరిష్కారంగా 'విద్యా వాలంటీర్ల' పేరుతో పారా టీచర్ల వ్యవస్థ ముందుకు వచ్చింది. రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 65 వేల మంది విద్యా వాలంటీర్లు పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడికి కావలసిన అర్హతలు లేకున్నా, తగిన శిక్షణ లేకున్నా విద్యా వాలంటీర్ల పేరుతో బోధన సాగుతోంది. వీరికిచ్చే వేతనాలు రు. 1500 నుంచి రు. 2500 మాత్రమే. అదీ సకాలంలో ఇవ్వరు. పైగా వీరిని సకాలంలో నియామకాలు చేయరు. ఈ పరిస్థితుల్లో ఒడిదుడుకులతో విద్యా సంవత్సరాన్ని అయిందనిపిస్తే విద్యా ప్రమాణాల సంగతి పట్టించుకునేదెవరు?

నవోదయ విద్యాలయాల స్థాపనకు మార్గదర్శకమైన గురుకుల విద్యా వ్యవస్థ పరిస్థితి ప్రభుత్వ పాఠశాలలకు భిన్నంగా లేదు. గత

నలభై ఏళ్లుగా ప్రభుత్వరంగంలో నిర్వహించే రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో సకాలంలో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో కాంట్రాక్ట్ పద్ధతిలో, దినసరి వేతనంతో ఉపాధ్యాయులను నియమించి బోధన జరిపిస్తున్నారు. రెగ్యులర్ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించక పోవడంతో జవాబుదారీతనం లోపించడం, రెండేళ్ల క్రితం తెలుగు మీడియంను రద్దు చేసి, ఇంగ్లీష్ మీడియం ప్రారంభించడంతో గురుకుల పాఠశాల వ్యవస్థ కూడా సంక్షోభంలో ఉంది. మంచి ఫలితాలిస్తున్న గురుకుల పాఠశాలలను అభివృద్ధి చేయడానికి బదులుగా ఈ వ్యవస్థకు సమాంతరంగా కాన్సెప్ట్, గ్రామీణ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రైవేట్ యాజమాన్యం భాగస్వామ్యంతో ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచించింది. అయితే తాత్కాలికంగా ఆ ప్రతిపాదన కనుమరుగైనా, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించబోయే మోడల్ పాఠశాలల్లో గురుకుల విద్యావ్యవస్థ మరోసారి సంక్షోభంలో పడనున్నది.

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాఠశాల విద్యలో సరికొత్త వివాదానికి తెరలేపింది. పాఠశాల విద్యను ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్యగా విడగొట్టి ఇంటర్ విద్యను మాధ్యమిక విద్యను కలిపేసింది. 1 నుండి 5 తరగతులలో ప్రాథమిక పాఠశాలలు, 1 నుండి 7 తరగతులలో అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 6 నుండి 10 తరగతి వరకు సెకండరీ పాఠశాలలు ఉన్న పాఠశాల విద్యలో ఇక నుండి 1 నుండి 5 తరగతులలో ఉండే ప్రాథమిక విద్య వేరుగా నిర్వహిస్తే, అప్పర్ ప్రైమరీ పాఠశాలల భవిష్యత్తు ఈ విధానంతో ప్రశ్నార్థకం కానుంది. గత సంవత్సరం 'సక్సెస్' పాఠశాలల్లో 6, 7 తరగతులను విలీనం చేయడం ద్వారా 4 వేల అప్పర్ ప్రైమరీ పాఠశాలలను రద్దు చేసింది. ప్రస్తుతం ప్రాథమిక విద్య విభజనతో మరో 3 వేల అప్పర్ ప్రైమరీ పాఠశాలలు రద్దైతే 6, 7 తరగతుల చదువు కోసం 10 ఏళ్ళ వయసులో పిల్లలు పక్క గ్రామాలకు వెళ్లలేక డ్రాపౌట్లు అయ్యే ప్రమాదాన్ని గుర్తించడం లేదు. పాఠశాల స్థాయిలో 1వ తరగతిలో చేరే పిల్లల్లో 35 శాతం మంది మాత్రమే పదోతరగతికి చేరుతున్న పరిస్థితుల్లో 6, 7 తరగతుల రద్దుతో పరిస్థితి మరింత క్షీణించే అవకాశం ఉంది. మరోవైపు కొత్తగా ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి చదువుకుందాం . . . . రా, బడి బాటలు, వేసవి బడులు, సామూహిక అక్షరాభ్యాసాలు బడి బయట ఉన్న 4 లక్షల మంది పిల్లలను పాఠశాలలకు మరల్చలేకపోతున్నాయి.

ఒకవైపు అనేక యాజమాన్యాల, వాటి మధ్య వైరుధ్యాలు, రెండోవైపు అసౌకర్యాలు, ఉపాధ్యాయుల సర్వీసు సమస్యలను, పదోన్నతుల సమస్యలను పరిష్కరించక, సమస్యలను కోర్టులకప్పగించి ఖాళీలను భర్తీ చేయక విద్యాభివృద్ధి సాధిస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోంది. మరోవైపు ప్రైవేట్ పాఠశాలలకు గుర్తింపు నిబంధనలను విపరీతంగా సరళీకరించింది. పాఠశాలలకు అనుబంధంగా ఉండాల్సిన ఆట స్థలాలను సుదూరంగా ఉన్నా ఫరవాలేదంటూ, ఒకేసారి పదేళ్ల వరకు, పది తరగతులకు గుర్తింపు ఇస్తోంది. మామూలు ప్రైవేట్ పాఠశాలలకు అదనంగా కాన్సెప్ట్, ఇంటర్నేషనల్, టెక్నో స్కూళ్ళు వచ్చి మొత్తం విద్యా వ్యవస్థ అనేక అంతరాలతో డబ్బుతో మాత్రమే విద్య కొనగలిగే పరిస్థితి వచ్చేసింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లోనికి మామూలు మధ్య తరగతి తల్లిదండ్రులు పోలేని విధంగా ఫీజుల మోత పెరిగి ఆ చదువు కూడా అందుబాటులోనికి రాకుండా పోయింది.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించి అదుపు చేయాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. 1994లో జారీ చేసిన జీ.వో. 1 లోని అంశాలను అమలు చేసినా ఫీజులను అదుపులో ఉంచే అవకాశం ఉంది. పైగా ఆ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు వసూలైన ఫీజులో 85 శాతం చెందేలా నిబంధనలు అమలు చేస్తే, ఉపాధ్యాయులకైనా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ఆ పని కూడా ప్రభుత్వం చేయక ప్రేక్షక పాత్ర వహిస్తోంది. ఇంజనీరింగ్ విద్య కంటే ఎక్కువ ఫీజులు వసూలు చేసే ఈ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా నాణ్యత 'నేతి బీరకాయలోని నేయి' చందంగా ఉన్నట్టు 'అసర్' నివేదికలు వెల్లడిస్తున్నాయి. సుమారు 46 శాతం మంది విద్యార్థులకే చదవడం, రాయడంలో పట్టు ఉన్నట్లు ఆ నివేదిక ఫలితాలు చెపుతున్నాయి. ఓవైపు అధిక ఫీజుల మోత, రెండోవైపు నాణ్యత లేని విద్య ప్రైవేట్ పాఠశాలల్లో ఉంటే, ప్రభుత్వ పాఠశాలల దయనీయ స్థితి పాఠశాల విద్యారంగాన్ని సంక్షోభంలో పడేసింది.

గత నాలుగైదేళ్లుగా ప్రభుత్వమే అంతరాలతో కూడిన విద్యను చట్టబద్ధం చేస్తూ, ప్రభుత్వ నిధులను ప్రైవేట్ యాజమాన్యాలకు తరలించడానికి అనేక ప్రతిపాదనలు ముందుకు తెచ్చినా ఉపాధ్యాయుల, విద్యార్థుల, విద్యావేత్తల, విద్యాభిమానుల ప్రతిఘటనతో అమలు కాలేదు. ప్రభుత్వమే కాన్సెప్ట్ స్కూళ్ళను, గ్రామీణ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రైవేట్ భాగస్వామ్యంతో, ఇంగ్లీష్ మీడియంలో ప్రారంభించి గ్రామీణ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించే పేరుతో ప్రభుత్వం ఆలోచించింది. ప్రభుత్వరంగంలోని రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థను పటిష్టం చేయకుండా, ఖాళీ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయకుండా వాటిని బలహీనం చేయడానికే ఈ సరికొత్త ప్రతిపాదన ప్రభుత్వం తెచ్చిందనేది బహిరంగ రహస్యం. రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో, పని భారాన్ననుసరించి తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించిన మొదటి విద్యా వ్యవస్థ రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థ.

కేంద్ర ప్రభుత్వ విధానాలు కూడా ఇందుకు భిన్నంగా లేవు. ఇప్పటికే జిల్లాకో జవహర్, నవోదయ విద్యాలయాలు ప్రారంభించిన కేంద్రం, ఇప్పుడు సరికొత్తగా 6000 మోడల్ స్కూళ్ళను స్థాపించి 'విద్యాభివృద్ధి' చేస్తామంటోంది. అందులో 2500 స్కూళ్లను ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహిస్తారు. సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలను అయిదేళ్ళ కాలంలో లక్ష కోట్లను మోడల్ స్కూళ్ళపై వెచ్చించడానికి పదకొండో ప్రణాళికలో ప్రతిపాదించారు. ఇది గతంలో మన రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కాన్సెప్ట్ స్కూళ్ళ ప్రతిపాదన లాంటిది. మన ప్రభుత్వాలు పాఠశాలల్లో పబ్లిక్ రంగానికన్నా ప్రైవేట్ రంగానికే ప్రాధాన్యతనిస్తూ చదువును అంగట్లో సరకు చేస్తూ అందరికీ విద్యను మిథ్య చేయనున్నాయని విశదమవుతోంది. అదే కాకుండా తల్లిదండ్రులకు తమ పిల్లలు చదివే పాఠశాలను ఎంపిక చేసుకోవడానికి, స్వేచ్ఛనిస్తూ ఏ పాఠశాలలోనైనా తమ పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చేరిస్తే ఆ ఫీజును తిరిగి చెల్లించడానికి 'వోచర్ పద్ధతి'ని అమలు చేయాలనే యోచన పదకొండో పంచవర్ష ప్రణాళికలో చేస్తోంది. అంటే భవిష్యత్తులో ప్రభుత్వ నిధులన్నీ ప్రైవేట్ యాజమాన్యాలకు తరలించి, ప్రభుత్వ పాఠశాలలకు నిధులు లేవని, సౌకర్యాలు కల్పించలేమని చేతులెత్తేసే ప్రమాదం పొంచి ఉంది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలన్నీ విద్యార్థులు లేక మూతపడి మెజారిటీ నిమ్న ఆదాయ వర్గాలు మరోసారి చదువుకు దూరమయ్యే ప్రమాదం ఎంతో దూరం లేదు. వీ

ప్రజావ్యతిరేక విధానాల అమలులో పాలకులకున్న ఐక్యత, వాటిని ప్రతిఘటించడంలో ప్రజలలో లోకపోవడం వల్లనే విద్యారంగం కూడా అధోగతి పాలవుతోందంటున్నారు **పి. కృష్ణారావు**

చిక్కి శల్యమౌతున్న ప్రభుత్వ పాఠశాలలు

1947 అధికార మార్పిడికి ముందు, తరువాత మన దేశంలో పాఠశాలలు అటు ప్రభుత్వరంగంలోనూ, ఇటు ప్రైవేట్ రంగంలోనూ నడిచేవి. ముఖ్యంగా బ్రిటిష్ వారి పరిపాలనా కాలంలో క్రైస్తవ మిషనరీ పాఠశాలలు ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగిస్తూ, ప్రైవేట్ రంగంలో నడుపబడేవి. అదే విధంగా హైదరాబాద్ సంస్థానం లాంటి వాటిలో ముస్లింలు మదరసాలు నడిపేవారు. ఏది ఏమైనప్పటికీ ఎక్కువ శాతం పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ రంగంలో నడిచేవి. 1947 అధికార మార్పిడి తరువాత మన రాష్ట్రంలో గానీ, హైదరాబాద్ సంస్థానంలో గానీ, ముఖ్యంగా పట్టణాలలో (ఉదాహరణకు, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ మొదలైన) ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు ఎక్కువగా నెలకొల్పబడి, తదనంతరం ప్రభుత్వ ఎయిడ్‌తో కొంతవరకు సేవాభావాన్ని కలిగి ఉంటూ విద్యనందించేవి. అయితే మన పాలకవర్గాల రాజకీయ, ఆర్థిక విధానాలు వలసవాదం నుంచి అర్ధవలస వాదానికి, అర్ధవలసవాద విధానాలు నుంచి నయా వలస వాద విధానాలకు రూపాంతరం చెందుతూ వచ్చాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు విద్యారంగంలో కూడా ప్రవేశించాయి. ఇవి 1991 నుంచి మరింతగా ఊపందుకున్నాయి.

ముందుగా ఉన్నత, సాంకేతిక, వృత్తి విద్యలను ప్రైవేటీకరించి, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశాయి. 2000 తరువాత ప్రాథమిక, సెకండరీ విద్యను ప్రైవేటీకరించడం మొదలుపెట్టాయి. ఒకవైపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు, నియామకాల ప్రక్రియను కౌన్సిలింగుల ద్వారా సరళతరం చేస్తూనే, మరోవైపు విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని పెంచుతూ, పోస్టుల క్రమబద్ధీకరణ పేరుతో ప్రతి సంవత్సరం వేలాది పోస్టులు ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో రద్దు చేయడం, తరలించడం జరిగిపోతోంది. మన విద్యా శాఖాధికారులు ఒకవైపు ఎప్పెప్ (ఎ.పి.పి.ఇ.పి.), డిప్పెప్ (డి.పి.ఇ.పి.), సర్వశిక్షా అభియాన్ (ఎస్.ఎస్.ఎ.) వంటి పథకాలు, వినూత్న కార్యక్రమాలతో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతామని చెబుతున్నప్పటికీ, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల మూసివేత దిశగా ప్రయాణం సాగిస్తున్నాయి. ఇందుకు గల కోణాలను చర్చించకుండా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ చర్యలు తీసుకోవడం సాధ్యంకాదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాల వలన ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి రోజురోజుకి పడిపోతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2002-03 విద్యా సంవత్సరంలో 98.5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువగా, 2007-08 విద్యా సంవత్సరం నాటికి 81.49 లక్షల మందికి తగ్గిపోయారు. అదే పరిస్థితులలో ప్రైవేట్ పాఠశాలల్లో 31 లక్షల మంది విద్యార్థుల నుంచి 47.89 లక్షల విద్యార్థులకు పెరిగారు. ఈ సంఖ్య రోజురోజుకి ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతుంటే, ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతోంది. ఇందుకు ప్రభుత్వం చెబుతున్న కారణాలు చాలా విచిత్రంగా ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆంగ్ల మాధ్యమం పట్ల మక్కువ, ఉపాధ్యాయులు సక్రమంగా పనిచేయకపోవడం మొదలగునవి ప్రధాన కారణాలుగా ప్రచారం జరుగుతోంది. నిజానికి ఇవి పాక్షిక కారణాలే.

బ్రిటిష్ కాలం నుంచి ఆంగ్ల మాధ్యమం పాఠశాలలు ఉన్నప్పటికీ ఇటువంటి పరిస్థితిగానీ, ఇంతటి దుష్ప్రచారం గానీ (టీచర్లపైన) జరుగలేదు. పాలకులు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ మంత్రం జపించడం మొదలు పెట్టినప్పటి నుంచి, ప్రభుత్వ పాఠశాలలను బలహీనం చేసి, ప్రైవేట్ పాఠశాలలను బలోపేతం చేయ సంకల్పించినప్పటి నుంచి ప్రభుత్వం టీచర్లపైన దుష్ప్రచారం మొదలుపెట్టింది. ఇందులో కొంత టీచర్ల తప్పిదాలు, బాధ్యతారాహిత్యం ఉంటున్నప్పటికీ, వాటిని భూతద్దంలో పెట్టి చూపడం జరుగుతోంది. ముఖ్యంగా ఉద్యోగ అవకాశాల పట్ల ప్రభుత్వ విధానాలు, కార్పొరేట్ రంగ విధానాలు, ఆంగ్ల భాషా నైపుణ్యం పట్ల ప్రాధాన్యత పెరగడం వలన విద్యార్థుల తల్లిదండ్రులలో తమ పిల్లలకి ఆంగ్ల భాష వస్తే తప్ప ఇక భవిష్యత్తులో మనుగడలేదన్న భయాందోళనలు ఏర్పడడం వలన వారు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు ప్రధాన బాధ్యత ప్రభుత్వానిదే కానీ, విద్యార్థుల తల్లిదండ్రులది కాదు. ఇటువంటి బాధ్యతల నుంచి తప్పుకోవడానికే మన పాలకులు చూస్తున్నారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం, పాఠశాల వసతి, ఫర్నిచర్, లైబ్రరీ, మరుగుదొడ్లు, నీటి వసతి మొదలైనవి లేకపోవడం, విద్యా సంవత్సరం ముందుగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం, విద్యా వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించడం వంటి కారణాలను ప్రధానంగా చెప్పవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వ విద్యా చట్టం - 1980 ప్రకారంగా గానీ, విద్యా మాన్యువల్ ప్రకారంగా గానీ ప్రైవేట్ పాఠశాల నియంత్రణ కోసం జారీ చేసిన జి.ఒ. నెం. 01 ప్రకారంగా గానీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఒకే సిలబస్, కరిక్యులమ్, సెలవు నిబంధనలు, గుర్తింపు మొదలైనవి వర్తిస్తాయి. కానీ ఆచరణలో ఇవేవీ ప్రభుత్వ పాఠశాలల వలే ప్రైవేట్ పాఠశాలలు పాటించడం లేదు. చివరకు విద్యార్థుల వద్ద వసూలు

చేస్తున్న ఫీజుల విషయంలో కూడా ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు. సిలబస్ విషయానికి వస్తే కచ్చితంగా తెలుగు భాషను ఒక విషయంగా బోధించాలి, కానీ చాలా ప్రైవేట్ పాఠశాలలు తెలుగుకి బదులుగా సంస్కృతం బోధిస్తున్నాయి. కరిక్యులమ్ విషయంలో అవి పూర్తిగా నిబంధనలను ఉల్లంఘించి, ఇతర విషయాలను బోధిస్తున్నాయి. ఇక పరీక్షలు, సెలవుల పాటింపు వాటి ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించినా, మరోవైపు వాటి పక్కనున్న ప్రైవేట్ పాఠశాలలు పనిచేస్తూ ఉంటాయి. అయినప్పటికీ వాటిపైన మండల, జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికార్లు ఎటువంటి చర్యలు తీసుకోలేరు. కారణం రాజకీయ ఒత్తిళ్లు, మరోవైపు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి వస్తున్న లంచాలు వెరసి విద్యాశాఖ అధికార్ల నోళ్లు మూతబడుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు ఎప్పుడూ సెలవుగా కన్పించడం వలన విద్యార్థుల తల్లిదండ్రులలో ఒక వ్యతిరేక భావం ఏర్పడుతోంది. ఇక ప్రభుత్వ ఉపాధ్యాయులకు అదనంగా ఇస్తున్న సెలవులు, బోధనేతర కార్యక్రమాలు కలిపి విద్యా బోధన కుంటుపడుతోంది. ప్రైవేట్ పాఠశాలలకున్న స్వేచ్ఛ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని విధాలుగా లేకపోవడం వలన ప్రభుత్వ పాఠశాలలు చిక్కి శల్యమౌతున్నాయి. దీనికంతటికీ కారణం మన పాలకవర్గాల వివక్షాపూరితమైన విధానాలే.

2008-09 విద్యా సంవత్సరంలో మన రాష్ట్ర ప్రభుత్వం జి.ఒ.76 ద్వారా 6500 ఉన్నత పాఠశాలలను సక్సెస్ పాఠశాలలుగా మార్చింది. ఈ పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టి, ఆంగ్ల మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టింది. ఇది మాతృభాషలో బోధనను కాదని ఆంగ్ల మాధ్యమంలో బోధించడం వలన జాతుల భాష, సంస్కృతి వికాసానికి గొడ్డలిపెట్టు. జాతుల వికాసం వారి మాతృభాషలో బోధన జరిగినప్పుడే సాధ్యపడుతుంది. ప్రపంచ చరిత్రలో చైనా, రష్యా, జపాన్, జర్మనీ, ఇటలీ మొదలైన దేశాలు ఇప్పటికీ వాటి మాతృభాషలో బోధనా ప్రక్రియను కొనసాగించడం వలన అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించాయి. కానీ కొద్దిపాటి కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం మొత్తం జాతిని బలిచేయడం దుర్మార్గమైన చర్య. ఇందుకోసమే భారత పాలకవర్గాలు పూనుకొని సక్సెస్ పాఠశాలలను నెలకొల్పాయి.

2009-10 విద్యా సంవత్సరంలో సక్సెస్ పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జిటి లను, రోలు 30 లోపుగల ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్‌జిటి పోస్టులను ఉన్నతీకరించి సుమారు ఇరవై వేల పోస్టులను రద్దుచేసి, వాటిలో గల అర్హతగల టీచర్లకి ప్రధానోపాధ్యాయులుగాను, స్కూల్ అసిస్టెంట్లు గాను పదోన్నతులు ఇచ్చింది. ఫలితంగా టీచర్లకి పదోన్నతులు పెద్ద ఎత్తున వచ్చాయని సంతోషపడాలో, లేక సుమారు పన్నెండు వేల ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని బాధపడాలో అర్థం కావడం లేదు. దూర దృష్టితో చూసినట్లయితే మరో పది సంవత్సరాలలో ప్రాథమిక పాఠశాలలు చాలా వరకు మూతపడడానికి మృత్యుద్వారాలు సక్సెస్ పాఠశాలల ద్వారా తెరవబడినాయని చెప్పవచ్చు. ఇక ప్రాథమిక పాఠశాలలు మూతపడితే సక్సెస్ పాఠశాలల్లో కూడా విద్యార్థుల రోలు తగ్గిపోతుంది. అప్పుడు పూర్తిగా ప్రాథమిక, సెకండరీ పాఠశాలలన్నీ మూతపడి, మొత్తం ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యార్థుల మళ్లింపు జరుగుతుంది. ఇదంతా పాలకులు ముందస్తు కుట్రతో పోస్టుల తరలింపు, ఉన్నతీకరణ, రద్దుల వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారని చెప్పవచ్చు.

1990ల తరువాత విద్యారంగ ప్రైవేటీకరణ పట్ల మన దేశంలో, రాష్ట్రంలో గల రాజకీయ పార్టీలు (పార్లమెంటరీ) అన్నీ ఒకే విధమైన వైఖరిని కలిగి ఉన్నాయని చెప్పవచ్చు. ఇవి అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగాను, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో రకంగాను మాట్లాడడం జరుగుతోంది తప్ప, అన్ని పార్టీలు ప్రపంచబ్యాంక్ విధానాలకు అనుగుణంగా విద్యారంగ ప్రైవేటీకరణ కొనసాగిస్తున్నాయి. ఆయా పార్టీల గ్రామ సర్పంచ్‌ల నుంచి మంత్రుల వరకు వారు, వారి సంబంధీకులు విద్యా వ్యాపారాన్ని మూడు పువ్వులు - ఆరు కాయలుగా పండించుకుంటున్నారు. అందువల్లనే వారు ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోవడం లేదు. ఒకవేళ పట్టించుకొన్న స్కూల్ గ్రాంట్స్ కోసమో, తరగతి గదుల కాంట్రాక్ట్ కోసమో తప్ప, వాస్తవానికి ఆయా పాఠశాలల అభివృద్ధి కోసమో, పిల్లల రోలు పెంచడం కోసమో అయితే మాత్రం కాదు. ఇదీ వీరి పరిస్థితి.

మనదేశంలోని, రాష్ట్రంలోని విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు మొదటి నుంచి విద్యారంగం పట్ల కొంత ఆలోచించి, సదస్సులు, ధర్నాలు వంటి కార్యక్రమాలను నిర్వహించాయి. ముఖ్యంగా వామపక్ష భావజాలం గల సంఘాలు కొంత చురుకైన పాత్రను పోషించాయి. వీరు ప్రజలను ఆయా కార్యక్రమాలలో భాగస్వామ్యం చేశారు. కానీ వీటికి వెలుపల వివిధ పాలకవర్గ పార్టీలు, ప్రజాసంఘాలతో విశాలమైన జనబాహుళ్యం ర్యాలీ అవుతున్నాయి. ఈ జన బాహుళ్యంలోని ప్రజా సమూహాలు విద్యారంగంలో వస్తున్న పెడధోరణులకు వ్యతిరేకంగా స్పందించడం లేదు. లేదా కొన్ని సందర్భాలలో పాలకవర్గాలకు వత్తాసు పలుకుతున్నాయి. ఉదాహరణకు, జి.ఒ. 76ను కొంతమంది దళిత మేధావులు సమర్థించారు. వారు ఆంగ్ల మాధ్యమాన్ని ఆహ్వానించారు. కానీ అదే మేధావులు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధం కాలేదు. కొన్ని సంస్కరణలను దళితుల కోసం ప్రతిపాదిస్తున్నారు. ఇదంతా ఏం తెలియజేస్తోందంటే మౌలికమైన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణను వ్యతిరేకించకుండా, పైపై సంస్కరణలను ఆహ్వానించడం వలన ఫలితం కనిపించడం లేదు.

అంతేకాకుండా, భూస్వామ్య, పెట్టుబడిదారీ ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, వాటి ప్రజా సంఘాల మధ్య ఉన్న భావసారూప్యత, శ్రామిక, దళిత వర్గ, కులాల మధ్య లేకపోవడం కూడా ప్రభుత్వ రంగ పాఠశాలల పరిరక్షణకి గొడ్డలిపెట్టుగా ఉంటున్నది. మరో ముఖ్యమైన కారణం ఏమంటే, భారతదేశ శ్రామిక, దళిత, ఆదివాసీ వర్గాలకు, కులాలకు వెన్నుదన్నుగా నిలువ వలసిన వామపక్ష ఉద్యమం గత మూడు దశాబ్దాలుగా అనేక చీలికలకు గురికావడం, అంతర్జాతీయంగా వామపక్ష కేంద్రం బలహీనపడడం వలన సామ్రాజ్యవాద, దళారీశక్తులు పుంజుకోవడం జరిగింది. ఫలితంగా ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒ సంస్థల నేతృత్వంలో పెట్టుబడిదారీ శక్తులు ప్రైవేటీకరణను నల్లేరుపై బండిలా కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకోసం, ప్రైవేట్‌రంగ పాఠశాలల స్వాధీనం కోసం ప్రజలు, ప్రజాసంఘాలు అన్నీ విశాల ప్రజాసంఘటనగా ఏర్పడి, కొఠారీ కమిషన్ చెప్పినట్లుగా 'కామన్ స్కూల్ విధానం' కోసం గొప్ప పోరాటాన్ని చేసినప్పుడు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలను పునరుజ్జీవింప చేసుకోగలం. వీ

ప్రాథమిక విద్యకు ఉద్దేశ్యపూర్వకంగా తూట్లు పొడిచి వయోజన విద్యకు పూనుకోవడం పాలకుల చిత్తశుద్ధి లేనితనాన్ని సూచిస్తోందంటున్నారు **విద్యాభూషణ్**

పరిమిత లక్ష్య దిశలో పాఠశాల విద్య

నిర్బంధ ప్రాథమిక విద్యను మన పాలకులు అమలు పరచనంత వరకూ అక్షరాస్యత వృద్ధిలోకి రాదు. ఫలితంగా విద్యావ్యాప్తి కేవలం కాగితాలకే పరిమితం. గత అరవై రెండు ఏళ్ల స్వతంత్ర పాలన వ్యక్తం చేస్తున్న అక్షర సత్యం ఇది. ఎన్ని కమిషన్లు సూచించినా, ఎన్నిసార్లు నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేయనున్నట్లు ప్రభుత్వాలు ప్రకటించినా ఆచరణలోకి రావడం మాత్రం కుదరదు. ఎందుకంటే 'కుల రాజకీయాలు' రాజ్యమేలుతున్న పచ్చి ఫ్యూడల్ వ్యవస్థ మనది. రాజ్యాంగంలో 'సోషలిస్ట్ రిపబ్లిక్' అనే లేబిల్‌ను అలంకార ప్రాయంగా పెట్టుకుని, ఆచరణలో కుల ప్రాతిపదికన, వర్గ రాజకీయాలను బలోపేతం చేస్తున్న వాస్తవం మన ముందు ఉంది. ఫలితంగానే కులాలు – ఉపకులాల 'రిజర్వేషన్‌ల' జాబితాలో ప్రతీ ఎన్నికకూ అదనంగా కులాలు వచ్చి చేరుతూనే ఉన్నాయి. రిజర్వేషన్‌ల కోసం కులాంతర, మతాంతర మార్పిళ్లనూ యథేచ్ఛగా ప్రోత్సహించే అధికార లక్ష్య రాజకీయ పార్టీలు కొత్తగా పురుడు పోసుకుంటునే ఉన్నాయి. ప్రజల 'అవిద్య – అజ్ఞానం' ఓట్లు దండుకోవడానికి అనువైన సోపానాలుగా గత చరిత్ర రుజువు చేసింది. అందుకే ప్రజలు నిరక్షరాస్యులుగా ఉంటేనే పాలకులు ఆడింది ఆట – పాడింది పాటగా కొనసాగగలదన్న వాస్తవం ఈ ఫ్యూడల్ రాజకీయానికి తెలిసినంతగా మరింకెవ్వరికీ తెలీదు. అందుకే 'ప్రపంచీకరణ' నేపథ్యంలో ఎంతగా అక్షరాస్యతా లక్ష్య సాధనకై గొంతు చించుకుంటున్నా, ఆచరణ గడపదాటని దిశగా మన ప్రభుత్వ విధానాలున్నాయ్. వర్ణవ్యవస్థకు పునాదిగా ఉన్న వర్గ వ్యవస్థను తొలగించనంతకాలం, పేదరికం కానీ, దీన్నే అంటిపెట్టుకున్న నిరక్షరాస్యతను గానీ, రోజు రోజుకీ ఉధృతం అవుతున్న నిరుద్యోగాన్ని గానీ తొలగించటం కుదరదని మన పాలకులకు తెలుసు. అయినా ఈ రుగ్మతలను యథాతథంగా కొనసాగిస్తూ, స్వప్రయోజనాలను కాపాడుకోవడమే వీరి ప్రధాన లక్ష్యం.

ఇందుకనుగుణంగానే మన పాలకులు చేపడుతున్న విధి విధానాలు కొనసాగుతున్నాయి. అక్షరాస్యతను పెంచేందుకు కీలకమైన ప్రాథమిక విద్యావ్యాప్తిని అటకెక్కించి, అరకొరగా వయోజన విద్యావ్యాప్తి వైపు అడుగులు వేయడం. నిర్బంధ ప్రాథమిక విద్యను చిత్తశుద్ధితో అమలు చేసినట్లయితే ఈ వయోజన విద్య పథక ప్రయోగం అవసరం ఉండదు. ప్రాథమిక విద్యా వ్యాప్తిని పటిష్ట పరచనంత కాలం ఉద్యోగాల భర్తీలో ఖాళీలు కొనసాగుతూనే ఉంటాయి. ఇది నిన్నటి మాట. ఈ రోజు ప్రపంచీకరణ ప్రభావంలో విద్యను పరాయీకరణ దిశగా మళ్లించి, ప్రైవేట్‌పరం చేసి, కొనుక్కుంటున్న పరిస్థితిని చూస్తున్నాం. అందుకే గత తరం నాటి రిజర్వేషన్‌ల ప్రయోగం మళ్లీ వేదిక మీదకొచ్చి, ప్రైవేట్ రంగాల్లో సైతం రిజర్వేషన్‌లను అమలు పర్చాలనే కొత్త నినాదాన్ని భుజానికెత్తుకుంటున్నారు. నాటి రిజర్వేషన్‌ల ఉద్యమం ఏ ఫలితాలను మన ముందుంచిందో, ఈ కొత్త నినాదం అవే ఫలితాలను పునరావృతం చేస్తుందన్న వాస్తవాన్ని గుర్తెరగాల్సి ఉంది ఈ ఉద్యమకారులు. ఇందుకు షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ల 1982, 1984 నాటి నివేదికలే సజీవ సాక్ష్యాలు. షెడ్యూల్డ్ కులాల్లో 16 శాతం, తెగలలో 6 శాతం జనాభా మాత్రమే నగరాల్లో నివసిస్తున్నారు. మిగతా వారంతా గ్రామసీమలకే పరిమితం. నిరక్షరాస్యతకు బలయిపోతున్నవారు ఈ తెగలకు చెందిన గ్రామీణులే. ఇక పాఠశాల విద్యారంభానికి నోచుకున్న వారిలో సైతం 25 శాతవే ఎనిమిదో తరగతి వరకూ కొనసాగగలుగుతున్నారు. అంటే 'పేదరికం' వీరి చదువును అడ్డుకుంటోంది. ఇప్పుడు ప్రపంచీకరణ మహమ్మారి పేద వర్గాలకు ఈపాటి ప్రాథమిక విద్యను సైతం అందనీయక అడ్డు పడుతున్న వైనం మన ముందుంది. ప్రపంచీకరణ ప్రభావాన్ని మరింతగా పెంచే లక్ష్యంతోనే మన పాలకులు విధి విధానాలు రూపొందుతున్నాయి.

గత ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో రాష్ట్ర గవర్నర్ ఎన్.డి. తివారీ ఓ ప్రకటన చేశారు. 2008–09 విద్యా సంవత్సరం నుంచి మెరుగైన పాఠశాల విద్యను అందించేందుకై కేంద్ర సహకారంతో 'స్కీమ్ ఫర్ యూనివర్సల్ యాక్సిస్ అండ్ క్వాలిటీ ఎట్ సెకండరీ స్టేజ్' (సక్సెస్) అనే పథకాన్ని అమలుపర్చాలని మన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు పాఠశాలలో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు మొదలైన మౌలిక సదుపాయాలను కల్పించనున్నామనీ ప్రకటించారు. రాజధానిలోని పాఠశాలలకే కనీస వసతులు లేవు. ప్రాథమిక పాఠశాలలు ఈనాటికీ రాజధానిలో ఒకే ఆవరణలో రెండు షిఫ్ట్ పద్ధతిలో కొనసాగిస్తున్న వైనం ఉంది. ఏ పాఠశాలలోనూ పూర్తిస్థాయి సిబ్బంది ఉన్న దాఖలాలు లేవు. మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు లేని పాఠశాలలు మన భాగ్యనగరంలోనే కోకొల్లలు. ఈ పరిస్థితుల్లో 'సక్సెస్' ప్రయోగం. వెయ్యి కోట్లను బడ్జెట్‌లో కేటాయించామని చెప్పుకున్నా, అటు కేంద్రంగానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ ఒక్క పైసా విదల్చలేదు.

6,500 ఉన్నత పాఠశాలల్లో సి.బి.ఎస్.ఇ. సిలబస్‌ను ప్రవేశపెట్టాలని, 4,121 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7 తరగతులను విలీనం చెయ్యాలనీ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పైగా ఈ ఆంగ్ల మాధ్యమ విద్యా

బోధనకై ఉపాధ్యాయులకు 13 రోజుల ప్రత్యేక శిక్షణను ఇప్పించి మరీ సమాయత్తం చేసింది. తెలుగు మాధ్యమంలో బోధనకే సంవత్సర కాలపు బి.ఎడ్. శిక్షణ, రెండేళ్ల డి.ఎడ్. కోర్సులను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ 13 రోజుల శిక్షణ ఏ మేరకు దోహద పడగలదో ఏలిన వారికే తెలియాలి. పైగా ఈ బోధన రాష్ట్ర సిలబస్‌ను వదిలేసి కేంద్ర సిలబస్ విద్యా బోధనకే.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10,500 పాఠశాలల్లో 6,500 పాఠశాలలనే ఈ 'సక్సెస్' పథకానికి ఎంపిక చేసి, ఐదేళ్ల కాలంలో కోటి రూపాయలను ఖర్చు చేసి అభివృద్ధి చేయాలన్నది సంకల్పం. అంటే మిగిలిన నాలుగువేల పాఠశాలల గతి అధోగతేనన్న సంగతి వేరే చెప్పనవసరం లేదు. అవి మూతపడిపోతాయన్న మాట. ఇదే క్రమంలో గత ఏడాది 'సర్వశిక్షా అభియాన్' పథకం పేరిట ఐదువేల కోట్ల రూపాయలను కేటాయించిన కేంద్రం, కేవలం 350 కోట్ల రూపాయలను మాత్రమే విడుదల చేసింది.

ఆర్థిక సంస్కరణలు మూడో దశ ఆచరణలోకి వచ్చిన ఫలితమే ఇది. కొత్త అప్పు కోసం ప్రపంచ బ్యాంక్ విధించిన షరతుల్లో భాగమే ఈ విద్యారంగ సంస్కరణలు. విద్యారంగం పై ప్రభుత్వ వ్యయాన్ని కుదించాలి. ఇందుకు గాను ప్రపంచ బ్యాంక్ సూచిస్తున్న పరిష్కారాలు విద్యారంగంలో ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడం, కండిషనల్ క్యాష్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో ఉపకార వేతనాలను ప్రవేశపెట్టడం వంటివి. ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించే పేరిట ఇటీవల పదో తరగతి పరీక్షల నిర్వహణా తీరునే మార్చిన వైనం ఓ విషయాన్ని మనకు తెలియజేస్తుంది. పరీక్ష రాస్తున్న ప్రతి విద్యార్థి ఒ.ఎం.ఆర్. ఆన్సర్ షీట్‌పై తన రిజిస్టర్డ్ నెంబర్ మత్రమే పేర్కొనాలి. అదే ఆబ్జెక్టివ్ పేపర్‌పై తన నెంబర్‌ను సైతం వేయరాదని అధికారులు శాసించారు. ఇందులో అంతర్ రహస్యం ఏంటంటే? ఆబ్జెక్టివ్ పేపర్లను తమ అనుకూల ప్రైవేట్ పాఠశాలలకు పేపర్ల మార్పిడిని చేసుకునేందుకు అనువుగానేనని చెప్పక తప్పదు. ఈ తరహా ప్రైవేట్ విద్యారంగ ప్రోత్సాహకాల నేతృత్వంలో విద్యారంగం ముమ్మందు ఏ స్థాయికి దిగజారనుందో వేరే చెప్పనవసరం లేదు.

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల విషయానికి వస్తే, ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్టుంది. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత ఐదేళ్ల నుంచీ ప్రభుత్వ – పంచాయితీ రాజ్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు పై నిర్ణయం తీసుకోకపోవడం, రాజకీయ పక్షాలన్నింటి సహకారంతో రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఫలితం విద్యారంగ పర్యవేక్ష అధికారుల పదవుల భర్తీ కాలేకపోవడం, ఇంచార్జీలు జవాబుదారీతనంతో వ్యవహరించకపోవడం కొత్త సమస్యలకు ఆజ్యం పోయడం జరుగుతూ ఉంది. రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలన్నీ రాజీవ్ విద్యామిషన్ అయిన సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నడుస్తుండగా, అధ్యాపకులు మాత్రం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉన్నారు. ఫలితం సమన్వయ లోపం. ఇక సక్సెస్ పథకానికి ఇరవై వేల అధ్యాపకులకు పదోన్నతి ఇచ్చి పంపేయగా, భర్తీకి నోచుకోనందున ఏకోపాధ్యాయ పాఠశాలలు కొత్తగా ఉనికిలోకి రానున్నాయి. ఫలితం ఏకోపాధ్యాయుడు ఏకారణం చేతనైనా పాఠశాలకు రాకుంటే పిల్లలకు సెలవు దినమే. ఇక ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ వేతన విధానం అమలుకాక ఉపేక్షింప బడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరపు ప్రారంభానికే సుమారు 33 వేల ఉపాధ్యాయ పదవులు భర్తీ కావాల్సి ఉంది. జరిగిన డి.ఎస్.సి. విద్యార్హతలకు – విద్యాశాఖ రూపొందించిన అర్హతల మధ్య సమన్వయాన్ని రూపొందించి అమలు చేయాలి. ఎం.ఎ. ఎడ్యుకేషన్ నియామకానికి అర్హతే అయినా పదోన్నతికి నిరాకరిస్తున్నారు. పదోన్నతికీ నియామక అర్హతనే ప్రాతిపదికగా తీసుకోవాలి. ఇలాగే భాషా పండితుల వేతన అమలులో పరిపరి విధానాలను అమలు చేయడాన్ని పరిశీలించాల్సి ఉంది. అందరికీ విద్య పథక లక్ష్య సాధనలో కీలక పాత్ర నిర్వహించాల్సి అధ్యాపకులకు సంబంధించిన మౌలిక సమస్యలు. సత్వరమే పరిష్కరించి, లక్ష్య సాధనలో ప్రోత్సాహకరంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే పాలకులు ప్రకటిస్తున్న అనేకానేక శుష్క వాగ్దానాల్లో ఇవి ఒకటౌతాయి.

ఇప్పటికి మనం చర్చించిన ఈ విషయాలన్నీ పాలకవర్గాలకు తెలియనివని మనం అనుకుంటే పొరపడినట్టే. తెలియక ఎంతమాత్రం కాదు. అభివృద్ధిని భవిష్యత్ సాధనగా చెప్పుకుంటూ, గతంలో సాధించిన ప్రగతిని సమీక్షించకుండా, సమయానుకూలంగా సానుకూల మార్గాలను అన్వేషించడమే 'ఆధునిక రాజనీతి'గా చెలామణీ అవుతున్న దురవస్థ నేడు నెలకొంది. ఏ రాజకీయ పక్షమైనా స్వప్రయోజనాల కోసమే చేపట్టే పనులనే ప్రభుత్వ పథకాలుగా, అశేష ప్రజావసరాలకు అనువైనవిగా రూపొందిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో అధికారం కోసం అర్రులు చాచిన ప్రతి రాజకీయ పక్షం చేపట్టిన విధి విధానాలు దీన్నే సూచిస్తున్నాయి. గతంలో నీ హయాంలో నీవు వ్యవహరించిన వైఖరేంటి? ఈనాటి నీ వాగ్దానాలకు, నీ హామీ ఏంటని అడిగే శక్తి లేనందునే ఈ దురవస్థ. ఎందుకంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఎంపిక చేసుకున్న ప్రభుత్వ పథకాలను ప్రశ్నించే అధికారం లేకనే. ఇందుకు సైదోడుగా అవినీతిమయ అధికారవర్గం – పాలకవర్గానికి లోబడి అవరోధంగా నిలుస్తున్న చట్టాలను పక్కకు నెట్టేసి తమ పనులను తాము సాధించుకోగలుగుతున్నాయి.

దీంతో 'అధికారం' అటు రాజకీయం గానూ, ఇటు పాలనాపరంగానూ 'అణకువ'కే ప్రధాన ప్రాతినిధ్యం ఇచ్చిన వైనం మనకు తేటతెల్లం అవుతుంది. దీంతో వర్గ ప్రయోజనాలే కీలకం గానీ ప్రజాప్రయోజనాలు కాదనేది సుస్పష్టం. వర్గం – ఆ వర్గం వెనుక వర్గం – ఆ వర్గం వెంబడే కుటుంబం అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నప్పుడు ఈ వ్యవస్థకు మోక్షం ఎప్పుడు? విధాన లక్ష్యమే గాడి తప్పినప్పుడు 'లక్ష్యసాధన' మిథ్యే కదా! పీడిత ప్రజలు మౌనం వహించినంత కాలం ఈ కుట్ర ఇలా సాగుతూనే ఉంటుంది.

వీ

అనేకమంది నిష్ణాతులైన విద్యావేత్తల సూచనలతో ఏర్పడిన ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను ప్రభుత్వం ఏకపక్షంగా రద్దుచేయడం అటు విద్యార్థులకూ, ఇటు అధ్యాపకులకూ తీవ్ర నష్టమంటున్నారు **కె. శ్యామ్‌రావు**

ఇంటర్ విద్య రద్దు ఎందుకోసం?

అది 2010....ఢిల్లీ బిల్‌క్లింటన్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ క్యాంపస్....ఇద్దరు విద్యార్థినిలు కలుసుకున్నారు. వాళ్లిద్దరూ బాగా అలసినట్లున్నారు. ఒకమ్మాయి, 'రండి, అలా వెళ్లి కాస్త రిలాక్సవుదాం, వస్తారా?' అని అడిగింది.

'అమ్మో! రిలాక్సా? ఈ రోజంతా నాకు ఖాళీ లేదు. పిచ్చిబిజీ! మొదటి ఫిరియడ్ కోకాకోలా ఫిజిక్స్ ల్యాబ్‌లో యూనిలివర్ ప్రాక్టికల్స్, పెప్సీథియేటర్‌లో విదేశీ నృత్య ప్రాశస్త్యం పై ప్రాక్టర్ అండ్ గాంబెల్స్ సెషన్, ఆ తరువాత మైక్రోసాఫ్ట్ ఆడిటోరియంలో ఇన్‌ఫర్మేషన్, టెక్నాలజీపై సుజుకీ లెక్చర్. ఇవన్నీ అయిన తరువాత, యూనియన్ కార్బైడ్ స్క్వేర్‌లోని 'కెంటకీ చికెన్' క్యాంటిన్‌లో మనం మీటవుదాం, ఓకేనా!'....,

సమకాలీన ఉన్నత విద్య పై అనిల్‌సద్‌గోపాల్ సెటైర్ ఇది. 2000లో బిర్లా-అంబానీల 'ఎడ్యుకేషనల్ ఫ్రేంవర్క్' కూడా సిద్ధాంతీకరించింది ఈ తరహా విద్యా కార్పొరేటీకరణనే! జాతీయ నాలెడ్జ్ కమిషన్ సూచనల మేరకు యూనివర్శిటీలను 1500ల వరకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో పెంచేయాలని నిర్ణయించింది. మార్కెట్ అవసరం మేరకు 'మేధోబానిసలను' ఉత్పత్తి చేయటం కార్పొరేట్ యూనివర్శిటీల బాధ్యత అన్నది వేరే చెప్పనక్కర్లేదు. అయితే, కేంద్ర ప్రభుత్వం నియమించిన యశ్‌పాల్ కమిటీ కార్పొరేట్ యూనివర్శిటీల 'ఉత్పత్తి'ని, 'డీమ్డ్' అర్హతలను వ్యతిరేకించటం ఆసక్తికరమైన విషయం. ప్రైవేట్ (వ్యక్తిగత) లాభాలకోసం పనిచేసే 'విద్యామాల్' లకు 'యూనివర్శిటీ' అన్న పేరు తగదని యశ్‌పాల్ అసహ్యించుకున్నారు. ఈ విమర్శకు విరుగుడుగా ఎచ్.ఆర్.డి వెబ్‌సైట్ నుండి యశ్‌పాల్ కమిటీ రిపోర్ట్‌ను ఉన్న ఫళంగా ప్రభుత్వం తొలగించివేసింది. ఈ నేపథ్యం నుండి ఇంటర్ విద్యా విలీనాన్నీ చూస్తే ప్రభుత్వాల 'పథకం' అర్థమవుతుంది.

1968లో ఆనాటి విద్యామంత్రి పి.వి. నరసింహారావు అధ్వర్యంలో వైస్-చాన్స్‌లర్లు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, విద్యాధికారులతో కలిసి ఒక సమావేశం జరిగింది. ఈ కాన్ఫరెన్స్ రాష్ట్రం మొత్తం మీద ఒకే విద్యా విధానం, విద్యా స్వరూపం ఎలా ఉండాలో చర్చించింది. కొఠారీ కమిషన్ కూడా 10+2+3 విద్యా స్వరూపాన్ని సూచించింది కూడా ఈ సందర్భంగానే! ఎంతో వైవిధ్యాన్ని, ఎన్నో వైరుధ్యాలను కలిగివున్న భారతీయ సమాజానికి మూసవిద్య కాకుండా, ఒక ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామిక విద్యకోసం కొఠారీ కమిషన్ ప్రయత్నించింది. ప్రయోగాత్మకంగా దేశంలోనే మొదటిసారి ఆంధ్ర రాష్ట్రంలో ప్రారంభించిన ఇంటర్ విద్య పై రివ్యూ జరగాలని సూచించింది. ఇంటర్ విద్యను చట్టబద్ధంగా నడపడంకోసం 1972లో 1972 నం.2 చట్టం వచ్చింది. ఈ క్రమంలోనే స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఇంటర్మీడియట్ 'విద్యామండలి' ఆవిర్భవించింది.

ఈ మండలిలో ఆంధ్రరాష్ట్ర ఉన్నత విద్యాశాఖామాత్యులు సభాపతిగా, విద్యా విభాగపు ప్రభుత్వ కార్యదర్శి ఉపసభాపతిగా, ఉన్నత విద్యా సంచాలక కేడర్‌లో ఉండే అధికారి సెక్రెటరీగా పనిచేస్తారు. 1975 వరకు ఇంటర్ విద్య ఉన్నత విద్యలో భాగంగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ కింద ఉంది. తిరిగి 1975లో డి.పి.ఐ రెండుగా-ఉన్నతవిద్య, స్కూలు విద్యగా విడగొట్టబడింది. 1989లో తిరిగి ఉన్నతవిద్య రెండుగా కాంజియేట్ విద్య, ఇంటర్ విద్యగా విభజింపబడింది. 1989 నుండి ఇంటర్ విద్య స్వతంత్రంగా ఉన్నత విద్యగా పరిగణించబడుతూ పనిచేస్తోంది. ఈ విషయాన్నే ఉన్నత విద్యాచట్టం 1988, యాక్ట్ 16, సెక్షన్ 2(8) ఊటంకిస్తుంది.

150 కళాశాలలు, 30 వేల మంది విద్యార్థులతో 1969-70 విద్యా సంవత్సరంలో ప్రారంభమయిన ఇంటర్ విద్య ప్రస్తుతం నాలుగు వేల కళాశాలలతో, 15 లక్షల మంది విద్యార్థులతో ఒక పెద్ద విద్యా వ్యవస్థగా ఎదిగింది.

ఇంతటి పటిష్టమైన నిర్మాణాన్ని, దీర్ఘకాలిక లక్ష్యాన్ని కలిగిన ఇంటర్ విద్యను ఏక పక్షంగా సెకండరీ స్కూలువిద్యలో ఎందుకు కలిపినట్లు? ఉన్నత విద్యామంత్రికి ఇంటర్ విద్యను అప్పగించినపుడు (జిఒఎంఎస్281) అధ్యాపక, విద్యార్థి, నాన్-టీచింగ్ సంఘాలు ఆందోళన చేసాయి. అయినా ప్రభుత్వం కార్యదర్శులను మార్చేస్తూ ఉత్తర్వులు (జిఒఆర్ నెం. 3009) జారీచేసింది.

స్కూలు విద్య నుండి ప్రైమరీ విద్యను విడదీసి, ఉన్నత విద్య నుండి ఇంటర్ విద్యను విడదీసి, సెకండరీ స్కూలు విద్యలో ఇంటర్ విద్యను విలీనం చేసేముందు సంబంధిత విద్యార్థి, అధ్యాపక సంఘాలతో, ప్రజాప్రతినిధులతో ఏలాంటి సంప్రదింపులు, చర్చాలేకుండా 'తుదినిర్ణయం' తీసుకోవటం ఎన్నికలనంతర ప్రభుత్వ విధానాలకు ఒక ఉదాహరణ! ఇదే ప్రతిపాదన 1994లో జిఒఆర్‌టి నెం.82 రూపంలో వచ్చి విద్యార్థి, ఆధ్యాపకుల ఆందోళనతో ఆగిపోయింది. ఎన్నికల ముందు గత సంవత్సరం డిసెంబర్‌లో మళ్లీ విలీన ప్రతిపాదన రావటం, ఎన్నికల భయంతో ఆగిపోవటం జరిగింది. విద్యారంగంలో విభజన,

విధానాలవల్ల ప్రమాణాలు పెరిగి, డ్రాపవుట్లు తగ్గి, బాలికల్లో బాల్యవివాహాలు తగ్గి విద్యావ్యాప్తి పెరుగుతుందన్నది ప్రభుత్వం వినిపిస్తున్న వాదన. విద్యా ప్రమాణాలంటే ఎలా ఉంటాయన్న చర్చను కొద్దిసేపు పక్కన పెడితే– ప్రభుత్వ కొలమానాలతో చూస్తే 'ప్రమాణాలంటే' నికరమైన ఫలితాలు మాత్రమే! సిబిఎస్ఇ విద్యార్థులకన్నా ఇంటర్ విద్యార్థులే జాతీయస్థాయిలో ఐఐటి, ఏఐఇఇఇ, బిఐటిఎస్, ఎఐఎంఎస్, జిఐపిఎంఈఆర్ పోటీ పరీక్షల్లో 25 శాతం కన్నా ఎక్కువ సీట్లనే రాబడుతున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఎంసెట్ లాంటి ప్రవేశ పరీక్షల్లో సాధిస్తున్న 'అద్భుతాలు' అందరికీ తెలిసినవే! అందుకే, ఏటా 10 నుండి 15 వేల మంది సిబిఎస్ఇ కోర్సునొదిలిపెట్టి ఇంటర్ సిలబస్ లోనికి వలసలొస్తున్నారు.

ఇక డ్రాపవుట్లు, విద్యావ్యాప్తి, పిల్లల తల్లితండ్రుల ఆర్థిక, సామాజిక కోణాలలో చూడాల్సిన సమస్యలు. పై పై సంస్కరణలు కొత్త సంక్షోభాన్ని సృష్టిస్తాయే తప్ప పరిష్కారం ఎంత మాత్రం దొరకదు. ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్న 'సక్సెస్ స్కూళ్లు ' డ్రాపవుట్లను తగ్గిస్తాయా? ఆంగ్ల భాషలో తగినంత శిక్షణలేని టీచర్లు, భాషను నేర్చుకునే వాతావరణంలేని పిల్లలున్నప్పుడు డ్రాపవుట్లు మరింత పెరుగుతాయి. దీనితో ప్రభుత్వ వాదనలో పస లేదని తేలిపోయింది.

ఇక రాష్ట్ర ప్రభుత్వం చెప్పకనే చేసేది కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి రాజీవ్ విద్యామిషన్ పేరుతో ఇచ్చే వేలకోట్ల రూపాయల నిధులను రాబట్టడం, కార్పొరేట్ విద్యాసంస్థలకు స్కూలు విద్యలో కూడా భారీ దోపిడికి అవకాశం కల్పించడం. సక్సెస్ స్కూళ్ల ప్రారంభం, టెక్నో, కాన్సెప్ట్ స్కూళ్ల పుట్టుక ఒకేసారి జరగటం గమనిస్తే, 'కన్పించని వ్యూహం' తెలిసిపోతుంది. ప్రతి సంవత్సరం 8009 మంది ప్రతిభ కలిగిన పేదవిద్యార్థులకు ప్రభుత్వమే ఒక్కొక్కరికి 30,000 రూపాయల చొప్పున ఫీజులు చెల్లించి కార్పోరేట్ కళాశాలలకు అప్పగించటం కూడా కన్పించని వ్యూహంలో భాగమే! గత పది సంవత్సరాలుగా ఇంటర్ విద్య కార్పొరేట్–అనుకూల సంస్కరణలతో ఒక ప్రయోగశాలగా మారింది.

ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల నడుమ ఒక అప్రకటిత యుద్ధ వాతావరణం ఏర్పడింది. కార్పొరేట్ విద్యార్థులకు ప్రభుత్వం బంగారు పథకాలు అందచేస్తుంటే, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఉత్తీర్ణత శాతం తగ్గిందని సస్పెన్షన్ ఉత్తర్వులు అందుకుంటున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు, విద్యాధికారులు కొందరు పనిగట్టుకుని ప్రభుత్వ కళాశాలలను లక్ష్యంగా చేసి దుష్ప్రచారానికి పూనుకుంటున్నారు.

తగిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేక, అధ్యాపకులు లేక, సమాజం నుండి నైతిక మద్దత్తు లేక, ప్రభుత్వ అరకొర సహకారంతో కళాశాలలు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం చేసే చివరి 'దాడి'తో ఇంటర్ విద్యావ్యవస్థ మొత్తంగా కనుమరుగయిపోతుంది. ఇప్పటికే సర్వ అధికారాలతో అటు 'కరిక్యులం'ను, ఇటు సిలబస్‌ను స్వేచ్ఛగా మార్చుకుంటూ విద్య కార్పొరేట్లు 'సెజ్'లుగా (స్పెషల్ ఎడ్యుకేషనల్ జోన్స్)గా బలిసిపోయారు. 8 నెలలో చెప్పాల్సిన సిలబస్‌ను 4 నెలల్లోనే పూర్తిచేసి పోటీ పరీక్షల సిలబస్‌ను బోధిస్తారు. హిందీ, తెలుగు భాషలను నిషేధించి పనికిమాలిన సంస్కృతం, ఫ్రెంచ్‌లను రెండవ భాషగా రుద్దుతారు. ప్రభుత్వం ఈ విద్యా ప్రయోగాలకనుగుణంగానే వెయిటేజీ ఉత్తర్వులను జారీ చేస్తుంది.

ప్రపంచీకరణ తాత్వికతను ఒకింత జీవితంతో కలుపుకున్న, మధ్య తరగతిలో భాగమైన మన అధ్యాపక వర్గం బలహీన, ధిక్కార స్వరంతోనైనా ఆందోళనకు పూనుకుంది. ప్రమోషన్లలో కోత, సర్వీసు సమస్యలు, లిటిగేషన్లు పెరిగి పోతాయన్న ఆతృత, మొత్తంగా విద్యావ్యవస్థ కుప్పకూలి పోతుందన్న ఆవేదనతో 'ఇంటర్ విద్యా పరిరక్షణ కమిటీ' ఏర్పడింది. ఎందరో విద్యావేత్తల సూచనలతో ఏర్పడి నిర్ణయించుకున్న లక్ష్యాలను ఒక మేరకైనా సాధిస్తున్న ఇంటర్ విద్యా వ్యవస్థను ఏకపక్షంగా రద్దు చేయటం అటు విద్యార్థులకు, ఇటు అధ్యాపకులకు నష్టమని ప్రభుత్వం గ్రహించేవరకు మా ఆందోళన కొనసాగుతుంది. వీ

(... 7వ పేజీ తరువాయి)

– ఓడినా మారబోయేది ఏమీ ఉండదు.' 'వ్యవస్థ మార్పు గురించి' అంటే గతకాలానికి సంబంధించిన విషయమా? లేక వ్యవస్థను మార్చాలనే ఆలోచన కలిగి ఉండడమా? స్పష్టతలేదు. ఏమైనా, వ్యవస్థ మార్పు గురించి కాకపోయినా, కనీసం రాజ్యాంగ బద్ధ ఆదర్శాల గురించి కించిత్తు ఆలోచనన్నా కలిగి ఉన్న రాజకీయపక్షం ఏదైనా ఉండి ఉంటే, అది గెలిస్తే కొంత మారబోయేది ఉండేది. కనుక రాజకీయ పక్షాలు రాజ్యాంగం చదువుకోవాలి. పీఠికలోని ఆదేశసూత్రాలను బట్టిపట్టాలి. అప్పుడు అంతా కాకపోయినా, కొంతైనా సవ్యంగా ఉంటుంది. సూక్ష్మంలో మోక్షం – ఇదంతా కూడా అక్కరలేదు. ఇది చాలు – ఇది ప్రజాస్వామ్యం అయినా, కాకపోయినా ప్రభుత్వాల పట్లా, ప్రతిపక్షాల పట్లా అసలు రాజకీయాల పట్లనే నిరంతరం జాగరూకంగా ఉండవలసింది ప్రజలేనని ఈ ఎన్నికలు మరోసారి రుజువు చేస్తున్నాయి. స్థూలంగా పై విధంగా మీరు అభిప్రాయపడుతున్నారు.

బూర్జువా ప్రజాస్వామ్యంలో మూడేళ్లకో, ఐదేళ్లకో ఒకసారి ప్రజలు – ఒకే దేశంలో, ప్రాంతంలో – దాదాపు ఒకలాంటి జీవన వ్యవస్థ కలిగి ఉంటూ దోపిడీకి గురయ్యే బహుళ సంఖ్యాకులు – తమను దోపిడీ చేసే వర్గాల నుండి ఎవర్ని తమ భుజాలకెత్తుకోవాలో నిర్ణయించుకునేదే ఓటు హక్కు అనబడేది! అన్న మార్క్స్ కథనం 'వీక్షణం' సంపాదకులకు తెలియంది కాదు. పోతే, నేడు జరుగుతున్నది బూర్జువా ప్రజాస్వామ్యం కూడా కాదు. హీనస్థాయి ధనస్వామ్యం. ఇందులో కులమతాలతో పాటు, డబ్బు, ఫ్యాక్షనిజం, గూండాయిజం, అవినీతి, అక్రమాలు, మద్యం సహజీవనం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం ఇక్కడ ఒకనాడు ఉండిందిలేదు. నేడు పోయింది లేదు. 'సమాజ వ్యవస్థను దోపిడీవర్గాలు తమంత తాము ఒప్పుకోవు. అందుకు బలప్రయోగం తప్పనిసరి!' అయితే వ్యవస్థలో కొంతైనా వెసలుబాటుకు ఎన్నికల విధానంలో మార్పు అవసరం. వ్యక్తులు కాక, రాజకీయపక్షాలు మాత్రమే ఎన్నికల్లో పోటీ చెయ్యాలి. వారికి వచ్చిన ఓట్ల దామాషాలో రాజకీయ పార్టీలు, వారిచ్చిన అభ్యర్థుల జాబితా నుండి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికైన అభ్యర్థులను ప్రకటిస్తుంది. శాసనసభలకూ, లోక్‌సభకూ ఇది వర్తిస్తుంది. శాసనమండలులు, రాజ్యసభలను రద్దుచేయాలి. వీటికి ఖర్చు దండగ. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణ జరగాలి. ఈ దామాషా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది. ఈ పద్ధతిలో రిజర్వేషన్ల అవసర ముండదు. ఏ వర్గమూ, రాజకీయ అభిప్రాయాలున్నవారూ ఈ విధానంలో ఓట్ల ఫలితాలతో బాధపడరు. ఇది దామాషా పద్ధతి కనుక వారి దామాషా మేరకు వారి అభ్యర్థులు గెలుస్తారు. ఒకవేళ ఎవరైనా మరణించినా, ఆయా పార్టీలిచ్చిన జాబితా నుండి మిగిలిపోయి ఉన్న అభ్యర్థులను ఆ స్థానానికి ఎంపిక చేస్తారు. నిరంతర ఎన్నికల బెడదా, ఖర్చూ, శ్రమా తగ్గుతాయి. ఈ విధానంలో ప్రతి ఒక్క ఓటూ గెలుపులోనే ఉంటుంది. నేటిలాగ ఓడిన లిస్టులో ఉండదు. ప్రజల నిరాసక్తత, నిర్లిప్తత ఈ విధానంలో ఉండదు. ఓట్లశాతం 90కి పెరుగుతుంది. ఇందుకోసం ప్రజలూ, ప్రజాసంఘాలూ, ప్రజాస్వామ్యవాదులూ రాజ్యాంగ సవరణకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

– వి. వెంకటరెడ్డి
బలపనూరు, కడప

ఉగ్రవాద అణచివేత పేరిట స్వాత్ ప్రాంత పష్తూన్, బెలూచీ జాతి ప్రజలపై పాకిస్థాన్ సైన్యం అమలు చేస్తున్న దమనకాండను వివరిస్తున్నారు **పి. ప్రసాద్**

పష్తూన్ జాతీయ విమోచనోద్యమం

(గత సంచిక తరువాయి)

1920 ఫిబ్రవరి 2న జరిగిన అఖిల రష్యన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నివేదికలో కామ్రేడ్ లెనిన్ పార్టీ శ్రేణులను ఇలా హెచ్చరించాడు: 'తూర్పున మన విధానం మరింత ఓర్పు, జాగ్రత్తలతో ఉండాలి. ఎందుకంటే అక్కడి దేశాలు చాలా వెనుకబడి ఉన్నాయి. మత మౌఢ్య ప్రభావంలో ఉన్నాయి.' అంతేకాకుండా ఇస్లాం ఉప రిపబ్లిక్ దగెస్థాన్‌లో చేపట్టాల్సిన వైఖరిని విప్లవ సైనిక బాధ్యుడు ఓర్డ్ జొనకీడ్జెక్‌కు లెనిన్ 2 ఏప్రిల్ 1920న పంపిన రహస్య టెలిగ్రామ్‌లో ఇలా పేర్కొన్నాడు. 'ముస్లింల పట్ల, ముఖ్యంగా దగెస్థాన్‌లో మీరు ప్రవేశించినపుడు, అత్యంత సద్భావాన్ని జాగ్రత్తలనూ ప్రదర్శించాలని నేను మళ్లీ మళ్లీ కోరుతున్నాను. ముస్లింల పట్లా, వాళ్ల స్వపరిపాలన పట్లా, వారి స్వాతంత్ర్యం వగైరాల పట్లా మన సానుభూతిని అత్యంత స్పష్టంగా ప్రదర్శించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేయండి.' లెనిన్ పంపిన ఈ సందేశానికి నేటికీ కాలదోషం పట్టలేదు. పైగా ప్రపంచీకరణ పేరిట విపరీత పెడధోరణులు, పెట్టుబడిదారీ విష సంస్కృతి వెర్రితలలు వేస్తున్న నేటి పరిస్థితులను గమనంలో ఉంచుకోవాలి. సామ్రాజ్యవాద దురాక్రమణ లు బాధిత జాతులనూ, మతాలనూ, తెగలనూ తీవ్రంగా గాయపరుస్తున్న కాలమిది. తమ భుజాలపై తుపాకులు ధరించి దురాక్రమణదార్లను ఎదిరించి అశేష ప్రాణత్యాగాలతో పురోగమిస్తున్న జాతీయ పోరాట శక్తులను ఈ పేరిట క్రూర నేరస్తులుగా నిందించడం కుట్రపూరితమైనది. సోషలిజం వచ్చిన తర్వాత సైతం ఎర్ర రాజ్యాలలో లెనిన్ తీసుకున్న జాగ్రత్తలు పరిశీలించాక, నేడు దురాక్రమణలకు గురౌతున్న చోట్ల భౌతిక, వాస్తవిక పరిస్థితిని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి.

స్వాత్ ఒప్పందాన్ని ఎవరు ముందుగా ఉల్లంఘించారన్న విషయంలోకి వద్దాం. ఒప్పందం తొలుత సూఫీ మహమ్మద్‌కూ, ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. ప్రభుత్వానికీ మధ్య కుదిరింది. జర్దారీ ప్రభుత్వ ఆశీస్సులతో జరిగిన ఈ ఒప్పందాన్ని పార్లమెంట్ రెండు నెలల్లో ఆమోదించాల్సి ఉంది. పై శాంతి ఒప్పందం ప్రకారం ఈ లోపుగానే ఖైదీల విడుదల జరగాలి. శాంతిభద్రతల పోలీసు, పౌరపాలనాధికార్లు తప్ప సైన్యం మాలాఖండ్ డివిజన్ నుంచి వెనక్కి వెళ్లాలి. పాక్ తాలిబన్లు ఆధునిక ఆయుధాలతో సంచారం చేయరాదు. పార్లమెంట్ ఆమోదించాల్సిన షరియత్ చట్టం గురించి మాత్రమే. కానీ దీనికి ముందు ఒప్పందంలోని నిర్ణీత గడువు ప్రకారం మిలిటెంట్లను ప్రభుత్వం విడుదల చేయలేదు. సైన్యం వైదొలగలేదు. మార్షల్ చట్టాలను రద్దు చేయలేదు. మిలిటెంట్ల కోసం వేట ఆగలేదు. ఇవన్నీ ప్రభుత్వం వైపు నుంచి ఉల్లంఘనలే. ప్రపంచానికి వెలుగులోకి రాని ఉల్లంఘనలివి. ఒప్పందం కుదిరాక యాభై రోజులకి స్వాత్ జైళ్లల్లోని 200 మంది డిటెన్యూలు, 261 మంది రిమాండ్ ఖైదీలు అధికారుల కొక అల్టిమేటం ఇచ్చారు. (ఒప్పందం ప్రకారం ఖైదీల విడుదల జాప్యం పట్ల నిరసనగా సూఫీ మహమ్మద్‌తో సహా స్వాత్ మిలిటెంట్ సంస్థలు అప్పటికే సాగిస్తున్న ఉద్యమానికి సంఘీభావ అల్టిమేటమిది.) తమను విడుదల చేయకపోతే సామూహిక ఆత్మహత్యలు చేసుకుంటామని 4 ఏప్రిల్ 2009న హెచ్చరించారు. ఇదంతా ప్రభుత్వ ఉల్లంఘనకు నిదర్శనమే.

పై ఉల్లంఘనలు ఒక ఎత్తు, పాక్ తాలిబన్ల నుంచి ప్రమాదం గూర్చి అమెరికా మీడియా చేసిన భారీ ప్రచారం మరో ఎత్తు. బునైర్ జిల్లాలోకి వందలాది మంది సాయుధ మిలిటెంట్లు ప్రవేశించారంటూ భారీ ప్రచారం చేసింది. రాజధాని ఇస్లామాబాద్‌కు వంద కిలోమీటర్ల దగ్గరలోకి వచ్చారని భయపెట్టింది. త్వరలో కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్‌లు మిలిటెంట్ల హస్తగతం కానున్నాయని భయపెట్టింది. కాశ్మీర్‌లోకి అగ్రశ్రేణి తాలిబన్ నేతలు ప్రవేశించారంటూ భారత్ ప్రజలను రెచ్చగొట్టింది. రేపో, మాపో అణ్వస్త్ర కేంద్రాలు కూడా మిలిటెంట్ల కైవసం కానున్నాయంటూ సోకాల్డ్ నాగరిక రాజ్యాలను రెచ్చగొట్టింది. చైనా, ఇరాన్, చెచన్యా, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్ తదితర దేశాలలోకి కూడా తాలిబన్ ఉగ్రవాద తండాలు చొరబడతు న్నాయని రెచ్చగొట్టింది. ప్రపంచాన్ని మార్చ్, ఏప్రిల్ నెలలో ఫోబియాకి గురి చేసింది. వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోని పష్తూన్ జాతీయులపై అనాగరిక మారణహోమానికి పూర్వరంగాన్ని సిద్ధం చేసుకోగలిగింది.

మత దురహంకారబుద్ధితో సిక్కులను, హిందువులను ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. నుంచి తాలిబన్లు తరిమివేస్తున్నారన్న ప్రచారం కూడా నిజం కాదు. 150 ఏండ్ల క్రితం ఎంగెల్స్ పష్తూన్ చిత్రమైన స్వభావాన్ని వర్ణిస్తూ వ్యాపారాలను, వాణిజ్యాలను వారు హిందువులకు వదిలేసారన్నారు. వారు మేకలు, గొర్రెల పెంపకం, వ్యవసాయ పనులకే పరిమితమయ్యారని పేర్కొన్నారు. ఒకటిన్నర శతాబ్దం తర్వాత కూడా ఎంగెల్స్ అభివర్ణించిన మధ్యయుగ సామాజిక పరిస్థితుల్లోనే ఈనాటికీ పష్తూన్లు జీవిస్తున్నారు. నాటినుంచి నేటివరకూ కొన్ని హిందు, సిక్కు కుటుంబాలు కలప, వజ్రాలు, అటవీ ఉత్పత్తుల వ్యాపారాలు చేసి బడా సంపన్నులయ్యారు. ఇటీవల మిలిటెంట్లు రాజ్యాధికారం చేజిక్కించుకున్న చైతన్యంతో తమ ప్రాంత వ్యాపారాలను తామే చేసుకుంటామని పష్తూన్లు ముందుకొచ్చారు. అంతేకాకుండా వాళ్లు చేసే వ్యాపార రాబడి నుంచి

పాకిస్థాన్ ప్రభుత్వానికి బదులుగా తమ సంస్థలకు పన్ను చెల్లించాలని మిలిటెంట్లు కోరారు. ముఖ్యంగా వజ్రాలు (పచ్చలు) గనులను మిలిటెంట్లు స్వాధీనం చేసుకోవడం స్మగ్లింగ్ వ్యాపార వర్గాలకు రుచించలేదు. ఈ వజ్రాల ఆదాయంలో స్థానిక లేబర్‌కు 66 శాతం ఇచ్చి, కేవలం 33 శాతం రాబడిని ఆయుధ కొనుగోళ్లకు మిలిటెంట్లు వినియోగించ సాగారు. దీంతో లేబర్ కూలీ హఠాత్తుగా నాలుగైదురెట్లు పెరిగింది. ఇది వారిని పరవశింపజేసింది. అంతే కాకుండా సొంత మతస్థులైన కొందరు బడా భూస్వాములను తరిమివేసి భూములను స్థానికపేదలకు మిలిటెంట్లు పంచి పెట్టారు. (ఇందులో ఒక బడా ఇస్లాం మతపెద్ద ఉన్నాడు. అందువల్ల మత దురభిమానంతో సిక్కులు, హిందువుల పట్ల వ్యవహరించలేదని అర్థం చేసుకోవాలి.) కేవలం రెండు నెలల్లో జరిగిన ఈ రాడికల్ సంస్కరణలతో వ్యాపార వర్గాలు భీతిల్లి నిందా ప్రచారాన్ని తీవ్రతరం చేశాయి. (మన దగ్గర 1/70 ఆక్ట్ అమలును కోరుకునే ప్రజాతంత్ర శక్తులకు, ఆదివాసీ సంస్థలకూ పై పరిణామాలు సరిగ్గానే బోధపడతాయి.)

మరోవైపు షరియత్ చట్టం పట్ల సానుకూలత గల పాకిస్థాన్ ప్రజలతో పాటు సౌదీ, ఇరాన్, అరబ్బు దేశాల ప్రజలను వంచించడానికి కుట్ర పన్నింది. ఒకవైపు ఒప్పందంలోని ఖైదీల విడుదల, సైనిక ఉపసంహరణ, మార్షల్ ఉత్తర్వుల రద్దు, నిషేధాజ్ఞల ఎత్తివేత వంటి రాజకీయ షరతులను అమలు చేయలేదు. మరోవైపు ముస్లిం దేశాల ప్రజల ఆకాంక్షల కనుగుణంగా షరియత్ బిల్లును 14 ఏప్రిల్ 2009న పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తమ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను గురించి, సైనిక నీడలో షరియత్ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించడం అర్థరహితమని సూఫీ మహమ్మద్ తన వైఖరిని ప్రకటించాడు. మధ్యవర్తి సూఫీ మహమ్మద్ నుంచి ఒప్పందం అమలు గురించి తుది ప్రకటన వచ్చేంత వరకూ తమ వైపు నుంచి ఎటువంటి ఉల్లంఘనలుండవని మిలిటెంట్లు పదే పదే ప్రకటించారు. సైనిక ఉపసంహరణకు రెండు వారాల గడువునిస్తూ సూఫీ మహమ్మద్ ఏప్రిల్ మధ్యలో పాకిస్థాన్ ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చాడు. సైనిక ఉపసంహరణ జరక్కపోగా, భారీగా కొత్త సైనిక బలగాలను ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. లోకి పాక్ ప్రభుత్వం తరలించసాగింది. మరో నరమేధానికి సన్నద్ధం కాసాగింది. మరోవైపు షరియత్ కోర్టుకు అప్పిలేటు కోర్టు న్యాయమూర్తుల నియామకాన్ని సూఫీ మహమ్మద్‌ను విశ్వాసంలోకి తీసుకొని చేయాలన్న ఒప్పంద షరతును పాక్ ప్రభుత్వం ఉల్లంఘించింది. పచ్చి బ్యూరాక్రటిక్ నీతిజ్ఞులను ఏకపక్షంగా నియమించింది. అయినా తానిచ్చిన గడువు ముగిసేంత వరకూ సూఫీ మహమ్మద్ వేచి చూశాడు. ఆ తర్వాతే తాను నిస్సహాయ స్థితిలో మధ్యవర్తిత్వం నుంచి వైదొలిగాడు. స్వాత్ మిలిటెంట్లు అనివార్యంగా మరోసారి ప్రతిఘటనకు సిద్ధం కావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తమనూ, మధ్యవర్తినీ, లక్షలాది ప్రజలనూ వంచించిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఒప్పందం నుంచి తాము వైదొలుగుతున్నట్టు 4 మే 2009న పాక్ తాలిబన్లు బహిరంగ ప్రకటన చేశారు.

తెరవెనుక జరిగిన ఒక పరిణామాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాల్సి ఉంది. ఈ ఒప్పందం చేయడంలో పాక్ ప్రభుత్వ లక్ష్యాల గుర్చి మూడు రకాల అభిప్రాయాలున్నాయి. 1. తన మనుగడ కోసం అమెరికా ఒత్తిళ్లకు తలవంచకుండా తొలుత ప్రభుత్వం స్పందించి ఒప్పందం చేసుకున్నదనేది ఒక వాదన. ఆ తర్వాత లొంగిపోయిందనేది. 2. పాకిస్థాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వల్ల అమెరికా, ప్రపంచ బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్., ఇ.యు.ల నుంచి భారీ ఆర్థిక చేయూత అవసరమైంది. అది ఇండియాను నొప్పిస్తుంది. అందువల్ల ఇలాంటి పరిస్థితిని నాటకీయంగా సృష్టించి, పాకిస్థాన్‌కు చేయూత పట్ల ఇండియా ప్రజల నుంచి కూడా ఆమోదం పొందాలనుకున్నారనేది మరో వాదన. 3. పష్తూన్ల పట్ల పాకిస్థాన్‌లోని పంజాబీ, సింధూ ప్రజల్లో సైతం ఆదరణ పెరుగుతోంది. దీనిని దెబ్బకొట్టి, వారిలో జాతి విద్వేషాన్ని పెంచేందుకు వ్యూహాత్మకంగానే ఇలాంటి వంచనాత్మక విధానాన్ని అమెరికా, పాక్ ప్రభుత్వాలు పరస్పర కుమ్మక్కుతో చేపట్టాయనేది మరో వాదన. ఇందులో ఏది నిజమనేది భవిష్యత్తు నిరూపిస్తుంది. ఇదే కాలంలో పాకిస్థాన్‌లో ముదిరిన రాజకీయ సంక్షోభాన్ని అమెరికా తనదైన శైలిలో పరిష్కారం చేసింది. ప్రధాన ప్రతిపక్ష నేత నవాజ్ షరీఫ్‌ను ప్రసన్నం చేసుకున్నది. న్యాయమూర్తుల మన్ననలు పొందింది. అధ్యక్షుడు జర్దారీని ఇరకాటంలో పెట్టింది. ప్రధాని గిలానీని దువ్వింది. జనరల్ కయానీని తన పూర్తి కంట్రోల్‌లోకి తెచ్చుకున్నది. ఒకరికి మరొకరితో చెక్ పెట్టింది. అవసరమైతే మరో సైనిక కుట్రకు అనుకూల పరిస్థితిని సిద్ధం చేసింది. ఈ కూర్పుతో కేవలం తన లక్షిత మిలిటెంట్ సంస్థల మీదికి మొత్తం పాకిస్థాన్ రాజ్య శక్తులను అమెరికా ఏకం చేయగలిగింది. ఏకకాలంలో అటు ఆఫ్ఘనిస్థాన్ లోనూ, ఇటు పాకిస్థాన్‌లోనూ సామ్రాజ్యవాద వ్యతిరేక మిలిటెంట్ పోరాటాలను అణచివేసేందుకు ఒబామా ప్రభుత్వం ఒక కొత్త విధానాన్ని ఇటీవల కనిపెట్టింది. దీనికే ఆఫ్ – పాక్ పాలసీ అనే పేరు పెట్టింది. ఈ నూతన విధానానికి సుగుణంగా అమెరికా పావులు కదపడం గమనార్హం. ఈ కాలంలో భారతదేశ ప్రజల మనోభావాలను కూడా ఇందుకనుగుణంగా మలచగలిగింది. తద్వారా భారత పాలకవర్గాల వత్తాసును మరింత పొందగలిగింది.

మార్చ్, ఏప్రిల్ నెలల్లో వాషింగ్టన్‌కూ, ఇస్లామాబాద్‌కూ మధ్య దౌత్య పర్యటనల పరంపర జోరుగా సాగింది. మే మొదటివారంలో కూడా తుది మంతనాలు జరిగాయి. చివరకు పాక్ ప్రభుత్వం గొంతు విప్పింది. 7 మే 2009న రాత్రి జాతిని ఉద్దేశించి పాకిస్థాన్ అధ్యక్షుడు 'యుద్ధ ప్రకటన' చేశాడు. పాకిస్థాన్ ప్రజల, ప్రపంచ ప్రజల శాంతి, సుస్థిరతల కోసం ఒక భారీ యుద్ధం తలపెట్టక తప్పలేదని ప్రకటించాడు. ఇక అంతే, అదే రోజు అర్ధరాత్రి నుంచి వందలాది యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో, వేలాది సైనిక బలగాలతో స్వాత్‌పై యుద్ధాన్ని ఆరంభించింది. నేడు ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. లో లక్షన్నర సైన్యాలను మోహరించడం అసాధారణమే. కేవలం పది రోజులలో ఒక్క స్వాత్ జిల్లాలోనే పదకొండు లక్షల మంది దేశాంతర్గత కాందిశీకులు కావడం ప్రపంచ చరిత్రలోనే సాపేక్షికంగా అతి పెద్దది. (మొత్తం మాలాఖండ్ డివిజన్‌లో 20 లక్షల మందికి ఈ సంఖ్య చేరడం గమనార్హం.)

పైన పేర్కొన్న పాక్ ప్రభుత్వ యుద్ధ ప్రకటన వెలువడిన మరునాడే మాజీ పాకిస్థాన్ క్రికెటర్, ఇన్సాఫ్ పార్టీనేత ఇమ్రాన్ ఖాన్ ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'అమెరికాకు అమ్ముడు బోయిన తొత్తు ప్రభుత్వం తన స్వంత దేశ పౌరులపై తలపెట్టిన అధర్మ యుద్ధమిది' అంటూ నిశితంగా విమర్శించాడు. 15 లక్షలమంది పష్తూన్లను హత్య చేస్తే తప్ప తిరుగుబాటు చల్లారదని హెచ్చరించాడు. ఇలాంటి యుద్ధ వ్యతిరేక ప్రకటనలూ, నిరసనలూ పోటెత్తిన తాజా యుద్ధోన్మాదంలో ప్రస్తుతం కనిపించకపోవచ్చు. కానీ పష్తూనిస్థాన్ నేలమీద బాధిత పఠానీ జాతి చిమ్ముతున్న నెత్తుటి కాల్వలు నేడు మీడియా పరిచిన మబ్బు తెరను మున్ముందు చింపివేయక తప్పదు.

వలస యుద్ధాల ఫలితంగా సైనికులలో సైతం జాతీయ చైతన్యం పెల్లుబికి, జాతీయ విమోచనోద్యమాలకు ఉపయోగపడే సందర్భాలంటూ లెనిన్ జోస్యం నేడు ఇరాక్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్‌లలో రుజువవుతోంది. పాకిస్థాన్ ఉదాహరణనే చూస్తే పాకిస్థాన్ పార్లమెంట్‌లో సేనేటర్ (అమెరికా వ్యూహాత్మక మైత్రికి సమర్థుడే సుమా) పి.పి.పి. నేత అన్వర్‌బేగ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉగ్రవాదులపై తలపెట్టిన యుద్ధానికి సైనికుల నుంచి సహాయ నిరాకరణే ప్రధాన ఆటంకంగా ఉందని ఒక నగ్నసత్యాన్ని అంగీకరించాడు. ఇస్లామాబాద్‌కు వందమైళ్ల దక్షిణాన జీలం పట్టణం శివారు గ్రామమొకటి మిలిటరీ గ్రామంగా పేరొందింది. ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. పై యుద్ధంలో మరణించిన ఒక సైనికుడి భౌతికకాయాన్ని సైన్యాధికార్లు సైనిక శకటంలో ఊరిలోకి తెచ్చారు. స్వంత మతస్తులతో యుద్ధంలో మరణించిన తన కన్న కొడుకు భౌతిక కాయాన్ని స్వీకరించబోనని కన్నతండ్రి ప్రకటించాడు. అంతేకాకుండా తన కొడుకు శవాన్ని తెచ్చిన సైన్యాధికారులను తన కాలి చెప్పుతో కొట్టాడు. ఆ తర్వాత ఇలాంటి సైనికుల మృతదేహాలను ఊరు వెలుపల హఠాత్తుగా దింపి సైన్యాధికారులు పారిపోసాగారు. పాకిస్థాన్‌లో సైనిక కుటుంబాల ఈ పరిస్థితి పాక్ ప్రభుత్వానికి శిరోభారంగా మారుతోంది.

వేలాదిమంది సైనికులు మిలిటరీ ఆపరేషన్‌కు రాకుండా మూకుమ్మడి సెలవులు పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత ఏడాదిలో స్వాత్ నుంచి ఆరువందల మంది సైనికులు తమ అధికార్లకు చెప్పకుండా పారిపోయారు. వీరిలో సగం మందికి పైగా తిరిగి విధులకు హాజరు కాలేదు. వజిరిస్థాన్, బజౌర్, ఖుర్రం, మొహమండ్, ఖైబర్, ఒరాక్ జాయ్, దీర్, బునేర్ తదితర ప్రాంతాలలో ఇలాంటి సైనిక పలాయన సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని వార్తలు వెలువడుతున్నాయి. ఇవన్నీ పాక్ ప్రభుత్వ సైనిక విజయాన్ని ప్రశ్నిస్తున్నాయి.

అఫ్ఘానిస్థాన్‌ను దురాక్రమించి ఈ ఏడాది అక్టోబర్‌కు ఎనిమిది ఏళ్లు నిండనున్నది. ఎనిమిది ఏళ్లుగా 37 దేశాల సైనిక బలగాలు అఫ్ఘన్ ప్రజల మీద సాగిస్తున్న యుద్ధంలో సుమారు 11 వందల మంది సైనికులు మరణించారు. కానీ 2004 నుంచి నాల్గున్నర ఏళ్లు స్వంత ప్రజలపై చేసిన యుద్ధంలో 1450 మంది సైనికులను పాకిస్థాన్ కోల్పోయింది. విదేశీ దురాక్రమణ పట్ల అఫ్ఘన్ ప్రజల ప్రతిఘటన కంటే, స్వదేశీ ప్రభుత్వ సైన్యాలపై పాకిస్థాన్ పష్తూన్ జాతీయుల ప్రతిఘటన ఎక్కువ తీవ్రంగా ఉందని ఈ అంకెలు వెల్లడిస్తున్నాయి. అఫ్ఘానిస్థాన్ కంటె పాకిస్థాన్‌లో ఈ సాయుధ ప్రతిఘటన అధికంగా ఉండటానికి చారిత్రక నేపథ్యం ఉంది.

బ్రిటిష్ ఇండియాను పునాదిగా చేసుకున్న బ్రిటన్ వలసవాదులు అఫ్ఘానిస్థాన్‌కూ బ్రిటిష్ ఇండియాకూ మధ్య కుట్రబుద్ధితో 1893లో డురాండ్ సరిహద్దును సృష్టించారు. ఎంగెల్స్ చేత 150 ఏళ్ల క్రితమే స్వాతంత్రప్రియులు, పరాక్రమజాతిగా కీర్తించబడిన పష్తూన్ (ఫక్తూన్) జాతిని డురాండ్ రేఖ రెండుగా చీల్చింది. 116 ఏళ్ల క్రితం చీలిపోయిన ఈ పష్తూన్ జాతి తమ సమైక్య ఫక్తూనిస్థాన్ స్థాపనకై నాటి నుంచి నేటి వరకూ పోరాడుతూనే ఉంది. బ్రిటిష్ వలస వాదుల నిష్క్రమణతో పష్తూన్లు అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్‌లలో చెరిసగం చీలిపోయారు. సుమారు రెండున్నర వేల కిలోమీటర్ల సుదీర్ఘ డురాండ్ సరిహద్దుకు రెండు వైపులా పష్తూన్లే ఉన్నారు. (వీరినే పఠానీలని కూడా అంటారు.) ఐరిష్ జాతి తర్వాత పష్తూన్ జాతీయ విమోచనోద్యమమే ప్రపంచంలో సుదీర్ఘ చరిత్రను కలిగి ఉంది. అఫ్ఘానిస్థాన్‌లో కంటే రెట్టింపు సంఖ్యలో పాకిస్థాన్ పఠానీలు (పష్తూన్లు లేదా ఫక్తూన్లు) ఉన్నారు. ఏ కృత్రిమ సరిహద్దులూ ఈ జాతిని విడదీయలేదు. ఇండియా, పాకిస్థాన్‌లలోని కాశ్మీరీయుల మధ్య జాతీయ సమైక్యత వలెనే పఠానీల మధ్య ఉంది. అందుకే అఫ్ఘానిస్థాన్ దురాక్రమణకు గురైనా తమసాటి పష్తూన్ల పట్ల పాకిస్థాన్ పష్తూన్లు సానుభూతికే పరిమితం కాలేదు. స్వయంగా అదొక సమాంతర తిరుగుబాటు కేంద్రంగా మారడం ప్రపంచ సంఘీభావ ఉద్యమాల చరిత్రలోనే ఒక అద్భుతం.

అఫ్ఘానిస్థాన్‌ను దురాక్రమించిన నిజ లక్ష్యాలను అమలు జరగనివ్వకుండా అగ్రరాజ్యాన్ని చావు దెబ్బ తీస్తున్న ఒక కీలక రాజకీయ పరిణామం పాకిస్థాన్‌లోని పష్తూన్ బెల్టులో జరిగింది. ప్రపంచ చరిత్రలో ఏ దురాక్రమణదారీ రాజ్యాల సైన్యాలకైనా సైనిక సరఫరా మార్గం సరిగ్గా ఉండి తీరాలి. నాజీ హిట్లర్ సేనల సరఫరా మార్గాన్ని తెంచడం మీదే నాటి సోవియట్ రెడ్ ఆర్మీ కేంద్రీకరించిన విషయం తెలిసిందే. ఫలితంగా హిట్లర్ సేనలు ఓటమి పొందాయి. అఫ్ఘానిస్థాన్ భూవలయ దేశం కావడంతో పాకిస్థాన్ భూమార్గం ద్వారానే అఫ్ఘానిస్థాన్‌లోని అమెరికా నాటో సైనిక బలగాలకు సైనిక సరఫరాలు జరగాల్సి ఉంది. కరాచీ ఓడరేవుకొచ్చిన ఆయుధ, ఆహార, ఆయిల్ (అఫ్ఘానిస్థాన్‌లోని 70 వేల మంది విదేశీ సేనలకు అవసరమయ్యేవి) సరుకులు ట్రక్కుల్లో తొలుత పెషావర్‌కు చేరుస్తారు. అక్కడ నుంచి పాక్ పష్తూన్ ప్రాంతాల్లోని కొండదారుల ద్వారా కాబుల్‌కు చేరుస్తారు. దీనినే ఖైబర్ కనుమ మార్గం అంటారు. ఆర్యులు, ఇండోగ్రీకులు, పార్థియన్లు, సిథియన్లు, పారశీకులు, అరబ్బులు, కనిష్కులు, టర్కులు, మంగోలియన్లు, మొఘలులందరూ ఈ ఖైబర్ లేదా భోలానే కనుమ మార్గాల ద్వారానే భారత ఉపఖండానికొచ్చారు. ఈ కనుమ మార్గాలు పష్తూన్ ప్రాంతాలతో నిండి ఉంటాయి. అఫ్ఘన్ దురాక్రమణను పాక్‌లోని పష్తూన్లు కూడా ప్రతిఘటిస్తున్నందున ఈ నాటో సైనిక సరఫరా మార్గం మూసుకుపోతున్నది. పష్తూన్ల గెరిల్లా దాడుల తీవ్రతతో ఖైబర్ కనుమ దిగ్బంధనంలో చిక్కుకున్నది.

అటు ఖైబర్ కనుమ మార్గంలోనూ, ఇటు పెషావర్ లో మజిలీ గోడౌన్లలోనూ నిత్యం గెరిల్లా దాడుల్లో వందలాది సైనిక శకటాలు దగ్ధమయ్యాయి. 2008 అక్టోబర్ నుంచి 2009 మార్చ్ మధ్య గడిచిన ఆరు నెలల్లో మొత్తం 760 సైనిక ట్రక్కులూ, కంటైనర్లు దగ్ధమయ్యాయి. ఒక్క 7 డిసెంబర్ 2008న 140 ఆయుధాలతో కూడిన ట్రక్కులు బూడిదయ్యాయి. ఈ సైనిక మార్గానికి ప్రత్యామ్నాయంగా ఉత్తరాదిన మరో కొత్త మార్గం కావాలంటే రష్యా అనుమతి అవసరమయింది. రష్యా మీద ఆధారపడాలంటే, పోలండ్, చెక్ రిపబ్లిక్‌లలో అమెరికా ప్రతిపాదిత మిసైల్ల రక్షణ వ్యవస్థ రద్దును అది కోరుతున్నది. అందుకే ఎన్ని లక్షల మందిని చంపించైనా ఖైబర్ కనుమ గుండానే సైనిక సరఫరాలు చేయ జూస్తున్నది. అందుకే లక్షన్నర సేనలతో తాజా యుద్ధాన్ని పష్తూన్ల మీద పాక్ ప్రభుత్వంతో అమెరికా చేయిస్తోంది.

స్వాత్ కొండల్లో పఠానీలు చిమ్మిన నెత్తుటి కాల్వలూ, కాశ్మీరు లోయలో కార్చుతున్న కన్నీటి ధారలూ, ముల్లైతీవు అడవులను ఆవరించిన అమరత్వాలూ ముమ్ముందు స్నేహం చేసి జతకడతాయి. ఐరిష్, కుర్దిష్, పాలస్తీనా, బెలూచీ జాతుల త్యాగాలతో ఇవి రేపు పెనవేసుకుపోతాయి. ప్రపంచ శ్రామిక వర్గ విప్లవ సంస్థలతో ఇలాంటి సర్వపీడిత జాతులూ, తెగలూ చేతులు కలిపి పిడికిళ్లెత్తుతాయి. ప్రపంచ మరణోన్ముఖ దురాక్రమణదారీ శక్తులకు మరణశాసనం రాస్తాయి. స్వాత్ ప్రజలారా! మీ స్వాతంత్ర్యోద్యమం వర్ధిల్లుగాక. వీ

ఫ్రెంచ్ తత్వవేత్త, సుప్రసిద్ధ మార్క్సిస్ట్ చింతనాపరుడు, 'రీడింగ్ కాపిటల్' పుస్తక రచయిత **లూయీ ఆల్తూసర్** *ఫ్రెంచ్‌లో రాసిన ఈ వ్యాసం 'ఎల్ హ్యూమానిటి' 21 ఏప్రిల్ 1969 సంచికలో అచ్చయింది. ఇంగ్లిష్ అనువాదం 'మార్క్సిజం టుడే' అక్టోబర్ 1969 సంచికలో అచ్చయింది. కొన్ని సమకాలీన ప్రస్తావనలను మినహాయిస్తే 'కాపిటల్' అధ్యయనానికి మంచి ప్రవేశికగా ఉపయోగపడే శాశ్వత విలువ ఉన్న వ్యాసం ఇది.*

మార్క్స్ 'కాపిటల్' ఎలా చదవాలి?

1. మార్క్స్ రచించిన 'కాపిటల్' ఒక శతాబ్దం కింద 1867లో వెలువడింది. అయినా ఇవాళ్టికీ అది ఎంతో తాజాగా, గతంలో ఎన్నడూ లేనంత సంబద్ధంగా, వాస్తవికంగా ఉంటుంది. పెట్టుబడిదారీ సిద్ధాంత వేత్తలు, అర్థశాస్త్రవేత్తలయినా, చరిత్రకారులయినా, తత్వవేత్తలయినా ఆ పుస్తకాన్ని ఖండించడానికి ప్రయత్నిస్తూ గత శతాబ్దిలో చాలా భాగం గడిపారు. శ్రమశక్తి విలువ సిద్ధాంతం, అదనపు విలువ సిద్ధాంతం, విలువ సిద్ధాంతం వంటివన్నీ 'అధిభౌతిక' సూత్రీకరణలనీ, వాటికీ రాజకీయార్థ శాస్త్రానికీ ఏమీ సంబంధం లేదనీ వాళ్లు ప్రకటించారు. ఈ పాత వాదనలనే తిరగరాస్తూ, ఏదో కొత్తది చెపుతున్నట్టు నటిస్తున్న తాజా సిద్ధాంతవేత్తలలో సరికొత్తగా చేరాడు రేమండ్ ఆరాన్. నాకు తెలిసినంతవరకూ మొదటి ప్రపంచయుద్ధానికి ముందు ఇటువంటి వాదన లలో సమర్థమైన వాదనలు చేసినవాడు ఇటాలియన్ తత్వవేత్త క్రోస్.

2. అయితే ఎంత జ్ఞాన సంపన్నులయినా, సుప్రసిద్ధులయినా పెట్టుబడిదారీ నిపుణులందరూ అర్థం చేసుకోలేకపోయిన కాపిటల్‌ను కార్మికులు చాలా సులభంగా అర్థం చేసుకోగలరు. ఎందువల్ల? ఎందుకంటే, వారు ఏ పెట్టుబడిదారీ దోపిడీకి బలౌతున్నారో ఆ పెట్టుబడిదారీ దోపిడీ గురించి కాపిటల్ వివరిస్తుంది గనుక. కాపిటల్ ఆ దోపిడీని విశ్లేషించి అది ఏయే పద్ధతుల్లో సాగుతుందో చూపుతుంది. కార్మికులు తమ జీవిత కాలమంతా ఏ దోపిడీ కింద జీవిస్తారో, పెట్టుబడిదారులు ఈ దోపిడీని ఏయే రూపాల్లో కొనసాగిస్తారో ఆ పుస్తకం చూపుతుంది. పని గంటల పెంపు, ఉత్పాదకత పెంపు, పని వేగంలో పెంపు, వేతనాల తగ్గింపు, నిరుద్యోగం వగైరా అన్ని దోపిడీ రూపాల గురించీ అది వివరిస్తుంది. అంటే, కాపిటల్ అన్నిటికన్నా ఎక్కువగా కార్మికవర్గపు పవిత్ర గ్రంథం.

3. కార్మికులతో పాటు కాపిటల్‌ను తీవ్రంగా అధ్యయనం చేసే పాఠకులు మరికొందరు ఉన్నారు. వేతన కార్మికులు, సాధారణ ఉద్యోగులు, మేధో శ్రామికులుగా పిలువబడే ఉపాధ్యాయులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, వైద్యులు, నిర్మాణ నిపుణులు వగైరా వర్గాల ఉద్యోగులు. ఇక విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో చదువుకునే విద్యార్థుల సంగతి చెప్పనే అక్కర్లేదు. వీరందరూ పెట్టుబడిదారీ సమాజపు చలన సూత్రాలను అర్థం చేసుకోవాలనే కుతూహలంతో, వర్గపోరాటంలో తమ పాత్ర ఏమిటో గ్రహించాలనే కోరికతో ఆ పుస్తకాన్ని చదువుతారు. కాపిటల్ ఒక శాస్త్రీయమైన విప్లవాత్మక రచన మాత్రమే కాక అది పెట్టుబడిదారీ ప్రపంచాన్ని వివరిస్తుంది గనుక వాళ్లు కాపిటల్‌ను చదువుతారు. అలాగే వాళ్లు లెనిన్ ను కూడా చదువుతారు. ఆయన మార్క్స్ కృషిని కొనసాగించాడు. పెట్టుబడిదారీ విధానం దాని అత్యున్నత దశ, చివరి దశ సామ్రాజ్యవాదానికి చేరిందని వివరించాడు.

రెండు ఇబ్బందులు

4. ఇదంతా చెప్పిన తరువాత కాపిటల్‌ను చదవడమూ, అర్థం చేసుకోవడమూ ప్రతి ఒక్కరికీ అంత సులభం కాదని కూడా చెప్పాలి. కాపిటల్‌ను చదవడం అంటే, రెండు ప్రధానమైన ఇబ్బందులను ఎదుర్కోవడం – ఒకటి, ఒక రాజకీయ ఇబ్బంది. ఇది ప్రధానమైనది. రెండు, ఒక సైద్ధాంతిక ఇబ్బంది. ఇది ద్వితీయమైనది. ముందే చెప్పినట్టు మొదటి ఇబ్బంది రాజకీయపరమైనది. కాపిటల్ ను అర్థం చేసుకోవాలంటే పాఠకులకు పెట్టుబడిదారీ దోపిడీ గురించి ప్రత్యక్ష అనుభవం ఉండాలి, కార్మికులలాగ. లేదా, కార్మికులైనా, మేధావులైనా విప్లవాచరణలో ఉన్నవాళ్లలాగ. అలా అయితే, వాళ్లకు కార్మిక వర్గ దృక్పథానికి చేరగలిగిన అవసరమైన ప్రయత్నం చేసినట్టు అవుతుంది. కార్మికులూ కాక విప్లవాచరణలోనూ లేక ఉండేటట్టయితే వాళ్లు అప్పటికే ఎంత చదువుకున్నవాళ్లయినా, అర్థశాస్త్రవేత్తలయినా, చరిత్రకారులయినా, తత్వవేత్తలయినా ఈ పుస్తకాన్ని అర్థం చేసుకోవాలంటే వాళ్లు చెల్లించవలసిన మూల్యం చాలా పెద్దది. అప్పటికే పెట్టుబడిదారీ దురభిప్రాయాలతోనూ, ముందస్తు భావనలతోనూ నిండి ఉన్న తమ దృక్పథంలో విప్లవం తెచ్చుకోవలసి ఉంటుంది.

5. రెండో ఇబ్బంది సైద్ధాంతికమైనది. ఇది మొదటి దానిని అనుసరించి ఉండేదే కాని, వాస్తవికమైనది. కాపిటల్ ఒక సైద్ధాంతిక గ్రంథం. అంతకు ముందే సైద్ధాంతిక రచనలతో పరిచయం ఉన్న వాళ్లు, సైద్ధాంతిక విజ్ఞాన శాస్త్రరంగంలో ఉన్నవాళ్లు ఎక్కువగానూ, సామాజిక శాస్త్రాలలో పనిచేసేవాళ్లు తక్కువగానూ ఈ ఇబ్బందిని అధిగమించగలరు. (మానవీయ శాస్త్రాలు అనే పేరుతో ఉన్నవి శాస్త్ర విజ్ఞానానికి 80 శాతం తప్పుడు రూపాలు. అవి పెట్టుబడిదారీ భావజాల ఫలితాలు.) కాని, సిద్ధాంత అంశాలతో అంతగా పరిచయం లేని ఇతరులు, ఉదాహరణకు కార్మికులు, ఈ సైద్ధాంతిక విషయంలో పురోగతి సాధించాలంటే నిరంతర కృషి జరపాలి. ఓపికగా పనిచేయాలి. అదే

పనిగా అధ్యయనం చేయాలి. వారికి సహాయం చేయడానికే ఈ వ్యాసం. వారు కూడా ఈ ఇబ్బందిని అధిగమించడం ఎలా సాధ్యమో ఇప్పుడే చూద్దాం.

6. ప్రస్తుతానికి వాళ్లు తెలుసుకోవలసినదంతా ఏమంటే, (ఎ) కాపిటల్ ఒక సిద్ధాంత గ్రంథం. అది 'పెట్టుబడిదారీ విధానానికీ, ఆ విధానం కింద సాగే ఉత్పత్తి, వినిమయ పరిస్థితులకూ' చెందిన సిద్ధాంతాన్ని వివరిస్తుంది. అందువల్ల కాపిటల్ అమూర్త విషయాలతో వ్యవహరిస్తుంది. అమూర్తం అంటే మనం చేతులతో ముట్టుకోలేనిది అని. అంటే కాపిటల్ నిర్దిష్ట చరిత్ర గురించో, మన అనుభవంలో ఉన్న అర్థశాస్త్ర విషయాల గురించో, చరిత్రకారులో, అర్థశాస్త్రవేత్తలో వివరించినట్టుగా వివరించే పుస్తకం కాదు. (బి) ఎక్కడ అయినా సిద్ధాంతం అంటే దానిలో అమూర్తీకరణ ఉంటుంది. అలాగే దానిలోని భావనలను గంభీరంగా క్రమబద్ధీకరించే పద్ధతి ఉంటుంది. అందువల్ల కాపిటల్ చదవాలంటే అమూర్తీకరణ పద్ధతిని, క్రమబద్ధీకరణ పద్ధతిని గ్రహించడం అవసరం. ఈ అమూర్త భావనలు, క్రమబద్ధీకరణ వ్యవస్థలు సోమరిపోతుల ఊహలు కావు. అవి శాస్త్రీయజ్ఞానాన్ని ఉత్పత్తి చేసే పనిముట్లు. మోటర్ కార్లు, ట్రాన్సిస్టర్లు, విమానాలు, వగైరా భౌతిక ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి పరికరాలను, యంత్రాలను, నిశితమైన వ్యవస్థలను సాధనాలుగా ఎలా వాడుతామో, శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి అమూర్తీకరణను, క్రమబద్ధీకరణను అలా వాడవలసి ఉంటుంది.

7. ఇది మనసులో పెట్టుకుని కాపిటల్ మొదటి సంపుటం చదివేటప్పుడు ఈ కింది ఆచరణాత్మక సూచనలను పాటిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

8. మొదటి సంపుటాన్ని చదవటానికి అడ్డుగా నిలబడే అతి పెద్ద ఇబ్బందులు సైద్ధాంతికమైనవైనా, ఇతరమైనవైనా అన్నీ కూడా దురదృష్టవశాత్తూ (బహుశా అదృష్టవశాత్తూ) మొదటి సంపుటం మొదట్లోనే ఉంటాయి. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే సరుకులు, డబ్బు అనే మొదటి భాగంలోని మొదటి అధ్యాయంలోనే ఉంటాయి. అందువల్ల నా సలహా ఏమంటే, మొదటి సంపుటంలోని రెండో భాగంతో, పెట్టుబడిగా డబ్బు పరివర్తన అనే అధ్యాయంతో పుస్తకం చదవడం ప్రారంభించండి. రెండో భాగం తరువాత పుస్తకాన్ని మళ్లీ మళ్లీ చదవకుండా, మొదటి భాగంతో మొదలుపెట్టి మొత్తం సంపుటాన్ని చదివి అర్థం చేసుకోవడం సాధ్యం కాదని నా అభిప్రాయం.

9. ఇది కేవలం సలహామాత్రమే కాదు, అంతకన్న ఎక్కువ. ఇది ఒక సిఫారసు. అవసరమైన సిఫారసు అని నా అభిప్రాయం. తమ ఆచరణాత్మకమైన అనుభవం ద్వారా ప్రతి ఒక్కరూ దీన్ని నిర్ధారిస్తారు.

10. ఎవరైనా మొదటి సంపుటాన్ని మొదటి నుంచి అంటే, మొదటి భాగం నుంచి మొదలుపెట్టి చదివినట్టయితే అతి త్వరలోనే విసుగు చెంది వదిలేస్తారు. లేదా, అర్థం చేసుకున్నామని కూడా ఎవరైనా అనుకోవచ్చు గాని, అది ఇంకా ఘోరం. ఎందుకంటే అక్కడ అర్థం చేసుకోవలసిందానికన్నా పూర్తిగా భిన్నమైనదేదో అర్థమై ఉంటుంది.

11. రెండో భాగం నుంచి, పెట్టుబడిగా డబ్బు పరివర్తన నుంచి విషయాలన్నీ చాలా సులభంగా ఉంటాయి. ఇప్పుడు పాఠకులు మొదటి సంపుటం హృదయంలోకీ, ఆత్మలోకీ ప్రవేశించగలరు.

12. ఇక్కడ ఉన్నది అదనపు విలువ సూత్రం. దీన్ని కార్మికులు ఇసుమంత ఇబ్బంది లేకుండా గ్రహించగలరు. ఎందుకంటే వాళ్లు ప్రతిరోజూ అనుభవిస్తున్న వర్గదోపిడీ శక్తిని అతి సులభంగా చెప్పిన శాస్త్రీయ సిద్ధాంతం ఇది.

13. మూడో భాగం, నాల్గవ భాగం చాలా బరువైనవి. కాని చాలా సులభమైనవి. అవి ఇవాళ్టి వర్గపోరాటానికి నిర్ణయాత్మక ప్రాముఖ్యత కలిగినవి. ఆ రెండు భాగాలు అదనపు విలువలో రెండు ప్రాథమిక రూపాల గురించి వివరిస్తాయి. పెట్టుబడిదారులు కార్మికవర్గాన్ని అతి ఎక్కువ దోపిడీకి గురిచేసే రూపాలు అవి. వాటిని మార్క్స్ సంపూర్ణ అదనపు విలువ, సాపేక్ష అదనపు విలువ అంటాడు.

14. మూడో భాగంలో వివరించే సంపూర్ణ అదనపు విలువ పని దినపు నిడివికి సంబంధించినది. పెట్టుబడిదారీ వర్గం పని దినపు నిడివిని వీలయినంత ఎక్కువ పెంచడానికి అలుపు లేకుండా పనిచేస్తుందని మార్క్స్ వివరిస్తాడు. మరొకపక్క ఒక శతాబ్దానికి పైగా కార్మికవర్గపు పోరాటపు లక్ష్యాలలో ఒక లక్ష్యం ఈ పని దినపు నిడివిని తగ్గించడమే.

15. ఈ భీకర పోరాటపు చారిత్రక దశలు అందరికీ తెలిసినవే. మొదట పన్నెండు గంటల పనిదినం కోసం, ఆ తరవాత పది గంటల పని దినం కోసం, తరవాత ఎనిమిది గంటల పని దినం కోసం కార్మికులు పోరాడారు. 1936లో పాపులర్ ఫ్రంట్ రోజులలో నలభై గంటల పనివారం కోసం పోరాడారు. దురదృష్టవశాత్తు పెట్టుబడిదారీ వర్గం తన శక్తినీ, తన చేతిలో ఉన్న చట్టపరమైన, చట్టేతరమైన అన్ని సాధనాలను ఉపయోగించి వాస్తవ పనిదినపు నిడివిని పెంచడానికి ప్రయత్నిస్తుందనేది కూడా సుప్రసిద్ధమైన విషయమే. కార్మిక వర్గ పోరాటాల ఫలితంగా చట్టాలు రూపొంది చట్టపరంగా పనిదినపు నిడివిని పరిమితం చేసినప్పుడు కూడా వాస్తవ పనిదినాన్ని పెంచడానికి పెట్టుబడిదారులు ప్రయత్నిస్తారు.

16. వాస్తవ ఆచరణలో వారానికి 45 నుంచి 54 పనిగంటలు ఉంటున్నాయి. యజమానులు ఓవర్‌టైం అనే ఒక కొత్త ఎత్తుగడను కూడా కనిపెట్టారు. నిర్ణీత గంటలకు అదనంగా అదనపు పనిగంటలు కూడా మొదలయ్యాయి.

17. ఇక్కడ ఓవర్ టైం గురించి ఒక్క మాట – ఒప్పందాలను బట్టి ఈ ఓవర్ టైం పనికి మామూలు పని వేతనం కన్న ఇరవై అయిదు శాతం, యాభై శాతం, చివరికి వంద శాతం ఎక్కువ కూడా ఇస్తారు. అంటే, ఆ పని యజమానులకు చాలా ఖరీదైంది అన్నట్టుగా కనబడుతుంది. కాని వాస్తవంగా అది వాళ్లకు ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇటువంటి పని ద్వారా పెట్టుబడిదారులు తమ ఖరీదైన యంత్రాలను ఇరవై నాలుగు గంటలూ వాడకంలో ఉండేటట్టు చూడగలరు. అంటే, అదే తరహా కొత్త యంత్రాలు కనిపెట్టబడే లోపలే ఈ యంత్రం పూర్తిగా పని చేస్తుందన్నమాట. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నిరంతరాయంగా ఎక్కువ సమర్థమైన యంత్రాలను తయారు చేస్తుంది గనుక పెట్టుబడిదారులకు తమ యంత్రాలతో ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా, ఎంత ఎక్కువ వీలయితే అంత ఎక్కువగా

పని తీసుకోవలసి ఉంటుంది. ఓవర్ టైం ద్వారా సాధించేది అదే. ఇక కార్మికుల వైపు నుంచి చూసినప్పుడు ఓవర్‌టైం వేతనాలు యజమానుల నుంచి వారికి అందే ఉచిత బహుమతులు ఏమీ కావు. వాటివల్ల కార్మికులకు అదనపు ఆదాయం వస్తుందనే మాట, దానితో వారు తమ ఇష్టం వచ్చినట్టు ఖర్చు పెట్టుకోవచ్చనే మాట నిజమే కాని దానితో వారి ఆరోగ్యం శిథిలమవుతుంది. పైకి చూడడానికి మోసపూరితంగా, భిన్నంగా కనబడినప్పటికీ ఓవర్ టైం అంటే కార్మికుల మీద సాగే అదనపు దోపిడీ తప్ప మరేమీ కాదు.

18. ఇప్పుడిక మనం సాపేక్షిక అదనపు విలువ ఉత్పత్తి అనే నాలుగో భాగాన్ని పరిశీలిద్దాం. ఇది చాలా కీలకమైన సమస్య.

19. సాపేక్షిక అదనపు విలువ అనేది ఇవాళ్టి దోపిడీ పద్ధతులలో అతి ముఖ్యమైనది. అది పైకి చూడడానికి చాలా మెత్తగా కూడా కనబడుతుంది. పరిశ్రమలలోనూ, వ్యవసాయంలోనూ యంత్రాల వాడకం పెరిగిపోవడంతో, అందువల్ల ఉత్పాదకత పెరిగిపోవడంతో దీనికి దగ్గరి సంబంధం ఉంది. ఉత్పాదకతలో పెరుగుదల కేవలం ఇంకా ఇంకా సంకీర్ణమైన ఆధునిక యంత్రాలను ప్రవేశపెట్టినందువల్ల మాత్రమే జరగడం లేదు. ఆ యంత్రాలు అదే స్థాయి ఉత్పత్తిని అంతకుముందు తీసుకున్న సమయంకన్న సగం సమయంలో, మూడోవంతు సమయంలో లేదా పావు వంతు సమయంలో తయారు చేస్తుండవచ్చు. కానీ, ఉత్పాదకతలో పెరుగుదల శ్రమ క్రమం తీవ్రతరం కావడంతోనే సాధ్యమౌతుంది.

20. ఈ విషయాలన్నీ మార్క్స్ నాలుగో భాగంలో చర్చించాడు. ఉత్పాదకత పెరుగుదల అనేదాన్ని దాని నిర్దిష్ట రూపాలలో పరిశీలించి వాటిలో దోపిడీ జరిగే క్రమాన్ని ఆయన వివరించాడు. ఉత్పాదకతలో పెరుగుదల దానంతట అదిగా కార్మిక వర్గానికి ఎటువంటి మేలు చేకూర్చదనీ, దాని ఫలితం కార్మిక వర్గాన్ని మరింతగా దోపిడీ చేయడమేననీ మార్క్స్ రుజువు చేశాడు.

21. కార్మికులు పని గంటల విషయంలో ఏమి చేశారో ఇప్పుడు కూడా అదే చేయవలసి ఉంది. ఉత్పాదకతతో ముడిపడి ఉన్న స్వాభావిక దోపిడీ రూపాల మీద వారు పోరాడవలసి ఉంది. ఆ రూపాలను పరిమితం చేసే ఉద్దేశంతో వారు పోరాడవలసి ఉంది. ఆ పోరాటాలు శ్రమ క్రమం తీవ్రతరం కావడానికి వ్యతిరేకంగానూ, కొన్ని రకాల ఉద్యోగాలు రద్దయిపోవడానికి వ్యతిరేకంగానూ, ఉత్పాదకత పెరిగినందు వల్ల కొన్ని ఉద్యోగాలు అనవసరమైపోవడానికి వ్యతిరేకంగానూ పోరాడవలసి ఉంది. ఉత్పాదకత పెరుగుదల వల్ల తమకేదో మేలు జరుగుతుందని కార్మికులు ఆశించనక్కర్లేదని మార్క్స్ నిస్సందేహమైన పద్ధతిలో రుజువు చేశాడు. ఉత్పాదకత వల్ల కార్మికులకు ప్రయోజనం జరగాలంటే వారు గానీ, వారి మిత్రులుగానీ అధికారానికి రాక తప్పదనీ అది జరిగే లోపుగా వారు చేయగలిగినదంతా ఉత్పాదకత పెరుగుదల ఫలితాలను పరిమితం చేసేందుకు పోరాడడమేనని మార్క్స్ అన్నాడు. కార్మికులు చేసే వర్గపోరాటం తీవ్రతరమయేటప్పుడు తమపై సాగే దోపిడీని ఎదిరించడం దాని ఉద్దేశాలలో ఒకటిగా ఉంటుంది. ఉత్పాదకత ఫలితాలను అరికట్టడం అందులో భాగమే.

22. అవసరమైతే ప్రస్తుతానికి పాఠకులు అయిదో భాగాన్ని చదవకుండా పక్కన పెట్టవచ్చు. సంపూర్ణమైన అదనపు విలువ, సాపేక్షిక అదనపు విలువ ఉత్పత్తి అనే అధ్యాయం అది. అది చాలా సాంకేతిక వివరాలతో కూడి ఉంటుంది. అందువల్ల దాన్ని ఒదిలేసి వేతనాలను గురించి చర్చించిన ఆరో భాగానికి వెళ్లవచ్చు.

ఉత్పాదకత – వర్గపోరాటం

23. ఈ భాగంలో కూడా కార్మికులు పూర్తిగా తమకు తెలిసిన విషయాలనే చదవగలుగుతారు. ఇక్కడ కార్మికులకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుందనే పెట్టుబడిదారీ అబద్ధాన్ని మార్క్స్ పక్కన పెట్టి విభిన్న రకాల వేతనాల గురించి చర్చిస్తాడు. కాలానికి వేతనం, వస్తువును బట్టి వేతనం వగైరా అన్ని రూపాలు కూడా కార్మికులను మోసగించడానికి, వర్గపోరాటంలో భాగస్థులు కాకుండా వారి సంకల్పాన్ని ధ్వంసం చేయడానికి రూపొందించిన ఎరలే అని మార్క్స్ చూపుతాడు.

24. మొత్తంగా వేతనాల సమస్య పెట్టుబడిదారీ సిద్ధాంతవేత్తలు చెప్పినట్టుగా జీవన ప్రమాణాల సమస్యకాదని, అది అంతిమ పరిశీలనలో వర్గపోరాట సమస్యేనని ఈ భాగంలో కార్మికులు గుర్తించగలుగుతారు. వేతనాల సమస్య ఉత్పాదకతను పెంచడం ఎలా అనే సమస్యకూడా కాదు. ఆ పెరుగుదల నుంచి కార్మికులు సహజంగా ప్రయోజనం పొందుతారనే వాదన అబద్ధం.

25. రెండో భాగం నుంచి ఆరో భాగం వరకు పూర్తి చేసిన తరువాత కార్మికులు గుర్తించగలిగిందేమంటే తమ ఆర్థిక పోరాటాలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థకు అనివార్య ధోరణి అయిన రెండు రకాల దోపిడీలకు వ్యతిరేకంగా సాగే వర్గపోరాటమే అని.

26. ఆ రెండు రకాల దోపిడీ రూపాలేమంటే

1. పని దినాన్ని పెంచడం. 2. వేతనాలను తగ్గించడం.

27. పెట్టుబడిదారీ వర్గం ఈ రెండు లక్ష్యాలను సాధించడానికి చేసే పోరాటాన్ని ఎదుర్కొనేందుకు కార్మికవర్గం సాగించే ఆర్థిక పోరాటానికి ఉండవలసిన రెండు ప్రాథమిక లక్ష్యాలు: 1. ఏ రూపంలో పనిదినాన్ని పెంచినా వ్యతిరేకించడం; 2. వేతనాల కోతను ఎదిరించడం.

28. కార్మికవర్గం జరిపే ఆర్థిక పోరాట సారాంశమంతా పని గంటల పెంపుదలకూ, వేతనాల కోతకూ వ్యతిరేకంగా సాగే పోరాటమే అని నేను నొక్కిచెప్పినప్పటికీ ఈ కింది మూడు ప్రాథమిక సూత్రాలను గమనంలో ఉంచుకోవలసి ఉంటుంది.

1. పెట్టుబడిదారీ విధానంలో ఉత్పాదకత పెరుగుతూ పోతుంది గనుక వేతనాలు కూడా పెరుగుతూ పోతాయని ప్రజలను నమ్మించే ఉద్దేశంతో సంస్కరణవాదులు ఒక భ్రమను ప్రచారం చేస్తున్నారు. దీనితో పెట్టుబడిదారీ విధానంలో వేతనాల కోత అనే అనివార్యమైన ధోరణి ఉంటుందనే వాస్తవం మీద ముసుగు కప్పబడుతుంది. పెట్టుబడిదారీ విధానపు ధోరణి గురించి కమ్యూనిస్టులు తమ కార్మికవర్గ సహచరులకు వివరించాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్ని వేతన పోరాటాలు ఈ ధోరణికి వ్యతిరేకంగా సాగేవే. అంతేకాదు, వేతనాల కోతకు వ్యతిరేకంగా సాగే పోరాటాలు అదే సమయంలో ఉన్న వేతనాలను పెంచడం కోసం జరిగే పోరాటాలుగా కూడా ఉంటాయని ప్రత్యేకంగా

చెప్పనక్కర్లేదు.

2. సంస్కరణవాదులు ఈ వాస్తవాన్ని మరుగుపర్చడానికి ప్రయత్నిస్తారు. ఎందుకంటే వర్గపోరాటం అనే మాట ఎత్తకుండా ఉండడానికి ప్రయత్నిస్తారు. పని గంటల పెంపుదలకూ, వేతనాల కోతకూ వ్యతిరేకంగా జరిగే పోరాటం ఉత్పాదకత పెంపుదల వ్యవహారం కాదు. అది స్పష్టంగా ఒక వర్గపోరాటం. అయితే అది ఆర్థిక రంగంలో జరిగే వర్గపోరాటం.

3. పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యంగా ఉండే ఒక ధోరణికి, ఆర్థిక దోపిడీని పెంచుతూ ఉండే ధోరణికి వ్యతిరేకంగా ఆత్మరక్షణగా సాగే పోరాటం అయినందువల్ల ఆర్థిక పోరాటం పరిమితమైనదే అవుతుంది. కనుక కార్మికవర్గం ఈ ఆత్మరక్షణాయుత ఆర్థిక పోరాటాన్ని రాజకీయ రంగంలోకి తీసుకువెళ్లి తామే దాడి చేసే కార్మికవర్గ పోరాటంగా పరివర్తన చెందించవలసి ఉంటుంది. ఆత్మరక్షణాయుత ఆర్థిక పోరాటంలో త్వరితగతిన పనిచేయించడానికీ, శ్రమ క్రమాన్ని తీవ్రతరం చేయడానికీ, వేతనాల కోతకూ, ఉద్యోగాల రద్దుకూ, బోనస్‌లను నిరంకుశంగా నిర్ణయించడానికీ వ్యతిరేకంగా సాగే పోరాటాలెన్నో ఉంటాయి. కార్మికవర్గం చేసే రాజకీయ పోరాటానికి అంతిమ లక్ష్యంగా సోషలిస్ట్ విప్లవ సాధన మాత్రమే ఉంటుంది. కమ్యూనిస్టులు సాగించే రాజకీయ పోరాటంలో, సోషలిస్ట్ విప్లవం కోసం సాగించే పోరాటంలో ఆర్థిక పోరాటం కూడా కలిసే ఉంటుంది.

29. ఈ విషయమంతా కాపిటల్‌లో పూర్తిగా స్పష్టంగా ఉంది. అయితే వర్గపోరాటంలోని రాజకీయాంశాలకూ, ఆర్థిక అంశాలకూ మధ్య తేడా గురించి చాలా వివరంగా లేదు. ఆ పనిని మార్క్స్ అనుయాయులు, అందరి కన్నా ముఖ్యంగా లెనిన్ ('ఏం చేయాలి?' పుస్తకంలో) మరింత స్పష్టతతో చేశారు. విప్లవ నాయకులందరూ ఆ పని చేశారు. మారిస్ థొరెజ్ ప్రతిసందర్భంలోనూ ఆ విషయం నొక్కిచెప్పాడు. సాధారణ ఆర్థిక పోరాటం కన్న రాజకీయ పోరాటం ప్రాథమికమైనదనే అవగాహన లేకుండా విప్లవ దృక్పథమే సాధ్యం కాదు. రాజకీయేతరమైన ఆర్థిక పోరాటం ఆర్థికవాదానికి అంటే, వర్గ సామరస్య వాదానికి దారితీస్తుంది. మరొకపక్క రాజకీయ పోరాటం మీద మాత్రమే కేంద్రీకరించడం, ఆర్థిక పోరాటాన్ని విస్మరించడం, చిన్నచూపు చూడడం, ప్రాప్త కాలజ్ఞతకూ అంటే దుస్సాహసికత్వానికీ దారితీస్తుంది.

30. వర్గపోరాటం అన్నప్పుడుకూడా ఎప్పుడైనా అది జాతీయ స్థాయిలో జరగవలసిందే. ఒక నిర్దిష్ట సమాజపు ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని జరగవలసిందే. కాని, అదే సమయంలో అంతర్జాతీయ కార్మిక వర్గపు పోరాటంలో భాగంగా జరగవలసిందే.

విస్తరణలూ - హత్యాకాండలూ

31. ఆరో భాగంలో వేతనాల గురించి చదివిన తరువాత పాఠకులు పెట్టుబడి సంచయనం అనే ఏడో భాగానికి వెళ్లాలి. ఈ భాగం చాలా స్పష్టంగా ఉంటుంది. కార్మికుల నుంచి సంపాదించిన అదనపు విలువను నిరంతరాయంగా పెట్టుబడిగా మార్చడమే పెట్టుబడిదారీ విధానపు ధోరణి అని మార్క్స్ ఇక్కడ వివరిస్తాడు. ఎందుకంటే పెట్టుబడి విస్తరించకుండా తనను తాను పునరుత్పత్తి చేసుకోకుండా ఎప్పుడూ ఆగదు. కార్మికుల నుంచి అంతకంతకూ ఎక్కువగా అదనపు శ్రమనూ, అదనపు విలువనూ రాబట్టే లక్ష్యంతో పెట్టుబడి ఎప్పటికప్పుడు బలిసిపోతుంటుంది. ఈ సూత్రీకరణలను మార్క్స్ బ్రిటన్‌లోని పెట్టుబడిదారీ విధానం 1846 -66 మధ్య ఎలా పెరిగిందో నిర్దిష్ట ఉదాహరణలతో అద్భుతంగా వివరించాడు. 19వ శతాబ్ది చివరి నుంచి ఈ పెట్టుబడి పునరుత్పత్తి అనేది సామ్రాజ్యవాదం రూపం తీసుకుందని లెనిన్ చూపాడు. సామ్రాజ్యవాదం రూపంలో బ్యాంక్‌ల పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి కలిసిపోయి ద్రవ్య పెట్టుబడి రూపం తీసుకుని వలసవాదం రూపంలో మిగతా ప్రపంచాన్ని ప్రత్యక్షంగా అధిక దోపిడీ చేయడం సాగించింది. వలసవాద యుద్ధాలనూ, సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధాలనూ తీసుకొచ్చింది. రెండు ప్రపంచ యుద్ధాల ఫలితంగా జరిగిన ఇతర పరిణామాలతోపాటు 1917 రష్యా విప్లవం, జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాల స్థాపన, 1949 చైనా విప్లవం వంటి ఘటనల వల్ల సామ్రాజ్యవాదం తన మరణశయ్యమీద చేరిందని ఇవాళ ప్రతిఒక్కరికీ స్పష్టంగా తెలుసు.

32. పెట్టుబడి మొదటి సంపుటంలో చివరి భాగం ఆదిమ సంచయనం అనే ఎనిమిదవ భాగం. ఇందులో చాలా ముఖ్యమైన ప్రతిపాదన ఒకటి ఉంది. పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావం గురించి పెట్టుబడిదారీ సిద్ధాంతకర్తలు ప్రచారం చేసిన అబద్ధాలను మార్క్స్ ఈ భాగంలో పటాపంచలు చేశాడు. తొలి పెట్టుబడిదారులు నిరాడంబరంగా జీవించి, కష్టపడి ఆదాచేసి ఆ డబ్బును పెట్టుబడిగా వినియోగించారనేదే ఆ అబద్ధం. కాని వాస్తవంగా పాశ్చాత్య దేశాలలో కొంతమంది ధనికుల చేతిలో అపారంగా సంపద పోగుపడినందువల్ల పెట్టుబడిదారీ విధానం తలెత్తిందని మార్క్స్ చూపించాడు. వారిదగ్గర ఆ సంపద నిజానికి కొన్ని శతాబ్దాలపాటు సాగిన ఓడల దొంగతనాలు, దాడులు, దోపిడీ, విధ్వంసం, జాతులను ఊచకోత కోయడం ద్వారా దుర్మార్గమైన పద్ధతుల ఫలితంగానే పోగుపడిందని మార్క్స్ చూపించాడు. విస్తృతంగా బంగారు గనులు ఉండిన పెరూ వంటి దేశాలలో, ఇన్‌కా వంటి జాతులను, ఇతర ప్రజలను రూపుమాపి పెట్టుబడిదారులు తమ పెట్టుబడి సంపాదించారు.

33. పెట్టుబడిదారీ విధానపు ఈ చారిత్రక మూలాల గురించి మార్క్స్ చేసిన విశ్లేషణ ఇవాల్టికీ ఒక కీలకమైన వాస్తవంగా ఉంది. ఎందుకంటే, ఇవాళ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన దేశాలలో ఎటువంటి హత్యాకాండలకు పాల్పడడం లేదనే అనిపిస్తుంది. కాని, మూడో ప్రపంచ దేశాలని పిలవబడే లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలలో పాత పద్ధతులలోనే దొంగతనం, దోపిడీ, బందిపోటు, హింస, ఊచకోత సాగుతూనే ఉన్నాయి. ఇవాళ వియత్నాంలో అమెరికన్‌లు సాగిస్తున్న ఊచకోతలూ, హత్యాకాండలూ మార్క్స్ కాపిటల్ మొదటి సంపుటంలో ఎనిమిదో భాగంలో పెట్టుబడిదారీ విధాన మూలాల గురించి చేసిన వర్ణనలకు సజీవ సాక్ష్యం.

34. అయితే ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజలు

ఊచకోత కోయబడడానికి సిద్ధంగా లేరు. వారు సంఘటితం అవుతున్నారు. తమను తాము రక్షించుకోవడానికి ఏకమవుతున్నారు. ఎందుకంటే ఇతర కారణాలతో పాటుగా మార్క్స్, లెనిన్, వారి అనుచరులు ఆ ప్రజలను మేల్కొలిపి వర్గపోరాటంలో క్రియాశీల విప్లవ యోధులుగా మలిచారు. అందువల్లనే ప్రజలు రూపొందించుకున్న సంస్థల నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధం వల్ల వియత్నాం ప్రజలు ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తిమంతమైన సైనిక శక్తిని ఓడించి విజయం సాధిస్తారు.

35. కాపిటల్ చదవదలచుకున్నవారెవరైనా లెనిన్‌ను కూడా చదవాలి. ప్రత్యేకించి లెనిన్ రాసిన 'అతివాద కమ్యూనిజం' పుస్తకంలోని చివరి భాగం 'కొన్ని నిర్ధారణలు'లో లెనిన్ పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలలో సోషలిస్ట్ విప్లవ పరిస్థితుల గురించి చర్చించాడు. అది చదివితే మనదేశంలో కూడా మన జీవితకాలంలోనే మనలో చాలామందిమి విప్లవ విజయాన్ని చూడగలమనే ఆశ కలుగుతుంది.

గీటురాయి

36. కాపిటల్ ఎలా చదవాలనే విషయమై నా సలహాను మళ్లీ ఒకసారి క్రోడీకరిస్తాను :

1. మొదటి భాగాన్ని వదిలేసి ప్రారంభించండి.
2. రెండో భాగంతో చదవడం మొదలుపెట్టండి.
3. రెండు, మూడు, నాలుగు, ఆరు, ఏడు, ఎనిమిది భాగాలను చాలా శ్రద్ధగా చదవండి. (అయిదవ భాగాన్ని తరవాత చదవడం కోసం అట్టిపెట్టండి.)
4. ఇప్పుడు ఒకటో భాగాన్ని చదవడానికి ప్రయత్నించండి. ఇది చదవడం చాలా కష్టమనీ, చాలా వివరమైన అవగాహన అవసరమనీ గుర్తుంచుకొని చదవండి.

37. ఇది చెప్పాక కాపిటల్ పాఠకులకు నేను మరొక సలహా కూడా ఇవ్వాలనుకుంటున్నాను. మార్క్స్ రాసిన ఆ మహత్తర రచనను చదవబోయే ముందు ఈ కింద చెప్పిన రెండు చిన్న పుస్తకాలు చదవండి. అవి కాపిటల్ కు అద్భుతమైన ప్రవేశికలుగా ఉపయోగపడతాయి.

1. 'వేతన శ్రమ, పెట్టుబడి' అని మార్క్స్ 1847లో రాసిన పుస్తకం; 2. ఎంగెల్స్ రాసిన 'ఆన్ కాపిటల్'. ఇది మొదటి సంపుటంలో ఉన్న ప్రధాన భావనలను అద్భుతంగా వివరిస్తుంది.

38. కాపిటల్ మొదటి సంపుటంలో ఉన్న కొన్ని ముఖ్యమైన నిర్ధారణలను స్పష్టంగా, సులభంగా అర్థం చేసుకోవాలంటే ఆ సంపుటం చదివిన తరువాత పాఠకులు మార్క్స్ 1865లో రాసిన 'వేతనాలు, ధర, లాభం' అనే పుస్తకం కూడా చదవాలి. ఈ రెండు చిన్న రచనలు మార్క్స్ ఇచ్చిన ఉపన్యాసాలు. మొదటిది తొలి రోజుల్లో 1847లో ఇచ్చినది కాగా, రెండవది 1865 ది. మొదటిదేమో ఒక కార్మికుల సమావేశంలో చేసిన ప్రసంగం కాగా, రెండవది, ఫస్ట్ ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ రెండవ సమావేశంలో చేసిన ఉపన్యాసం.

39. ఈ పుస్తకాలు చదివితే కార్మికోద్యమంలో పనిచేస్తున్న కార్మికులతోనూ, కార్యకర్తలతోనూ మాట్లాడేటప్పుడు ఎటువంటి భాష ఉపయోగించాలని మార్క్స్ అనుకున్నాడో మనకు అర్థమవుతుంది. సులభంగా, స్పష్టంగా, నేరుగా మాట్లాడడం ఎలాగో మార్క్స్‌కు తెలుసు. అదే సమయంలో తన సిద్ధాంతాల శాస్త్రీయ సారాంశంలో ఏమాత్రమూ రాజీపడడానికి ఆయన సిద్ధపడలేదు. కార్మికులకు శాస్త్రపరిజ్ఞానం నేర్చుకొనే హక్కు ఉన్నదని ఆయన నమ్మాడు. ఏ శాస్త్రీయ వ్యక్తీకరణలోనైనా సాధారణంగా ఉండే ఇబ్బందులను అధిగమించగల సామర్థ్యం కార్మికులకు ఉందని కూడా ఆయన నమ్మాడు. ఈ గీటురాయే మనందరికీ గుణపాఠం కావాలి.

40. కాపిటల్ మొదటి సంపుటంలోని మొదటి భాగం గురించి ఒక వివరణ.

కాపిటల్ మొదటి భాగాన్ని వేగంగా చదవడానికి అడ్డుపడే సైద్ధాంతిక సమస్యల విషయంలో ఒక చిన్న వివరణ ఇవ్వదలిచాను. ఆ భాగం ఇప్పుడు ఉన్న రూపంలోకి రావడానికి మార్క్స్ దాన్ని కనీసం పదిసార్లు తిరగరాశాడు. అది కేవలం వివరణ సమస్య మాత్రమే కాదు.

ఆ సమస్యలను అధిగమించడానికి ఒకటి రెండు మాటలు.

1. శ్రమ శక్తి విలువ సిద్ధాంతం అర్థం కావాలంటే దాన్ని. మార్క్స్, ఎంగెల్స్‌లు విలువ సూత్రాన్ని రాబట్టే ఒక ప్రత్యేక సందర్భంగా వాడుకున్నారని తెలియాలి. ఈ విలువ సూత్రం అనే సూత్రీకరణే అర్థం చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది.
2. అదనపు విలువ సిద్ధాంతం అనేది ఒక ప్రత్యేక అంశం మాత్రమే. అది ఇంకా విస్తారమైన అదనపు శ్రమ సిద్ధాంతంలో భాగం. ఈ అదనపు శ్రమ అన్ని సమాజాలలోను ఉనికిలో ఉంది. అన్ని వర్గ సమాజాలలోను దాన్ని మరొకరు స్వాధీనం చేసుకున్నారు. కాని ఈ అదనపు శ్రమ సిద్ధాంతాన్ని దాని సాధారణ అర్థంలో మొదటి సంపుటంలో చర్చించడం జరగలేదు.

అంటే మొదటి సంపుటానికి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, రెండవ, మూడవ, నాల్గవ సంపుటాలలో లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు మొదటి సంపుటంలో ఉన్నాయి. (అదనపు విలువ సిద్ధాంతాలు అనే పేరుతో విడిగా వచ్చిన మూడు సంపుటాల పుస్తకాన్ని ఇక్కడ ఆల్తూసర్ కాపిటల్ నాల్గవ సంపుటంగా ప్రస్తావిస్తున్నాడు.) అలాగే తరవాతి సంపుటాలలో జవాబు ఉన్న కొన్ని ప్రశ్నలను మార్క్స్ మొదటి సంపుటంలో ప్రస్తావించి వదిలేశాడు.

మొదటి సంపుటం చదివేటప్పుడు తలెత్తే సమస్యల స్వభావం మౌలికంగా ఈ ఉత్కంఠ, ఊహలకు సంబంధించినదే. అందువల్ల మొదటి సంపుటం చదివే వారెవరైనా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పుస్తకానికి మరి మూడు భాగాలు కూడా ఉన్నాయని గమనంలో ఉంచుకోవాలి.

రెండవది, విస్మరించడానికి వీలులేనిది అయిన మరొక సమస్య మొదటి సంపుటంలో మరీ ముఖ్యంగా మొదటిభాగంలోని మొదటి అధ్యాయంలో కొన్ని పరిచ్ఛేదాలలో, సరుకుల ఆరాధన సిద్ధాంతంలో మార్క్స్ ఉపయోగించిన పదజాలం హెగెల్ నుంచి వారసత్వంగా తీసుకున్నది. అది తన బలహీనత అని మార్క్స్ అంగీకరించి ఉన్నాడు.

వీ

మానవజాతి విస్తరణకూ, కుంచించుకుపోవడానికీ, ఆధిపత్యం నెరపడానికీ, లోబడిపోవడానికీ వెనుక ఉన్న ప్రాకృతిక, భౌగోళిక అంశాల పాత్ర గురించి వివరిస్తున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

అమెరికా వలసలకు తొలి ప్రయత్నాలు

మానవజాతి చరిత్ర ఏయే దశలకు లోనయిందో మనకు తెలుసు. పశ్చిమాసియాలో అన్నిటికన్నా ప్రాచీనమైన నాగరికతలు తలెత్తడం, ఈజిప్ట్, సింధునది, చైనా మొదలైన ప్రాంతాల్లో జరిగిన పరిణామాలూ, ఆ తరవాత గ్రీక్, రోమన్ నాగరికతలూ, యూరప్‌లో క్రైస్తవమత ప్రాబల్యం, అక్కడి దేశాలు తక్కిన ఖండాల్లోని దేశాలను లోబరుచుకోవడం, అమెరికా ఖండాల గురించి పదిహేనో శతాబ్దపు చివరి దాకా ఎవరికీ తెలియకపోవడం, అన్నీ వరసగా ఒకదాని వెంట మరొకటిగా జరిగాయని మనకు తెలుసు. అంతకాదు, ఇవన్నీ ఒకదాని వల్ల మరొకటి జరిగాయని కూడా అనుకోవచ్చు. క్రీస్తుకు మూడు వేల ఏళ్ల క్రితమే మొదలైన బలమైన నాగరికతలన్నీ తరవాతి పరిణామాలకు గట్టి పునాదిని సమకూర్చాయి. రాజకీయంగానూ, విజ్ఞాన సాంకేతికపరంగానూ గతంలో జరిగిన పరిణామాలను గురించి తెలియడం చరిత్రలో కొందరికి లాభించింది. అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాల్లో ఆదిమ తెగలుగా జీవిస్తూ, ఇటువంటివేవీ ఎరగని 'వెర్రిబాగుల' ప్రజలందరూ ఈ 'ఉన్నత' జాతుల దాడులకు లొంగి, చచ్చినవారు చావగా మిగిలినవారు హీనదశలో నేటికీ జీవిస్తున్నారు.

చరిత్ర ఇదే పద్ధతిలో ఎందుకు జరిగింది? కొన్ని జాతుల బుద్ధిహీనతే అందుకు కారణమా, లేక వారికి స్థానికంగా ఎదురైన భౌగోళిక, పర్యావరణ పరిస్థితులు వారిని ఎదగనివ్వలేదా? వారిలోనూ ఎవరైనా తెలివైనవారుంటే అలా జరిగి ఉండేది కాదా? యూరపియన్లే అమెరికాకు ఎందుకు వెళ్లారు? అక్కడివారే వచ్చి యూరప్‌ను ఆక్రమించలేదెందుకని? ఈ ప్రశ్నలకు కొంతవరకూ జవాబులు చెప్పవచ్చు. అమెరికా తెగలకు నౌకాయానం తెలియదు. వారికి ప్రకృతిసిద్ధంగా అంతులేని వనరులుండేవి. యూరప్‌లోలాగా ఎక్కువ జనసాంద్రతా, దారిద్ర్యమూ లేవు. వ్యాపారానికో, కొల్లగొట్టటానికో కొత్త ప్రాంతాలను వెతకవలసిన అవసరమూ, ఆ విధంగా పొందగలిగిన లాభార్జనకై తెగించి సుదీర్ఘ సముద్రయానాలు చెయ్యవలసిన అగత్యమూ, సామర్థ్యమూ కూడా యూరపియన్లకే ఉండేది. వీటన్నిటికీ అంతకు ముందు వేల సంవత్సరాల నాటి చారిత్రక కారణాలున్నాయి.

ఎవరైనా కొత్తచోటికి వెళితే ఏమవుతుంది? రోదసీ యాత్రికులు నివాసయోగ్యం కాని ఏ చంద్రమండలం మీదనో స్థిరపడదలుచుకుంటే వారికి ముందుగా అవసరమయేది వారి అత్యాధునిక విజ్ఞానమే. వ్యక్తిగతంగా, శారీరకంగా వారికేమీ ప్రత్యేకత ఉండనవసరం లేదు. టెక్నాలజీ చాలు. అదే ఏ హిమాలయ పర్వతాలనో కాలినడకన ఎక్కదలుచుకున్న నాగరికులకు మాత్రం తమతో పోలిస్తే స్థానికులైన షెర్పాలూ, కొండజాతివారూ అక్కడి పరిస్థితులకు బాగా తట్టుకోగలరని అర్థమవుతుంది. ఇతరత్రా ఆధునికత లేనివారైనప్పటికీ అలాంటివారికి సహజంగా కొంత సామర్థ్యం ఉంటుంది. వారు కూడా అవసరమనిపించినప్పుడు వలసవెళ్లిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు ఎప్పుడో కొన్ని వేల ఏళ్ల క్రితం హిమయుగాల కాలంలో బెరింగ్ జలసంధి గడ్డ కట్టుకుపోయినప్పుడు సైబీరియా తూర్పు అంచు నుంచి కొందరు ప్రజలు కాలినడకన అలాస్కాలోకి ప్రవేశించగలిగారు. ఆ తరవాత కొన్ని వేల సంవత్సరాలు గడిచేటప్పటికి మానవజాతి ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలనంతటినీ ఆక్రమించేసింది. హిమయుగం అంతమవగానే దాటరాని సముద్రాలవల్ల అక్కడ నివసించసాగిన ప్రజలకు తక్కిన ప్రపంచంతో సంబంధాలన్నీ దాదాపుగా తెగిపోయాయి. ఆ తరవాత అలాస్కాలో నివసించిన కొందరు ఎస్కిమోలు సముద్రాన్ని దాటి సైబీరియా తీరప్రాంతాల్లో స్థిరపడే ప్రయత్నాలు కొన్ని చేశారు.

అయితే కొలంబస్ వెళ్లినదాకా అమెరికాల గురించి ఎవరికీ తెలియదనడం పూర్తిగా నిజం కాదు. నార్వే దేశస్థులు కొందరు క్రీ.శ.874 లో ఐస్‌లాండ్‌కూ, 986లో గ్రీన్‌లాండ్‌కూ వచ్చి స్థిరపడ్డారు.

ఆ విధంగా గ్రీన్‌లాండ్‌కు వచ్చినవారిలో కొందరు క్రీ.శ. 1000, 1300 ప్రాంతాల్లో ఉత్తర అమెరికా ఈశాన్య ప్రదేశాలైన న్యూఫౌండ్‌లాండ్ తదితర తీరాలకు వచ్చి చేరారు. ఆధునిక యుగంలో అమెరికాకు మొదటగా వలసవచ్చినది వీరే. యూరేషియాలో దాదాపు తొమ్మిది వేల సంవత్సరాల నుంచీ కొనసాగుతున్న నాగరికతకు వారసులైన నార్వే దేశస్థులు అప్పట్లో నిర్జన ద్వీపాలైన ఐస్‌లాండ్‌వంటి ప్రాంతాలకు వచ్చినప్పుడేమయింది? జంతువుల పెంపకమూ, పరిమితమైన వ్యవసాయమూ కొనసాగేందుకు అనువైన పరిస్థితులు వారికి నామమాత్రంగా కనిపించాయి. వాటిపై ఆధారపడి ప్రజలు నివసించసాగినందువల్లనే ఆ వ్యవస్థలు నేటికీ అక్కడున్నాయి. మరొకటేమిటంటే నార్వే తదితర ప్రాంతాల్లోని పరిస్థితుల ప్రాబల్యం వల్లనే ప్రజలు సముద్రయానాలు చేసి కొత్త చోట్లను వెతుక్కునే అగత్యం ఏర్పడిందనుకోవాలి. అమెరికా ఖండాల్లోని తెగలకు నౌకానిర్మాణం వంటిది తలపెట్టి దేశాలు పట్టి పోవలసిన అవసరమేమీ కలగలేదు. మొత్తం మీద యూరపియన్లు పశ్చిమంగా ప్రయాణాలు మొదలుపెట్టి అమెరికాలో కాలుమోపే ముందుగా ఈ దీవులను కనిపెట్టారు.



వీటిలో పెద్దదైన గ్రీన్‌లాండ్ మాత్రం ఎక్కువగా మంచుతో కప్పబడి ఉండేది. అక్కడి కొన్ని తీరప్రాంతాల్లో తప్ప నార్వే తరహా ఆహారోత్పత్తి పద్ధతులకు అనువైన పరిస్థితులు ఉండేవికావు. భౌగోళికంగా ప్రతికూల వాతావరణం ఎదురైనప్పుడు ఎంతటి నాగరికులైనా తలవంచవలసిందే. అందుచేత అక్కడివారు తమకు అవసరమైన ఆహారాన్నీ, ఇనుమునూ నార్వే నుంచీ, కలపను పశ్చిమాన లేబ్రడార్ నుంచీ దిగుమతి చేసుకుంటూ ఉండేవారు. పసిఫిక్ దీవులు కొన్నింటిలాగా ఈ ప్రాంతాల్లో ఆహారోత్పత్తికి తగిన పరిస్థితులు ఒనగూడలేదు. వేటా, ఆహారసేకరణ మీద ఆధారపడి, నాగరికత ఎరగని స్థానిక ఎస్కిమో తెగలు మాత్రం ఉండేవి. అసలే గడ్డు పరిస్థితుల్లో కొత్త ప్రదేశాలకు వచ్చి జీవిస్తున్న నార్వే వారికి మరిన్ని చిక్కులు ఎదురయాయి. పదమూడో శతాబ్దపు చిన్న హిమయుగం కారణంగా ఆ ప్రాంతాల్లోని ఆహారోత్పత్తీ, నార్వేకు నౌకాయానాలూ అన్నీ మరింతగా దెబ్బతిన్నాయి. త్వరలోనే యూరప్‌తో సంపర్కం తెగిపోయింది. 1577లో యూరపియన్లు మళ్లీ అక్కడికి వచ్చినప్పుడు ఈ వలన ప్రాంతాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయని తెలిసింది.

పదో శతాబ్దం నుంచీ నాలుగు వందల ఏళ్లపాటు కొనసాగిన నార్వే ప్రజల వలస స్థావరాలు చివరకు విఫలం కావటానికి ఉష్ణోగ్రతల తగ్గుదల ఒక కారణం. వారి నౌకలకు తిన్నగా కెనడా దాకా పోగలిగిన సామర్థ్యం లేదు. వారికి మజిలీలుగా పనిచేసిన గ్రీన్‌లాండ్ స్థావరాలు ఎక్కువ జనాభాను పోషించ లేకపోయాయి. చలి ప్రాంతాల్లో నార్వేవారి ఇనప పనిముట్లకన్నా స్థానిక ఎస్కిమోలకు ఉండిన, రాతి, ఎముక, కొయ్య వస్తువులే అక్కడి పరిస్థితులకు బాగా పనికొస్తాయని రుజువైంది. వ్యవసాయం, రాజకీయాలూ, టెక్నాలజీ తదితర రంగాల్లో అప్పటి నార్వే ప్రజలకు ఉండిన అనుభవమేదీ ఆర్కిటిక్ ప్రాంతాల స్థితిగతులకు పనికిరాలేదు. చివరకు వలసవచ్చిన ప్రజలు తిండికి మాడి చచ్చిపోయారో, స్థానికుల దాడులకు బలి అయారో, లేదా స్థానికులతో వివాహాది సంబంధాలు ఏర్పరుచుకుని వారిలో కలిసిపోయారో ఏమీ తెలియదు. కఠోర పరిస్థితులకు అలవాటు పడిన అనాగరికులదే చివరికి పైచెయ్యి అయింది. దీనర్థం ఏమిటంటే ఉన్నత నాగరికత విజయం సాధించాలంటే కొన్ని ప్రత్యేక పరిస్థితులు అవసరమౌతాయి.

1492లో స్పెయిన్ చేపట్టిన అమెరికా యాత్రలు మాత్రం విజయవంతం కాగలిగాయి. నార్వే కన్నా సంపన్న దేశమైన స్పెయిన్‌కు అంతకుపూర్వం ఇస్లామ్‌ద్వారా యూరప్‌లో ప్రాచుర్యంలోకి వచ్చిన విజ్ఞానమూ, చైనా, ఇండియా, ఇండొనేషియా తదితర దేశాలు విజయవంతంగా సాధించిన నౌకా నిర్మాణమూ, హిందూ మహా సముద్రంలో జరిగిన యాత్రల అనుభవాలూ, పరికరాలూ, ఆయుధాలూ అన్నీ పనికొచ్చాయి. నార్వేలాగా కాకుండా భూమధ్యరేఖకు సమీపంలో జరిగిన కొలంబస్ యాత్ర ఎన్ని ఒడిదుడుకులకు లోనైనప్పటికీ తరవాతి దండయాత్రలకు మార్గాలను సుగమం చేసింది. హిమయుగాల బెడద కలగలేదు. వలస ప్రాంతాల దోపిడీకి తగిన ప్రేరణ లభించింది. చరిత్రాత్మక సంఘటనలకు ఇటువంటివెన్నో కారణాలుండేవి. ■

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - ఆగస్ట్ 2009 : సింగరేణి బొగ్గు గనులు - నిన్నా, నేడూ, రేపూ**
- **ఫోకస్ - సెప్టెంబర్ 2009 : మహిళా ఉద్యోగుల సమస్యలు**

బౌద్ధంతో మరింత వికసించాల్సిన భారతీయ తత్వశాస్త్రం, కళలు, విజ్ఞానం మనుధర్మం ప్రవచించిన వర్ణవ్యవస్థ, వైదిక సాంప్రదాయాల వల్ల ఎలా అణచివేయబడ్డాయో వివరిస్తున్నారు **మచ్చ ప్రభాకర్**

బౌద్ధం - మనుధర్మం

ప్రాచీన భారత ఉపఖండ సంస్కృతి, మానవ సమాజాల వికాసం గ్రీకు, ఈజిప్ట్, మెసపటోనియా ఖ్యాతికన్న గొప్పదైనది. మాతృ, పితృ, బానిస సమాజాల నుంచి సామంత, గణరాజ్యాల దిశకు పయనించిన కాలంలో ప్రాగ్, ద్రవిడ భాషలతో, మతాలతో ఈ దేశ మూలవాసులు నూలు పంచెలతో ఎదిగిన సంస్కృతి నాటిది. బ్రిటిష్ పాలనలో మరీ ముఖ్యంగా 1920 పిదప ప్రారంభించిన పురావస్తు పరిశోధనల మూలంగ వెలుగులోకి వచ్చిన హడప్పా – మొహంజోదడో సంస్కృతి అవశేషాలు దానిని నిరూపించాయి. ఆర్యుల దాడులతో అది కనుమరుగైనది. అనార్య ద్రావిడ, నాగ, ఆదివాసి జాతులను ఆర్యులు తమ యుద్ధ నైపుణ్యాలతో (గుర్రం, బాణం) ఓడించి బందీలుగానో, దాసులుగానో చేసుకుని ఆర్య సామ్రాజ్యాలను విస్తరించుకొన్నట్లు చరిత్ర తెలుపుతున్నది. మూలవాశి, సింధు సంస్కృతి చోట వైదిక భాష, వైదిక మత ప్రాబల్యం పొంది వర్ణవ్యవస్థకు జీవం పోసేలా వైదిక శక్తులు కృషిచేశాయి. అయినప్పటికీ వైదిక – అవైదిక శక్తుల మధ్య భావజాల సంఘర్షణ, ఆధిపత్య పోరు ఆగిపోలేదు. సరిగ్గా పరస్పర విరుద్ధ భావజాలాల శక్తుల నుంచే లోకాయతులు, సాఖ్యం, జైనం, బౌద్ధం క్రమంగా వికసించాయి. ఇందులో బౌద్ధతత్వశాస్త్రం అనూహ్యంగా అగ్రశిఖరాలకు చేరి వేదాలను, వేద సంస్కృతిని దాదాపు కనుమరుగయ్యే పరిస్థితికి కొనిరావడం గమనార్హం. ప్రజలు మాట్లాడే పాలీ భాషతో నూతన జీవతత్వశాస్త్రాలతో ఎదిగిన బౌద్ధం, ఈ దేశ భవిష్యత్తుకు ఎన్నో రూపాల్లో మార్గదర్శకం చేసి, ప్రగతికి బాటలు చూపడం అనూహ్యం.

వర్ణ వ్యవస్థ మూలంగా ఆనాటి సమాజం వందలాది కులాలతో విభజింపబడి కొందరి అగ్రశ్రేణుల కులాల ఆధిపత్యంలో నడిచేది. అస్పృశ్యతలాంటి భయంకర సమస్యలు మొలకెత్తాయి. బుద్ధుడు, బౌద్ధ సంఘాల ఆవిర్భావాలతో, దానికి తోడు వాటికి రాజాదరణ లభించడంతో, తిరోగమన భావజాలాల పట్టు సడలి సమధర్మ, సమతా, న్యాయ, కరుణ, శాంతి బీజాలు నెలకొల్పి సమాజంలో సుస్థిరత్వం సాధించినట్లు తెలుస్తోంది. బౌద్ధ ధర్మ – కాల చక్ర పరిణామాల వలన దేశంలోని వివిధ ధర్మాలకు, మతాలకు, కుల, భాషా, ప్రాంతాలకు చెందిన వివిధ వర్గాల వారు సమిష్టి భావనను అందుకొని సమగ్ర అభివృద్ధికి తోడ్పడడం ఆనాటి గొప్ప చారిత్రక పరిణామం.

కోట్లాది ప్రజలచేత ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడిన ప్రవక్తలు గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మద్‌పైగంబర్‌లు. ఇందులో బుద్ధుడు నేను మార్గదాతను మాత్రమే, ముక్తిదాతను కాదని ప్రబోధించగా, మిగిలిన ఇద్దరు నేరుగా దేవదూతలుగా తమకు తామే సంబోధించుకొని మత దేవతలుగా ఎదిగినారు. కనీసం జైనం స్థాయిలో హిందూ మతంగా చెప్పే వైదిక మతంలో ఒక ప్రవక్తలేకపోవడం గమనార్హం. తొలి బౌద్ధం మతరూపాన్ని సంతరించుకోనిది మానవతావాద, వాస్తవిక, హేతువాద, సామాజిక రాజనీతి తత్వశాస్త్రం. గ్రీకు సోక్రటీస్, ప్లాటోల కన్న ముందటివాడు బుద్ధుడు. ఆయన ఆలోచనా విధానం ఎన్నో శాస్త్ర రంగాల ద్వారాలకు తలుపులు తెరచి కొత్త కొత్త ఆవిష్కరణలకు కారణభూతమైంది. నేటికీ ఆధునిక మానసిక, సామాజిక, రాజనీతి తత్వశాస్త్రవేత్తలు అందుకోలేని ఎన్నో అంశాలను 2500 ఏళ్ల క్రితం గౌతమబుద్ధుడు అందుకోవడం అసాధారణమయిన విషయం. ఆయన బోధనలలో సజీవ అంశాలు ఉన్నందువల్ల అవి ఆనాటి మామూలు జనసామాన్యం నుంచి ధనిక, పురోహిత, క్షత్రియ వర్గాల్లోనూ విశేష ఆదరణను చూరగొన్నది. యజ్ఞాలను, వేదాలను తిరస్కరించడం మానవులందరు సమానమని, మనిషి దుఃఖాన్ని గుర్తింపజేయడం దాని నివారణకు సంఘశక్తి ఆవశ్యకతను, కార్యాకారణం తెలియజేయడం ఒక్క బుద్ధుడికే సాధ్యం కాగలిగింది. వైదిక ధర్మాలకు ప్రత్యామ్నాయంగా ఒక నూతన శకయుగం భారతావనిలో ఉదయించి అతి కొద్దికాలంలోనే దేశ, విదేశాల్లో ఎంతో దూరం వరకు విస్తరించగలిగింది. అశోకుని కాలంలో బౌద్ధవ్యాప్తి ఒక మిషనరీలాగా వ్యాప్తిచెంది విశ్వఖ్యాతి గడించింది. అట్లే హర్ష, కనిష్క శాతవాహన రాజుల కాలంలోనూ, బౌద్ధం ప్రజల్లోనూ, రాజుల్లోనూ ఆదరణ పొంది బౌద్ధ భావజాలం జీవం పోసుకున్నది.

బౌద్ధ భావజాలం మూలంగా ప్రాచీన భారతదేశం విద్యా, వ్యాపార, కళా, సాహిత్య, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో సామాజిక, రాజనీతి రంగాలలో సాధించిన ప్రగతి అత్యున్నతస్థాయికి చేరి సమస్త ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా మారి గుర్తింపు పొందినది.

క్రీ.శ. 1–3 శతాబ్దాల మధ్యకాలం నాటి వైద్య గ్రంథాలు చరక సంహిత, శుశృత సంహితలు – భారతవైద్య విజ్ఞానానికి అద్దం పడతాయి. ఈనాటి ఆధునిక ప్లాస్టిక్ సర్జరీ విధానం శుశృత సంహితలో వివరంగా ఉంది. అలెగ్జాండర్ దండయాత్ర నాటికే ఇండియా వైద్య, శస్త్ర చికిత్సలో పేరుమోసింది. బింబిసారుడనే బౌద్ధ చక్రవర్తి బుద్ధునికి వైద్యం చేయడానికి ప్రసిద్ధ నలంద విశ్వవిద్యాలయంలో అగ్రశ్రేణి వైద్యునిగా

పేరొందిన జీవకుడిని 'పర్సనల్ ఫిజీషియన్'గా నియమించినట్లు బౌద్ధగ్రంథంలో ప్రస్తావన ఉంది. ఇప్పుడిప్పుడే ఆవిర్భవించిన వైద్య సాంకేతిక పరిజ్ఞానానికి చెందిన ఇన్‌హేలర్ వైద్యానికి జీవకుడు ఆద్యుడు. ఆయన అందించిన వైద్య జ్ఞానం ద్వారా బుద్ధుడి అనేక రుగ్మతలు దూరం కాగలిగాయని 'వినయ పీటకం'లో వివరించి ఉంది. వినయపీటకం కాల్పనిక సాహిత్యం కాదు. బౌద్ధ త్రిపిటికలలోని ప్రధాన గ్రంథమన్న విషయం చరిత్రకారులందరికి తెలిసినదే.

అట్లే లోహ విజ్ఞానానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం గొప్పతనం తెలుసుకోవాలంటే బౌద్ధకాలంలో స్థాపించిన స్థూపాల గురించి పరిశోధించాలి. అవి నేటికీ తుప్పు పట్టకపోవడం వెనుక రహస్యం ఏమిటో తెలుసుకోవాలి. కుతుబ్ మీనార్ వద్ద ఉన్న ఇనుప స్తంభం క్రీ.శ. 4వ శతాబ్ది నాటిది. అది నేటికీ తుప్పు పట్టకపోవడం పరిశోధనా నిపుణులనే అబ్బురపెట్టిన అంశం. డెమాస్కస్ కత్తుల గురించి, కంచు మిశ్రమ లోహాల గొప్పతనాల గురించి విదేశీయులే ప్రశంసించిన సందర్భాలను ఇక వివరించనక్కర్లేదు. వస్త్ర పరిశ్రమలో నేతన్నల వృత్తి నైపుణ్యం అద్వితీయమైనది. ఆ కాలంలో రోమన్ సామ్రాజ్యాలు మన దేశ వస్త్రాలను దిగుమతి చేసుకొని తమ ఖజానాను ఖాళీ చేసుకున్నట్లు చరిత్ర తెలుపుతున్నది. దానివలన భారత్‌కు ఏడాదికి నికరంగా ఒక మిలియన్ పౌండ్లు బంగారు నాణేల రూపంలో చెల్లించడం జరిగింది. దానివలన రోమ్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని భారతదేశ వస్త్రాలపై నిషేధం విధించింది. అంతటి ఘనకీర్తిగల మన వస్త్ర సాంకేతిక రంగం బ్రిటిష్ వలసపాలనతో నేడు ఆత్మహత్యల మార్గం చేపట్టడం శోచనీయం.

పెయింట్లు, రంగులలోనూ భారత్ సాధించిన ప్రగతికి నిదర్శనంగా అజంతా చిత్రీకరణకు వాడిన రంగుల నాణ్యతను పేర్కొనాలి. అలాగే నౌకా నిర్మాణంలో, నౌకాయానంలో భారతదేశ ప్రజలు గొప్ప సాంకేతికపరులుగా, సాహసికులుగా గుర్తింపు లభించింది. కాని బౌద్ధ పతనానంతరం, బ్రాహ్మణ మత విశ్వాసాల మూలంగా, సముద్రయానంపై వైదిక ధర్మశాస్త్రాలు విధించిన నిషేధంతో మనం బావిలో కప్పలుగా మారిపోయి, మన అభివృద్ధికి మనమే అడ్డుకట్ట వేసుకొన్నాం. మరీ ముఖ్యంగా వైదిక పురోహితులు చెప్పిందే 'వేదవాక్కు' అయ్యింది.

ప్రఖ్యాత గణిత మేధావి ఆర్యభట్ట – 2 (3.14) విలువను క్రీ.శ. 500 నాటికే కనుగొని కచ్చితంగా చెప్పాడు. భూమి తన చుట్టూ తాను తిరుగుతుందని, సూర్యుడు పశ్చిమంగా కదులుతున్నట్లు కనిపిస్తాడని చెప్పిన తొలి వ్యక్తి ఆయన. గ్రహణాలు రాహు కేతువుల పని కాదని భూమి, చంద్రుడి పరిభ్రమణల వల్లనే అవి సంభవిస్తాయని చెప్పి పుక్కిట పురాణాలను ఎండగట్టాడు. దీంతో ఆయనపై వైదికులు కత్తిగట్టి అవహేళన చేసి, వేధించారు. వేద విజ్ఞానంకు వ్యతిరేకమని నిందించారు. ఖగోళ పరిశోధనలో చేసిన గొప్ప పరిశోధనల స్మృతి నిమిత్తం, కొన్ని వందల ఏళ్ల తర్వాతనైతేనేమి, ఆర్యభట్ట కృషిని ఆధునిక భారత సమాజం గుర్తించింది. భారత్ తొలి ఉపగ్రహానికి ఆయన పేరుపెట్టి నివాళి అర్పించింది. దేశంలోని కిందికుల, వర్గాలవారు శాస్త్ర, సాంకేతిక రంగాలు వృద్ధి చెందితే సుఖపడతారు. వారికీ విద్యా అవకాశాలు లభిస్తే తమను మించిపోయి తమ అదుపాజ్ఞలలో ఉండరని అప్పుడు తమ విశిష్ట కుల వర్గాల ఆధిపత్యాలకే ప్రమాదమని మొదలు గుర్తించింది వైదిక పౌరోహిత శక్తులే. లేనిచో తమకూ, తమ ఆధిపత్యాల కింద ఉన్న క్షత్రియులకు మాత్రమే పరిమితమైన రాజ్య సుఖవైభోగాలకు ఆటంకం కలుగుతుందని భావించారు. శూద్ర, అతిశూద్రులు తెలివి మీరితే తమ మాటకు, ధర్మశాస్త్రాలకు విలువ పోతుంది. తమ పెత్తనం అంతరిస్తుంది. ధర్మం ప్రమాదంలో పడి అరాచకం మొదలవుతుందని ఘోషించడం మొదలెట్టారు. బౌద్ధాన్ని వ్యతిరేకించిన ఈ వైదికులు, తమకు తామే దైవాంశ సంభూతులుగా, దైవదూతలుగా, పూజార్లు, స్వాములుగా మారి ఉన్నత కులాలతో చేతులు కలిపి, స్వయంపోషక వృత్తి కులాల ఉత్పత్తి శక్తులను అణిచివేయడం చేశారు. అలా జరగకపోయి ఉంటే ఈ దేశం ఈనాటికీ ఇంత గాఢాంధకార దేశంగా మారకపోయేది. అంతేకాదు దుఃఖాన్ని, దుఃఖ నిరోధాన్ని శోధించిన తత్వాలకు కాలదోషం పట్టకపోయేది. (చారిత్రక పరిణామాలను ఆపలేమని అంతా 'విధి' రాతగా కొందరి భావన).

విదేశీ దురాక్రమణదారుల పాలనలోకి పోయి దాస్యం చేయవలసిన గతి వచ్చి ఉండకపోయేది. బ్రిటిష్ వారు వచ్చి ఎంతో కొంత నిమ్నవర్గాలలో విద్యాభివృద్ధికి వెసులుబాటు కల్పించినా, వారి పారిశ్రామిక విధానాలతో మన దేశ వృత్తి కులాల పొట్టలపై కాలుపెట్టి వలసబాటలు పట్టించి రెంటికి చెడ్డ రేవడిని చేసేది కాదు. ఒక బుద్ధుడు, ఐన్‌స్టీన్ పుట్టాల్సిన తరుణంలో ఒక మనువు, శంకరాచార్యులు, (ప్రచ్ఛన్న బుద్ధుడు) గాంధీ పుట్టి ఉండేవారు కాదు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్ లాంటి వారు పుట్టినా ఒకరిని సంఘ సంస్కరణలకు కుదించడమో, మరొకరిని దళితులకు చెందిన వ్యక్తిగా ముద్రించి భావిండమో జరిగిపోయిందంటే ఎంత శోచనీయమో గమనించాలి.

వైదిక సంస్కృతిని, సంప్రదాయాలను వ్యతిరేకించి, ప్రశ్నించే గుణాన్ని పెంపొందించుకొని కార్యకారణవాదాలతో హేతుబద్ధంగా ఆలోచించినపుడే విజ్ఞాన శాస్త్రం, సమాజం ప్రగతి సాధిస్తాయి. బుద్ధుడు ఒక్కడే ఆ లోటును పూర్తిచేశాడు. పంచశీల, అష్టాంగ, ప్రతీత్య సముత్పాద ఆలోచనలను అందించి వైదిక సంప్రదాయాల నుంచి విముక్తి ప్రసాదించాడు. చాతుర్వర్ణ వ్యవస్థ కుల పునాదులను ఎంతో కొంత మేరలో నైనా పెకిలించిన ఘనత ఆ మహానుభావుడికే దక్కింది. ఆయన ఆలోచన ఫలితంగానే ఏ పెంటకుప్ప మీదో దొరికిన జీవకుడు, ఏ కులమో తెలియకుండానే గొప్ప వైద్య శాస్త్రవేత్తగా బౌద్ధ సమాజం తీర్చిదిద్దిందన్న విషయం మరిచిపోకూడదు.

వర్ణ వ్యవస్థలో శూద్ర, అతిశూద్ర, స్త్రీలు చదువుకోవడం నిషేధం. వైదిక, బ్రాహ్మణ శాస్త్రాలు అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. అందుకు ప్రత్యక్ష తార్కాణాలే ప్రాచీన పురాణాల ఏకలవ్యుడు, శంభూకుడు, కర్ణుడు, సత్యకామజాబాలి లాంటి వారు. ఆధునిక కాలంలో జ్యోతిరావు పూలే, అంబేద్కర్ నిమ్నకులాల సామాజిక విద్యాభివృద్ధి కోసం చేసిన కృషి మరవలేనిది. వీరు వేదాలను, స్మృతులను ప్రశ్నించారు. ధర్మశాస్త్రాలను, పురాణాల వాస్తవికతలపై పరిశోధించి నిలదీశారు. మనుస్మృతి దహనం చేశారు. వీరు హిందూ మతమంటే వైదిక, బ్రాహ్మణ మతమనే వాదనలను పరిశోధించి వెలికితీసి, కింది కులవర్గాల వారి దేవతలను క్షుద్ర

దేవతలని, వారి సంస్కృతి వైదిక సంస్కృతి కాదని సోదాహరణంగా నిరూపించి ఈ దేశం ఏ రంగంలోనూ అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన అడ్డంకిగా వైదిక ధర్మమే ముందు ఉందని, దాని భావజాలం కింద సర్పబంధాలతో కట్టివేయబడి భావదాస్యంతో యుగయుగాలుగా చీకటి కొట్టంలోకి తోసి వేయబడ్డదని గొప్ప దూరదృష్టితో పోరాడారు. ప్రశ్నించడం, వాస్తవిక సత్యాలను తెలుసుకోవడం ద్వారానే జ్ఞానం వికసిస్తుంది. బౌద్ధం ప్రశ్నించడాన్ని ప్రోత్సహించింది. సైన్సుకు, జ్ఞానానికి అదే పునాది. అందుకు మూఢవిశ్వాసాలను, సంప్రదాయాలను తిరస్కరించాలి. యూరప్‌లో క్రిస్టియానిటీ సైన్స్‌పై యుద్ధం చేసినా అక్కడి విజ్ఞానవేత్తలు చెక్కు చెదరక ముందుకు వెళ్లారు. అలాగే బౌద్ధులు, విజ్ఞానవేత్తలు, నిమ్నకులవర్గాల శ్రేయోభిలాషులు, విప్లవవాదులు కనిపెట్టిన ఎన్నో అంశాలపై వైదిక బ్రాహ్మణ వర్గాలు కత్తికట్టినట్లు చరిత్ర నిరూపిస్తున్నది. వారు కనిపెట్టిన ప్రతి ఒక్కదానికీ విరుద్ధంగా ప్రవర్తించి ఈ దేశాన్ని తిరోగమన దిశలోకి తీసుకువెళ్లారు. బౌద్ధం బాహ్య, అంతర్గత వైరుధ్యాలతో, విభేధాలతో బలహీనపడ్డ మరో క్షణమే పుష్యమిత్ర-శుంగ వంశజుల, శశాంకుల పాలన నుంచి వెనుకపట్టు పట్టే దశ ప్రారంభమైనట్టు తెలుస్తోంది. బౌద్ధం పతనంతో భారత పురోగతికి అడ్డుకట్ట పడ్డదన్నది గుర్తించాల్సిన పరిశోధనాంశం.

కాలచక్రం వెనుకకు మరలడంతో వైదిక సంప్రదాయం, భావజాలం తిరిగి బలం పుంజుకుంది. నిమ్నవర్గాలపై కొత్త కొత్త కట్టుబాట్లు, ఆంక్షలు విధిస్తూ, పకడ్బందీగా వాటిని అమలు చేస్తూ భయంకరమైన అణిచివేతను కొనసాగించారు. వృత్తి కులాలకు సంబంధించిన అన్ని శాస్త్రాలను, సైన్సుకు చెందిన అన్ని అంశాలనూ నీచమైనవిగా, దైవధిక్కారంగా ప్రచారం చేశారు. అంటరానితనం, కుల వివక్షలు మరింత పెరిగి మొత్తం ఉత్పత్తి కుల శక్తులనే నీచంగా భావించాయి. వారికి వేదాలు, పురాణాలు, శాస్త్రాలు, విజ్ఞానం అన్నీ రహస్యంగా మారాయి. కొత్త ఆలోచనలను, ఆవిష్కరణలను, ఉక్కుపాదంతో అణిచివేసి, ప్రశ్నించే, ధిక్కరించే శక్తులను బందీ చేశాయి.

వర్ణవ్యవస్థ సమాజాన్ని ఆరు వేలకు పై కులాలుగా చీల్చివేసింది. నిచ్చెన మెట్ల సమాజాన్ని పెంపొందించింది. కర్మ సిద్ధాంతం పేరుతో వారి అభివృద్ధికి అడ్డుకట్ట వేసింది. బ్రాహ్మణులు అత్యున్నత కులంగా, మేధావి వర్గంగా, తమకు తామే ప్రకటించుకొన్నారు. వారూ, వారితో మరికొన్ని కులాలు వైట్‌కాలర్ వృత్తులను చేపట్టాయి. మిగిలిన వారందరినీ శూద్ర – అతి శూద్రులుగా మార్చి వారి చెమటా, రక్తాలను తాగుతూ పరాన్న భుక్కులుగా మారారు. నిమ్న వర్గాలతో నిర్బంధంగా పనులు చేయించి, వారు నచ్చిన పనిని ఎంచుకొనే స్వేచ్ఛను హరించివేశారు. వంశపారంపర్యంగా, పూర్వ జన్మ కర్మ ఫలంగా సంక్రమించిన పనినే బలవంతంగా ఇష్టం లేకున్నా చేయాల్సి వచ్చింది. బయటి లోకంతో సంబంధం లేకుండా, చదువుకునే హక్కు లేకుండా చేశారు. అలాంటి పరిస్థితిలో వారికి కొత్త ఆలోచనలు రావు. కొత్త ఆవిష్కరణలు జరగవు అన్న విషయం వైదికులకు స్పష్టంగా తెలుసు. అందుకే మనుస్మృతిని అమలు చేశారు.

ఇంతేకాదు, అన్నిరకాల నిమ్నకులాల వృత్తులు, చివరికి చిత్రలేఖనం, ఆయుధతయారీ, వైద్య, నిర్మాణ, వ్యవసాయ, పశు పోషణలన్నీ నీచమైనవిగా మారాయి. శ్రాద్ధ కర్మలలో వైద్యుడికి భోజనం పెడితే అది పితరులకు గిట్టదని ధర్మశాస్త్రాలు, హిందూ పవిత్ర గ్రంథాలు ఘోషించాయి. శస్త్ర చికిత్సను ఆయుర్వేదం రాక్షస విద్యగా చిత్రించింది. రానురాను అది నీచ విజ్ఞానంగా తీర్చిదిద్ది దానిని నిమ్నకులాల స్త్రీలకు అంటగట్టించారు. గ్రామాల్లో ఇప్పటికీ వారే పురుడు పోస్తారు. (నాభి కుల స్త్రీలు).

భారతదేశంలో పరిస్థితి ఇలా ఉంటే పాశ్చాత్య దేశాల్లో నిమ్నకుల వర్గాల వారే మహాశాస్త్రవేత్తలుగా మారిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ప్రసిద్ధ శాస్త్రవేత్త విద్యుత్ జనక పితామహుడు మైకల్ ఫారడే చెప్పులు కుట్టే వాడన్న విషయం పాఠశాలల్లో చదివిందే. అక్కడ వర్ణ కుల వ్యవస్థ లేకపోవడం మూలంగా మానవులందరూ సమానమనే ధార్మిక భావాల మూలంగా విజ్ఞానం కింది వర్గాల వరకు చేరగలిగింది. సమాజాలు అభివృద్ధి పథంలోకి వెళ్లగలిగాయి.

బ్రిటిష్ వలస పాలనలోనూ, ఆ తదుపరి కాలంలోనూ భారతదేశం వైజ్ఞానిక, సాహిత్య, కళా, క్రీడారంగాలలో సాధించిన ప్రగతి ఏమిటో అందరికీ తెలిసినదే. 1920 ప్రాంతంలో సి.వి. రామన్ సాధించిన ఒక్క నోబెల్ బహుమతి, రవీంద్రుడు సాధించిన మరొక్క బహుమతి, ఆర్థికరంగంలో ఇటీవలి అమర్త్యసేన్ సాధించిన విజయాల మధ్య కాలాంతరం ఎంత ఉందో తెలిసిందే. ఒక ఓలింపిక్ మెడల్ కోసం పడుతున్న తపన, ఒక ఆస్కార్ కోసం ఎదురుచూపుల సంగతి ఇక వేరే చెప్పనక్కరనే లేదు. ఐటి కమ్యూనికేషన్, స్పేస్ రంగాలలో ఎంతో ప్రగతి సాధించామని ఎన్ని గొప్పలు చెప్పినా నేటికీ బడుగు, బలహీన వర్గాల వారికి విద్యాస్థాయి, హోదా, జీవన పరిస్థితి ఈ దేశంలో ఏ రూపంలో ఉందో భ్రష్టుపట్టిన ఈ దేశ రాజకీయ వ్యవస్థనే అడగాలి. వారు నిత్యం జపించే సామాజిక న్యాయం నిర్వచనమేమిటో ప్రశ్నించాలి. ప్రతిభ ఒకరి సొత్తు కాదని, రిజర్వేషన్ నిమ్నవర్గాలకూ అవసరమని మొసలికన్నీరు కార్చి తమ రాజకీయ పబ్బాన్ని గడుపుకుంటున్న పాలకవర్గాలను నిలదీయాలి. వారేమి జవాబు చెప్తారో వినాలి. అది ఎంతవరకు కింది స్థాయి వర్గాల వరకు చేరగలదో ఎంతో కొంత సమయమైన వెచ్చించి ఆలోచించాలి. మనకే తెలుస్తుంది. ప్రస్తుత రాజకీయ నేపథ్యాల వెనుక గల రహస్యాలేమిటో? కొందరు మతాలపై, కులాలపై, భాషాభిమానాలపై చేసే ఉద్దేశ్యపూరిత రాజకీయాల్లో ఈ దేశ పీడిత ప్రజల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ఆలోచించి తెలుసుకొని, చైతన్యవంతులు కావల్సిన అవసరం ఎంతో ఉంది. ఇందులో హిందూ మత పరిరక్షకులమనీ ప్రాచీన సంస్కృతి వారసులమనీ, సహనానికి మారుపేరనీ ప్రకటించే భావజాల శక్తుల బండారాన్ని బయటపెట్టి ఎండగట్టాల్సిన ఆవశ్యకత మరెంతో ఉంది.

భారతదేశ పీడిత ప్రజలు, అందులో అణచబడ్డ నిమ్నవర్గాలు సుదీర్ఘకాలం చీకటి ఖండంలో తోయబడి, భావదాస్యంలో ముంచబడ్డారు. అతికొద్ది శాతం విశిష్ట కులవర్గాలు తరతరాలుగా తమ ఆధిపత్యం పీడిత ప్రజలపై చలాయిస్తూనే ఉన్నారు. వారి పాలనఅంతం కావడానికి పీడిత ప్రజలు సంఘటితమై రాజీలేని పోరు చేయడమే ఏకైక మార్గం.

వీ

గ్రామీణ నిరుద్యోగ ప్రజానీకానికి ఉపాధి హామీ పథకం కాస్త ఊరట అని పేర్కొంటూ ఈ పథకం అమలు వివరాలు అందిస్తున్నారు **బుర్ర శ్రీధర్, కేతిరెడ్డి వాసు**

జాతీయ ఉపాధి హామీ పథకం - అమలు

భారతదేశ అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలు. ఈ దేశంలో ప్రజలు దాదాపు యాభై ఏడు శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడి నివసిస్తున్న వారికి సంవత్సరంలోని అన్ని రోజులూ పని దొరకదు. పైగా మనదేశ వ్యవసాయం రుతుపవనాలపై ఆధారపడి కొనసాగుతున్నది. తద్వారా వ్యవసాయంలో ప్రచ్ఛన్న నిరుద్యోగం ఏర్పడుతోంది. ప్రచ్ఛన్న నిరుద్యోగంతో అంటే ఒక వ్యక్తి చేసే పనినే ఇద్దరు వ్యక్తులు చేయడం. అంటే, అదనపు వ్యక్తి చేసే పనివల్ల ఉత్పత్తి శూన్యం. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగిత ఏర్పడి, తద్వారా పేదరికం పెరిగి ఆర్థిక అసమానతలు చోటు చేసుకుంటున్నాయి. పేదరికం రూపుమాపి బడుగు వర్గాల వారికి చేయూత నియ్యడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం నిరుపేద కూలీల జీవనజ్యోతి.

మన దేశంలో జనాభా పెరిగినంత త్వరగా జీవనోపాధి లభించడంలేదు. దీనికి కారణం వారికి తగినంతగా పని దొరకకపోవడం, అందరూ నైపుణ్యమైన పనులు చేయలేకపోవడం కారణంగా అనేక మంది కూలీలు వలసలకు వెళ్తున్నారు. ఈ వలసలను ఆపడానికి నైపుణ్యంతో సంబంధం లేని పనులు చేయడానికి కేంద్రప్రభుత్వం చేపట్టిన ఈ పథకంవల్ల గ్రామీణుల వలసలు చాలావరకు ఆగే అవకాశం ఉంది. అక్షరాస్యతలో అభివృద్ధి సాధించిన వారికి జీవనోపాధి కల్పించడంలో సఫలం కాలేదు. సాంకేతిక విద్యను కలిగినవారు వారి సామర్థ్యాల మేరకు ఇతర దేశాలలో ఉద్యోగాలు సంపాదించుకోవడంవల్ల ఈ దేశంలో ఉన్న మానవ వనరులు కూడా వలస పోతున్నాయి. దీనివల్ల వనరుల కొరత, ఉన్న వనరులను సరిగా వినియోగించుకోకపోవడం జరుగుతోంది.

భారతదేశంలోని 604 జిల్లాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని 11 ఏప్రిల్ 2008న యుపిఎ ప్రభుత్వం పేర్కొన్నది. దీనికి కావలసిన నిధులు కూడా 2008-09 కేంద్ర బడ్జెట్‌లో పథకానికి ఇరవై శాతం అదనంగా సమకూర్చారు. అవసరమైతే ఇంకా ఎక్కువ నిధులు కూడా అందజేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం ప్రకటించడం శుభపరిణామం. ఈ పథకానికి 2008-09 బడ్జెట్‌లో పదహారు వేల కోట్ల రూపాయలు కేటాయించారు. 2007-08లో 3.10 కోట్ల మంది పని కోరగా 3.08 కోట్ల మందికి ఉపాధి కల్పించారు. అయితే 32.26 లక్షల మందికి మాత్రమే వంద రోజుల పని దొరికింది. ఈ పథకం కింద రాజస్థాన్‌లో 23 శాతం, మధ్యప్రదేశ్‌లో 13 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 7 శాతం, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో 6 శాతం మందికి సంవత్సరంలో వంద రోజుల ఉపాధి లభించింది. ఈ పథకం కింద ఉపాధి పొందిన వారిలో 27.4 శాతం షెడ్యూల్డ్ తరగతులకు చెందినవారు కాగా, 30 శాతం గిరిజనులు ఉన్నారు. మహిళలు మొత్తం ఉపాధిలో 3వ వంతు ఉండాలని చట్టం నిర్దేశించగా అంతకంటే ఎక్కువగా 42.13 శాతం లబ్ధిపొందిన వారు మహిళలు కావడం విశేషం. వేతన చెల్లింపులకు గాను దేశం మొత్తం మీద 1,10,28,779 అకౌంట్లను ప్రారంభించారు. 15.61 లక్షల పనులు చేపట్టారు. ఇందులో 4.96 లక్షల పనులు పూర్తి చేశారు. మిగిలిన 10.64 లక్షల పనులు పూర్తి చేయాల్సి ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో సగటున 42.17 పని రోజులు కల్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 88,73,036 కుటుంబాలకు ఉపాధి కార్డులను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు వందరోజుల పనిని 4,02,007 కుటుంబాలకు కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 42,258 కుటుంబాలకు పని కల్పించగా, అత్యల్పంగా గుంటూరు జిల్లాలో 719 కుటుంబాలకు పని కల్పించారు. చిత్తూరులో సగటు పని దినాలు 56.37 కాగా, ప్రకాశం జిల్లాలో 27.16 గా నమోదయింది. గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 11,57,116 పనులకు అనుమతులు మంజూరుకాగా, 3,27,175 పనులు పూర్తయ్యాయి. చిత్తూరులో 26,904, ఖమ్మంలో 16,621, మహబూబ్‌నగర్‌లో 13,280, గుంటూరులో 5,735 పనుల వివరాలు తెలియడం లేదు. పనులు ప్రారంభించాక పురోగతిని వివరించని జిల్లాల్లో ఖమ్మం, మహబూబ్‌నగర్, తూర్పుగోదావరి జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. కొన్ని చోట్ల పనులు మొదలుపెట్టి మధ్యలో అనివార్య కారణాల వల్ల పనులు ఆపడం జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ పథకం ఆదర్శవంతంగా అమలు అవుతోందని ఇటీవలి కాలంలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 26.47 శాతం, మహబూబ్‌నగర్ జిల్లాలో 19.65 శాతం, అదిలాబాద్ జిల్లాలో 17.79 శాతం కూలీలకు ముప్పై రోజులలో కూలీలు చెల్లిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 0.97 శాతం, చిత్తూరు జిల్లాలో 2.63 శాతం, మెదక్ జిల్లాలో 4.97 శాతం కూలీలకు ముప్పై రోజుల తర్వాత కూలీలు చెల్లిస్తున్నారు. స్థానికంగా జిల్లా యంత్రాంగం సక్రమంగా వ్యవహరిస్తున్నచోట్ల పనులు త్వరగా పూర్తయి, త్వరగా వేతనాలు చెల్లించడం జరుగుతోంది. ఒక్కొక్క కూలీకి రోజుకు రు. 82.66 చెల్లిస్తున్నారు.

భూయాజమాన్యాన్ని రైతు సహకార సంఘాలకు బదిలీ చేసి పర్యావరణ అనుకూల, ఆరోగ్యకర విధానాలతో సుస్థిరత దిశగా అడుగులేస్తున్న క్యూబా వ్యవసాయాన్ని వివరిస్తున్నారు **రిచర్డ్ లెవిన్స్**

ప్రత్యేక పంథాలో క్యూబా ప్రగతి

ప్రస్తుతం ప్రపంచం తీవ్ర సందిగ్ధంలో ఉంది. ఒకవైపున ప్రపంచ ప్రజలు, అనేక ప్రభుత్వాలు మెరుగైన జీవన ప్రమాణాలను కోరుకుంటున్నాయి. ఇంకోవైపున, మెరుగైన జీవన ప్రమాణాలు అంటే యూరపు, ఉత్తర అమెరికాల జీవన సరళిని అనుసరించటమనుకుంటే మనందరి మద్దతు, మనుగడను, వ్యవస్థను నాశనం చేస్తాయి. ప్రపంచ జనాభాలో అధికశాతం ప్రజలను పేదరికంలో ఉంచలేం, అట్లాగని వారిని వినియోగదారి జీవన విధానంలోకి తీసుకుని రాలేం. సమానత, సుస్థిరత అన్న లక్ష్యాలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తున్నాయి. రెండు ముఖ్యమైన లక్ష్యాలు తరచు ఒకదానితో ఒకటి పొసగవు అనిపించినపుడు దానర్థం మనం సమస్యను పరిమిత దృష్టితో చూశామని. అభివృద్ధి, ప్రగతి అన్నవి తక్కువ అభివృద్ధి స్థాయి నుంచి మరింత అభివృద్ధి అన్న స్థాయికి చేరుకునే ఏకైక మార్గాన్ని అనుసరించటమయితే దీనికి పరిష్కారం లేదు. అలాకాక అభివృద్ధి అనేది అనేక దారులు ఉన్న మార్గమైతే దారి పొడవునా అనేక ఎంపికలకు అవకాశం ఉంటుంది. జీవన ప్రమాణాలను పెంచటమన్నది సుస్థిర పరిమితులకు లోబడి జీవన నాణ్యతను పెంచటంగా చూస్తే, ఆర్థిక అభివృద్ధి అన్నదే లక్ష్యంగా కాక సుస్థిర, వైవిధ్యభరిత, ప్రజా అనుకూల పర్యావరణంలో సమానత, ఆరోగ్యం, విద్య, సంస్కృతి, వినోదం, పరస్పర సంరక్షణలకు ప్రాధాన్యత నిస్తూ, జీవనాన్ని సుసంపన్నం చేస్తూ ప్రకృతిని కాపాడటానికి సాధనంగా చూస్తే; క్యూబా అనుసరిస్తున్న ప్రత్యేక పంథా ఇదే.

ప్రతి సమాజానికి దానికే ప్రత్యేకమైన ప్రజల సంబంధాలు, జీవన అవసరాలను ఉత్పత్తి చేసే పద్ధతులు, ప్రకృతితో సంబంధాలు ఉంటాయి. సామాజిక రూపంలో సంభవించిన ప్రతి పెద్ద మార్పుతో పాటు జీవ, నిర్జీవ ప్రకృతిలో – మొక్కలు, జంతువులలో, రోగకారక క్రిములలో, నేల, నీరు, గాలితో సంబంధాలలో మార్పులు వచ్చాయి. క్యూబాలో సోషలిస్టు సమాజం రూపుదిద్దుకోవడం మనం చూస్తున్నాం. ఉత్పత్తిలో, జనాభాలో, ఆవాసాలలో, మానవ సంబంధాలలో, పరిసరాలతో మన సంబంధాలలో సోషలిస్టు పద్ధతులను చూస్తున్నాం. ఈ ప్రక్రియలో వ్యవసాయం ఒక అంశం.

సమస్యలను పరిష్కరిస్తున్న క్రమంలో ప్రయాణం చేస్తూనే, సమస్యల గురించి ఆలోచిస్తున్న క్రమంలో ఈ మారుతున్న సంబంధాలు విభిన్న స్థాయిలలో అభివృద్ధి చెందుతుంటాయి. సోషలిస్ట్ ప్రకృతి సొబగు, అడవి, పంటలు, సాంకేతిక విజ్ఞానం ఉండాలంటే మనం ఏం చెయ్యాలని ఎవ్వరూ తీరుబడిగా కూర్చుని ప్రశ్నించుకోలేరు. అయినప్పటికీ క్యూబాలో అదే జరుగుతోంది. సోషలిస్టు జీవావరణని మనుషులు – భూమి మధ్య, మనుషులు – పురుగులు, శిలీంధ్రాలు, టమాటోల మధ్య సోషలిస్టు పద్ధతిలో సంబంధాలను క్యూబా సృష్టిస్తోంది. కొన్ని ఆలోచనలను ఆచరణలో పెట్టిచూసి, వాటిని త్యజించి, కొత్త పద్ధతుల్లో మళ్లీ చేసి చూడటం ద్వారా మార్పులు అనుకోకుండా సంభవిస్తున్నాయని కొన్నిసార్లు అనిపించవచ్చు. సోవియట్ రష్యా కుప్పకూలటం, అమెరికా విధించిన ఆర్థిక వ్యాపార దిగ్బంధాలకు అత్యవసర స్పందనలుగా మాత్రమే కొత్త వాటిని కనుగొన్నారని కొన్నిసార్లు అనిపించవచ్చు. ఈ ప్రక్రియలో తలమునకలై ఉన్న ప్రజలకు తమ పనుల నుంచి ఒక్క క్షణం ఊపిరి తీసుకుని 'అందరూ చూడండి! మేము సోషలిస్టు జీవ సామాజిక వ్యవస్థని సృష్టిస్తున్నాం!' అని చెప్పే సమయం కూడా లేదు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగే పనులపై పర్యవేక్షణను వికేంద్రీకరించి గ్రామసభ ఆడిట్ అధికారం కల్పించారు. ఈ పథకం కింద చేపట్టే పనుల నిర్ణయం, ప్రణాళికలను రూపొందించడం, వాటి అమలులో పంచాయత్‌రాజ్ సంస్థలకు పెద్దపీట వేస్తున్నారు. గ్రామసభకు ఈ పథకం పై ప్రత్యేక ఆడిట్ చేసే అధికారం ఉంది. స్థానికంగా పర్యవేక్షణ కమిటీలను నియమించి పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో నాణ్యతను పరిశీలిస్తారు. ఈ కమిటీలో గిరిజనులు, దళితులు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తారు. పనులకు సంబంధించిన పట్టికలను తయారుచేసి వాటిని పారదర్శకంగా ప్రజలు తెలుసుకునేటట్లు అందుబాటులోకి తేవాలి. పనులకు వనరులను కేటాయించి, కేటాయించిన పనులపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా 'సమగ్రమైన మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం' ను రూపొందించారు. ఇటీవలి కాలంలో ఈ సాంకేతిక పరిజ్ఞానానికి ఉత్తమ జాతీయ సాంకేతిక అవార్డు కూడా లభించింది.

ఈ పథకంలో స్త్రీ, పురుషులకు సమాన వేతనాలు కల్పించడం ఒక ముందడుగుగా భావించవచ్చు. ఎందుకంటే ప్రపంచంలో స్త్రీ పురుషునితో సమానంగా అన్ని పనుల్లో పాల్గొని విజయం పొందటం నేడు మనం చూస్తూనే ఉన్నాం. ప్రతిసారి ఈ దేశం నాకు ఏమిచ్చింది అనుకుంటూ ఉంటే ఫలితం ఏమీ ఉండదు, నేను ఈ దేశానికి ఏమి చేశాను, అని ఆలోచించి పనులు ప్రారంభిస్తే ఈ దేశం అభివృద్ధి చెందిన దేశాల వరుసలో కచ్చితంగా ఉండగలదు. మనం ప్రయాణించే ఎంత దూరం అయినా మొదట ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది. వీ

కాని క్యూబాలో జరుగుతోంది అదే. కొన్ని కొత్త విషయాల పట్ల అబ్బుర పడినప్పుడు కానీ, వాటిల్లో కొన్నింటిని తమ దేశంలో ఆచరింప చేయాలని అనుకున్నప్పుడు కానీ సందర్శకులు గమనించని విషయం అదే. క్యూబన్ వ్యవసాయం సోషలిస్ట్ వ్యవసాయం. క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో సామాజిక లక్ష్యాలను సాధించటానికి దీనిని రూపొందించారు.

అయితే క్యూబన్ వ్యవసాయంలో 'సోషలిస్ట్' అంశాలు ఏమిటి? సోషలిజంలో వనరులు నేరుగా సహకార సంఘాల ద్వారా గాని, పరోక్షంగా రాజ్యం ద్వారాకాని 'సహ ఉత్పత్తిదారుల' చేతుల్లో ఉంటాయి. రాజ్యం ద్వారా యాజమాన్యం మరీ పరోక్షంగా ఉన్నప్పుడు ఎటువంటి మార్పులు చేర్పులకు అవకాశం లేనప్పుడు, తగినంత ప్రజాస్వామ్యం లేనప్పుడు వనరులపై ఆధిపత్యంలో కొత్త రూపాలను అనుసరించారు. ప్రత్యేక ఉత్పత్తి కార్యక్రమాలకు తరచు రైతు సంఘాలు, లేదా స్థానిక ప్రభుత్వాలు నాయకత్వం వహిస్తుంటాయి. తాము చేపట్టిన పనికి సంబంధించిన సాధారణ విధానాల నిర్ణయాలకు సంబంధించే కాకుండా జాతీయ స్థాయి నిర్ణయాలలో పాలుపంచుకోవటానికీ, శాస్త్రజ్ఞులతో కలిసి సమష్టిగా సమస్యలు పరిష్కరించటానికీ, వ్యవసాయంలో పని చేస్తున్న వారి సామాజిక విజ్ఞానాన్ని సమీకరించటానికీ గ్రామీణ ప్రజాస్వామ్యంలో వివిధ రూపాలు అవసరమవుతాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పట్టణ ప్రాంతాల పాలకులు గ్రామీణ ప్రాంతాలను సాధ్యమైనంతగా కొల్లగొడతారు. క్యూబన్ సోషలిజంలో దీనిని అనేక విధాలుగా సరిదిద్దారు.

- గ్రామీణ ప్రాంతాల్లో, చిన్న పట్టణాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రాధాన్యతను ఇవ్వటం, ప్రజలకు సమాన విద్య, ఆరోగ్య సేవలను అందించటం, అత్యంత ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని తరచు ముందుగా కొండలలో, సుదూరంగా ఉన్న ప్రాంతాలకు అందజేస్తారు. ఉదాహరణకు ఫోటోవాల్టాయిక్ సౌరశక్తి ప్యానళ్ళు.
- వ్యవసాయ వ్యర్థ పదార్థాలను అక్కడే తిరిగి ఎరువుగా మార్చడం, పట్టణ వ్యర్థ పదార్థాలను తిరిగి నేలకు చేర్చడం. (ఇలా చేయాలంటే పట్టణ వ్యర్థపదార్థాలు విషరహితంగా ఉండాలి.)
- పల్లె ప్రాంతాలకు మారటానికి లేదా సంవత్సరంలో కొంతకాలం పాటు అక్కడ పని చెయ్యటానికి పట్టణ ప్రజలను నమోదు చేసుకోవటం.
- పట్టణ, పట్టణ చుట్టు పక్కల ప్రాంతాలలో వ్యవసాయాన్ని, గ్రామ ప్రాంతాలలో పరిశ్రమలని అభివృద్ధి పరచడం.
- సామాజికంగా నిర్ణయించిన అవసరాలను తీర్చటంపై పరిశోధనల దృష్టి కేంద్రీకరించడం.

నేరుగా వివిధ సహకార సంఘాల రూపాల ద్వారా లేదా పరోక్షంగా సోషలిస్టు రాజ్యం ద్వారా 'సహ ఉత్పత్తిదారులు' అయిన వారి చేతుల్లో వనరులు ఉండి, నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. సోషలిస్టు సిద్ధాంతం ప్రతిపాదించే భూ కమత విధానమేదీ లేదు. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల నుంచి భూ యాజమాన్యాన్ని సహకార సంఘాలకు బదిలీ చెయ్యటమంటే సోషలిజానికి తిలోదకాలు ఇవ్వటం కాదు. సామాజిక లక్ష్యాలకు మరింత చేరువ అవ్వటానికి సోషలిజంలో పునఃవ్యవస్థీకరణ ఇది. అయితే వ్యక్తిగత యాజమాన్యంలో లాగా వ్యవసాయ వాణిజ్యం, అత్యధిక లాభాలను సమకూర్చుకోటానికి కూలీలను పెట్టుకోవటం, కేవలం మార్కెట్ విలువ కోసం పంటలను ఎంపిక చేయటం, వ్యవసాయంలో పని చేసే వారి ఆరోగ్యాలను, భవిష్యత్ ఉత్పాదక సామర్థ్యాన్ని దెబ్బతీసే సాంకేతిక విజ్ఞానం వంటివి నిషేధాలు. అంతేకాకుండా లాభాపేక్షతో నడిచే వ్యవసాయ ఉత్పాదకాల (ఇన్‌పుట్స్) పరిశ్రమలు కూడా నిషేధమే. దీనివల్ల పరిశోధనల ప్రాధన్యతలే మారిపోతాయి. పెట్టుబడులు పెట్టడానికి పరిగణనలోకి తీసుకునే అంశాలు ఏ పంటలు వెయ్యాలి, ఎలా వెయ్యాలి వంటి నిర్ణయాలను ఇవి ప్రభావితం చేస్తాయి.

జనాభా మొత్తానికి ఆహారం అందించటం అన్నది మొదటి లక్ష్యం. ఇందుకు అనుగుణంగా ఎక్కువ అవసరం ఎక్కడ ఉందో అక్కడికి వ్యవసాయ ఉత్పత్తులు చేరేలా చేస్తారు. అందరికీ ఆహారం అందుబాటులో ఉండాలి అన్నప్పుడు పాల సరఫరా తక్కువగా ఉన్నప్పుడు వాటిలో వెన్న, జున్ను వంటి అధిక విలువ ఉత్పత్తులు తయారు చెయ్యకుండా దానిని ముందుగా పిల్లలకు సరఫరా చేస్తారు. దీని ఫలితంగా ప్రజలు తినే పంటలపై పరిశోధనలు తమ దృష్టిని కేంద్రీకరించాయి. ఇలా ఉత్పత్తి చేసిన పంటలను ప్రజలకు ఉత్పత్తికి అయిన ఖర్చు కంటే తక్కువకి అమ్మేవారు. భూమి వినియోగం, పట్టణ, పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంతాల మధ్య శ్రమ కేటాయింపు వంటి సమస్యలను; ఉత్పత్తి, ఉపాధితో సహా సామాజిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తారు.

ఆర్థికంగా గిట్టుబాటుగా ఉండటమన్నది రెండవ లక్ష్యం. అయితే దీనర్థం సాధ్యమైనంత ఎక్కువ లాభాలు దండుకోవటం కాదు. ప్రజలకు అవసరమయినది పూరించటానికి, ఉత్పత్తికి, అభివృద్ధికి అవసరమైన విదేశీ మారకద్రవ్యం కోసం ఎగుమతి పంటలకు కొంత భూమి కేటాయిస్తారు. అయితే ఆర్థికంగా లాభసాటిగా ఉండటం కోసం భూసారాన్ని బలిపెట్టడానికి, జీవ వైవిధ్యత కోల్పోటానికి, ప్రపంచం వేడెక్కిపోవటానికి దోహదం చెయ్యటానికి కానీ వీలులేదు. అలాగే నష్టాలకు గురి కాకుండా ఉండటానికి నిరుద్యోగాన్ని పెంచడాన్ని, సాగు విస్తీర్ణాన్ని తగ్గించడాన్ని కానీ అనుమతించరు. దీనికి విరుద్ధంగా పట్టణ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తారు – హెక్టారుకు ఇరవై మంది చొప్పున ఇది ఉపాధి కల్పిస్తుంది కాబట్టి, పట్టణ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఇది కూడ ఒక కారణమే. ఆ దిశగా పయనిస్తున్నప్పటికీ అన్ని వ్యవసాయ క్షేత్రాలూ ఆర్థికంగా లాభసాటిగా లేవు. పాతకాలపు చిన్న రైతుల జాతీయ సమాఖ్య సహకార సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. కొత్తగా ఏర్పడిన సహకార ఉత్పత్తికి మౌలిక యూనిట్లలో సగం లాభసాటిగా ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ఈ సహకార సంఘాలు సోషలిస్ట్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్నాయి. కాబట్టి అనతికాలంలోనే వీటిని కూడా సభ్యులు లాభాల బాట పట్టిస్తారని ఆశించవచ్చు.

ప్రజల ఆరోగ్య రక్షణ అన్నది మూడవ లక్ష్యం. పెట్టుబడిదారీ వ్యవస్థలో మాదిరి ఆరోగ్యాన్ని 'బయటి' అంశంగా చూడరు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ఏ అంశమయినా సమాజానికి 'అంతర్గత' అంశమే అవుతుంది. దానితో ఆ విధంగానే తలపడతారు. పురుగుల యాజమాన్యానికి జీవావరణ పద్ధతులను అనుసరించటానికి ఇది ఒక కారణం.

పరిశోధన జరిగే విధానాన్ని సోషలిస్ట్ లక్ష్యాలు, సోషలిస్ట్ సాధనాలు కూడా నిర్ణయిస్తాయి. ఇక్కడ విజ్ఞాన శాస్త్రం అన్నది ఒక

సరుకు కాదు. పేటెంట్ల పరుగు పందెంలో అత్యధిక లాభాలను తెచ్చి పెట్టే సరుకుల ఉత్పత్తికి ఇది వెంపర్లాడదు. పెట్టుబడిదారీ విధానంలో తమ ఉత్పత్తులు ఎటువంటి హానీ చెయ్యవని చెప్పడానికి కంపెనీలు తమ పరిశోధనలలో అధిక శాతం వెచ్చిస్తాయి. ఇందుకు విరుద్ధంగా క్యూబాలో పరిశోధనలు ఒక సాంకేతిక విజ్ఞానం వివిధ స్థాయిలలో పర్యావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అన్న దానిపై దృష్టి కేంద్రీకరిస్తాయి. ఇందులో ప్రతి చిన్న ప్రభావం ముఖ్యమైనదే, బాహ్యమైనది ఏదీ లేదు. దీర్ఘకాలిక లేదా అత్యవసర లక్ష్యాలను సాధించడానికి వివిధ సంస్థలు తాము కనుగొన్నవి తమ గుత్తాధిపత్య రహస్యాలుగా భావించకుండా కలిసి పని చెయ్యగలుగుతున్నాయి. ఈ విధంగా అందరూ పంచుకునే సామాజిక లక్ష్యాల దిశగా దేశ మేధో వనరులను సమీకరించగలుగుతున్నారు. విజ్ఞానశాస్త్రంలో నాయకత్వ స్థానాలు మహిళలకు పూర్తి అందుబాటులో ఉండటంతో పరిశోధనకు దోహదం చేసే మెదడుల సంఖ్య రెట్టింపు అయ్యింది అని చెప్పవచ్చు.

అయితే ఈ ప్రక్రియ అంత తేలికైనది ఏమీ కాదు. యూరప్, ఉత్తర అమెరికా శాస్త్రవేత్తల హోదా అభివృద్ధి చెందుతున్న దేశాల శాస్త్రవేత్తలను ఎంతగానో ప్రభావితం చేస్తోంది. వీళ్లు స్వతంత్రంగా కొత్త విషయాలను కనుక్కోనివ్వకుండా ఇది అడ్డుపడుతుంది.

పురుగు మందులు, స్పెషలైజేషన్, పశుపాలనలో సాంకేతిక విజ్ఞానం, యాంత్రీకరణ వంటి నిర్ణయాలకు సంబంధించి సుదీర్ఘ చర్చలు జరిగాయి, ఇప్పటికీ జరుగుతున్నాయి. అమెరికాలో మాదిరే క్యూబాలో కూడా పురుగుమందులపై చర్చలు జరిగాయి. అయితే అమెరికాలో జరిగిన చర్చలకి, క్యూబాలో జరిగిన చర్చలకి తేడా ఉంది. అమెరికాలో మాదిరే క్యూబాలోనూ ఈ చర్చలు నిస్పృహకి దారితీసి ఉండవచ్చు. మొండితనం, సాంప్రదాయ భావాలను పట్టుకు వెళ్లాడడం, విషయ జ్ఞానం లేకపోవటం, మూర్ఖత్వం వంటివి ఏ దేశంలోనైనా ఉంటాయి. అయితే తేడా ఎందులో ఉందంటే క్యూబాలో జరిగిన చర్చలు భిన్నమైన అభిప్రాయాల వ్యక్తీకరణకు వేదికగా నిలిచాయి. అంతిమంగా హేతువు నిగ్గుతేలుతుంది. పెట్టుబడిదారీ దేశాలలో సాంకేతిక విజ్ఞానంపై చర్చలు అన్నవి విరుద్ధ స్వార్థ ప్రయోజనాల చేతుల్లో ఆయుధాలుగా ఉపయోగపడతాయి. ఇక్కడ పురుగు మందులు తయారు చేసేవాళ్లు నేలని, ప్రజలను కాపాడుతూనే పురుగుల వల్ల జరిగే నష్టాన్ని ఎలా తగ్గించుకోవచ్చు అని కాకుండా, రైతులకు అమ్మడానికి చమురుని లాభసాటి మార్కెట్ సరుకుగా మార్చటం ఎలా అని ఆలోచిస్తారు. తమ సరుకులను అమ్ముకోవటానికి, నష్టానికి గురికాకుండా ఉండటానికి ఎంతకైనా తెగిస్తారు.

1990ల ఆరంభం నుంచి క్యూబన్ వ్యవసాయం, జీవావరణ పరిణామం అన్నది చాలా సంక్లిష్టమైనది. దీంట్లో వ్యవసాయ సాంకేతిక విజ్ఞానం, భూ వినియోగం, భూకమతం, ఉత్పత్తి, పరిశోధనల సామాజిక నిర్దేశనం, విద్యా కార్యక్రమాలు, ఆర్థిక సంస్థలు వంటి వాటిల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. దీంట్లో పాల్గొంటున్న వారి దృష్టికోణం నుంచి చూస్తే సామాజిక లక్ష్యాలను సాధించటానికి సమస్యలను పరిష్కరించే క్రమంలో ఈ మార్పులు సంభవిస్తున్నాయి. ఈ సామాజిక లక్ష్యాలు ఇలా ఉన్నాయి : ప్రకృతి, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరమైన ఆహార ఉత్పత్తిని సాధించడం, వ్యవసాయ ఉత్పాదకాల వాడకాన్ని తగ్గించడం, ఉత్పాదక సామర్థ్యాన్ని కాపాడుకోవడం, జీవ వైవిధ్యతను సంరక్షించడం, ప్రజల సంక్షేమం, స్థిరమైన, ఆరోగ్యకరమైన ఆహార సరఫరాలు, పట్టణ వ్యర్థాలు తిరిగి వినియోగంలోకి వచ్చేలా చూడటం, పట్టణాల గ్రామీణీకరణ, రూపాన్ని నిర్దేశించకుండా సహ ఉత్పత్తిదారుల చేతుల్లోకి నియంత్రణను ఇవ్వడం, సామాజిక లక్ష్యాల కోసం పరిశోధనలు చేపట్టడంగా ఉన్నాయి.

మొత్తంగా జీవావరణ అభివృద్ధి నేపథ్యంలో – రియో, క్యోటో, మాంట్రియల్ ఒప్పందాలు; ఎడారీకరణకి వ్యతిరేక కార్యక్రమాలు, అడవుల పెంపకం, సముద్ర తీరాల సంరక్షణ, విద్య, పరిశోధన, ఆర్థికం, జీవావరణాలను సమగ్రపరచడం వంటి వాటి నేపథ్యంలో క్యూబన్ వ్యవసాయం జీవావరణపరంగా అభివృద్ధి అవుతోంది.

భవిష్యత్తులో క్యూబన్ వ్యవసాయం జీవావరణ వ్యవసాయంగా ఉంటుందని మనం ఆశించవచ్చు. రకరకాల భూ వినియోగ నమూనాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇందులో ప్రతి భాగమూ నేరుగా ఉత్పత్తులను అందించడమే కాకుండా పరోక్షంగా ఇతర భాగాలకు కూడా దోహద పడుతుంది. ఉదాహరణకు అడవి కలప, బొగ్గు, తేనె, పళ్లు వంటి ప్రత్యక్ష ఉత్పత్తులనే కాకుండా అనేక రకాల వన మృగాలకి ఆశ్రయం ఇస్తుంది. పురుగులను తినే గబ్బిలాలు, పక్షులకు రక్షణ కల్పిస్తుంది. నీటి ప్రవాహాన్ని నిర్దేశిస్తుంది. ఆ విధంగా భూగర్భ నీటిని పైకి తేవటానికి శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. గాలి నిరోధకాలుగా పనిచేస్తుంది. పురుగుల వ్యాప్తికి అవరోధంగా నిలుస్తుంది. అడవి అంచులోని చెట్ల ఎత్తుకు పదింతల దూరం వరకు స్థానిక వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. పచ్చగడ్డి భూములు పశువులకు మేతనివ్వటమే కాకుండా, వరసల్లో విత్తే పంటలతో పోలిస్తే నేలకోతను మెరుగ్గా అరికడతాయి. పశువుల పెంటను సేకరిస్తాయి. తేనెటీగలకు, పురుగులను అదుపు చేసే కందిరీగలకు వివిధ పూల ద్వారా తేనెను అందిస్తాయి. పళ్లతోటల్లోని కలుపు మొక్కలను పశువులు తింటాయి. ఇలా చెప్పుకుంటూ వెళితే ఎన్నైనా ఉంటాయి. వ్యవసాయం పల్లె ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ, పట్టణ పరిసర ప్రాంతాలలో కొనసాగుతుంది. దీనివల్ల కాంక్రీట్ వనమైన పట్టణ ప్రాంతంలోకి పచ్చదనం ప్రవేశిస్తుంది. త్వరగా పాడైపోయే ఉత్పత్తులు వినియోగదారులకు చేరువలోకి వస్తాయి, ఉద్యోగాలు కల్పిస్తాయి. ప్రజల మధ్య పరస్పర సంఘీభావం బలపడుతుంది.

ఇదంతా జరుగుతోందంటే తమ పరిస్థితులకు అనుగుణంగా అక్కడ పనిచేస్తున్న వారు ప్రతి ఒక్క దానిని మార్చుకుంటూ ఉండాలి. జీవావరణ వ్యవసాయానికి రైతుల భౌతిక శ్రమ, మేధో శ్రమ రెండూ అవసరమవుతాయి – ఇది దీర్ఘకాల సోషలిస్టు లక్ష్యమే కాకుండా ఉన్నత విద్యావంతులైన క్యూబన్లు పల్లెల్లో పని చెయ్యటానికి అనువుగా ఉద్యోగాలను కల్పిస్తుంది.

క్యూబన్ వ్యవసాయాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా దానిని దగ్గర నుంచి, క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యాలి. ఆ తరువాత కొంత దూరం జరిగి అభివృద్ధికి క్యూబా వేస్తున్న కొత్త దారులను చూడాలి. తిరిగి వివరాలపై దృష్టి కేంద్రీకరించి సమస్యలను పరిష్కరించే క్రమంలో మానవాళి అంతటికీ ఆశావహమైన, నిజంగా కొత్తవైన వాటిని క్యూబా ఎలా రూపు దిద్దుతోందో చూడాలి.

(తెలుగు అనువాదం : కె. సురేష్) వీ

బినాయక్ సేన్‌కు బెయిల్

పౌరహక్కుల నేత బినాయక్ సేన్‌కు మే 25న సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. వ్యక్తిగత పూచీకత్తుపై ఆయన్ను విడుదల చేయాలని జస్టిస్ మార్కండే కట్టు, జస్టిస్ దీపక్‌వర్మలతో కూడిన వెకేషన్ బెంచ్ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిల్లల వైద్యుడు, పియుసిఎల్ జాతీయ ఉపాధ్యక్షుడైన బినాయక్ సేన్‌ను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2007 మే14న చత్తీస్‌గఢ్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. జైల్లో ఉన్న మావోయిస్ట్‌నేతకు కొరియర్‌గా వ్యవహరిస్తున్నాడనే అభియోగం మోపింది. సేన్‌కు మానవ హక్కుల విషయంలో చేసిన కృషికి గాను 2008లో ప్రతిష్ఠాత్మక జొనాథన్ మాన్ అవార్డు సేన్‌కు లభించింది. సేన్‌ను విడుదల చేయాలని దేశంలోనూ, విదేశాల్లోనూ ప్రజాస్వామిక వాదులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. నోబుల్ బహుమతి గ్రహీతలు ఆయన విడుదలకై ప్రధానికి లేఖ రాశారు.

తొలి మహిళా స్పీకర్

దేశ చరిత్రలోనే అత్యున్నత చట్టసభ అయిన లోక్‌సభకు తొలిసారిగా ఒక మహిళ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. లోక్‌సభకు మీరాకుమార్ పేరును యుపిఎ చైర్ పర్సన్ సోనియాగాంధీ ప్రతిపాదించగా, ప్రణబ్ ముఖర్జీ బలపరిచారు. జూన్ 3న స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలు దేశాల్లో దౌత్యవేత్తగా, ఐదుసార్లు ఎంపిగా, కేబినెట్ మంత్రిగా పనిచేసిన మీరాకుమార్ లోక్‌సభకు తొలి మహిళా స్పీకర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు.

అవినీతిలో నేతలదే మొదటి స్థానం

భారతదేశంలోని అవినీతిపై రెండు ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ఒక సర్వే నిర్వహించాయి. సర్వేల్లో సేకరించిన సమాచారం ప్రకారం అవినీతిలో రాజకీయ నాయకులు అగ్రభాగాన ఉంటే అధికారులు రెండో స్థానంలో ఉన్నట్లు బెర్లిన్ ప్రధాన కేంద్రంగా పనిచేసే ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్‌నేషనల్ (ఐటి), పొలిటికల్ అండ్ ఎకనామిక్ రిస్క్ కన్సల్టెన్సీ (పిఇఆర్‌సి) తాజా నివేదికలో పేర్కొన్నాయి. ఆసియా మొత్తంలోనే భారత్‌లో బ్యూరోక్రసీ అత్యంత అవినీతిమయంగా ఉందని పేర్కొన్నాయి. 2009 గ్లోబల్ కరప్షన్ బారోమీటర్ నివేదికను జూన్ 3న ఢిల్లీలో విడుదల చేసింది. పేదలు తమకు రావాల్సిన సేవలు పొందడానికి గత ఏడాది రు.900 కోట్లను లంచంగా చెల్లించినట్లు అధ్యయనంలో వెల్లడైంది.

హబీబ్ లేని రంగస్థలం

ప్రముఖ హిందీ నాటక రచయిత, ప్రయోక్త హబీబ్ అహ్మద్ తన్వీర్ (85) చాలా కాలంగా శ్వాస సంబంధమైన వ్యాధితో బాధపడుతూ జూన్ 8న భోపాల్‌లోని నేషనల్ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. హబీబ్ తన్వీర్ 1923 సెప్టెంబర్ 1న నేటి ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జన్మించారు. అలీగఢ్ ముస్లీం యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తిచేసారు. ప్రగతిశీల రచయితల సంఘం సభ్యునిగా ఉన్నారు. ఇంగ్లాండ్‌కు వెళ్లి నటనలోనూ, దర్శకత్వంలోనూ శిక్షణ పొందారు. భారత్‌కు తిరిగివచ్చి నాటక దర్శకుడిగా జీవితాన్ని ప్రారంభించారు. సంస్కృతంలో శూద్రకుడు రచించిన 'మృచ్ఛకటిక' ఆధారంగా 'మిట్టి కీ గాడి' అనే నాటకాన్ని ఛత్తీస్‌గఢ్ మాండలికంలో రచించారు. జనపదాల్లోంచే నాటకాలను సృష్టించారు. లౌకిక, ప్రజాస్వామ్య భావాలకు పట్టంకట్టారు. చరణ్‌దాస్, సత్ రంజ్‌కీ మొహ్రీ, ఉత్తర రాం చరిత్ర, పోంగా పండిట్, రాజ్‌రక్త్ లాంటి అనేక నాటకాలు రచించారు. ఆయన1969లో సంగీత నాటక అకాడెమీ అవార్డు, 1983లో పద్మశ్రీ, 2002లో పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు.

అణువిద్యుత్ వద్దేవద్దు

యురేనియం ప్రాజెక్టుల వ్యతిరేక ఉద్యమం తరపున కావుల సరస్వతి అడవులు పర్యావరణ శాఖామంత్రి జయరామ్ రమేష్‌కు జూన్ 7న ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన యురేనియం ప్రాజెక్టులు తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఒక లేఖను రాశారు. ఆ లేఖలో నల్గొండ తుమ్మలపల్లి, ఇంకా ఇతర చోట్ల జరుపుతున్న యురేనియం తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టే యురేనియం తవ్వకాలవలన ముప్పైయేళ్లలో ఇరవై ఏడు మిలియన్ టన్నుల అణువ్యర్థాలు పోగుపడుతాయని భూగర్భ నీటివనరులు ఇంకిపోతాయని తెలిపారు. ఇప్పటికీ మన దేశంలో అణువిద్యుత్ 2.8 శాతం అవసరాలను మాత్రమే తీరుల్తోందని ఇది సోలార్, తరంగ విద్యుత్‌లకన్నా (12.5 శాతం) చాలా తక్కువని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 442 అణువిద్యుత్ కేంద్రాలు కేవలం 2.7 శాతం విద్యుత్ అవసరాలను మాత్రమే తీరుస్తున్నాయని తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీతో కలిసి పనిచేస్తున్న సంస్థలేవి ప్రజల, పర్యావరణ జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు లేవనీ, భావితరాల భవిష్యత్ దృష్ట్యా యూరేనియం ప్రాజెక్టులను నిలిపివేయాలని కోరారు.

లోక్‌సభలో అంతా కోటీశ్వరులే

భారతదేశంలో 28 కోట్ల జనాభా దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. మన దేశంలో 80 శాతం పైగా జనాభా కుటుంబ ఆదాయాలు రోజుకు రు.100 లోపేనని ఐక్యరాజ్యసమితి గణాంకాలు తెలియ జేస్తున్నాయి. ఇటీవలి మూడు నెలల కాలంలో 3000 వేల మంది రైతులు ఆకలి, దుర్భర దారిద్ర్యాలతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరోవైపు 15వ లోక్‌సభకు ఎన్నికైన 543 మంది సభ్యులు ప్రకటించిన ఆస్తుల విలువ మొత్తం రు.3075 కోట్లు. అంటే సరాసరి ఒక్కొక్క సభ్యుడి ఆస్తి రు.5.7 కోట్లు. ఎన్నికైన కోటీశ్వరులు పార్టీల వారిగా చూస్తే కాంగ్రెస్-138, బిజెపి-58, ఎస్‌పి-14, బిఎస్‌పి-13, డిఎంకె-11, శివసేన-9, జెడియు-8, ఎన్‌సిపి-7, బిజెడి-6, టిఎంసి-6 మంది సభ్యులు ఉన్నారు

రచయిత్రి కమలా దాస్ మృతి

సాహిత్యంలోనూ, జీవితంలోనూ సంచనాలు సృష్టించిన కమలా దాస్ 2009 మే 31న పూణెలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కమలా దాస్ 1934 మార్చ్ 31న అప్పటి మద్రాసు రాష్ట్రపు మలబార్ జిల్లాలో పున్నయూర్ కులం గ్రామంలో పుట్టింది. తాత, తల్లి ప్రఖ్యాత సాహిత్యకారులు కావడంవల్ల కమల చిన్నతనం నుంచే సాహిత్య వాతావరణంలో పెరిగింది. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. 1965లో ఆమె కవితాసంపుటం సమ్మర్ ఇన్ కలకత్తా అచ్చయింది. ప్రేమను, వంచనను, విషాద ఉద్వేగాలను శక్తిమంతంగా చిత్రించిన ఈ సంపుటం ఆమెను భారతీయాంగ్ల సాహిత్యలోకంలో విస్మరించడానికి వీలులేని రచయితగా రుజువు చేసింది. భారతీయ మధ్యతరగతిలో అమలయ్యే పితృస్వామిక విలువల కింద స్త్రీ స్వేచ్ఛ ఎలా అణచబడుతుందో బహిరంగంగా, నిష్కర్షగా ఆమె తన ఆత్మకథలో వెల్లడించారు. మలయాళం లో ఏడు కథా సంపుటాలు, ఐదు నవలలు, రెండు భాగాల ఆత్మకథ, కవిత్వం వెలువడ్డాయి. అనేక సాహితీ వ్యాసాలు, విశ్లేషణలు రాశారు.

నేపాల్ ప్రధాని మాధవ్ కుమార్

నేపాల్ కొత్త ప్రధానిగా సిపిఎన్ - యూఎంఎల్ నాయకుడు మాధవ్‌కుమార్ మే 23న ఎన్నికయ్యారు. నేపాల్ అసెంబ్లీలోని 601 మంది సభ్యులలో 351 మంది సభ్యుల మద్దతుతో మాధవ్ ఒక్కరే ప్రధాని పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మావోయిస్టులు ఓటింగ్‌ను బహిష్కరించారు. ఆపద్ధర్మ ప్రధాని ప్రచండ, మావోయిస్ట్ సీనియర్ నేత బాబూరామ్ భట్టారాయ్‌లు సమావేశంలో పాల్గొనలేదు. పోటీగా ఇతరులెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో మాధవ్ ప్రధానిగా ఎన్నికైనట్లు స్పీకర్ సుభాష్ నేమాంగ్ ప్రకటించారు.

పాకిస్థాన్‌లో తాలిబన్ల దాడులు

పాకిస్థాన్‌లోని లాహోర్‌లోని గూఢచర్య సంస్థ ఐఎస్ఐ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై మే 27న తాలిబన్లు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఆత్మాహుతి దాడిలో 35 మంది చనిపోగా, మూడు వందల మందికి పైగా గాయపడ్డారు. మే 28, జూన్ 9న పెషావర్‌లోని జరిపిన దాడుల్లో 21 మంది మరణించగా, 149 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఓ రాష్ట్ర మంత్రి, సెనేటర్ ఉన్నారు. స్వాత్ లోయలో జరుపుతున్న సైనిక చర్యకు ప్రతికారంగానే ఈ దాడులు జరిపినట్లు తాలిబన్ పేర్కొంది.

సూకీ నిర్బంధానికి ఆరేళ్లు

బర్మా ప్రజాస్వామిక ఆకాంక్షల ప్రతీక నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆంగ్‌సాన్ సూకీ గృహ నిర్బంధానికి మే 30తో ఆరేళ్లు పూర్తయ్యాయి. 2003 మే లో ఆమెను అరెస్టు చేశారు. అప్పట్నుంచి ఆమె ఉత్తర బర్మాలోని డిపెయిన్‌లో గృహనిర్బంధంలో ఉన్నారు. మయన్మార్ సైనిక నియంతృత్వంలోని ఆమె గత 19 ఏళ్లలో 13 ఏళ్లు గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రజాస్వామ్యం కోసం ఆమె వ్యక్తి స్వేచ్ఛను, కుటుంబ జీవితాన్ని త్యజించింది.

ఇయు ఎన్నికల్లో లేబర్ పార్టీ పరాజయం

యూరపియన్ యూనియన్ (ఇయు) పార్లమెంటు ఎన్నికల్లో లేబర్ పార్టీ పరాజయం పాలైంది. మే 18న ప్రకటించిన ఈ ఎన్నికల ఫలితాల్లో కన్జర్వేటివ్ పార్టీ 28.3 శాతం ఓట్లతో మొదటి స్థానంలో ఉండగా, ఇండిపెండెన్స్ పార్టీ 17.5 శాతం, లేబర్ పార్టీ 15.4 శాతం ఓట్లతో రెండూ, మూడూ స్థానాల్లో నిలిచాయి. బ్రిటన్ ప్రధాని గార్డన్ బ్రౌన్ సారథ్యంలోని లేబర్ పార్టీ గత వందేళ్లలో ఇలాంటి ఓటమిని ఎన్నడూ చవిచూడలేదు. ఓటమికి బ్రౌన్‌దే బాధ్యతని సమావేశంలో తీవ్ర విమర్శలు వెలువెత్తే అవకాశం ఉంది. బ్రౌన్ పనితీరు బాగాలేదని ఆరోపిస్తూ మంత్రుల రాజీనామాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంత్రుల రాజీనామాలకు అడ్డుకట్టవేయడానికి బ్రౌన్ మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేసినా ఫలితం లేకపోయింది.

ఇరాన్ అధ్యక్షుడుగా మళ్లీ నెజాద్

ఇరాన్ అధ్యక్షుడిగా మహ్మద్ అహ్మదినెజాద్ మళ్లీ ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నికల్లో నెజాద్‌కు 65 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి, మాజీ ప్రధాని మీర్ హుసేన్ మూసావీకి 32 శాతం ఓట్లు వచ్చాయి. ఎన్నికల ప్రక్రియలో అనేక అక్రమాలు జరిగాయనీ, ఎన్నికల ఫలితాలు బూటకమనీ, వీటిని అంగీకరించే ప్రసక్తే లేదని మూసావీ అన్నారు. విజేత తానేనని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలకు నిరసనగా మూసావీ అనుచరులు దేశ రాజధాని టెహ్రాన్‌లో ఆందోళనలు చేశారు. నెజాద్ గెలుపుపై ఇజ్రాయల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్‌పై అమెరికా అనుసరిస్తున్న విధానంలో ఎటువంటి మార్పులూ ఉండబోవని అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ చెప్పారు. వెనిజులా అధ్యక్షుడు చావెజ్ నెజాద్‌ను అభినందించారు.

పెరుగుతున్న సామాజిక అశాంతి

ప్రస్తుత ఆర్థిక మాంద్యం తీవ్రమైన సామాజిక అశాంతులకు దారితీయవచ్చని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. ఆర్థిక మాంద్య నివారణ చర్యలు త్వరితగతిన చేపట్టనట్టయితే రాజకీయ పరమైన సామాజిక, మానవ సంబంధాలలో భారీ పతనం చూడాల్సి వస్తుందని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి రాబర్ట్ జోలిక్ అన్నారు. భారీ నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు సమాయత్తం కావాలన్నారు. కుంచించుకు పోతున్న ఆర్థిక వ్యవస్థలు, వ్యక్తమౌతున్న నిరసనలు వంటి జటిలమైన స్థితిని తూర్పు యూరప్ ఎదుర్కొంటోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎదురౌతున్న ఆర్థిక సంక్షోభాన్ని వెంటనే ఎదుర్కొనే ప్రయత్నాలు చేపట్టకపోతే, పేద దేశాలలో పెద్ద ఎత్తున మానవ విధ్వంసం జరుగుతుందని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది.

మార్క్స్, చేగువేరా రచనలతో స్కూల్ పాఠాలు

'ది రివల్యూషనరీ రీడింగ్ ప్లాన్' పేరిట కార్లమార్క్స్, చెగువేరా రచనలతోపాటు కచ్చితంగా స్కూల్ విద్యార్థులు చదవాల్సిన పాఠ్యప్రణాళికను వెనిజులా ప్రభుత్వం రూపొందించింది. వెనిజులా సాంస్కృతిక శాఖ తన వెబ్‌సైట్‌లో ఈ ప్లాన్ వల్ల విద్యార్థులు పెట్టుబడిదారీ ఆలోచనా విధానాన్ని వదిలి, సోషలిస్ట్ రాజ్యస్థాపనకు అవసరమయ్యే ఆదర్శాలను, విలువలను బాగా అర్థం చేసుకోగలరని పేర్కొంది. వెనిజులా అధ్యక్షుడు ఛావెజ్ విద్యార్థులను ఉద్దేశించి, 'చదవండి, చదవండి, చదవండి... ఇదే మన రోజువారి పని. చదవడం వలన మన స్పృహ, మేధస్సులు పెరుగుతాయి. విప్లవోత్తేజాన్ని, స్వేచ్ఛాస్పృహను మనం చదవడం ద్వారా పొందాలి' అని పిలుపునిచ్చారు.

అగస్టో బోల్

బ్రెజిల్ దేశానికి చెందిన ప్రముఖ నాటకరంగ కళాకారుడు అగస్టో బోల్ మే 2న మరణించారు. అగస్టో బోల్ 16 మార్చ్ 1931న బ్రెజిల్ లోని రియో-డి-జనిరోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు పోర్చుగల్ నుంచి బ్రెజిల్‌కు బతుకుదెరువు వెత్తుక్కుంటు వచ్చిన పేదవారు. బోల్ రియో లో చదువు ముగిసాక కొలంబియాలో కెమికల్ ఇంజనీరింగ్‌లో పి.ఎచ్.డి. పూర్తి చేశారు. నాటకరంగంపై ఉన్న ఆసక్తితో 1956 నుండి 1971 వరకు సోహోపాలోని ఎరీనా థియేటర్‌లో పనిచేశారు. తన నాటకరంగాన్ని 'పీడిత ప్రజానాటకరంగం'గా ప్రకటించుకున్నారు. ప్రజలకోసం వారి కష్టాలు, సమస్యలే ఇతివృత్తాలుగా నాటకాలు రాశారు, ప్రదర్శించారు. ప్రభుత్వం నుండి నిర్బంధాలు, అరెస్టులు, అణచివేతలు ఎదుర్కొన్నారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 మే 2009 నుండి 20 జూన్ 2009 వరకు)

జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)
ఆదిలాబాద్	–	–	37	–	–	–	2	11	–	5	37	27	15	–	–	–	5	17
హైదరాబాద్	–	–	37	–	–	–	16	22	–	–	59	26	4	–	–	–	23	–
కరీంనగర్	9	2	85	–	–	–	10	18	2	3	34	52	28	–	–	–	7	62
ఖమ్మం	1	–	50	–	–	–	15	7	–	16	62	12	25	–	–	–	–	41
మహబూబ్‌నగర్	వివరాలు అందలేవు																	
మెదక్	9	–	30	–	–	–	8	4	1	–	55	15	15	–	–	–	–	14
నలగొండ	వివరాలు అందలేవు																	
నిజామాబాద్	–	–	32	–	–	–	8	4	–	7	32	20	–	–	–	–	–	7
రంగారెడ్డి	4	–	33	–	–	–	8	12	–	7	50	22	10	–	–	–	–	5
వరంగల్	4	–	30	–	–	–	11	11	–	2	20	32	14	2	–	–	–	35
అనంతపురం	5	2	19	1	–	–	3	6	–	4	31	9	4	–	–	–	–	–
చిత్తూరు	–	–	9	–	–	–	–	–	–	12	54	–	4	–	–	–	–	–
కడప	1	–	10	1	–	–	5	5	–	2	30	12	7	–	–	–	–	–
కర్నూలు	4	–	58	–	–	–	10	15	–	6	33	48	20	–	–	–	–	3
తూర్పు గోదావరి	1	–	32	–	–	–	15	10	–	3	48	46	11	–	–	–	4	18
గుంటూరు	2	–	8	–	–	–	13	19	–	7	39	9	10	–	–	–	2	5
కృష్ణా	1	–	18	–	–	–	12	1	–	2	29	19	3	–	–	–	–	5
ప్రకాశం	–	–	10	–	–	–	2	4	–	10	32	16	3	–	–	–	–	5
శ్రీకాకుళం	–	–	5	–	–	–	7	–	–	–	19	15	9	–	–	–	–	2
విశాఖపట్నం	–	–	16	–	–	–	1	1	–	3	30	10	4	–	–	–	2	7
విజయనగరం	1	–	13	–	–	–	1	4	–	4	17	10	–	–	–	–	–	5
మొత్తం	**442**	**4**	**532**	**2**	**–**	**–**	**147**	**154**	**3**	**93**	**711**	**400**	**186**	**2**	**–**	**–**	**43**	**231**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నలగొండ – డి. మహేష్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – ఎం. ఆదిశేషయ్య; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; నెల్లూరు – శ్యాంసుందర్ రావు; ప్రకాశం – కె. మల్లికార్జున్; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. రమణ; విజయనగరం – డి. సుధాకర్;

*231 వడదెబ్బ తగిలి చనిపోయినవారు

త్వరలో వెలువడనున్న వీక్షణం ప్రచురణలు

వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, ఆర్థిక వ్యవహారాలు, ఉపాధి, పాలన,
ప్రాంతీయ అసమానతలు, ప్రజా ఉద్యమాలు, తదితర అంశాలపై

మీరు - నేను - ఆర్థికం

వి. హనుమంతరావు

వ్యాసాల సంకలనం

సామాజిక అధ్యయనం ఎలా చేయాలి? గ్రామీణ ప్రాంతాల పరిశీలనలో ముఖ్యమైన అంశాలేమిటి?
సాహిత్యం ద్వారా సమాజ పరిణామాలను గుర్తించడం ఎట్లా? వంటి అనేక మౌలిక అంశాలపై
లోతయిన ఆలోచనలను రేకెత్తించే

ముదునూరి భారతి

వ్యాసాల సంకలనం

భారత రాజకీయార్థిక పరిణామాలు, ప్రణాళికలు, ప్రజల చరిత్ర, ప్రజా ఉద్యమాలు మొదలయిన
అనేక కోణాలలో తాత్విక ప్రశ్నలు సంధించి, కొత్త ఆలోచనలు రగిలించే

ఆర్.ఎస్. రావు

వ్యాసాల సంకలనం

110 ఏళ్ల అమెరికా దురాక్రమణల చరిత్ర
స్టీఫెన్ కింజెర్ రచన 'ఓవర్ త్రో' కు **కొణతం దిలీప్** తెలుగు అనువాదం

కుట్రాజకీయం

• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/6/2009 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao